# అడ్డదారి

మొదలి నాగభూషణ్

20-8-1958

సుందరం: నాకు తెలియక అడుగుతాను, అంత మూర్ఛపోయే ఆపద ఏం వచ్చిందిరా?

చిన్నకొడుకు:(ఏడుపు గొంతుతో) ఇంకేం రావాలిరా – ఇందిరి పాట –

(ఇందిర కోపంతో పాట ఆపుతుంది)

సుందరం: ఇదేం బాగులేదురా – చీటికీ మాటికీ మీరిద్దరూ యిట్లా పోట్లాడుకోకూడదు – మీరిద్దరూ సంధి చేసుకోండి.

చిన్నకొడుకు:నాకేం అభ్యంతరం లేదు. ముక్కు మీద కోపం వుండేది దానికి, దాన్ని అడుగు.

ఇందిర: నువ్వే చీటికి మాటికీ చిచ్చు బుడ్డిలా లేస్తావు.

చిన్నకొడుకు:నువ్వే –

ఇందిర: నువ్వే.....నువ్వే.......నువ్వే

(ఇద్దరూ వాదులాడుకుంటూ వుండగా బాబాయి వస్తాడు)

బాబాయి: మూడో ప్రపంచ యుద్ధం అల్జీరియాలోనో, ఇజ్రాయిల్‌లోనో, కాశ్మీర్‌లోనో మొదలెడుతుం దంటున్నారు గాని – కొంపదీసి మన ఇంట్లోనే మొదలెట్టిందా ఏం?

చిన్నకొడుకు:ఎక్కడ రాజకీయ నాయకులు వుంటే అక్కడే ప్రపంచ యుద్ధం చెలరేగే అవకాశం వుందని ఓ కంద పద్యంగాడు పూర్వం ఎప్పుడో చెప్పాడు బాబాయ్!

బాబాయి: పిల్లకాకి కేం తెలుసురా వుండేలు దెబ్బ! ఈ సారి ఎన్నికల్లో చూడు బాబాయి తడాఖా! వాడు చచ్చినాసరే ఈసారి మనకు మంత్రి పదవి తప్పదు.

సుందరం: అదేమిటండీ అంత గట్టిగా చెబుతున్నారు? అర్హతలూ అవీ వుండొద్దూ?

బాబాయి: ఎన్ని తక్కువ అర్హతలు వుంటే అంత మంచిది. నువ్వు నిశానీదారువయినా ఇబ్బంది లేదు. కాని కొంచెం వోర్పు వుండాలి. జనం నిన్ను తిడతారు. అవసరమని తోస్తే కొడతారు. నిన్ను కాదనుకొని పో. మూడోనాటికి నువ్వు మంత్రివైపోతావు.

సుందరం: ఈ అర్హతలన్నీ మీకు వున్నట్లేనా అండీ?

బాబాయి: అన్నీ ఎవ్వడికీ వుండవోయ్....కష్టపడి సాధించాలి. ముందు ప్రజలకు నువ్వు గొప్పవాడివిగా కనిపించు. ఆ తరువాత పని వాళ్ళే చూసుకుంటారు.

చిన్నకొడుకు:మరి ప్రజలకు నీ సంగతి ఎలా తెలుస్తుంది?

బాబాయి: కొంచెం వోపిక పట్టరా అబ్బాయి. ఇప్పటికే మన సంగతి చాలావరకు తెలిసింది. ఇహ వచ్చే ఎన్నికల్లో చూడు – సుందరం! ఒక సిగరెట్టు యివ్వవోయ్ –

సుందరం: నాది జనతా బ్రాండండి –

బాబాయి: నేను మాత్రం ప్రజల మనిషిని కాదటోయ్ – ఇవ్వు.

చిన్నకొడుకు:సమయానికి వచ్చావు బాబాయి...ఈ ఒక్క వరస చూడు. ఎక్కువమంది రాజకీయ నాయకులు సంపాదించుకొను గుణము – అనే దానికింద షేమ్, షేమ్ – రెండు ఇచ్చారు. నేను షేమ్

వేశాను, ఏమంటావ్.

బాబాయి: బ్రహ్మాండంగా రైటవుతుంది. అయినా నాకు తెలియక అడుగుతాను - ఎందుకు వచ్చిన ఫజిల్సురా యివి. కడుపు నిండేనా, కాళ్ళు నిండేనా?

ఇందిర: ఉత్తమమైన మాట చెప్పావు బాబాయి.

చిన్నకొడుకు: బాబాయిలాంటి రాజకీయ నాయకుడికి నీ చెత్త సలహాలేం అక్కర్లేదు. ఇంకా కావాలంటే వాళ్ళ దగ్గరే దొరుకుతాయి భలే హాయిడియాలు.

బాబాయి: ఇంత వుత్సాహంతో మా లైనులో రెండేళ్ళు పనిచెయ్యి. వచ్చే ఎన్నికల నాటికి నువ్వు కనీసం ఎమ్.ఎల్.ఏ. నయినా కాకపోతే అప్పుడను -

చిన్నకొడుకు: మరి అవసరమయితే దెబ్బలుకూడా తినాలన్నావు గదా!

బాబాయి: కొన్ని సుఖాలు వచ్చేటప్పుడు కొన్ని దు:ఖాలు కూడా భరించాలిరా - నీ సంగతి మరీ ఘోరం గదా! నెలాఖరున పజిల్ రిజల్ట్స్ వచ్చినా ప్రతి సారి నూటపది టెంపరేచరుతో పడుకొంటున్నావు గదా - అంతకంటే ఇది నయం కాదనా?

సుందరం: బాగా చెప్పారు. ఎన్నికల్లో వోడిపోతామనుకోండి....రెండే పద్ధతులు. ఒకటి గుండె ఆగి చచ్చిపోవడం. రెండవది మొనగాడిగా బ్రతకడం. ఛస్తే మంచిదే. బ్రతికితే మరీ మంచిది. ఈసారి కాకపోతే వచ్చేసారి రావచ్చు మంత్రి పదవి -

చిన్నకొడుకు: నీ ఇంత చిన్నబుర్రలో ఇన్ని ఆలోచన లెక్కడివిరా?

సుందరం: కేరళ రాష్ట్రంలో జనాభా మాదిరిగా చదరపు అంగుళానికి 6-5 ఆలోచన లున్నాయిరా యీ బుర్రలో - సామాన్యమైన బుర్ర అనుకున్నావా ఏం?

చిన్నకొడుకు: ఎందుకవుతుంది? రెండు మూడుసార్లు దెబ్బలు తిని గట్టిపడ్డది.

సుందరం: రెండు మూడుసార్లెక్కడరా?

బాబాయి: గట్టిబడడానికి ఒక్కసారి చాలదూ?

చిన్నకొడుకు: స్వానుభవమిది చాటుచున్నాను వినుడు, కాదుగదా బాబాయ్?

బాబాయి: ఎందుకు కాదు? రాజకీయ నాయకుడన్నాక అన్ని అనుభవాలు ఉండాలి. ఇంతకూ అన్నయ్య ఏడిరా? అరగంటాయే, వాడికోసం ఎదురు చూస్తున్నాను?

చిన్నకొడుకు: కొంపదీసి మంత్రిని చేస్తున్నావా ఏం?

సుందరం: చేస్తే నువ్వో నేనో చేయాలిరా. ఇంకా మీ ఇందిర చెయ్యవచ్చు. అడది అనే క్వాలిఫికేషన్ ఉంది కనుక.

బాబాయి: బాగా అన్నావు నాయనా! నా ఆయుస్సు కూడా పోసుకు బ్రతుకు.

ఇందిర: ఇంతకీ అన్నయ్య ఎందుకో చెప్పలేదు.

బాబాయి: ఇవ్వాళ కస్తూరిబా హాల్లో మీటింగు వుంది. అక్కడికి పెద్ద పెద్ద వాళ్ళందరూ వస్తున్నారు. ఎమ్.ఎల్.ఏ.గా నిలబెడుతున్నారు. నేనూ వెళ్ళాలి మరి -

చిన్నకొడుకు: మరి అన్నయ్య ఎందుకు? తోడా?

బాబాయి: కాదు కాదు. అక్కడికి వెళ్ళిరావడమంటే మాటలా? రానూ పోనూ రెండు రూపాయలు కావాలి.

**చిన్నకొడుకు:** అందుకా! అయినా రాజకీయ నాయకులకి అన్నీ చేతనయి వుండాలన్నావు కదా! ఇక్కడనుంచి లెఫ్ట్, రైటు కొట్టరాదూ?

**బాబాయి:** నువ్వయితే అంత పనీ చేయించేవాడివేరా నాయనా! వాడి పుణ్యమా అని పెద్దవాడు – ఏదీ వస్తున్నాడేమో........(అంటూ వాకిట్లోకి వెడతాడు)

**ఇందిర:** అన్నయ్యా! బాబాయి మాట విని రాజకీయల్లో చేరరా!

**సుందరం:** ఇంకేం కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదినట్టేగా!

**ఇందిర:** ఎవ్వరితోకా పట్టుకోకుండానే, అన్నయ్య మంత్రి కాగలడండీ –

**చిన్నకొడుకు:** ఇంకా రాజకీయల్లో నీకే ఎక్కువ ఛాన్సు. ఎవరిని వోడించ దలుచుకున్నావో వాడితో వెళ్లి, వాడి వుపన్యాసం కాగానే సంగీత కచేరి పెట్టు. వాడికి డిపాజిట్టు దక్కితే అప్పుడను.

**ఇందిర:** నీ సలహాలు ఎవ్వరికి అక్కర్లేదు.

**చిన్నకొడుకు:** నేను అడిగితేనే ఇచ్చావా నీ అమూల్యమైన సలహా నాకు?

**ఇందిర:** బాగు పడతావని ఇచ్చాను.

**చిన్నకొడుకు:** నేనూ అంతే.

**సుందరం:** నేను వుండగానే ఇందిరని నువ్వు ఇట్లా అనడం బావులేదురా!

**చిన్నకొడుకు:** ఏం? నువ్వు అంత గొప్పవాడివా ఏం?

**సుందరం:** కనీసం స్నేహితుడిని కదా!

**చిన్నకొడుకు:** నువ్వు మొన్న పది రూపాయలు అప్పు అడగడానికి వచ్చినప్పుడు తప్పిస్తే యీ యింటికి నా కోసం ఎప్పుడయినా వచ్చావురా?

**సుందరం:** అన్యాయం, మరి ఎవరికోసం వచ్చానంటావ్?

**చిన్నకొడుకు:** అమ్మడి కోసం......దాన్ని పెద్ద సినిమా స్టారును చేయిస్తానంటావ్! అది నమ్మింది, నా కెందుకూ మధ్య?

**సుందరం:** శ్రుతి మించుతోందిరా బ్రదర్ – చిన్ననాటి స్నేహితుడివని –

**చిన్నకొడుకు:** నిజమే! నేను మాత్రం కాదన్నానా? కాని అమ్మడిని వెనక వేసుకు వచ్చి నాకే ఎదురుచెబితే మండదూ?

**సుందరం:** అమ్మడంటే ఆడది –

**చిన్నకొడుకు:** ఏడిసావ్...నీలాంటి మగవాళ్ళకంటే వందరెట్లు అది నయం, తెలుసా!

**సుందరం:** అరేయ్! ఆనక విచారిస్తావ్....ఇన్ని మాటలన్నాక ఇక ఇక్కడ ఒక్క క్షణం వుండను...వెడుతున్నాను.

**చిన్నకొడుకు:** ఏడిశావు....మళ్ళీ సెకండ్ షో వేళకు రావూ –

**సుందరం:** చూస్తావుగా – (అంటూ విసురుగా వెళ్ళిపోతాడు)

ఇందిర: ఏమండీ.....ఏమండీ.....(సుందరం వెళ్ళిపోగా, విసురుగా హార్మోనియం దగ్గకు పరుగెత్తుకుని వెళ్లి ఏడుపు రాగం ఎత్తుకుంటుంది.)

**చిన్నకొడుకు:** (కొంచెం సేపు నిర్ఘాంతపోయి) ఆపు తల్లీ........ఆపు....నేను వెళ్ళి వాడిని బ్రతిమాలైనా పిలుచుకు వస్తాను గాని – సినిమా టెక్నిక్‌లో ఏడుపు మాత్రం మొదలు పెట్టకు. ఛస్తాం –

ఇందిర: (ఏడుపుతో) నిన్ను అనేవాళ్లు లేరనేగా నీ ఇది –

(వాకిట్లోనుంచి తండ్రి వస్తాడు)

తండ్రి: అసురసంధ్య వేళ ఈ ఏడుపులేమిట్రా ఇంట్లో?

చిన్నకొడుకు: అసురసంధ్య వేళ రాత్రి ఎన్నిగంటలదాకా నాన్నా?

తండ్రి: నోర్మూసుకోవోయ్ – ఇంటి ఆడపడుచు అట్లా వున్నదేం?

ఇందిర: ఈ అన్నయ్యే నాన్నా –

తండ్రి: ఏమన్నావురా దాన్ని?

చిన్నకొడుకు: నేనేమనలేదు నాన్నా.... అదే! నన్ను గిచ్చి తను శోకాలు పెడుతోంది.

తండ్రి: ఓరీ అనాథ రక్షకా ఎప్పటికి వచ్చేనురా వీళ్ళకు బుద్ధి?
ఇంకా అన్నయ్య రాలేదురా? వీడొకడు... అబ్బే! ఒక్కళ్ళకు బాధ్యత అంటూ తెలిసి ఏడవదు.. ఎట్లా బ్రతకుతార్రా మీరందరూ? మేళగాళ్లు వచ్చార్రా?

చిన్నకొడుకు: మేళగాళ్ళు – రాలేదే?

తండ్రి: రాలేదే అంటూ ఇంట్లో కూర్చోకపోతే అలా వాకిట్లోకి వెళ్ళి చూడకూడదూ?

చిన్నకొడుకు: బావుంది నాన్నా...నువ్వా తూ తూ సన్నాయిగాళ్ళని పిలిచావని నే నేమన్నా కలగన్నానా?

(అంటూ వాకిట్లోకి వెడతాడు. ఇందిద రీడ్ నొక్కుతుంది)

తండ్రి: అడిగేవాళ్ళు లేకగాని ఎటూ గాని వేళ నీకీ పాట లేమిటి? అందుకే నేను ఎన్నడో చెప్పాను, అమ్మాయికి పెళ్ళిచేసి అత్తవారింటికి పంపండిరా అని – నా మాట వింటేనా?

ఇందిర: వినివుంటే చచ్చి వుందును –

తండ్రి: ఏమమ్మా! చేదు మింగుతావా? 'అష్టవర్షా ద్భవేత్కన్యా అన్నారు.

ఇందిర: అదంతా పాతచింతకాయ పచ్చడి నాన్నా, ఈ రోజుల్లో జ్వరం వచ్చినా పేషెంట్లే తినడం లేదు.

తండ్రి: అంతే, అంతే! చెట్టు చెడే కాలానికి కుక్కమూతి పిందెలట! ఏం చెయ్యాలనుకుంటున్నాడో ఆ రామచంద్రమూర్తి?

ఇందిర: ఇప్పుడీ మేళ తాళాలు దేనికి నాన్నా?

తండ్రి: అభిషేకాలు అవీ చేయిస్తున్నామా –

ఇందిర: అవి చేయించడానికి పేరుశాస్త్రులుగారు వున్నారుగా –

తండ్రి: అన్నీ వుండవలసిందే నమ్మాయ్! లేకపోతే బెడిసి కొడుతుంది.

ఇందిర: ఈ మేళగాళ్ళకు ఎంత యివ్వాలి నాన్నా?

తండ్రి: పది రూపాయలు –

ఇందిర: పదిరూపాయలే! నాకైతే –

చిన్నకొడుకు: ఆ తూ తూ సన్నాయిగాళ్ళు కనుచూపు మేరలో ఎక్కడా లేరు నాన్నా –

తండ్రి: చావు కబురు చల్లగా చెబుతావేరా? వెళ్ళి పిలుచుకురా –

చిన్నకొడుకు: వాళ్ళు ఎక్కడ వుంటారో నాకేం తెలుసు?

తండ్రి: ఇంకా ఎందుకు పనికొస్తార్రా మీరు?

చిన్నకొడుకు: ఇటువంటి వాటికి పనికొస్తామనేగా మీరు దేవుడికి అభిషేకాలు చేయించడం –

తండ్రి: వేళాకోళం కాదోయ్.....ఇంకా ఒక్క సంవత్సరం ఆగు....బృహస్పతి ఎనిమిదింటికి వస్తే మనకు రాజయోగం –

చిన్నకొడుకు: ఇప్పుడు మాత్రం కాదు కనకనా?

తండ్రి: అఘోరించినట్లే వుంది నా రాజయోగం నేనైనా వెళ్లి పిలుచుకువస్తాను వాళ్లని – (అంటూ వెడతాడు)

ఇందిర: (గొంతు తగ్గించి) ఈ మేళగాళ్ళకు పదిరూపాయలట్రా?

చిన్నకొడుకు: నిజం!

ఇందిర: ఆ! ఇప్పుడు నాన్నే చెప్పాడు.

చిన్నకొడుకు: అన్యాయం. నాకు రెండు పజిల్సుకు సరిపోయేది.

ఇందిర: ఆ మాటకు వస్తే నేను నాలుగు సినిమాలు చేసేదాన్ని.

చిన్నకొడుకు: నువ్వు సినిమాలు చూసి నేర్చుకున్నదేమిటి? ఒక్క ఏడుపు టెక్నిక్కు మినహాయించి ఇంకే కనిపించడం లేదు. డబ్బు తగలెయ్యడం కూడా ఎందుకు?

ఇందిర: నువ్వు డబ్బు తగలేసి పజిల్సు కట్టడం లేదూ?

చిన్నకొడుకు: అదృష్టం బావుండి ఆల్ కరెక్టు రానీ – లక్ష – లక్ష – లక్షరూపాయలు వస్తాయి తెలుసా?

ఇందిర: నాకు ఒక్క సినిమాలో ఛాన్సు వస్తే లక్షేమిటి లక్షన్నర ఇస్తారు.

చిన్నకొడుకు: అయినా ఏ గొప్పస్టారు కూడా సినిమాలు చూసే గొప్ప నటి యింతవరకు కాలేదు. ఇహముందు కాదు.

ఇందిర: నీకేం తెలుసు?

చిన్నకొడుకు: మీ సుందరం గాడి కంటే లక్షరెట్లు ఎక్కువ తెలుసు, సరా?

ఇందిర: ఒట్టిది..మీ స్నేహితుడు బుద్ధిలో బృహస్పతి అని చెప్పావ్.....

చిన్నకొడుకు: నేను నీకు చెప్పినప్పుడు అంత గొప్పవాడే! ఇంతలో అదృష్ట రేఖ వక్రించింది. వాడు అమాంతం చచ్చు వెధవై కూర్చున్నాడు.

ఇందిర: ఏమైనా సరే నేను సినిమా స్టారును అయితీరాలి. ఆ లైనులో ఎంత కీర్తి, ఎంత డబ్బు?

చిన్నకొడుకు: ఎందుకే ఈ గొప్పలూ, కీర్తి కాంతలూ? హాయిగా పెళ్ళి చేసుకుని కాపురం చెయ్యక?

(వాకిట్లో సన్నాయి మేళం వినిపిస్తుంది.)

అరుగో! ప్రపంచమంతా తిరిగి నాన్న పట్టుకువచ్చిన విద్వాంసులు – మంగళ తూర్యాలు మోగిస్తున్నారు నీ పెళ్ళికి –

ఇందిర: నా పెళ్ళేమీ కాదు....ఇంకా అయితే నీదే!

చిన్నకొడుకు: ఆ పెళ్ళి చేసినా బావుండిపోను. కట్నం తాలూకూ ఏ రెండు వేలో వుంటే ఫజిలు కట్టడానికి రెండేళ్ళదాకా ఇంకెవరినీ అడగక్కరలేదు.

ఇందిర: ఆడదాని డబ్బుకురా ఆశపడతావు.

చిన్నకొడుకు: నీ మొహం......దాన్ని పెళ్ళి చేసుకోడానికి వాళ్ళ నాన్న నా కిచ్చే లంచం అది – లేకపోతే

మరెరికి గుండెలు వుండును దాన్ని చేసుకోవడానికి.

(సన్నాయి మేళం ధ్వని ఎక్కువవుతుంది)

ఇందిర: వాయించేవాళ్లు ఇక్కడెందుకు? ఆ గుడి దగ్గరే వాయించక.

చిన్నకొడుకు: ఆ బాధేదో ఆ భగవంతుడే భరిస్తాడంటావ్!

ఇందిర: కళ్ళపోతాయిరా!

చిన్నకొడుకు: ఈ వాద్య గోష్ఠి వింటుంటే, నా మతే పోతుంది.

ఇందిర: నాన్నవింటే ఇంట్లోంచి వెళ్ళగొడతాడు.

చిన్నకొడుకు: మరీ హాయి..వీళ్ళతో గుడిలోకి వెళ్ళి వుంటాను. రంగాచారి కూతురు ఇప్పుడు వాళ్ళ నాన్నతో రోజూ గుళ్ళోకి వస్తోందిట!

ఇందిర: ఛీ ఛీ అది కింగ్‌కాంగ్ చెల్లెలు, దాన్నేమని రా చూస్తావ్!

చిన్నకొడుకు: ఖర్మ కాలి అదీ సినిమాల్లో చేరదా మనుకుంటోందట!

బాబాయి: (వస్తూ) ఎటూ గాని వేళ వాకిట్లో యీ మేళ తాళా లేమిట్రా?

చిన్నకొడుకు: నాన్నను అడుగు బాబాయ్! ఈ గుళ్ళో భగవంతుడు కులాసాగా వున్నాడని నాన్న బెంగ.

ఇందిర: ఏం? నాదస్వరం బాగానే వుందిగా బాబాయ్!

బాబాయి: ఏం బాగు అమ్మాయ్! వాడు "తూ" మనిపించినప్పుడల్లా నా గుండె తూట్లు పడుతూంటే! వీళ్ళు ఇవ్వాళ ఆపరా ఏం?

చిన్నకొడుకు: ఎట్లా? అన్నయ్యరావాలి.

బాబాయి: అయినా ఇప్పుడీ తతంగం ఎందుకు? నాకు తెలియక అడుగుతాను!

ఇందిర: మను గ్రహాలు చాలలేదట బాబాయ్!

బాబాయి: (ఆవేశంతో లేచి) చాలంది గ్రహాలు కాదు......లోపం బడ్జెట్టులోను, మనం ఎన్నుకునే శాసన సభ్యుల్లోను వుంచుకుని, విధిని దేవుడిని నిందించి ప్రయోజనం లేదు.

చిన్నకొడుకు: (చప్పట్లు కొడుతూ) బాబాయ్‌కీ జయ్......ఈసారి ఎన్నికల్లో విజయం తప్పదు బాబాయ్...ఇంకొంచెం వట్రసుడి కూడా వుంటే మంత్రివే అవుతావు.

బాబాయి: ఏదో ఆ భగవంతుడి దయవుంటే –

చిన్నకొడుకు : ఎట్లాగూ భగవంతుడికి అభిషేకాలు చేస్తున్నారు కదా, కాస్త మన పేర్లు కూడా కలిపి చెయ్యడానికి వీలుంటుందేమో పేరిశాస్త్రులగారిని అడగాలి.

ఇందిర: ఇటువంటివి కొన్ని హైకమాండు వారికి తెలియకూడదే!

బాబాయి: ఆ ఏర్పాటు ఏమన్నా వుంటే నా పేరు కూడా కలపరా అబ్బాయి! మనకు కలిసొస్తే ఆయనకు లక్ష పత్రి పూజ చేయిస్తామని చెప్పు.

ఇందిర: ఎవరికి? పేరిశాస్త్రులుగారికా?

బాబాయి: ఆయనకెందుకు మధ్య? ఎక్టాకిని భగవంతుడికే!..ఇవ్వాళ ఆపడా ఏరా వీడి సంగీత కచేరి?

చిన్నకొడుకు: వీడి సన్నాయి వాయిద్యమూ, అమ్మడి సంగీతమూ ఒక్కలానే వున్నాయి. పోనీ వీడిని కూడా నీతోబాటు సినిమాల్లోకి తీసుకుపోవే, నీ పాటలకి శ్రుతన్నా వేస్తాడు?

ఇందిర: నా సంగతి ఎత్తవద్దని ఎన్నిసార్లు చెప్పాను? అయినా ఎంతసేపులే, అన్నయ్య రాగానే సినిమాకు వెడతాను.

చిన్నకొడుకు: అన్నయ్య వస్తే, నేనా ఇంట్లో వుండేది! నీతో పాటు బజారుదాకా నేనూ వస్తాను.

బాబాయి: ఈపాటికి మీటింగు మొదలెట్టి వుంటారు. ఇంకా రాలేదేం వీడు?

తండ్రి: (వస్తూ) అమ్మాయ్ అన్నయ్య వచ్చాడా? ఇంకా రాలేదా? ఎట్లా బ్రతుకుతార్రా మీరందరూ? వాకిట్లో ఈ మేళగాళ్ళు తొందర చేస్తున్నారు.

(సుందరం వస్తాడు, కొడుకేమోనని అందరూ గుమ్మందాకా వెళ్ళి చూస్తారు)

తండ్రి: నువ్వా! ఇంకా మా పెద్దవాడనుకున్నాం.

సుందరం: వాకిట్లో మేళాలు మోగుతుంటేను..

చిన్నకొడుకు: ఆ! మోగుతుంటే? ఇందిర పెళ్ళనుకున్నావా? లేక మేము మేళతాళాలతో కదిలి సినిమాకు పోతున్నామనుకున్నావా?

సుందరం: నేను నీతో ఏం అనలేదు.

చిన్నకొడుకు: ఈ అంధ్రుల్ని చూస్తే అందుకేరా నాకు చిరాకు. హాస్యాన్ని కొంచమైనా ఆస్వాదించలేరేమర్రా!

తండ్రి: సుందరం! ఈ పోసుకోలు కబుర్లు చెప్పకపోతే, ఓ చిన్నపిల్లను చూసుకుని, పెళ్ళి చేసుకుని గుట్టు చప్పుడు కాకుండా కాపురం చేసుకోరాదు? అధిక మాసాలతో నా యీడు వస్తుంది గదా!

చిన్నకొడుకు: ఆ సంగతి ఎత్తకు నాన్నా! వాడికి పెళ్ళంటే కించుత్తు భయం.

(ఇంతలో పెద్ద కొడుకు వస్తాడు. ఈ సురోమంటున్న మనిషి విచారం మూర్తీభవించినట్లు కనిపిస్తాడు)

బాబాయి: వచ్చావ్! వెయ్యేళ్ళు ఆయుష్షు నీకు –

తండ్రి: ఇంత ఆలస్యమయిందేం రా? నీకోసం గంటాయె కాచుక్కూర్చున్నాను.

చిన్నకొడుకు: ఎందుక?

తండ్రి: ఇవ్వాళనుంచి అభిషేకాలు చేయిద్దాం అనుకున్నాం కదరా!

చిన్నకొడుకు: వాకిట్లో ఆ సన్నాయి గాళ్ళు అందుకేనా?

తండ్రి: అవును. మొదటి రోజా! అందరం కలిసి గుడికి పోవాలి.

చిన్నకొడుకు: ప్రొద్దున్న ఊరికే అనుకున్నాం గాని, ఇవ్వాళే చేద్దామనుకున్నామా?

తండ్రి: అనుకోవడం, చెయ్యడం – రెండూ రెండుసార్లా? అనుకున్న వెంటనే జరగవలసిందే! నేను ఇంట్లోకి వెళ్ళితీసుకురావలసినవి సర్దుతాను నువ్వు త్వరగా తెములు – (లోపలకు వెడతాడు)

(పెద్దకొడుకు దీర్ఘంగా నిట్టూర్చి కుర్చీలో కూలబడతాడు)

సుందరం: ఇవ్వాళ ఒకటో తారీఖు గదా, అట్లా వున్నారేం?

పెద్దకొడుకు: మనకు సంవత్సరం పొడుగునా నెల చివరేనండీ?

చిన్నకొడుకు: అదేరా మన జీవితాల్లో వున్న విశేషం! అదృష్ట చక్రం గుండ్రంగా వుంటుంది కదూ! మొదలూ, చివరీ చెప్పలేం.

బాబాయి: అబ్బాయి! రెండు రూపాయలు ఇవ్వరా! ఇవ్వాళ కస్తూరిహాల్లో మీటింగు వుంది, వెళ్ళక పోతే బావుండదు.

పెద్దకొడుకు: రెండు రూపాయలా!

బాబాయి: అంతే! రెండు రూపాలయలు చాలు –

ఇందిర: ఒకటో తారీఖు కోసం వారం రోజులనుంచి కాచుక్కూర్చున్నారురా అన్నయ్యా' నేను సినిమాకు వెడతాను.

చిన్నకొడుకు:బాబాయి మీటింగుకి, నీ సినిమాకీ తొందరొచ్చిందా! నేను పుస్తకం కొనుక్కోవాలి.

(బయట నాదస్వరం ఘోష)

పెద్దకొడుకు: ఏమిట్రా ఈ గోల? నా చావుకి వచ్చాయి అన్నీ –

చిన్నకొడుకు:నాన్నకి ఎప్పుడు దొరికినా ఇటువంటి బేరాలే దొరుకుతాయి.

ఇందిర: మళ్ళీ చెల్లింపులకేం తక్కువ కాదు. పదిరూపాయలు.

పెద్దకొడుకు: ఇహనైనా వాళ్లని ఆపమని చెప్పు. నా కడుపులో దేవుతుంది.

(చిన్నకొడుకు వాకిట్లోకి వెడతాడు)

ఇందిర: ఏమంటావురా అన్నయ్యా?

పెద్దకొడుకు: ఏమిటి?

ఇందిర: సినిమా సంగతి?

పెద్దకొడుకు: మరో రోజు పోవచ్చులే అమ్మాయ్!..

సుందరం: అది కాదండీ! ఇవ్వాళ మొదటి తారీఖు గదూ! ఇవ్వాళ వున్న ఆనందం రేపు వస్తుందా?

బాబాయి: సలక్షణంగా వస్తుంది. సినిమా ఆనందానికేముంది? పిలిచినప్పుడు పరిగెత్తుకు వస్తుంది?

చిన్నకొడుకు:వాళ్ళకు డబ్బులిస్తున్నాం కనుక వాయించేది వాయించేదేనంటున్నారు వాళ్లు. పైగా వాళ్ళ విద్వత్తు వినడానికి చుట్టు పక్కల వాళ్ళు నలుగుర్నీ పిలవలేదని నా మీద లేచారు.

పెద్దకొడుకు: ఏడవలేకపోయారు? ఇంట్లో సంగీతాలే వినలేక చస్తుంటే.

ఇందిర: అంటే నా సంగీత మనేనా నీ అభిప్రాయం?

చిన్నకొడుకు:నీ ఒక్కదానిదే ఏం తల్లీ! అమ్మ కడుపున పుట్టిన వాళ్ళందరూ సంగీత పాతకులే!

ఇందిర: నీ పజిళ్ళ గొడవలో నువ్వుండక నా సంగీతం సంగతి ఎందుకు ఎత్తుతావు?

చిన్నకొడుకు:ఏయ్, అమ్మడూ! ఏమిటా వాగుడు?

పెద్దకొడుకు: ఇంకా పజిల్సు కడుతున్నావురా?

చిన్నకొడుకు:లేదన్నయ్యా –

పెద్దకొడుకు: ఈసారి కడుతున్నట్టు తెలిసిందా చదువు మన్పించి ఇంట్లో కూర్చోబెడతాను. ఈ పజిళ్ళకి కూడా డబ్బు ఎక్కడ తెచ్చేది?

తండ్రి: (లోపలనుంచి వస్తూ) ఏమిటిరా పోట్లాట పెద్దవాడా? ఇంటికి రావడం ఆలస్యం, ఏమిటిరా యీ యుద్ధం?

పెద్దకొడుకు: అంటే, దీనికంతా నేనే కారణం అంటావు?

తండ్రి: కారణం ఎవరైతేనేం? శ్రీరామచంద్రా! ఎట్టా బ్రతుకుతారయ్యా వీళ్ళందరూ?

పెద్దకొడుకు: కొంపమీదికి ఏమీ తీసుక రాకుండా వుంటే నిక్షేపంలా బ్రతుకుతారు.

తండ్రి: అంతా నీ మంచికే గదరా!

పెద్దకొడుకు: అవునువును. అందరూ వుద్ధరించే వాళ్ళే –

తండ్రి: లేకపోతే ఏమిటోయ్? ఎంత సంపాదించినా మా రోజుల్లో యీ మాటలు ఎరగం –

సుందరం: పోనివ్వండి ఇవ్వాల్టికి – ఎవ్వరి మనసులూ బాగులేవా హాయిగా అందరం కలిసి సినిమాకు పోదాం

పెద్దకొడుకు: ఎవరికి పుట్టిన బిడ్డరా ఎక్కెక్కి ఏడ్చిందని, నువ్వు తయారే!

ఇందిర: నేనడిగిన రెండు రూపాలయలూ ఇవ్వనంటావు?

పెద్దకొడుకు: ఇవ్వనని ఎందుకంటాను? లేవంటాను.

ఇందిర: ఒకటో తారీఖే గదా?

పెద్దకొడుకు: ఇక్కడేం డబ్బు కుప్పలు పోసుక్కూర్చోలేదు.

తండ్రి: ఎందుకురా క్షణక్షణానికి అట్లా వుగ్రుడివైపోతావు.

పెద్దకొడుకు: గ్రహబలం బావుండక –

తండ్రి: ఆ! సరిగ్గా అందుకే ఈ అభిషేకాలు.

పెద్దకొడుకు: ఒక్క అభిషేకలేమిటి? పూజలు, పునస్కారాలు, నైవేద్యాలు, – అన్నీ కానివ్వండి. కొంప గుండం కావడమేగా మీకు కావలసింది.

తండ్రి: హ.....వ్వ! దేవిడి మీదనే యీ సవాళ్ళన్నీ! ఓయీ రామచంద్ర తండ్రీ! చూస్తూ నే వున్నావు గదా! ఇందులో ఒక్కడికయినా బాగుపడే బుద్ధి వుండకూడదూ?

(సన్నాయి వాద్యం శ్రుతిమించుతుంది)

పెద్దకొడుకు: వాళ్ళెందు వాకిట్లో? ఇంట్లో వాళ్ళు సవ్యంగా వుండిపోయారనా?

తండ్రి: అఘాయిత్యం మాటలనకురా! పూజ అన్నాక అన్నీ సక్రమంగా ఉండవలసిందే!

పెద్దకొడుకు: దానితో పాటు నాశ్రాద్ధం కూడా ఒక్కసారే పెట్టండి.

(అంటూ విసురుగా లోపలకు వెడతాడు. ఇంతలో ఆఫీసు ప్యూను వస్తాడు. ఆఫీసు ఫైళ్ళు ఒకచేతిలో – ఏదో కాగితాన్ని తదేకంగా చూస్తూ వస్తాడు)

ప్యూను: బాబూ!

చిన్నకొడుకు: ఏమిటి అంత తీక్షణంగా చూస్తున్నావు! సినిమా శతదినోత్సవం కాగితామా?

ప్యూను: బాబూ! కూసింత ఈ ఒక్కమాటకీ అని పేరు చెప్పండి బాబు! దీని సిగదరగ – మీ ఇదొక్కటే రావాలండీ – అయిదొందలు మనవే ననుకోండి.

ఇందిర: ఏమిట్రా అది?

బాబాయి: తెలుగు ఫజిలు. మీ అన్నయ్యకీ వీడికి ఒకే రకం వ్యాధి.

ప్యూను: దొరా! నాలుగు కాళ్ళ జంతువు – దాని పాలు బాగా బలం – రెండచ్చరల్లో ఒకటి 'క' వుండాలంట – ఏంటి దొరా అది?

సుందరం: ఓస్! ఏముంది? నక్క –

చిన్నకొడుకు: భేష్, భేష్...తెలుగులో నీకున్న విజ్ఞానం సంగతి విన్నాకనే చిన్నయసూరి ఆత్మహత్య చేసుకున్నాట్ట!

సుందరం: ఏం? నేను చెప్పింది రైటు కాదా?

ప్యూను: కాకింద కావత్తు వుండకూడదంటే ఒట్టి 'క'నే -

సుందరం: ఏమిటో వెధవ భాష! ఎంతసేపటికి పైకీ, కిందికి నడుస్తుంది గాని, ముందుకు నడవదేం?

(వస్తూ)

పెద్దకొడుకు: ఏరా! కేసుల ఫైలు తెచ్చావ్?

ప్యూను: (గాభరాగా, కాగితాలు దాస్తూ) తెతెతె తెచ్చినానుండి -

పెద్దకొడుకు: మరి అక్కడ పెట్టి పోలేదేం?

ప్యూను: మమమ మరి -

పెద్దకొడుకు: మెమెమె ఏమిట్రా, మేకలాగా?

ప్యూను: సరిపోయింది సార్! సరిగ్గా సరిపోయింది సార్! నాలుక్కాళ్ళ జంతువు మేకే సార్...ఈ సారి మనకు అయిదు వందరూ తప్పవు సార్!

పెద్దకొడుకు: ఏమిటది! పజిలేనా. నీకూ పట్టిందా యీ పిచ్చి, నోర మూసుకుని ఇంటికి నడు -

(ప్యూను వెడతాడు)

తండ్రి: ఇంకా గుళ్ళోకి బయలుదేరలేదా?

పెద్దకొడుకు: నా దగ్గర చిల్లీ కానీ లేదు.

తండ్రి: ఎట్లా మరీ?

పెద్దకొడుకు: ఏమో! మీకే తెలియాలి.

ఇందిర: నన్నూ సినిమాకు వెళ్ళడం మానుకోమంటావా?

పెద్దకొడుకు: నిక్షేపంగా.

సుందరం: చెల్లెలు ప్రేమాగా అడిగితే?

పెద్దకొడుకు: సుందరం నోరు మూసుకో నీ రికమండేషన్లు ఏమీ అక్కర్లేదు. మా యింటి విషయాల్లో నువ్వు జోక్యం కలిగించుకుంటే బావుండదు.

సుందరం: ఏదో కుటుంబ మిత్రుణ్ని గదా అని చెప్పాను గాని -

తండ్రి: ఇన్నాళ్ళు పెంచి పెద్దవాడిని చేసిన తండ్రికి నువ్వు చూపించే గౌరవం ఇదేనన్నమాట!

ఇందిర: ఒక్కగాను ఒక్క చెల్లెల్ని, వాడికి నామీద మాత్రం అభిమానం ఉందా?

బాబాయి: అందరిమీదా అంతే!!

పెద్దకొడుకు: అవును. నాకు ఎవ్వరిమీదా అభిమానం లేదు. ఎందుకు వుండాలి. మీ కందరికీ అడిగినవన్నీ ఇస్తే నేను మంచివాడిని. లేకపోతే కాదా. నేను మీకు చిల్లి గవ్వ ఇవ్వను. వెళ్ళిరండి...తక్షణం వెళ్ళండి.

(అంటూ ఆయాసంతో తలమీద చేతులు వుంచుకుంటాడు)

తండ్రి: ఏమిటోయ్...సంపాదిస్తున్నావనా అంత అహంకారం? బాగుపడే లక్షణాలు యివేనా? అయినా ఇదంతా నాకోసమా?

బాబాయి: నేను మాత్రం? రేపు పొద్దున్న ఎమ్.ఎల్.ఎ నో మంత్రినో అయితే ఆ సంపాదించేది నా ఒక్కడి

కోసమా?

ఇందిర: నేనూ అంతే -

చిన్నకొడుకు: అందరూ అంతే నమ్మడూ!

పెద్దకొడుకు: మీరు నన్నేమీ ఉద్ధరించనక్కరలేదు. నా పెట్టుబడి మీద గొప్పవాళ్ళు కానక్కరలేదు. నన్ను ఒక్క చిల్లిగవ్వ అడగొద్దు..(లోపలకు వెళ్ళిపోతాడు)

తండ్రి: చూశారా చూశారా - వాడు నన్ను ఎట్టా దులిపి పారేశాడో?

బాబాయి: నన్ను మాత్రం?

చిన్నకొడుకు: వాడసలు నా మాటే వినలేదు.

ఇందిర: నా మాట విని మాత్రం చేసిందేమిటి?

తండ్రి: అంతే, అంతే! ఏదో సామెత చెప్పినట్టుగా.

ఇందిర: నువ్వా మేళతాళాలు, ఈ అభిషేకాలు మొదలు పెట్టకపోతే నాకిచ్చేవాడే డబ్బు -

చిన్నకొడుకు: అసలు వాడిదగ్గర లేనే లేవన్నాడు.

బాబాయి: నీకు తెలియదురా! అటువంటి విషయాలు నన్ను అడుగు, చెబుతాను....వాడు వుంచుకునే లేవంటున్నాడని నా నమ్మకం.

సుందరం: బాగా చెప్పారు - నా అనుమానమూ అదే.

ఇందిర: అందుకే నువ్వు అడక్కుండా వుండవలసింది నాన్నా!

తండ్రి: భగవంతుడి పూజకంటే సినిమాకు వెళ్ళడం ఎక్కువంటావ్! కళ్ళు పోతాయి తెలుసా?

చిన్నకొడుకు: బాబాయ్ మీరు పెద్దవాళ్ళు మీ కట్లా అడ్డం వస్తే ఎట్టా చెప్పండి?

బాబాయ్: నీ పజిలు తొందరట్రా?

చిన్నకొడుకు: ఇప్పుడు పజిలు కోసం ఎవరడిగారు? నేను పుస్తకం కొనుక్కోవాలి.

ఇందిర: ఏరాయి అయితే నేం పళ్ళు వూడడానికి?

చిన్నకొడుకు: నీకంటే నయమే! నువ్వు అన్నయ్యని అట్లా ఏడిపించకపోతే, యీ ఒక్కపూటకు సినిమాకు పోకపోతే ప్రాణం పోతుందా?

ఇందిర: మాటలు సరిగ్గా రానీ అన్నయ్యా.

చిన్నకొడుకు: నువ్వే రానియ్యి. నాకు అడ్డం వచ్చింది కాకుండా సవాళ్ళు చేస్తావేం?

ఇందిర: ఛీ! నాతో మాట్లాడకు.

చిన్నకొడుకు: నాతో మాట్లాడాలని లేకపోతే నువ్వే నోరు మూసుకో.

ఇందిర: (ఏడుస్తూ) అను అను....నిన్నెవ్వరూ అనేవాళ్ళు లేరనేగా నీ ఇది -

బాబాయి: వూరుకోండిరా - ఎవరన్నా చూస్తే ఏమన్నా అనుకుంటారనన్నా లేదేమిట్రా మీకు?

ఇందిర: వాడే! అనవసరంగా కయ్యానికి కాలు దువ్వుతున్నాడు.

చిన్నకొడుకు: నువ్వే! నేనంటే గిట్టక -

ఇందిర: నువ్వే...

చిన్నకొడుకు: నువ్వే.

ఇందిర: నువ్వే..నువ్వే......నువ్వే.....

తండ్రి: ఓయా శ్రీరామచంద్రమూర్తీ! ఆర్తత్రాణ పరాయణా!చూస్తున్నావు కదయ్యా వీళ్ళ బ్రతుకులు –

(అంటూ వుండగా చేతులెత్తి నమస్కారం చేస్తూ వుండగా తెర)

27–8–1958

(మూడు నెలల తరువాత, అదే గదిలో ఉదయం ఎనిమిది గంటలకు – తండ్రి స్నానాదికా లయ్యాక భగవద్గీత పారాయణ చేస్తూ వుంటాడు. చిన్న కొడుకు ఆదుర్దాగా ప్రవేశిస్తాడు)

చిన్నకొడుకు: బాబాయి.......బాబాయి.....బాబాయి......ఎక్కడ నాన్నా?

తండ్రి: ఏమిటి గెలిచాడా?

చిన్నకొడుకు: లేదు డిపాజిట్ కూడా పోయింది, అందుకే, అభినందిద్దామని.

తండ్రి: అదేమిట్రా.......మరీ పోయేకాలం – ఎవరైనా గెలవాలనుకుంటారు.

చిన్నకొడుకు: చచ్చేవాళ్ళ గెలుస్తే...గెలుస్తాననుకున్నప్పుడే అంత మిడిసిపడి పోయేవాడా ఇహ గెలిస్తే అడిగావూ–

తండ్రి: ఏం మనుష్యులురా! ఎదుటివాడు బాగు పడడం ఒక్కరికీ ఇష్టం లేదు గదా ఖర్మ. అందుకే ఆ రాముల వారి దయ అట్లా వుంది.

చిన్నకొడుకు: ఈ చలవంతా నీదే నాన్నా! ఏ ఒక్క పని మొదటెట్టినా నీ దీవెనలు తప్పవు గదా! ఇంటికి పెద్దవాడే ఇట్లా పెళ్ళికూతురు ముండ పదంటే యిహ పనులేం సాగేను?

తండ్రి: అదుగో....అందుకేరా, అందుకే – అటే చూస్తున్నాను...గదా – (బాబాయి వచ్చాడు.ఒత్తుగా పెరిగిన గడ్డం – ముఖంలో ఆతృత)

చిన్నకొడుకు: బాబాయి! విన్నావా యీ శుభవార్త!

బాబాయి: ఏమిట్రా! ఏమిటది? ఏమయింది?

చిన్నకొడుకు: ఎలక్షను ఆఫీసరునుంచి వస్తున్నాను. తప్పకుండా గెలుస్తానని ధీమాగా యింట్లో కూర్చుని, నీ ఏజంటుగా పంపావే, ఈ వీరభద్రయ్య స్వయంగా చెప్పాడు.

బాబాయి: (సంతోషంగా) అయితే గెలిచానంటావూ! ఇహ చూసుకోరా బాబాయి తడాఖా! ఒరేయ్ చిన్నా! నీకో రెండు బస్సు రూట్లు – అన్నయ్యా! నీకు ప్రత్యేకంగా దేవాలయం – అందుకే శ్రీరామ చంద్రుడి ప్రతిష్ట.

తండ్రి: అది కాదురా –

బాబాయి: నీకు తెలియదులే అన్నయ్యా! ఈ సారి చూసుకో – మనం మంత్రి కావలసిందే! నేను చెబితే విన్నావుగా చిన్నా! ఇహ మనది రాజభోగం కాదరా! కోరుకో – ఏం కావాలో

చిన్నకొడుకు: పాపము శమించుగాక! బాబాయి! నువ్వు మంత్రి అయ్యే ఆశ వచ్చే ఎలక్షన్ల దాకా వాయిదా వేసుకో.

బాబాయి: అంటే –

చిన్నకొడుకు: అంటే నువ్వు ఎలక్షన్లలో వోడిపోయావు, ఆశలు పంచుకోవడం అంత మంచిది కాదు – అని.

బాబాయి: (నిర్ఘాంతపోయి) అదేమిట్రా! నిజంగా!

తండ్రి: నాకు అట్లాగే చెప్పాడు.

బాబాయి: శుభవార్త అని చెప్పావు కదా!

చిన్నకొడుకు: నువ్వు గెలవకపోవడం దేశానికి అంత మంచిది మరి.

బాబాయి: నేను ఛస్తే నమ్మను.

చిన్నకొడుకు: నాకేమిటి ప్రమాదం? ఇంకా వివరాలు కావాలంటే డిపాజిట్టు కూడా పోయింది?

బాబాయి: (కూలబడుతూ) అయ్యో!....అయ్యో......పోయిందీ, అంత పనీ జరిగింది –

చిన్నకొడుకు: ఇటువంటి విషయల్లో అబద్ధం చెబుతానా బాబాయి. గుళ్ళో శ్రీరామచంద్రుడి తోడు – నీ పేరుతో పూజలు చేసిన పేరుశాస్త్రులు తోడు.

బాబాయి: ఇదంతా వాడి పనే! వెధవ! వాడికో రూపాయి తక్కు విచ్చానని ఆనాడే అన్నాడు నానా మాటలూనూ. కొండ ముచ్చు మొహమూ వాడూ! అయ్యో! ఇహ నెట్లారా? నా పరువేంగాను?

చిన్నకొడుకు: ఇహనయినా ఆ చిరిగిపోయిన పరుపు కోటును గోడకు తగిలించి ఇంట్లో పడుకో –

తండ్రి: మీలో ఒక్కడికైనా నిజమైన భక్తి ఏడిసిందీ? అందుకే –

బాబాయి: చస్తుంటే సంధి మంత్రమని, వోడిపోయి నేడు ఏడుస్తుంటే –

చిన్నకొడుకు: డిపాజిట్టు కూడా పోయింది బాబాయి.

బాబాయి: పోతే పోయింది లేవోయ్ వెధవ ముండా డిపాజిట్టు...మొదటికే మోసం వచ్చి చస్తుంటే లేదు గాని – ఇహ అది వుండి వుద్ధరిస్తుందా?

తండ్రి: ఏమిటో! అంతా ఆ రాములవారి దయ –

చిన్నకొడుకు: బాబాయి విషయంలో అంతా ఆ వోట్లు వేసిన వాళ్ళ దయ నాన్నా! లేకపోతే నలభై వేల వోట్లు వుంటే నాలుగువందలు రాకూడదూ?

బాబాయి: ఒరే అబ్బాయి...నీ మాటే అసలు నాకు బెడిసి కొట్టాయి. ఇన్నాళ్ళనుంచీ చూస్తున్నాను గదా, శల్య సారధ్యంలా వుంది గాని నీ వ్యవహారం –

చిన్నకొడుకు: పురాణల్లో నీకు వుండుకున్న ప్రజ్ఞావిశేషాలకయినా నిన్ను గెలిపించవలసింది జనం. ఇప్పుడు పురాణాలు ఎవరికి కావాలి కనుక? – ప్లాటఫారం స్పీకర్లకి, తెలుగు మాస్టర్లకి తప్పించి –

బాబాయి: (లేచి) ఒక్కసారి ఎలక్షను ఆఫీసుకు వెళ్ళొస్తాను.

తండ్రి: ఇప్పుడే ఎందుకురా?

చిన్నకొడుకు: ఒంటిని ఇన్స్యూర్ చేయించుకుని మరీ వెళ్ళుబాబాయి.

బాబాయి: ఎందుకు?

చిన్నకొడుకు: అహా....ప్రజలకు నీ సంగతి ఇప్పుడే తెలిసిందా, ఆదరించి తగిన రీతిలో – సత్కరిస్తారేమోనని

బాబాయి: పెద్దా, చిన్నా విచక్షణ లేకుండా మాట్లాడగానే సరికాదు. ఇవేం నీ పజిళ్ళనుకున్నావా? ఇవి రాజకీయాలు తెలుసా?

చిన్నకొడుకు: మీ రాజకీయాల కంటే అవే నయం –

బాబాయి: చూస్తాంగా యీసారి –

చిన్నకొడుకు: చూడు.....మరో గంటలో తెలియాలి.....''ఆల్ కరెక్ట్'' అని టెలిగ్రాం, దీనితో పాటు లక్షరూపాలయలకు చెక్కు –

తండ్రి: అందుకా నాయనా ఈ మిడిసిపాటు –

చిన్నకొడుకు: పాపము శమించు గాక! మిడిసిపాటు నా కెందుకు నాన్నా? ఇంకా, నాకు లక్ష వస్తున్నాయని మీరే గర్వపడాలి.

బాబాయి: అదీ చూద్దాంగా......ఆ! నే నట్లా వెళ్ళొస్తా – (వెడతాడు)

తండ్రి: అన్నయ్య ఏడిరా?

చిన్నకొడుకు: ఏం? మళ్ళీ పూజలు, పురస్కారాలు మొదలా?

తండ్రి: ఈ అనవసర ప్రసంగాలే వద్దన్నాను. ఇంటికి పెద్దపిల్లాడన్నాక లక్ష పనుల వుంటాయి.

చిన్నకొడుకు: మీ శ్రీరామచంద్రమూర్తికి అందుకే రోజూ వెయ్యి దణ్ణాలు పెట్టుకుంటూ వుంటాను – నన్ను ఇంటికి పెద్దవాడిని చేయలేదు – ఆయన పుణ్యమా అని –

తండ్రి: అన్నయ్య ఏడో చెప్పరా అంటే.....

చిన్నకొడుకు: నాకేం చెప్పి వెళతాడా నాన్నా! రెండు రోజుల నుంచి ఒక్క క్షణం తీరిక లేకుండా తిరుగుతున్నాడు.

తండ్రి: తిరిగి ఏం లాభం?

చిన్నకొడుకు: ఏమో? అది వాడికే తెలియాలి.

తండ్రి: ఆ సుందరాంగుడయినా కనిపించాడా?

చిన్నకొడుకు: ఇంటర్వ్యూలో అడిగినట్లు ప్రశ్నలడిగితే నేనే సమాధానం చెప్పను? (పెద్దకొడుకు వస్తాడు) నాకు ప్రాణ దానం చేశావురా అన్నయ్యా!

పెద్దకొడుకు: అంత ప్రాణం పోయే ఆపదేం నాయనా?

తండ్రి: వాడికేం ఆడిపోతున్నాడు గాని, వెళ్లిన పని ఏమయినా అయిందర్రా?

పెద్దకొడుకు: ప్చ్ (అంటూ ఉసూరుమని కుర్చీలో కూలబడతాడు)

తండ్రి: ఇప్పుడేం చేయ్యాలిరా? నలుగురికీ తెలిస్తే అప్రదిష్ట కాదుట్రా?

పెద్దకొడుకు: నేనే చావను? అక్కడకు కాళ్ళు బలపాలు కట్టేటట్లుగా తిరుగుతూనే వున్నాను గదా!

తండ్రి: ఓ అఘాయిత్యం మాటలనకురా! అసలే పరువు పోయి నేనేడుస్తుంటే –

పెద్దకొడుకు: మీకేం? హాయిగా కాలుమీద కాలు వేసుకుని ఇంట్లోనే కూర్చున్నారుగా?

తండ్రి: ఇన్నాళ్ళు బ్రతికి ఇంటి వెనకాల చచ్చినట్టు మీచేత యిన్ని మాటలు పడాలని రాసివుంది – కానివ్వండి.

చిన్నకొడుకు: అమ్మడికి ఇదంతా నువ్వే ఇచ్చిన అలుసే నాన్నా!

తండ్రి: నేనా!....హ.....వ్వ! ఎవరయినా నవ్వి పోతారు. అసలు సుందరం గాడిని ఇంట్లో చేర్చింది నువ్వు కాదు.

చిన్నకొడుకు: బావుంది. వాడిట్లా చేస్తాడని నేనేమన్నా కలగన్నానా?

తండ్రి: నీ స్నేహితులందరూ ఇటువంటి బడుద్దాయిలే!

పెద్దకొడుకు: వీడి పోలికే వచ్చింది వాళ్ళందరికీ –

తండ్రి: ఇంట్లో ఇట్లా కూర్చుంటే ఎట్లాగురా! ఏదో ఒకటి చెయ్యొద్దు?

పెద్దకొడుకు: ఇంకా నేను ఉరిపోసుకు చావడం ఒకటే మిగిలింది.

చిన్నకొడుకు: అదేమిట్రా అన్నయ్యా? ఎలక్షన్లలతో డిపాజిట్లు పోయిన బాబాయి ఊరుకుంటాడా?

తండ్రి: అనేవాళ్ళు లేకగాని, పెద్దవాళ్ళను కొంచెం గౌరవంగా చూడడం ఎప్పుడు నేర్చుకుంటావురా నువ్వు?

చిన్నకొడుకు: ఏమో, ఆ శ్రీరామచంద్రుడి దయ!

తండ్రి: నీకు ఈ జన్మకు బుద్ధి రాదు.

(బాబాయి వస్తాడు చేతిలో పేపరుతో)

బాబాయి: పెద్దవాడా! వచ్చవ్: (చిన్నకొడుకుతో) చూశావురా! బాబాయి అంటే నీకు ఆటగా వుంటుంది. ఇప్పటికయినా తెలుసుకో బాబాయి జీనియస్ అని –

పెద్దకొడుకు: ఏం బాబాయ్! కొంపదీసి గెలిచావా ఏం?

చిన్నకొడుకు: గెలవడం ఏం ఖర్మరా? ఇప్పుడు బాబాయి ఎమ్.ఎల్.ఏ., డి.డి.ఎల్ – అనగా డిఫీడెడ్ అండ్ డిపాజిట్ లాస్ట్ – అని అర్థం.

బాబాయి: మీ కందరికి యింత కష్టంగా వుంటే నేను గెలిచి ఎవరిని సంతోషపెట్టను?

చిన్నకొడుకు: (పేపరు చూసి) ఆహాహా! చూడుడు! నిజంగా బాబాయిదిరా రాజకీయ నాయకుడి బుర్ర... వాళ్ళకి పబ్లిక్ జీవితం తప్ప ప్రయివేటు జీవితం వుండదంటారు –

తండ్రి: ఏమిటది.

చిన్నకొడుకు: అవధిరింపుడు..(అని పేపర్లో చూసి చదువుతూ) తప్పిపోయినది. 17 సం॥ల వయసు కలిగి, ఎర్రని ఛాయగలిగిన మా పిల్ల – సుందరి పేరు గల చిన్నది – తప్పిపోయినది. పిల్ల అందమైనది. చదువుకున్నది. ఎత్తు సుమారు 5 అ.3 అం.లు. సినిమా పిచ్చి కొంచెము ఎక్కువ. వివరములు తెలిపినచో రూ॥50 బహుమానము.

ఆహాహా! నీకు సుడి లేదు గాని బాబాయ్! నిజంగా మంత్రివి కాదగినవాడివి.

తండ్రి: (తేరుకుని) ఇదంతా నీ పనేనట్రా?

బాబాయి: మరి నీ తమ్ముడంటే తక్కువవాడనుకున్నావా అన్నయ్యా?

తండ్రి: నీ మొహం! అసలే పిల్ల కనిపించక నే నేడుస్తూ వుంటే – ఇహ యీ కాస్త పరువు కూడా దక్కనివ్వవా ఏం?

బాబాయి: అందుకే నన్నయ్యా యీ ప్రయత్నమంతా!

పెద్దకొడుకు: ఏమిటి బాబాయి నీ ప్రయత్నం? మమ్మల్ని రచ్చకీడ్వడమా?

బాబాయి: బావుందోయ్! అది లేచిపోతే లేదు గాని, నేను పేపర్లో వేయిస్తే వచ్చిందా!

తండ్రి: (ఆ పేపరు లాక్కొని చదివి) హ..వ్వ! ఫోటో కూడా వేయించావ్! ఇదేం పోయేకాలం నీకు! ఇవేనట్రా నీచవట రాజకీయం తెలివితేటలు?

బాబాయి: నా మాట ఒక్కరూ వినిపించుకోరేం ఖర్మ! మన అమ్మాయి మన ఇంటికి రావడమే కదా మనకు కావలసింది –

తండ్రి: అందుకని ప్రతి వూరా టాం టాం వేయించమంటావుట్రా!..నీతో ఏ పనైనా కొరివితో తల గోక్కున్నట్టే కదరా! పదరా పెద్దవాడా! మనం వెళ్ళి ఏమైనా ఆరాలు తెలిసాయేమో కనుక్కొందాం.

పెద్దకొడుకు: ఇప్పుడే కదా కనుక్కొచ్చింది నేను.

తండ్రి: పోనీ పేరుశాస్త్రులు గారి దగ్గరకు పోయి ప్రశ్న అయినా అడిగి వద్దాం పద.

ఇంత మందికి చేత కాలేదు, ఇహ పేరి శాస్త్రులు గారు చేస్తారు –

తండ్రి: అదుగో! అదే వద్దన్నాను – పదరా పెద్దవాడా – శ్రీరామచంద్రా! కాపాడు తండ్రీ –

(అంటూ ఇద్దరూ వెళ్ళిపోతారు)

బాబాయి: ఏరా, అబ్బాయి! నేను చేసిన పని నీకూ బాగా లేదా ఏం?

చిన్నకొడుకు: ముందు నాతో కొంచెం చెప్పవలసింది బాబాయి!

బాబాయి: నీకు మాత్రం తెలిసి ఏడిసిందంటా! నిన్న ఆఫీసులో కూర్చున్నానా! ఏమీ తోచక ఎమ్.పి.గా నిలబడే మా శనేశ్వరంగాడు లేదూ – వాడిని అడిగాను అతగాడిది ఈ తెలివి.

చిన్నకొడుకు: తెలివి పాళాలోనే వుంది గాని, ప్రయోగమే బెడిసి కొట్టింది.

(వాకిట్లో 'టెలిగ్రాం' అన్న కేక)

చిన్నకొడుకు: (ఎగిరి గంతేసి) అదుగో బాబాయి! టెలిగ్రాం! లక్ష – లక్షరూపాయలు బాబాయి!

బాబాయి: అదృష్టం అంటే నీదేరా! నాకు తెలియదూ –

చిన్నకొడుకు: (సంతోషంలో కొంచెం చలించి) అదృష్టమని నెమ్మదిగా అంటావేం బాబాయి– ఈ సారి ఎన్నికల్లో నిలబడడానికి నీకెంత కావాలో తీసుకో –

('టెలిగ్రాం సార్' అని మళ్ళీ కేక)

(చిన్నకొడుకు వాకిట్లోకి పరుగెత్తుకు వెళ్ళి మళ్ళీ కవరుతో వస్తాడు)

చిన్నకొడుకు: బాబాయి! నాకెందుకో భయంగా ఉంది. నువ్వు చూడు.

బాబాయి: మళ్ళీ నా చెయ్యి ఎందుకురా? కానీ –

చిన్నకొడుకు: కాదులే బాబాయి! నీ చెయ్యి బంగారం కాదనా!..తియ్......

బాబాయి: (కవరు చించి, చూసి) ఆ, ఆ! అనుకుంటూనే ఉన్నా!

చిన్నకొడుకు: ఏం? ఎంత? లక్షా వచ్చిందా?

బాబాయి: వస్తే యీ బాధంతా ఎందుకురా?

చిన్నకొడుకు: ఏమీ రాలేదా! సరిగ్గా చూడు బాబాయి.

బాబాయి: దీన్తో వున్నదే ఇదిరా! నో ప్రయిజ్ సారీ.

చిన్నకొడుకు: అయ్యో! దానిమీద వంద రూపాయలు తగలేసానే?

బాబాయి: వంద రూపాయలు ఎక్కడివిరా?

చిన్నకొడుకు: ఎక్కడివయితేనేం? అయ్యో ఎన్ని ఆశలు పెట్టుకున్నాను.

బాబాయి: ఆశల కేం? నేను మాత్రం పెట్టుకోలేదూ గంపెడు ఆశలు! ప్రాప్తం లేదు అంతే!

చిన్నకొడుకు: ఇరవై ఎంట్రీలు వేశాను. ఒక్కటి రైటు కాకూడదూ.

బాబాయి: నేను రెండు వేరు ఖర్చుపెట్టాను. కనీసం డిపాజిట్టు అయినా దక్కిందా?

చిన్నకొడుకు: ఇదంతా నీచేతి చలవే! పొరపాటున కవరు చేతికి ఇచ్చాను,చూడమని –

బాబాయి: నేను ముందే వద్దన్నాను. వినకుండా "నీ చెయ్యి బంగారం బాబాయి" అని బలవంతంగా నాచేత

చింపించింది నువ్వేగా?

చిన్నకొడుకు: నీ చెయ్యి బంగారం కాదు. ఒట్టి తోలు చెయ్యి.

బాబాయి: నీది ఇంకా చచ్చు చెయ్యి అనేగా నాతో తీయించావు.

చిన్నకొడుకు: బుద్ధి గడ్డితిని చేశాను, సరా!

(పెద్దకొడుకు, తండ్రీ ఆదుర్దాగా వస్తారు)

తండ్రి: ఏదిరా, మనకేదో టెలిగ్రాం వచ్చిందట –

పెద్దకొడుకు: అమ్మడి దగ్గరనుంచేనా? ఇద్దరూ అట్లా వున్నారేం?

ఏమయిందిరా?

బాబాయి: అది అమ్మడు దగ్గర నుంచి కాదురా!

తండ్రి: కాదూ?

మరి?

బాబాయి: చిన్నవాడికి పజిలులో ప్రయిజేమీ రాలేదని కంపెనీ వాళ్ళు టెలిగ్రాం ఇచ్చారు.

తండ్రి: ప్రయిజు రాకపోతే ఎందుకిస్తారురా టెలిగ్రాం!

బాబాయి: (చిన్న కొడుకువద్దని సైగ చేస్తున్నా, చూడక) నీకు తెలియదులే అన్నయ్యా! ఏభై రూపాయల కంటే ఎక్కువ ఎంట్రీలు కడితే వాళ్ళే టెలిగ్రాంలు యిస్తారు.

తండ్రి: ఏరా? నువ్వేనా కట్టింది అది?

పెద్దకొడుకు: మాట్లాడవేంరా? నువ్వేకదూ? ఎక్కడివిరా నీ కంత డబ్బు?

(చిన్నకొడుకు మాట్లాడడు)

చెప్పు. జీతం కోసం ఇచ్చిన డబ్బేనా? అవంతా తీసుకుపోయి ఇట్లా తగలేశావ్!

తండ్రి: వంద రూపాయలే! అంతా పజిళ్లకే?

పెద్దకొడుకు: నీకు బుద్ధి వుందా? పైగా బి.ఏ. అఘోరిస్తున్నావు. బి.ఏ! నేను నానా గడ్డీ కరిచి డబ్బు తీసుకువచ్చి జీతం కట్టరా అని నీకిస్తే నువ్వు చేసే పనులు ఇవా!

చిన్నకొడుకు: అది కాదన్నయ్యా –

పెద్దకొడుకు: ఇంకా మాట్లాడుతావ్, సిగ్గు లేక – మానాభిమానాలు వున్నాయిరా నీకు – ఛీ (అంటూ దగ్గరకు పోయి చెంపమీద కొడతాడు)

బాబాయి: అబ్బాయి!

తండ్రి: ఏమిట్రా అది వూరుకో!

పెద్దకొడుకు: ఒక వూరుకోక వురిపోసుకుంటామా? ఇంట్లో అందరూ దొరలే! అందరికీ డబ్బు కావాలి. కష్ట సుఖాలు ఒక్కరైనా ఆలోచిస్తున్నారా! ఇహ నన్ను కోసుకు తినండి. అదే మీకు కావలసింది –

చిన్నకొడుకు: పొరపాటు అన్నయ్యా – ఇహ ఎప్పుడూ చెయ్యనుగా –

(ఇంతలో ఇందిరతో సహా మామయ్య వస్తాడు)

మామయ్య: ఏమిటేమిటి? ఇంటిల్లి పాది నాటకం రిహార్సలు వెయ్యడం లేదు గదా!

బాబాయి: రా, బావా, రా! మంచి సమయానకే వచ్చావు –

తండ్రి: ఏమిటి! అమ్మడు కూడా వచ్చింది. ఏం పని చేశావు తల్లీ! మా పరువంతా గంగలో కలిపి పోయావుకదా! ఎక్కడికి పోయావే!

మామయ్య: ఎక్కడికి పోతే ఏం బావా! ముల్లోకాలు వెదికి సాధించి తెచ్చాను, కోడలు పిల్లను –

బాబాయి: ఎక్కడ కనిపించింది?

మామయ్య: మా స్నేహితుడే ఒకాయన – వీళ్ళు – ఇదీ, సుందరం గారుట – ఆయనా – ఇద్దరూ సత్రంలో ఉండగా నాకు చెప్పాడు.

పెద్దకొడుకు: మరి సుందరం ఏడీ?

మామయ్య: వచ్చాడు మరి స్టేషను దాకా –

పెద్దకొడుకు: కనిపించడనీ చెబుతూ – మక్కెలు విరగదంతాను.

మామయ్య: ఆ పని మాత్రం చెయ్యకురా, పాపం పిల్లవాడు సాత్వికుడులానే కనిపించాడు.

తండ్రి: ఏమోలే....అది ఇంటికి వచ్చింది. అంతే చాలు.

(చిన్నకొడుకు ఇంట్లోకి వెళ్ళబోతాడు)

మామయ్య: ఒరేయ్! చిన్నవాడా!..వెళ్ళాడూ? ఏమిటయ్యా బావా, నేను వచ్చేసరికి అడుతున్న నాటకం?

బాబాయి: అదంతా పెద్ద కథలే – తీరిగ్గా చెప్పుకుందాం.

మామయ్య: అవును మరి – ఆ పేపర్లో వేయించాలనే తెలివి తేటలెవరివి? చిన్నబావవేనా?

పెద్దకొడుకు: ఆ! ఆయనదే ఆ వుద్ధరింపు.

మామయ్య: పాపం.....అదే నాకు ఉపయోగించిందిరా.....

తండ్రి: అట్లా నిటబడ్డావేం అమ్మడూ? ఇంట్లోకి పో – ఆ శ్రీరామచంద్రుడు దయ వుంది. నువ్వు యింటికి తిరిగి వచ్చావు –

పెద్దకొడుకు: శ్రీరామచంద్రుడు దయకేం? డబ్బు వదిలితే సరి.

తండ్రి: అమ్మడూ తిరిగి రావడానికి అర్చనలు చేయిస్తూన్నాననేగా ఈ కోపం.

పెద్దకొడుకు: ఆ మాట అనుకోవడానికి నేనెవర్ని? నాకీ ఇంట్లో ఆ మాత్రం అధికారం వుండి ఏడిసిందా?

మామయ్య: చెప్పరూ! ఏదో రసవత్తరమైన ఘట్టంలోనే వచ్చానన్నమాట! ఏమిటి బావా ఇదంతా –

తండ్రి: ఏముంది బావా! చేసుకున్నవాళ్ళకు చేసుకున్నంత మహదేవ –

మామయ్య: కోట్లకి విలువైన మాట చెప్పావు బావా! ఏరా పెద్దవాడా! ఏమిటి సంగతి?

పెద్దకొడుకు: నేను బ్రతికి వుండడం ఒక్కటే విచారకరమైన సంగతి –

మామయ్య: ఓరీ మీ ఇల్లు బంగారంకాను, అందరూ అడ్డ దోవల వెంట పోయేవాళ్ళే గాని ఒక్కడూ సవ్యంగా, సూటిగా జవాబు చెప్పరేం? పైగా ఇంటికి వచ్చిన చుట్టాన్నా, ఏ క్షేమ సమాచారాలు అడగడం లేదు కదా, మీలో మీరు పోట్లాడుకుంటున్నారు!

బాబాయి: ఆ! అదే అడగబోతూ వుంటేనే – ఆ! ఇంటి దగ్గర అమ్మాయివాళ్ళంతా కులాసానా?

మామయ్య: నీ మంత్రి పదవిలానా వుంది దాని కులాసా కూడా – ఎప్పుడు వస్తా, వస్తా అనడమే కాని వచ్చినట్టు కనిపించదు. అన్నట్లు నీ మంత్రిపదవి ఎంతవరకు వచ్చింది?

పెద్దకొడుకు: పురుటిలోనే దోషం కొట్టింది.

మామయ్య: దోవలోనే తెలిసిందిలే!.మీ పిచ్చిగాని అనుకోగానే వస్తుందట్రా? ఎందుకు బావా నీకీ అడ్డదోవలు? హాయిగా ఎక్కడో ఒకచోట గుట్టు చప్పుడు కాకుండా కాల గడపక?

బాబాయి: ఇన్నాళ్ళు జీవితాన్ని ప్రజాసేవకోసం అంకితం చేశాను. ఆ మాత్రం కూడ కోరిక కోరకూడదా?

మామయ్య: ఇంకా ఏదో నువ్వు కోరుతున్నావు. అంటే ఇంకా నీలో స్వార్థం చావలేదన్నమాట. నీ పని నువ్వు సక్రమంగా చేసి వూరుకో....ప్రజలకు నీ అధికారం 'కావాలంటే వారినే ఏకగ్రీవంగా ఎన్నుకోనీ –(తండ్రితో) ఏమంటావు బావా?

తండ్రి: ఏమిటో నాయనా! అంతా ఆ శ్రీరామచంద్రుడి దయం.

మామయ్య: బావుంది, బావుంది...చీట్ల పేక ముక్కల దయ పోయి శ్రీరామచంద్రుడిదయ పట్టుకుందీ! ఇదీ బాగానే వుంది. అయినా దయతోనే కడుపు నింపుకుంటున్నావా ఏం? ఇంత పొద్దు పోతోందా, ఎవ్వరూ భోజనాలకు లేవరేం?

తండ్రి: ఇవ్వాళ గుళ్ళో అర్చనలు చేయిద్దామని –

మామయ్య: ఏమిటి బావా నీ కీ పిచ్చి! దూరం నుంచి ఒక్క నమస్కారం చేసేదానికి ఇంత హంగామా చేస్తున్నావా! నువ్వా భగవంతుడికి దేవతార్చనలు, పూజలు, పునస్కారాలు చేస్తున్నావు. కనుక, నీకా దేవుడు కావలసినన్ని ఇవ్వాలి! బావుంది బావా!

(సుందరం వస్తాడు. ఇందిరి లోపలకు వెడుతుంది)

తండ్రి: ఏం సుందరం! వచ్చావు నాయనా! మమ్మల్ని ఉద్ధరించావు!

సుందరం: ఇదీ మరీ బావుందండీ – మధ్యనే నేం చేశాననీ

పెద్దకొడుకు: ఇంకా ఏం చెయ్యాలోయ్! దాన్ని చిన్నదాన్ని చేసి సినిమాల్లో చేర్పిస్తానని (చిన్నకొడుకు వస్తాడు)

సుందరం: నేనా! ఎవరు చెప్పారు మీకు? ఇంకా నేను ఉండబట్టే మీ అమ్మాయి మీకు దక్కిందనుకోండి. మ అమ్మాయి బలవంతం చేస్తే తీసుకువెళ్ళాను గాని –

తండ్రి: అబద్ధం.....అంతా అబద్ధం......

మామయ్య: కాదోయ్ బావా! పాపం చాలా మంచి వాడు.....నేను చూశాగా!

చిన్నకొడుకు: నా స్నేహితుడు మరీ అంత బడుద్ధాయి కాదు మామయ్యా–

మామయ్య: ఇంతకీ సుందరం – మా అమ్మాయికి పెళ్ళిపెటాకులు అక్కర్లేదాం ఏం?

సుందరం: ఆ సంగతి నాకేం తెలుసునండీ?

మామయ్య: మరి తమకే సంగతి తెలుసునండ? ముందు మా అమ్మాయికి పెళ్ళి చెయ్యి. ఆ తరువాత అది సినిమాలో చేరినా, సంగీత కచ్చేరీలు చేసినా ఆ మొగుడి ఇష్టం.

(ఇందిర వస్తుంది. సుందరం వంక ఆతృతగా చూస్తుంది)

చిన్నకొడుకు: పాటకచ్చేరి లెందుకు మామయ్యా? ఇంకా సినిమాలే నయం – గొంతు అరువు తెచ్చుకోవచ్చు –

ఇందిర: తమరు నోరు ముయ్యొచ్చు.

మామయ్య: వచ్చావ్! నాకు నచ్చావే అమ్మడూ! మగవాడికి ఆ మాత్రం నోటి బెదురు వుండకపోతే ఎందుకూ పనికిరాడు.

తండ్రి: పోనీ సుందరం......మా అమ్మాయి సంగతి తెలిసిన వాడివి కదా! దాన్ని నువ్వే ఎందుకు పెళ్ళి చేసుకోకూడదు?

చిన్నకొడుకు: బ్రహ్మాండమయిన ఐడియా నాన్నా! ఏరా, ఎందుకు చేసుకోకూడదు?

సుందరం: అమ్మయ్యో! వద్దంటే, వద్దు – ఆ విషయంలో మాత్రం నన్ను బలవంత పెట్టకండి.

బాబాయి: ఏం నాయనా! మా అమ్మాయి అంత పనికి రాకుండా పోయిందా ఇప్పుడు?

సుందరం: అందుకు కాదండీ! తీరా పెళ్ళి అయ్యాక కూడ సినిమాల్లో చేరతానంటే నేనేమి చేసేదండీ?

చిన్నకొడుకు: ఇప్పుడు తీసుకెళ్ళలా, అలాగే తీసుకెళ్ళు.

సుందరం: బావుందిరా నువ్వు చెప్పేది –

మామయ్య: ఇన్నాళ్ళూ దాని సంగతి నీకు తెలుసు గదా –

సుందరం: నేను వద్దంటున్నది అందుకేనండీ –

పెద్దకొడుకు: ఇహ నేం చేస్తారు? దీన్నిం కెవరు పెళ్ళి చేసుకుంటారు? అందరూ కట్టుకుని వూరేగుదాం పదండి.

(ఇందిర బిక్కమొహం వేస్తుంది. హార్మోనియం దగ్గకు పోయి రీడ్ నొక్కుతుంది)

మామయ్య: అది కాదోయ్ సుందరం – నీకు మా అమ్మాయిని చేసుకోవడానికి ఏమిటి అభ్యంతరం?

సుందరం: చెప్పాను కదండీ! అదీ కాక, మీ అమ్మాయికి వ్యతిరేకంగా మీతో చెప్పానని అసలే ఇందిరకి నా మీద కోపం –

బాబాయి: పోనీ, దాన్నే అడిగితే సరి. దాని ఇష్టం లేకుండా పెళ్ళి చెయ్యంగదా! ఏమే అమ్మడూ! తేల్చి చెప్పు.

(ఇందిర సిగ్గు పడుతుంది)

చిన్నకొడుకు: ఏమే! నును సిగ్గు దొంతరలు అన్న కవి గాళ్ళ పదాన్ని సార్ధకం చేస్తున్నావు! నీకు ఇష్టమో కాదో తొందరగా చెప్పు –

ఇందిర: (సిగ్గుతో) ఏమో! నాకు తెలియదు బాబూ!

(అంటూ ఇంట్లోకి పరిగెడుతుంది)

చిన్నకొడుకు: (ఈలవేసి) అనగా నాకు తెలుసు అని అర్ధం – ఆ తూ తూ సన్నాయిగాళ్లని వాయించమనండి... కంగ్రాచ్యులేషన్స్‌రా బ్రదర్! భలే ఛాన్సు కొట్టేశావులే!

మామయ్య: (సిగ్గు పడిపోతున్న సుందరాన్ని చూసి) ఆనందం ఎగతన్నుతోందేమో, అతన్ని కొంచెం తమాయించుకోవనివ్వండి –

పెద్దకొడుకు: అమ్మయ్య! ఇప్పటికి నా ప్రాణం కుదట పడింది – ఈ సమస్యతో నిద్రాహారాలు లేకుండా పోయాయి.

మామయ్య: సవ్యంగా ఆలోచిస్తే, జీవితంలో ఏ విషయమూ సమస్య కానే కాదురా!

బాబాయి: నువ్వు ప్రధాన మంత్రుల జాబితాలో చేర్చవలసినవాడివి బావా!

మామయ్య: చచ్చాం –నీ కొలతలన్నీ ఎమ్.ఎల్.ఏ, మంత్రి, ప్రధానమంత్రి లెక్కల్లో జరుగుతాయి కాబోలు –

చిన్నకొడుకు: బాబాయికి మరీ అత్యాశలే మామయ్యా!

బాబాయి: ఆ మాటకు వస్తే నీది మాత్రం కాదట్రా?

చిన్నకొడుకు: నాకు తెలిసి వచ్చింది బాబాయి! అడ్డదోవలు పడితే త్వరగా చేరుకోవచ్చనే మాట నిజమే కాని, త్రోవనిండా ముళ్ళూ, అవాంతరాలు, అంతకన్నా ఎక్కువగా వుంటాయని తెలుసుకోలేకపోయాను.

మామయ్య: ఇప్పటికయినా తెలుసుకున్నావు, సంతోషించు. నీ కంటే చదువులో, వయసులో పెద్దవాళ్ళం అనుకుంటున్న వాళ్ళకి ఎందరికి తెలుసునంటావ్ ఈ సంగతి?

పెద్దకొడుకు: సుందరం! ఈ పూటకు నువ్వు కూడా ఇక్కడే భోజనం చెయ్యాలి.

మామయ్య: ఇప్పుడురా నువ్వు నిజమైన గృహస్థుడివి! భేష్. మరి ఆ సినిమా నటిగారిని మన భోజనాలయాక మరీ సినిమాలో చేరమనండి. ఇహ లేవండి. మీ కందరికీ ప్రొద్దుటినుంచీ ఓ విడత వడ్డన జరిగినట్లుగా వుంది – ఎటూ ఆకలి వేస్తోంది నాకే – నువ్వు గుళ్ళోకి వెళ్ళొస్తావా బావా?

తండ్రి: ఇంకా ఎందుకు? భోజనాలయ్యాక ఆ పేరిశాస్త్రులగారితో రేపటినుంచి అక్కర్లేదని చెప్పి వస్తాను.

మామయ్య: తెలివైన పని అంటే అది – పద –

(అందరూ వెడతారు. సుందరం మాత్రం అటూ యిటూ చూసి ఆగుతాడు. ఇంతలో ఇందిర వస్తుంది)

సుందరం: ఏం ఇందిరా, నీకు ఇష్టమేనా?

(ఇందిర సిగ్గు పడుతుంది)

చెప్పు మరి, కాదా?

ఇందిర: (మెల్లగా) ఎందుకు కాదు?

సుందరం: రైటో! ఈ మాటకోసం ఎన్నాళ్ళనుంచి ఎదురు చూస్తున్నానో తెలుసా?

ఇందిర: (ఆశ్చర్యపడి) మరి ఎప్పుడూ చెప్పనయినా లేదేం?

సుందరం: నువ్వు చెప్పనిస్తేనా? నీకు ఎప్పుడూ సినిమాలు పిచ్చేనాయే!

ఇందిర: మీకు లేనట్టు!

సుందరం: నీ కోసం తెచ్చుకున్నదేగా నేను –

ఇందిర: అమ్మ! మరి ఇప్పటికయినా తెలిసిందా –చక్కటి రాజమార్గాలు ఉండగా, అడ్డదోవలు మంచివి కావని......అడుగో చిన్నన్నయ్య వస్తున్నాడు. మీరు లోపలకు పదండి.

(సుందరం లోపలకు జారుకుంటాడు. ఇందిర త్వరగా హార్మోనియం దగ్గరకు వచ్చి రీడ్ నొక్కుతుంది. చిన్నకొడుకు వస్తాడు)

చిన్నకొడుకు: చచ్చాం! మళ్ళీ మొదలు పెట్టావ్! (నాలిక కొరుక్కుని)ఓ! ప్రేమ గీతం కాబోలు! ఆలపించు ఆలపించు...

ఇందిర: ఇహనుంచి నా జోలి ఎత్తకు తెలుసా!

చిన్నకొడుకు: ఎందుకు తెలియదూ – నాన్న పిల్చిన బాజాభజంత్రీలను పిలవమంటావా?

ఇందిర: ఇదుగో నబ్బాయ్ –

చిన్నకొడుకు: ఒకమ్మాయ్ పెళ్ళి, చూసి వద్దాం రండి......

ఇందిర: ఏయ్......అన్నయ్యా –

(అంటూ తరుముకుంటూ ఇంట్లోకి వెడుతూ వుండగా తెర)

# అన్వేషణ

## నాగ్‌భూషణ్

ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో ఒక చోటవున్నదొక వూరు. ఆ వూరికి మారుమూల అడ్డదిడ్డంగా మొలిచిన గృహాల గరిమనాభికి అల్లంత దూరాన ఓ దుకాణం. రోడ్డు ప్రక్క వురివేసిన గుడ్డి లాంతరు తాలూకూ ఇప్పుడో మరుక్షణంలోనో చనిపోయేటట్లనిపించే వెలుతురులో కనిపిస్తున్నది దుకాణదారు. ముడతలు పడ్డ మొహం, లోతుకు పోయిన కళ్ళు, ఒత్తుగా తెల్లగా పెరిగిన మీసం. ఇది అతని గతించిన జీవితాన్ని అనుభవాలతో భాగిస్తే, బాధల విభక్తం పోను మిగిలిపోయిన శేషం...నిజానికి వయస్సు యాభై మాత్రమే; కాని సమాజం విధించిన శిక్షలతో డెభ్భైయేళ్ళ వాడయినాడు. అతని ఆలోచనల కాటంకంగా పోలీసు వస్తాడు.

పోలీసు: అరె! అయితే నువ్వు చచ్చిపోలేదన్నమాట!

దుకాణదారు: లేదే! ఎవరు చెప్పారు నేను చచ్చిపోయానని?

పో: అబ్బే! ఎవరూ చెప్పలేదు...నేనే.......

దుకా: నేను జబ్బు చేసిన మనిషిలా కనిపిస్తున్నానా? దున్నపోతులాగా మనిషిని వుంటే, చచ్చిపోవడం యేమిటయ్యా?

పో: లేదులే! అది..వూరికే....

దుకా: ఆ! వూరికే –?

పో: వూరికే, తమాషాకన్నమాట.

దుకా: (అర్థం కాక) ఏది.

పో: అదేనయ్యా! నువ్వు చచ్చిపోయావన్నది.

దుకా: కాని, నేను చచ్చిపోందే!!

పో: నిజమే! నువ్వు చచ్చిపోలేదు. చచ్చిపోలేదని నాకు తెలుసు...తమాషా కన్నానంటే అర్థం చేసుకోవంఏ? అది కేవలం తమాషాకన్నమాట. తెలిసిందా?

దుకా: తమాషానా? చచ్చిపోవడం తమాషా ఏమిటయ్యా?

పో: (తన హాస్యాన్ని అర్థం చేసుకోలేదని, నిస్పృహతో) సరేలే! ఇక వెళ్ళొస్తా.

దుకా: అదేమిటి? చుట్ట ముట్టించుకుపోవూ?

పో: అక్కర్లేదులే; ఏం అనుకోకు.

దుకా: ఏం?

పో: మానవేశాను.

దుకా: అయితే కూర్చో. సోడా ఒకటి కొడతాను.

పో: అబ్బే! ఇవ్వాళ అక్కరలేదు.

దుకా: (గంభీరంగా) రేపు నేనిక్కడ వుండను.

(ఆ మాట విననట్లుగా వుంటాడు పోలీసు...ఒక క్షణం నిశ్శబ్దం)

పో: (గొణుక్కుంటున్నట్లుగా) చలి!

దుకా: ఎవరు?

పో: మనమే...గాలి........

దుకా: నువ్వు నీలోనే మాట్లాడుకుంటావ్...నాకు చేతకాదు.

పో: నీలో నువ్వు మాట్లాడుకోలేవు......ఎదుటివాళ్లతోనూ మాట్లాడలేవు...అంతేనా?.....అయినా నువ్వు చెప్పు.....చలిగా వున్నదనుకోవడం కూడా నేరమేనా?

(కొంచెంసేపాగి) చలిగి వున్నదన్నంత మాత్రాన నన్ను పోలీసు ఉద్యోగంలో నుంచి తీసివెయ్యరు గదా!.....ఏం?..

(ఎంతకూ దుకాణదారు మాట్లాడడు...మాట మారుస్తాడు పోలీసు)

పో: ఇంత ఛండాలపు రాత్రి నేను పుట్టిన తర్వాత చూడలేదు.

దుకా: నేను ఇంతకన్నా ఛండాలపు రాత్రులు చూశాను.

పో: నిజమే అయివుంటుందిలే!

దుకా: ఒక్కొక్క రాత్రిని తలుచుకుంటే.....ఆ రాత్రి బ్రతుకుతానో లేదో ననిపించేది...కాని నా వంటి మొండి ఘటానికి చావెట్లా వస్తుంది?

పో: (నవ్వుతూ) బాగా అన్నావు.

దుకా: పట్నంలో వుండగా, రెండు రోజుల గాలివానలో, రోడ్లప్రక్క, పెళ్ళాం బిడ్డలతో వున్నాను. (కొంచెం సేపు నిశ్శబ్దం)...ఒకనాటి రాత్రికిరాత్రి కొడుకు వెళ్ళిపోయాడు....(బాధతో) ఒక రాత్రి నన్ను వదిలి అది కూడా వెళ్ళిపోయింది. అటువంటి రాత్రులు పగవాళ్ళకు కూడా వద్దనుకున వాటిని, ఎన్నింటిని గడిపానో?....ఇటువంటి ప్రతి రాత్రీ చచ్చిపోదామనే అనుకున్నాను. కాని –

పో: (మళ్ళీ నవ్వుతూ) కాని, నీవంటి మొండి ఘటానికి చావెట్లా వస్తుంది? అంతేనా?

దుకా: అవును..అవును....(పోలీసు ఏదో చెప్పబోతాడు) ఆ! ఏమిటో అనబోతున్నావ్?

పో: అబ్బే......అదే.....నువ్వు చెప్పింది నిజమేననబోతున్నాను.

దుకా: అటువంటివి నువ్వూ అర్థం చేసుకోగలవన్న మాట!

పో: ఓ!

దుకా: (వ్యంగ్యంగా) చాలామంచిది.

పో: (కోపంతో) ఆ! ఇహ నేను వెడతాను.

దుకా: మంచిది నాయానా! మంచిది...

(పోలీసు వెళ్ళిపోతాడు...దుకాణదారు ఒక పొగాకు కాడతీసుకుని చుట్ట చుట్టకుంటూ ఉంటాడు)

తమాషా కన్నా నంటాడు; ఇటువంటివాణ్ని పోలీసుల్లో ఎట్లా చేర్చుకున్నారో?

(ఇంతలో రెండో పక్కనుంచి)

'దానికి సమాధానం చెప్పడం తేలికే!' అటు వంటి వాళ్ళని భగవంతుడు పుట్టించగా లేనిది, అధికారులు

పోలిసుల్లో చేర్చుకోవడానికేం? –

దుకా: ఎవరు నాయానా, నువ్వు?

యువకుడు: నేనా?...నేను........ఎవరినైతేనేం?....మీ మాదిరిగానే ఒక మనిషిని కదా!

దుకా: అవును నాయాన! నువ్వు ఎవరివైతే నాకేం?

యువ: (అతడు గాయపడ్డాడని గ్రహించి) క్షమించండి...నా వుద్దేశ్యం అదికాదు....నేను 'ఫలానా' అని చెప్పడం వల్ల లాభం యేమిటి చెప్పండి? ప్రతిమనిషీ, ఎదుటి మనిషిలోని మానవత్వాన్ని అంగీకరిస్తే, ప్రపంచంలో ఇన్ని పోట్లాటలు, ఇంత అశాంతీ వుండదనుకుంటాను.

దుకా: నిజమే నాయనా! నువ్వు చెప్పిందీ నిజమే!...ఆ! ఇంతకూ యేమిటి అంటున్నావు?

యువ: అదే! జాలిపడవలసిన వాళ్ళను చూసి నవ్వడం మాత్రమే నేర్చుకున్నాడు పోలీసు. దానికి అతన్నని ఏం లాభం?

దుకా: మరి ఎవర్ననాలి?

యువ: అతన్ని పుట్టించిన భగవంతుడిని అనండి...అతన్ని అలా తయారు చేసిన సంఘాన్ని అనండి......

దుకా: ఇటు చూడు, నాయాన!...నీకు భగవంతుడిమీద నమ్మకం లేదా?

యువ: మనుష్యుల మీదనే నమ్మకం పోతున్న వాడికి భగవంతుడి మీద నమ్మకం పోవడం అసహజం కాదుగా!

దుకా: ఒక మనిషి భగవంతుణ్ణి తప్పుపడుతున్నాడంటే అతను చాలా కష్టాల్లో ఉన్నాడన్నమాట....ఏం?

యువ: కష్టాల్లోనా? వాటి పుణ్యమా అని పుట్టినప్పటినుంచీ అవీ నేను వదలివుండలేదు. సరే! పోనివ్వండి. ఎప్పుడూ వుండే గొడవే!....కొంచెం అగ్గిపెట్టె యిస్తారా?

దుకా: అయ్యో! ఎందుకివ్వనూ?

యువ: ఆ పోలీసైతే ఏమనేవాడో తెలుసా? 'అయ్యో! ఎందుకిస్తాను?' అనేవాడు.

దుకా: నీ కెలా తెలుసు?

యువ: అట్లా ఎన్ని సార్లు ఎంతమందిచేత అనిపించుకున్నానో? (సిగరెట్టు ముట్టిద్దామని నిప్పుపుల్ల వెలిగించి, ముట్టించకుండానే ఆర్పి) చలిగి వుందికదూ!

దుకా: నాకు బాగానే వుంది.

యువ: ఇంత చలిలో బాగా వుండడం అదృష్టమే! కాని, నేను పూర్తిగా దురదృష్టవంతుణ్ణి...ఇటువంటి చలి అనుభవించడ మొదలు పెట్టి నెల రోజులైంది. నేను కూడా ఇదివరకు పెట్టెలాంటి యింట్లోనే వుండేవాణ్ణి.

దుకా: ఏం? ఇప్పుడక్కడ ఎందుకులేవు?

యువ: ఉండలేకపోయాను. నా తత్వానికది పడదేమో మరి!

దుకా: ఏం? తాగి తందానాలాడేవాడివా?

యువ: (నవ్వుతూ) అట్లా కనిపిస్తున్నానా?.....అదేమీ కాదండి....మనిషికి దివాలా తీశాను.

దుకా: నాకు తెలుసుగా, ఈ వ్యాపారం లాభం లేదు నాయనా!....సిగరెట్టు తాగవేం?

యువ: కొద్దిగా నీరసంగా ఉంది?

దుకా: అచ్చ తెలుగుబిడ్డలా చుట్టలు కాల్చక, సిగిరెట్టేమిటోయ్?

యువ: చుట్టలు పెద్దవాళ్ళ సొమ్మండీ! మేం వాటిని కాలిస్తే, మగవాడు చీరకట్టుకున్నట్టుగా వుంటుంది.

దుకా: అదీ నిజమేలే!

యువ: అబ్బా!....(అంటూ, తల పట్టుకుని కూలబడతాడు)

దుకా: (కంగారుగా) ఏమిటది?...ఏం జరిగింది??

యువ: భయంలేదు....నీరసంగా వుండి కళ్ళు తిరినయ్....అంతే! అది, నాకు మామూలే!

దుకా: ఏం? ఆకలిగా వుందా?

యువ: (నీరసంగా నవ్వుతూ) ఉన్నట్లుగానే వుంది...నిన్న పొద్దున చేసిన భోజనం.

దుకా: అదేమిటి నాయానా! ఇంతవరకూ ఎందుకు చెప్పలేదు? (అరటిపళ్ళు గెలలో నుంచి కోసి ఇస్తూ) ఇవిగో! ఇవి తిని కాసిని సోడానీళ్ళు తాగు, ప్రాణం జేరుకుంటుంది.

(ఆ ఆదరంతో తబ్బిబ్బైపోతాడు యువకుడు. లోతుగా పోయిన కళ్ళు అంతులేని కృతజ్ఞత చూపడం మనకు కనిపిస్తుంది....త్వరితంగా తింటూ వుంటాడు. దానిని బట్టే తెలుసుకోవచ్చు, అతనెంత ఆకలిమీద వున్నదీ!)

దుకా: మెల్లగా తిను నాయనా! అందులోనూ ఆకలిమీద వుండగా మీర మెల్లగా తినాలి.....(కొంచెంసేపాగి, జాలిగా) ఇంత ఆకలిమీద ఉన్న వాడివి మాట మాత్రం అనలేదు; చావంటే ఇష్టమా?

యువ: బ్రతకడం యిష్టం లేదని చెప్పలేను...కాని నా కిట్లా ఆకలితో వుండడం అలవాటే! అలవాట్లకు ప్రతి మనిషీ బానిసైనట్లు నేను కూడా! ఇట్లా ఎన్ని రాత్రులు, ఎన్ని పగళ్ళు గడిపానో?

దుకా: (ఓదారుస్తూ) కష్టాలు కాపురం ఉండవు నాయనా! ముందు కష్టాలు పడితేనే తరువాత సుఖం. నాలాంటి వాళ్ళకు ముందు సుఖం, తరువాత కష్టాలు. కాని ముందు కష్టాలు పడితే, నిజమైన జీవితం, దాని లోతుపాతులు అర్థం అవుతాయ్.

యువ: నేను ఆ ప్రాంతాల నుంచి తిరిగివచ్చిన తర్వాత, ఇంత జాలిగా, ఇంత మంచిగా మాట్లాడిందీ, సానుభూతి చూపిందీ మీరే! మీరొక్కరే!

దుకా: ఎక్కడనుంచి తిరిగి వచ్చింది?

యువ: నవాబుల దేశం నుంచి!

దుకా: అంటే, నైజాం నుంచేనా?

యువ: వూ!

దుకా: నైజాంలో ఏ ప్రాంతంలో ఉండేవాడివి?

(ఈ ప్రశ్న విననట్లు నటిస్తాడతను)

(మళ్ళీ) నిన్నే! ఏ ప్రాంతంలో వున్నావక్కడ?

యువ: ఉత్తరంగా కుడిచేతివేపున, పైన.

దుకా: ఇటువంటప్పుడు నవ్వులాట బావుండదు. నిజం చెప్పు....హైదరాబాదులోనా?

యువ: (ఏ ప్రాంతంలో వున్నావని చెబుదామా అని ఆలోచిస్తున్న యువకుడు, ఏదో జ్ఞాపకం వచ్చినట్లుగా) ఆ, ఆ! హైదరాబాదులోనే! కొన్నాళ్ళు వరంగల్‌లో వున్నాను. అజంతాలో వున్నాను. కాని ఎక్కువ రోజులు హైదరాబాదులోనే!

దుకా: ఎటువంటి పట్నం అది?

యువ: ఎటువంటిది?...బలే బావుంటుంది.

దుకా: నువ్వు అక్కడ ఏం వ్యాపారం చేస్తూ వుండేవాడివి?

యువ: వ్యాపారమా? నేను వ్యాపారం చేసే మనిషిలా వున్నానా? నేను వుద్యోగం చేసేవాణ్ణి.

దుకా: ఏం వుద్యోగం?

యువ: మీకు మూడు ఛాన్సులిస్తాను...చెప్పుకోండి.

దుకా: ప్రశ్న అడిగింది నేను –

యువ: జవాబూ మీతోనే చెప్పిస్తాను.

దుకా: అబ్బాయ్! నువ్వు తెలివిగలవాడివిలా కనిపిస్తున్నది...నేను సూటిగా ప్రశ్న అడిగాను కదా, నువ్వూ –

యువ: సూటిగానే జవాబు చెప్పమంటారు? ఇదివరకు చాలాసార్లు ప్రయత్నం చేసి చూశాను. మరోసారి చూస్తాను. కొన్నాళ్ళు నవాబుగారి మహల్లో వుత్తరాలకు స్టాంపులు అంటించేవాడిని. అది చాలా కష్టమైన పనండీ! కాస్త ఎక్కువ తక్కువలు వచ్చినయ్యా, మర్నాడు తలమీద మెడ – అహహ – మెడమీద తల వుండదు....

దుకా: నువ్వు అబద్ధం ఆడుతున్నావు!

యువ: అరె! మీరు కనుక్కున్నారే? కాని నేను నిజం చెబుతాననే అనుకున్నారా మీరు?

దుకా: తప్పకుండా!

యువ: మీరు పాతకాలం వాళ్ళు. మీరలా అనుకోవడంలో తప్పులేదు. నాకు పెద్దవాళ్ళంటే గౌరవం ఉంది; నిజం చెప్పమంటారా! ఎవరైనా హైదరాబాదు వచ్చి, డబ్బు ఖర్చు పెట్టదలుచుకుంటే, వాళ్ళతో వుండేవాణ్ణి. వాళ్ళు చూడదలుచుకున్న చోట్లన్నీ చూపేవాణ్ణి...కొన్నాళ్ళ తరువాత అక్కడకు వచ్చిన ప్రతిమనిషికీ నాకంటే ఎక్కువ తెలుసుననిపించింది. అందువల్ల చాలా రోజులు 'ఫలానా' వుద్యోగం అంటూ ఏది చెయ్యలేదు.

(ఒక్క క్షణం నిశ్శబ్దం...తరువాత)

దుకా: (మెల్లగా) మా అబ్బాయి అక్కడే వున్నాడు. కులాసాగా! దేవుడి దయవల్ల నీలాటి వాడు కాదు..అయితే నీకెందుకు దొరకలేదు వుద్యోగం?

యువ: దొరక్కపోవడమేం? చాలా వుద్యోగాలు చేశాను. అన్ని నౌకర్లలోనూ ఒకటే! బానిసల కంటే హీనం గా చూసేవాళ్ళు. నేనా వుద్యోగాలు చెయ్యలేక పోయాను. స్వతంత్ర్యంగా వుండి పొట్టపోసుకుందా మనుకున్నాను. కాని, ఒక అడుగు ముందుకు వేద్దామనుకొంటే, మూడడుగులు వెనక్కు తోసేవాళ్ళు ప్రతివాళ్ళూ! నేను జీవితంలో సుఖంగా వుండలేననుకున్న కొద్దీ, జీవితం మీద సుఖంమీ ఆశ పుట్టింది. చివరకు జూదం కూడా ఆడాను.

దుకా: జూదం ఆడడం పాపం నాయానా!

యువ: నిజమే! (పేవలంగా నవ్వుతూ) అన్ని పాపాలకు తోడు యిది ఒకటి! సాధ్యమయినన్ని పాపాలు చేస్తే సాధ్యమయినంత త్వరగా యీ ప్రపంచంనుంచి వెళ్ళిపోవచ్చునని ఆశ!...సరే! పోనివ్వండి..ఇటువంటివి ఎవరూ వినాలని యిష్టపడరు.

దుకా: నాకు ఇవి అలవాటే నాయనా! నీవంటి వాళ్ళే ఎందరో ఇక్కడ యివీ, అవీ కొనుక్కొవడానికి వస్తారా, అందరూ ఏదో ఒక ముక్క ఈ చెవిని వేసేపోతూ వుంటారు. అందరమూ మనుష్యులమే కద నాయనా!

ఎవరి కష్టాలు వారి కుంటాయ్!

యువ: అంటే యిట్లా బాధలు పెట్టింది నేనొక్కణ్ణే కాదంటారు.

దుకా: బాధ ఏముంది నాయాన!...నాకు తోచిన రెండు మాటు చెప్పి ఓదార్చడానికి ప్రయత్నిస్తాను.

యువ: అంతేలెండి....ఎవరి బాధలు వాళ్ళకుండగ, ఎదుటి వాళ్ళ కష్టాలకు కూడా దుఃఖించడం కష్టమే! మన దుఃఖాలకే మన కళ్ళనీళ్ళు ఇంకిపోతాయ్; మరొకళ్ళ కోసం మిగలవు.

దుకా: (చుట్టముట్టిస్తూ) నీకు రావుబహదూర్ రంగారావు గారు తెలుసా?

యువ: తెలియకేం? వాళ్ళ అబ్బాయితో నెలరోజులు అజంతా, ఎల్లోరాల్లో వున్నాను.

దుకా: అవును, ఆ కుర్రాడే! ఇక్కడకు వచ్చే వాడు...చాలా చెప్పేవాడు...పాపం! అతను ఒక అమ్మాయిన పెళ్ళిచేసుకుందామనుకునేవాడు..కాని వాళ్ళ నాన్నకు యిష్టం లేదు..ఇద్దరూ లేచి పోయారు....కాని మర్నాడే పట్టుబడ్డారు..ఆ అబ్బాయి మాత్రం తప్పించుకున్నాడు....ఆ అమ్మాయిని పట్టుకుని ఇంటికి తీసుకువచ్చారు; ఆ అమ్మాయి బావిలో పడి చచ్చిపోయింది.

యువ: అతను కూడా దాదాపూ పిచ్చివాడయి నాడు. ఆ అమ్మాయి పోయిన తరువాత అతను కాశ్మీర్ వెళ్ళాడు. బ్రతికున్నాడంటే మాత్రం నాకు నమ్మకం లేదు.

దుకా: ఆ అబ్బాయిని గురించి నీకు బాగా తెలుసునే! నువ్వు కూడా అటువంటివాడివల్లే వుంది!

యువ: అటువంటి వాణ్ణయినా బావుండేది! బ్రతకడానికి గాని, చావడానికి గాని ఏదో ఒక ఆశ కనిపించేది.... కాని మనిషికి ముందు కావలసింది తిండి; తన కనీస అవసరాలు గడవడం...ఆ రెండూ వుంటే తరువాత ప్రేమనాటకాలెన్నైనా ఆడవచ్చు.

యువ: నిజం..అటువంటివే, నా స్నేహితుల కథలు విని, నా సంగతులు జ్ఞాపకం వచ్చి, వాటికీ వీటికీ కూడా వెక్కివెక్కి యేడ్చేవాణ్ణి.

దుకా: (బాధపడుతున్నాడని తెలుసుకుని, మాట మారుస్తూ) సరే....ఇదిగో ఈ సోడా తాగు. (సోడా కొట్టియిస్తాడు.)

యువ: (గబగబా తాగబోయి చల్లదనం భరించలేక వుమ్మివేస్తాడు) అబ్బ!

దుకా: ఏం! బాగుండలేదా?

యువ: అబ్బ! ఇంత ఐస్‌లా వుందేం! ఈ చలికాలం రాత్రి ఈ సోడా తాగితే, యిహ చెప్పక్కర్లేదు...

దుకా: వేడి సోడా త్రాగనే కూడదు...నీకు చూస్తే సారా అలవాటున్నట్లుంది?

యువ: మీ పుణ్యాన అది ఒక్కటే తక్కువ....నేను సామాన్యంగా చలికాలం రాత్రుల వేడి టీ త్రాగేవాణ్ణి....ఇప్పుడు కాదు....ఎన్నాళ్ళయిందో మాని! భగవంతుడికే తెలియాలి.

దుకా: వేడి టీ త్రాగడం మంచిది కాదు.....

యువ: (నవ్వుతూ) మీ దృష్టిలో యిక మంచిదేమిటో చెప్పండి....జూదం ఆడడం మంచిదికాదు....వేడి టీ, వేడి సోడాలు మంచివి కావు...ప్రేమించడం మంచిది కాదు..

దుకా: నిజమే! అవన్నీ తప్పులే!

యువ: సరే! కానివ్వండి. మీ మాటెందుకు కాదనాలి?

దుకా: సరే! ఈ ప్రాంతాలకు మళ్ళీ ఏమైనా పనివుండి వచ్చావా?

యువ: (నీళ్ళు నములుతూ) దానకీ, దీనికీ అని ఏమిటి?

దుకా: అంటే, ప్రత్యేకంగా ఒక పనికోసమని రాలేదా?

యువ: (గాబరాగా) లేదు...ఆ...అవును...ఒక్కటే పని! (ఇదివరకటి కంటె గంభీరంగా, సీరియస్‌గా) మా అమ్మనూ, నాన్ననూ వెదకడానికి వచ్చాను.

దుకా: ఈ ప్రాంతాల్లోనే ఉంటున్నారు కాబోలు....కనిపించారా?

యువ: నాకు తెలియదు.

దుకా: తెలియదా?

యువ: ఊహూ! గుర్తుపట్టలేననుకుంటాను...అదీ కాక నేను రావడం ఆయనకు సంతోషమో, కాదో?

దుకా: అయితే, వాళ్ళు ఎక్కడ వుండేదీ నీకు తెలుసునన్నమాట!

యువ: ఎక్కడ కనిపించేదీ తెలుసు...కాని తీరా వెడితే –

దుకా: ఆయనా, నీలాంటి వాడేనా యేమిటి?

యువ: ఏం?

దుకా: తండ్రుల్లాంటివాళ్ళు కొడుకులు...అది సహజమే కదా!

యువ: ఓహో!....(కొద్దిగా ముడుచుకుంటాడు)

దుకా: నీకు చలిగా వున్నట్టుంది..కొంచెం లోపలికి రా.

యువ: అబ్బే! అక్కర్లేదు..వూహించడానికి కూడా భయం కలిగించే విషయాలు వింటే, వణుకు పుట్టడం సహజమే కదా!

దుకా: (తన కాఠిన్యానికి విచారిస్తూ) నేనన్నమాట తప్పే!

యువ: అబ్బే! అక్షరాలా నిజం.

(క్షణం నిశ్శబ్దం)

దుకా: ఏమిటి ఆలోచిస్తున్నావ్?

యువ: నైజాం వెళ్ళాడన్న మీ అబ్బాయిని నేనెప్పుడైనా కలుసుకున్నానేమో?...అతని పేరేమిటన్నారు?

దుకా: అబ్బే! పొరపాటున కూడా కలుసుకుని వుండవు.

యువ: (హేళనగా) చాలా సంతోషం. కాని అతడు మర్యాదస్థుడైనంతమాత్రాన అతని పేరు చెప్పడానికేం?

దుకా: వాడి పేరు మోహనరావు.

(యువకుడు పాలిపోతాడు. ఒక్క క్షణం దుకాణదారు కళ్ళల్లోకి చూసి బాధతో)

యువ: అవును..ఎప్పుడూ చూడలేదు...

దుకా: చెప్పానుగా! ఏడు సంవత్సరాలైంది వెళ్ళి – పదహారేళ్ళప్పుడు – అప్పుడు గుడ్డల మిల్లులో పని – ఈ సరికి గుమాస్తా అయి, హాయిగా వుండి వుంటాడు.

యువ: (ఆలోచనగా) మీ కతను హాయిగా వున్నాడని యేం తెలుసు?

దుకా: తప్పకుండా వుండితీరాలి – వాడి తత్త్వం నాకు తెలుసు.

యువ: అంటే, మీ కతను వుత్తరాలు వ్రాయడం లేదా?

దుకా: వ్రాయని మాట నిజమే ననుకో –

యువ: ఇంతవరకు! ఏడు సంవత్సరాలు!!

దుకా: అయినా, వాడికి తీరిక ఎక్కడవుంటుంది? ముందు పొట్టకోసం పాటుపడాలి –ముందు ముందూ బాగుపడడానికి కష్టపడి పనిచెయ్యాలి. ఈ సరికి ఓ పెద్ద వ్యాపారం చేస్తున్నాడన్నా ఆశ్చర్యపడను.... వాడు నిజంగా అంత సమర్థుడు.

యువ: నిజమే! అలానే వుండవచ్చు. ఒక వేళ అట్లా లేదనుకోండి –

దుకా: అట్లా అనుకోను; అనుకోలేను. వాడు సమర్థుడని చెప్పానుగా! వాడికి చేతకాని పనంటూ లేదు...

యువ: మీరు చెప్పింది నిజమే ననుకోండి....కాని అతను చేసే వుద్యోగం అటువంటిది కావచ్చు గదా!

దుకా: ఎటువంటిదైనా ఫరవాలేదు. వాడు చెయ్యగలడు...ఇప్పటినుంచా? చిన్నప్పటి నుంచీ వాడంతే! వాడికి చెయ్యలేని పనంటూ వుండదు....(ఆశతో) నా ఆశలన్నీ వాడిమీదనే పెట్టుకున్నాను.

యువ: (ఎంతో బాధను అణుచుకుంటూ) అయితే...అతను....(ఏదో చెప్పబోయి, చెప్పలేక పోతాడు)

దుకా: ఆ! ఏమిటి అతను?

యువ: అదే! అతని దగ్గరనుంచీ ఎవరికీ ఉత్తరాలు రాలేదా?

దుకా: (తేల్చివేస్తూ) ఆ! ఒకటో రెండో ఉత్తరాలు వచ్చినయ్.

యువ: (ఆసక్తితో) ఎవరికి?

దుకా: పోనిద్దూ...ఎవరికైతే మనకేం?

యువ: వాళ్ళంటే మీకు యిష్టం వున్నట్లుగా లేదు.

దుకా: ఆ! ఎవరో అమ్మాయికి వ్రాశాడు. అక్కడికి వెళ్ళగానే, వాడికి యింటిమీద బెంగ పట్టుకున్నదట!..... ఏడిశాడు –

యువ: నిజంగానే ఇంటిమీద బెంగతో ఏడ్చాడేమో?

దుకా: (కొంచెం తీక్షంగా) బాగుపడేవాడికి అటువంటివి పడితే యిక సాగినట్లే!..ఆ అమ్మాయి చెప్పింది, వాడు తనను పెళ్ళిచేసుకుంటానన్నాడని..నేనన్నాను – వాడు నీ సంగతి ఎప్పుడో మరిచిపోయాడు – అని.

యువ: (ఆలోచనగా) ఉహూ! ఆ అమ్మాయే మరిచిపోయి వుండాలి.

దుకా: లేదు, లేదు...ఆ అమ్మాయికి మా వాడి మీద యింకా ఆశవుందట!

యువ: (ఆశ్చర్యంగా) ఆ అమ్మాయి కింకా పెళ్ళికాలేదా?

దుకా: ఉహూ!

యువ: ఏమో! ఆ అమ్మాయి అతని కోసమే యింతవరకూ పెళ్ళిచేసుకోకుండా వున్నదంటే నేను నమ్మను.

దుకా: మరి ఎప్పుడూ వీడ్ని గురించే మాట్లాడుతుంది కదా!

యువ: జీవితంలో అటువంటి సంఘటనలున్నప్పుడే నిలువ నీరు కదిలేదు. అందుకోసం కావచ్చు.

దుకా: నాకు అర్థం అయ్యేటట్లు మాట్లాడు.

యువ: ఏం లేదు...ఈ పరిస్థితుల్లో మీ అబ్బాయిని గాని, ఆ అమ్మాయిని కాని యీ పెళ్ళిచేసుకుంటారా అని అడగండి. వాళ్ళు మీ ఎదుటనే చేసుకోమని ఘట్టిగా చెబుతారు.

దుకా: మావాడిప్పటికీ ఆ అమ్మాయికి అడపాదడపా వుత్తరాలు వ్రాస్తాట్ట!

యువ: చెప్పానుగా! ఇది కేవలం వాళ్ళకోసం కాదు. వాళ్ళను గురించి ఇన్ని విషయాలు తెలుసుకున్న ప్రపంచం, వాళ్ళు ఏదో ఒకటి యిటువంటి పని చెయ్యకపోతే, వాళ్ళను ఒట్టి వాజమ్మలకింద కడుతుంది.

దుకా: ఏమిటో! కాని ఇటువంటి వెన్ని జరిగినా, వాడు సుఖంగా మంచి ఉద్యోగం చేస్తూ వుంటాడీ పాటికి!

యువ: (గంభీరంగా, అయినా, బాధగా) ఆ! ఒక్క మాటడుగుతాను – ఏమీ అనుకోరుగా – వూరికే వాదనకోసం అడుగుతున్నాను....మీ అబ్బాయి మీ రనుకున్నంత హాయిగా వుండకపోవచ్చు...చాలా కష్టాల్లో వుండి వెనక్కు తిరిగిరావచ్చు...అదృష్టం కనికరించకపోవచ్చు నతన్ని. మీకు తెలిసినప్పటికీ, యిప్పటికీ ఎంతో మారి వుండవచ్చు.

దుకా: (కోపంతో) ఎవరి సంగతి నువు చెబుతున్నది? మా వాడి సంగతేనా?

యువ: కోప్పడకండి...వూరికే, వాదనకోసమని చెప్పానుగా!

దుకా: దేనికోసమైనా మా వాడు చాలా హాయిగా వుంటాడు.

యువ: దురదృష్టవంతుల్ని బాగుచేసేవాళ్లెవరు?

దుకా: అటువంటి దేదైనా వుంటే మాకు తప్పకుండా రాశేవాడు..వాడు రాయలేదంటే –

యువ: వ్రాయదలుచుకోక పోవచ్చుకదా!

(ఇంతకూ పూర్వమే పోలీసు వచ్చాడు. వీళ్ళ మాటు పూర్తిగా వినడు. ఈ చివరి మాటలు విని ఆ యువకుడు కూడా తనకు మాదిరిగానే తమాషాకు మాట్లాడుతున్నాడనుకుంటాడు)

పో: చూడబ్బాయ్! నువ్వతినితో ఏదో హాస్యాలాడుతున్నావల్లే వుంది! అట్లాగయితే మీ యిద్దరితో ఎవరినో ఒకరిని పిచ్చిసుపత్రికి పంపించాలి.

దుకా: నీ నవ్వులాటలు మళ్ళీ మొదలుపెట్టావా?

పో: అరె! నేను తమాషాకంటున్నానని నీకూ తెలిసిందే!

దుకా: కాని ఈ అబ్బాయికి తెలియదు.

యువ: నేను యిందాకటినుంచీ, యీయనతో ఒక విషయాన్ని గురించి మాట్లాడుతున్నాను...మాట్లాడడం యేమిటి? వాదిస్తున్నాను....వాదించి లాభం లేదని నాకిదివరకే తెలిసివుండవలసింది.

పో: భేష్! ఈయన సంగతి పూర్తిగా తెలిసిందా ఏం?

యువ: నా కెట్లా తెలుస్తుంది?

పో: ఎందుకు తెలియదు? నువ్వేం మాట్లాడినా ఎదురు చెప్పడు ఆయన.

దుకా: మళ్ళీ తమాషానా?

పో: ఈ సారి మెచ్చుకుంటున్నానా ఏం?

యువ: (తను వెళ్లడం భావ్యం అనుకుని) సరే! ఇక నేను వెడతాను.

పో: నేను రాగానే నువ్వు వెళ్ళిపోతున్నావంటే నిన్ను గురించి నేను అనుమానపడవలసి వుంటుంది.

యువ: (నవ్వుతూ) అయితే, నువ్వు అన్నం తినడం మానేసి సూదులు తింటున్నావా యేం?

పో: (అర్థంకాక) యేం?

యువ: అబ్బే! ఏం లేదు...వాటంత పదునుగానూ వుంటేనూ!

పో: (నవ్వుతూ) బావుంది, బావుంది...కాని, తమాషాకు ననెన్ని అన్నా నాకు బాగానే వుంటుంది.....

యువ: అయితే యింకేం? నువ్వు వంటవాడి రకం!

పో: వంటవాడేమిటి?

దుకా: అబ్బే! ఇతను స్వంతంగా వంటచేసుకోడు.

యువ: అదికాదండీ! వంటవాడికి మాదిరిగానే యీయనకూ యితరులకు వడ్డించడం తప్ప పనేమీ లేదని.

దుకా: ఇతనటువంటి వాడు కాదులూ! నైజాంలో అందరూ అటువంటి వాళ్ళేనా ఏమిటి?

పో: ఓ! అయితే నువ్వు నైజాంనుంచి వచ్చావన్నామాట! ఏ ప్రాంతాలనుంచి?

యువ: ఔరంగాబాద్....ఇంకా పైన...

దుకా: అదేమిటి! నాకు హైదరాబాదు అని చెప్పావ్?

యువ: అక్కడా వున్నాను...కాని ఎక్కువ రోజులు పైనే!

దుకా: అయితే హైదరాబాదులో అని ఎందుకు చెప్పావు?

యువ: ఏమిటో! మీరు హైదరాబాదులోనా అని అడిగారు. ఔనన్నాను.

పో: అక్కడ ఏం చేసేవాడివి?

యువ: నవాబునో, ప్రధానమంత్రినో కావలసింది, కాని కాలేదు.

పో: నేనడిగింది నువ్వు చేసిన వుద్యోగం ఏమిటని?

యువ: అది! ఓ ఆఫీసులో గుమాస్తా.

దుకా: ఇందాక ఇంకేదో చెప్పావ్?

యువ: మీరు వూరుకోండి బాబూ, పుణ్యం వుంటుంది.

దుకా: (బిత్తరపోయి) అట్లా అన్నావు – బావుంది.

(నిట్టూరుస్తూ, మధ్య మధ్య యువకుడి వంక చూస్తాడు)

పో: (దుకాణదారుతో) ఏమిటి అటు తిరిగావ్? ఏమైంది?

దుకా: నాకేమైతే యేం కాని, ప్రతివిషయం నీ కెందుకు?..ఇట్టా చంపుకుతింటాడు ప్రతి విషయంలో –

పో: (ఆశ్చర్యంతో) ఏమడిగాను? వూరికే విషయాలు తెలుసుకోడానికి అడిగాను....(యువకుడితో) ఏమయ్యా! నేనడిగిన ప్రశ్నలు నీకు కూడా బాగుండలేదా ఏం? ఇంకా అడిగినా నువ్వు సమాధానం చెబుతావుగా!

యువ: అయ్యో! దానకేం?

(ఈ మాటలు విని పోలీసు యువకుడి కళ్లల్లోకి చూస్తాడు...దగ్గరకు వచ్చి బుజం తట్టి)

పో: అదీ! అట్లా వుండాలి.

యువ: (కొద్దిగా జంకుతూ) చూడండి! ఇందాక మీరు వచ్చేసరికి ఒక విషయాన్ని గురించి మాట్లాడుకుంటున్నాం. ప్రపంచంలో నిజంగా జరిగే ఒక విషయాన్ని, ఆయన్ని ఒప్పుకోమంటున్నాను.

దుకా: (కోపంతో) మావాడు కులాసాగా లేడని, జైల్లో పడ్డాడని ఒప్పుకోమంటావ్!...అరుదు.....

పో: నువ్వు వుంటే నాకు హుషారుగా వుంది....కొంచెంసేపాగు.

యువ: బాగుంది...(అంటూ వెళ్ళడానికి ప్రయత్నిస్తాడు)

పో: అదేమిటోయ్! వెళ్ళబోకు. నేనొక పెద్ద మనిషికోసం వెదుకుతున్నాను. చూడగా ఈ మనిషిని నువ్వేననిపిస్తున్నది నాకు.

యువ: నేనా? నేను పెద్దమనిషిలా కనిపిస్తున్నానా?

పో: కాకపోతే మరీ మంచిదిగ! నాతో పాటువచ్చి, ఈ రాత్రికి స్టేషనులో వుండి..ఆ మనిషివి కాకపోతే ఏం ఇబ్బంది లేదు. ఆ మనిషివే అయితే, నేను యీ రాత్రంతా తిరిగే బాధ తప్పుతుంది..ఏమంటావ్?

యువ: వెడతానంటాను.

పో: నువ్వట్లా అంటావని నాకు ఎప్పుడో తెలుసు.

(యువకుడు త్వరగా వెళ్ళిపోతాడు.. అతని వెంటనే పోలీసుకూడా వెడతాడు. 'విజిల్' వేసుకుంటూ. ఈ సంఘటన దుకాణదారును కలవరపెడుతుంది. లేచి అటూ, ఇటూ చూస్తూ వుంటాడు. ఒకసారి ఒక వైపు, మరొకసారి రెండవవైపు వినిపిస్తుంది విజిల్. దుకాణదారు తాను కూడా త్వరగా కొట్టు వేసి ఎడమవైపుకు వెళ్ళిపోతాడు....ఒక్కక్షణం తరువాత యువకుడు ముందు, పోలీసు తరువాత రెండవ పక్కనుంచి)

యువ: చివరకు తరుముకు వచ్చావు! పద, ఇప్పుడు నీతో హాయిగా స్టేషన్‌కు వస్తాను.

పో: వస్తావా?...బావుంది. సరే! నిన్నొక్క సారి చూడనీ!

యువ: నేనెవరో నీకు తెలియదు. ఒకవేళ నన్ను చూసినా నిరుత్సాహపడక మానవు.

పో: ఏం? మొహం బావుండదా?

యువ: (కోపంతో) నన్ను వీలైనంత ఎక్కువగా బాధపెడదామని వచ్చినట్టున్నావ్! మీ మామూలు పద్ధతి పోనివ్వవు... సరే! నీకు కావలసిన మనిషిని నేనేనా?

పో: ఏమో కాని ఈ దుకాణదారుని నీ కళ్ళల్లోకి ఒకసారి చూడమని చెప్పాలి.

యువ: (కంగారుగా) వద్దు, వద్దు.

పో: అబ్బె! తప్పకుండా చూపిస్తాను.

యువ: చూపించడం నీకు చేతకాదు. అప్పుడు చూసేది నన్ను కాదు; నా శవాన్ని...నీకంగా అవసరమైతే నన్ను స్టేషనుకు తీసుకుపో!

పో: నీ వాలకం చూడగానే గుర్తుపట్టాను...ఏదీ! నిన్నొకసారి సరిగ్గా చూడనీ!

యువ: (తీక్షంగా) నీకప్పడే ఒకసారి చెప్పాను.

పో: చెప్పావా?..... అయినా చూడక తప్పదు.

(యువకుడు ఒక్కసారి పోలీసు కాళ్ళు పట్టుకుని)

యువ: నన్ను వదిలిపెట్టు కానిస్టేబుల్! నువ్వు నిజం కనిపెట్టావ్!....నేనిక ఒక్కక్షణం వుండను. వెళ్ళిపోతాను. అయినా మళ్ళీ నన్ను మా వాళ్ళతో చేర్చే ప్రమేయం నీకెందుకు, చెప్పు?

పో: పారిపోయినవాళ్ళంటే నాకిష్టం లేదు.

యువ: ఆలోచించు....ఎంతో ఆశతో ఉన్న వాళ్ళను నిరుత్సాహపరిస్తే, ఒక్కొక్కప్పుడు గుండె ఆగి చచ్చిపోవడం కూడా కద్దు.....(జాలిగా) ఏమంటావ్?

పో: సరే! అయిదు నిముషాలు టైం ఇచ్చాను నీకు. తరువాత నువ్వు కనిపిస్తే, అన్నంత పనీ చేసితీరతాను.

(పోలీసు వెళ్ళిపోతాడు. దుకాణదారుకోసం యువకుడు వెతుకుతాడు. ఆలస్యాన్ని భరించలేక యిక వెడదామనుకుంటూవుండగా దుకాణదారు వస్తాడు)

యువ: ఓ! మళ్ళీ కనిపించరేమో ననుకున్నాను....ఎట్లాగైతేనేం కనిపించారు....సెలవు తీసుకుంటాను.

దుకా: మంచిది నాయనా! ముందు ముందు నువ్వు బాగుపడతావని నాకు గట్టి నమ్మకం ఉంది.

యువ: బాగుపడతానా?

దుకా: అవును...ఇంతకంటే –

యువ: ఏమో, కావచ్చు....మీ ఆశీర్వాదం......ఆ! (ఒక్క క్షణం సంకోచించి) మీ అబ్బాయి –

దుకా: ఆ! మా అబ్బాయి సంగతికేం? ముందు –

యువ: అది కాదు! అతను, వూహించలేని పరిస్థితుల్లో వస్తే, అతని తల్లి అయినా కనీసం ఆదరించదా – అని.

దుకా: తల్లా! ఆమె....చచ్చిపోయింది.

యువ: (పాలిపోయి, గాద్గదికంగా) చచ్చిపోయిందా? చ...చ్చి...పోయిందా? తమ కొడుకులు తిరిగి వచ్చే వరకైనా తల్లులు బ్రతుకుతారనుకున్నాను. ప్రపంచం నిరాశాల నిలయం....అంతే!...వస్తాను...

దుకా: (యువకుని వంక విచారంగా, ఆశ్చర్యంగా చూసి) మంచిది నాయానా!.....నిన్ను చూస్తుంటే మా వాడు జ్ఞాపకం వస్తున్నాడు....

యువ: (కొంచెం ముందుకు వచ్చి, కన్నీళ్ళతో, ఎంతో బాధతో, మెల్లగా) నాన్నా!!

(వెళ్ళిపోతాడు...ఇంతలో పోలీసు వచ్చి విచారంగా వున్న దుకాణదారు వంక చూసి, నవ్వి, యువకుడు వెళ్ళిన వైపుకు వెడతాడు....దుకాణదారుకూడా భారంగా అటే వెడుతూవుండగా

**(తెర)**

# అతిథి దేవో భవ

**(హాస్య నాటిక)**

రచన

**మొదలి నాగభూషణ శర్మ**

## ఇందులో పాత్రలు

| | | |
|---|---|---|
| అవాక్కుల సన్యాసయ్య | : | అతిథి |
| దూర్వాసుల శాంతమూర్తి | : | ఇంటాయన |
| అతి మధురం | : | ఇంటావిడ |
| నక్కా చెవులయ్య | : | ఇంటి నౌకరు |

(ఓ మధ్య తరగతి కుటుంబీకుల ఇంట్లో ముందుగది. ఓ పక్క మూడు కుర్చీలు, ఓ విరిగిన ముక్కాలి పీట. బయట తలుపు కొట్టిన చప్పుడు.... స్టేజీ మీద ఎవ్వరూ లేరు.... మళ్ళీ తలుపు చప్పుడు...."ఎవరు? ...వస్తున్నా?" అని లోపలినుంచి కేక......తలుపు తోసిన శబ్దం....మెల్లగా తలుపు తోసుకుని అవాక్కుల సన్యాసయ్య వస్తాడు.)

**సన్యాసయ్య**

(లోపలికి వస్తూ గదిని పరిశీలించి) ఎవ్వరూ ఉన్నట్టు లేరే!...ఎవరండీ లోపల?...శాంతమూర్తిగారూ, శాంతమూర్తిగారూ! (వచ్చె, వచ్చె – అని లోపలనుంచి కేక) శాంతమూర్తిగారు, వాళ్ళావిడ మొన్న రత్నాకరం గారింట్లో పెళ్ళిలో కలిసి, మేమూ మీ ఇంటికి దగ్గర్లోనే వుంటున్నాం – వస్తూ వుండండి... సాయంకాలాలు మేంయింటి దగ్గరే వుంటాం – ఆవంటా అని ఎంతో ఆప్యాయంగా పిలిచారు...ఏం చక్కని జంట! మనం ఎట్లాగూ ఒంటరివాళ్ళం!...బ్రహ్మచారిగాడికి కావలసిందేమిటి? కడుపునిండా తిండి...తిన్న తరువాత తాను చెప్పే కథలకు మంచి శ్రోత – ఓహ్! మృష్టాన్న భోజనమే కదూ!..వీళ్ళని చూడగానే అనుకున్నాను – గృహస్థులంటే యిలా వుండాలి – అని... రాజారావు, వెంకటరత్నం వాళ్ళలా కాదు – వాళ్ళు నాలుగు రోజులు వాళ్ళింటికి వెళ్ళానో లేదో ఏదో సాకుతో తప్పించుకునేవాళ్లు. రెండు రోజులకొకసారి యీ జంట కోరికను మన్నించి సాయంకాలాల పూట యిక్కడకు వచ్చి టిఫినూ, కాఫీ సేవించి, కాదు కూడదంటే భోజనం......

**చెవులయ్య**

(లోపలినుంచి వస్తూ) ఎవరది?...ఎవరు కావాలండీ?

**సన్యాసయ్య**

ఇది దూర్వాసుల శాంతమూర్తిగారి ఇల్లేనా అండీ?

**చెవులయ్య**

ఆయన ఎంత శాంతమూర్తి అయితే మాత్రం అమాంతం అట్లా లోపలికి తరుముకుంటూ రావడమే నటండీ?

**సన్యాసయ్య**

వాకిట్లో నుంచి పిలిచాను....వస్తున్నా – అంటేను –

**చెవులయ్య**

"వస్తున్నా" అన్నాను గాని – మిమ్మల్నే 'రండి' అనలేదు కదా! సరే, మీరొచ్చారు – ఇక వచ్చిన పని చెప్పండి –

**సన్యాసయ్య**

ఇంతకీ మీరు –

**చెవులయ్య**

శాంతమూర్తిగారి ఆంతరంగిక –

**సన్యాసయ్య**

స్నేహితులూ?...నమస్కారం......

**చెవులయ్య**

అంతటి వాణ్ణేననుకోండి...ఆంతరంగిక సేవకుణ్ణి – ఇంతకీ మీరు – ?

**సన్యాసయ్య**

శాంతమూర్తి గారిని వారి శ్రీమతి – మధురంగారిని –

**చెవులయ్య**

కాదు. అతి మధురం –

**సన్యాసయ్య**

ఆ! అవునవును...వారిద్దర్నీ చూద్దామని –

**చెవులయ్య**

జరూరు పని ఏమైనా......?

**సన్యాసయ్య**

అబ్బే! అటువంటిదేమీలేదండీ –

**చెవులయ్య**

సిఫారసు గట్రా?

**సన్యాసయ్య**

ఛ! ఛ! ఒంటికొమ్ము సొంతికాయగాణ్ణి – నాకు సిఫారసు బెడదేముంటుంది.

**చెవులయ్య**

పోనీ – చందాలేమన్నా వసూలు చేస్తున్నారా? ఇళ్ళు తగలబడి పోవడం, వరదలకి ఇళ్ళు కూలిపోవడం..

**సన్యాసయ్య**

అబ్బెబ్బెబ్బే!....అటువంటి అకృత్యాలు చేసే వాడిలా కనిపిస్తున్నానా?..నేను కేవలం వారి స్నేహితుణ్ణి..

**చెవులయ్య**

అమ్మగారికా? అయ్యగారికా?

**సన్యాసయ్య**

ఇద్దరికీ అనుకోండి......

**చెవులయ్య**

తమ పేరు సెలవిచ్చారు కాదు......

**సన్యాసయ్య**

మీరు అడిగారు కాదు.....నా పేరు సన్యాసయ్య....

**చెవులయ్య**

బావుంది.

**సన్యాసయ్య**

ఏమిటి? నా పేరా?

**చెవులయ్య**

మీ పేరుకేమండీ? బ్రహ్మాండంగా వుంది....నాకు ఇంతకన్నా మంచి పేరున్న వాళ్ళు చాలామంది తెలుసు....

**సన్యాసయ్య**

అట్లాగా!

**చెవులయ్య**

ఆ! ఆ మేనమామ వేలువిడిచిన బావమరిది కొడుకుండే వాడండీ!

**సన్యాసయ్య**

ఇప్పుడు లేడా?

**చెవులయ్య**

అహ! సన్యాసుల్లో కలిసిపోయాడు.....వాడి పేరు కొరివిగాడు – అబద్ధాల కొరివిగాడు – ఇంకోడున్నాడండీ – తట్టా చవటయ్య – అని –

**సన్యాసయ్య**

నాయనా! పేర్ల చిఠ్ఠా ఆవర్జాలు తెరవకు.....శాంతమూర్తి గారు లోపల ఉన్నారా?

**చెవులయ్య**

ఉంటే?

**సన్యాసయ్య**

నేనొచ్చానని చెప్పు –

**చెవులయ్య**

తమ పేరు – ?

**సన్యాసయ్య**

చెప్పానుగదయ్యా! అవాక్కుల సన్యాసయ్య అని! ఊరికే తికమక పెట్టేస్తావేమ్! మనకి కొంచెం ప్రథమ....తత్తరపాటు –

**చెవులయ్య**

అదేమిటండీ ప్రథమ కోపంలాగా?

**సన్యాసయ్య**

అదేనయ్యా! కొత్త మనుషుల్ని కలిస్తే ముందు కాస్త తత్తరపాటు –

**చెవులయ్య**

ఆ తరువాత?

**సన్యాసయ్య**

ఆ తరువాత చూశావ్, మన తడాఖా! దేన్నీ గురించైనా గంటలసేపు ఏకబిగిన లెక్చరిచ్చెయ్యగలను.

**చెవులయ్య**

(ఆశ్చర్యంగా) అబ్బా!....చూడండి సన్యాసిగారూ! మా వాడొకడుండే వాడండీ!

**సన్యాసయ్య**

నాయనా! చచ్చి నీ కడుపున పుడతాను –

**చెవులయ్య**

ఏమిటి? నా కడుపునా?

**సన్యాసయ్య**

పోనీ మీ ఆవిడ కడుపున –

**చెవులయ్య**

నాకింకా పెళ్ళే కాలేదండి...

**సన్యాసయ్య**

అట్లా చెప్పు...అందుకే నిన్ను చూడగానే పాత స్నేహితుణ్ణి చూసినట్టుగా ఉంది.....ఇంతకీ – నీ పేరేమిటోయ్?

**చెవులయ్య**

చెవులయ్యా!....నక్కా చెవులయ్య –

**సన్యాసయ్య**

ఆహా! మంచి పేరేనోయ్!!

**చెవులయ్య**

ఆ పేరుకు ఓ పెద్ధ కథ ఉందిలెండి...అసలేం జరిగిందంటేనండి –

**సన్యాసయ్య**

(గడ్డం పుచ్చుకుని బతిమిలాడుతూ) నాయనా!...నేను శాంతమూర్తిగారిని చూడ్డానికి వచ్చాను. ఆయన వుంటే – నువ్వు పిలిస్తే –

**చెవులయ్య**

అంతేనా? మీరు కాసింత ఓపిక పట్టండి.....నేను అయ్యగారితో చెప్పొస్తాను....

**సన్యాసయ్య**

మా పెద్దలు తరించారు –

**చెవులయ్య**

అయ్యా! సన్నాసి గారూ......

**సన్యాసయ్య**

సన్నాసి కాదయ్యా!..సన్యాసి.....సన్యాసయ్య...

**చెవులయ్య**

(అమాయకంగా) ఏటండీ! ఆ రెండూ ఒకటి గాదా అండీ?

**సన్యాసయ్య**

ఒకటేనయ్యా చెవులయ్యా!...సన్నాసినే!....లేకపోతే ఎందుకొస్తాను?...ఇహనైనా మీ అయ్యగారికి చెప్పొస్తావా, లేదా?

**చెవులయ్య**

మీరు కోపం చేసుకుంటే చెప్పలేను గానిండీ......

**సన్యాసయ్య**

కోపమెందుకు చెవులయ్యా......చెప్పు.......

**చెవులయ్య**

మీరు చాలా మంచోళ్ళలా కనిపిస్తున్నారండీ!

**సన్యాసయ్య**

అరె! అ విషయం నీకెట్లా తెలుసు?

**చెవులయ్య**

అదేటండీ!..చూడంగానే నాకు ఎడం కన్ను అదిరిందనుకోండి...ఆళ్ళు మంచాళ్ళుగాదండీ!

**సన్యాసయ్య**

మరి?

**చెవులయ్య**

కుడికన్ను అదిరిందనుకోండి....ఆళ్ళు మంచోళ్ళన్న మాటండీ!

**సన్యాసయ్య**

నువ్వు ఎవర్ని చూసినా ఏదో కన్ను అదురుతూ వుంటుందన్నమాట!

**చెవులయ్య**

అబ్బే, లేదండీ! ఏ కన్నూ అదరలేదనుకోండి.....ఆడెవడో సత్తరకాయ బాపతండి.....

**సన్యాసయ్య**

మరి నన్ను చూడగానే ఏ కన్ను అదిరింది?

**చెవులయ్య**

భలే వోరండీ....కుడి కన్నే అదిరింది.....అందుకే మీరు మంచోళ్ళేనండీ –

**సన్యాసయ్య**

రక్షించావ్.....చూడు చెవులయ్యా! ఇప్పుడు మనం యిద్దరం మంచి స్నేహితులం అయ్యాం కనక –

**చెవులయ్య**

స్నేహితులం –

**సన్యాసయ్య**

ఆ..... స్నేహితులం అయ్యాం కనక......

**చెవులయ్య**

చిత్తం –

**సన్యాసయ్య**

నువ్వు నేనడిగే ప్రశ్నలకి సూటిగా జవాబులు చెప్పాలోయ్......నీ కష్టం ఉంచుకోన్లే నేను –

**చెవులయ్య**

చిత్తం.....

**సన్యాసయ్య**

నిజం చెప్పాలి సుమా! అబద్ధం చెప్పావో....నా చిటికెన వేలుక్కూడా తెలుస్తుంది –

**చెవులయ్య**

అట్లాగాఅండీ!

**సన్యాసయ్య**

మరేమనుకున్నావ్!...దేశదేశాలు తిరిగినవాణ్ణి!....నువ్వు నిజం చెప్పావనుకో – నీకు మంచి బహుమానం కూడా ఇస్తాను – పదిరూపాయలిస్తాను!

**చెవులయ్య**

అమ్మో! చాలా ఎక్కువండి...

**సన్యాసయ్య**

ఎక్కువో తక్కువో నాకు వదిలేసేయ్.....నువు దాన్ని గురించి ఆలోచించకు...

**చెవులయ్య**

అయితే, అడిగేసెయ్యండి –

**సన్యాసయ్య**

మాటవరసకే సుమా.....మీ అయ్యగారు – అమ్మగారు మంచివాళ్ళు గదూ?

**చెవులయ్య**

ఆ మాటేరేసెప్పాలేటండీ?

**సన్యాసయ్య**

నేననుకున్నానులే!...వాళ్ళు చాలా కలుపుగోలు మనుషులు గదూ!

**చెవులయ్య**

అయ్యో! ఆ మాట ఏరే సెప్పాలేటండీ?

**సన్యాసయ్య**

సాయంకాలాలు ఇంటి పట్టున వుండి స్నేహితులతోను, తెలిసినవాళ్ళతోను కాలక్షేపం చేసే మనుషులు గాదూ!

**చెవులయ్య**

అబ్బో! అబ్బో! అంతా చూసినట్టు చెప్పేస్తున్నారండీ!...మీ మాటకి ఏరే సెప్పాలేటండీ?

**సన్యాసయ్య**

(నవ్వి) ఆ!...వాళ్ళిద్దరూ అన్యోన్యంగా – చిలాకా గోరింకల్లా –

**చెవులయ్య**

(ఆశ్చర్యంగా) అయ్యో బాబోయ్!...ఆ మాట ఏరే సెప్పాలేటండీ? ఇద్దరూ ఒకళ్ళకొకళ్ళు అట్టా కలిమిడి అయ్యే మనుషులను కోండి......కుడి చెయ్యి చేసే పని ఎడమచెయ్యికి తెలియదండి....ఎడమ చెయ్యి చేసే పని కుడి చెయ్యికి తెలియదండీ!....సరేనాండి!! అయినా రెండూ ఒకే పని ఒకే పద్ధతిలో చేస్తాయండి....అటువంటి వోళ్ళండి మా అయ్యగారూ, అమ్మగారూ!

**సన్యాసయ్య**

ఇప్పుడు పూర్తిగా నచ్చావోయ్ నాకు –......వాళ్ళని చూసిన దగ్గర్నుంచీ వాళ్ళు ఇటువంటి వాళ్ళేనని నేను పసిగట్టాననుకో!..అయినా నువ్వేమంటావోనని – ఇదుగో! నీకు నేనిస్తానన్న పారితోషికం!!

**చెవులయ్య**

అబ్బో!...పదిరూపాయలిస్తున్నారు..తరువాత ఎందుకిచ్చానా అని అనుకోరు గందా?

**సన్యాసయ్య**

ఛ! అట్లా అనుకుంటానుటోయ్.........అందులోను నీ విషయంలో –

**చెవులయ్య**

అయితే అయ్యగారికి చెప్పొస్తానండి –

**సన్యాసయ్య**

అయ్యగారికి, అమ్మగారికి కూడానోయ్.....

**చెవులయ్య**

చిత్తమండి...........(అని వెడుతూ, వెనకదాకా వెళ్లి ఆగి సన్యాసయ్య మాటలు వింటూ నిలబడతాడు...)

**సన్యాసయ్య**

ఆహా! ఏమీ నా భాగ్యమూ.....పది రూపాయలు పోతేయేం? లక్షరూపాయల ఆసరా దొరికింది!! ఇహ సాయంకాలాలు ఎవరింటికెళ్లి కాసేపు కూర్చుని ఊరికే టిఫిన్ కాఫీలు కానిద్దామా అనే ఆలోచన అక్కర్లేదు కదా!..కాఫీ తాగడానికి కానీ ఖర్చుండదు...తాగే శ్రమ తప్ప! ఇంటి పట్టున ఉండి కుర్చీలో చేరగిలబడి కునుకు తీయడానికి ఇదివరకు ఏ హోటలో ఆశ్రయించేవాణ్ణి.....భోజనం ఎక్కడా అని దిగులక్కరలేదు......పెట్టెలాంటి యిల్లు........బంగారం లాంటి జంట!....అతిథి అన్నవాడికి ఇంతకన్నా ఏం కావాలి?..ఆహా!...ఏమీ నా భాగ్యమూ.........

(అంటూ వెనక్కు తిరుగుతాడు..చెవులయ్య అక్కడే ఉన్నాడు...ఈ పై సంభాషణ జరుగుతన్నతంసేపు..."నీ పని ఇట్టా వుందా! అవురా! ఇంత స్వార్థమా? నీ పని చెబుతానాగు!! అ చెవులు తెగ్గోస్తా – నీ కాళ్ళు విరగ్గొడతా...నీ ముక్కు పీకేస్తా....అన్నట్టు సంజ్ఞలు చేస్తూ వుంటాడు చెవులయ్య....

సన్యాసయ్య వెనక్కు తిరిగేసరికి...చెవులయ్య...."అయ్యా! వెదుతున్నా..." అన్నాదు...సన్యాసయ్య కూడా వెధవ నవ్వు నవ్వి)

**సన్యాసయ్య**

చూడు, నాయనా!..ఈ జీవితం ఉందే......బుద్బుదప్రాయం కదా!...దీని దుంపతెగ!....కోరికలంటే ఏమిటి? సత్సంగత్వే నిస్సంగత్వం...నిస్సంగత్వే...నిస్సంగత్వే – అదే! అట్లా అన్నారు మన పెద్దవాళ్ళు....దేనికీ ఆశపడకురా, జీవా!..ఆశపడితే – నిరాశే నీకు లభిస్తుందిరా మూఢా" అని చెప్పారు మన వేదాంతులు...

**చెవులయ్య**

(ఒక్కసారిగా, కలవర పడ్డట్టు) అయ్యో...అయ్యో....నా మతి మండిపోను –

**సన్యాసయ్య**

ఏమయిందోయ్......ఏమయింది?

**చెవులయ్య**

నల్లా వదిలిపెట్టినట్టున్నాను..ఊరికే కారిపోతున్నట్టున్నాయి నీళ్ళు...కట్టేసి వస్తాను.....అట్లాగే అయ్యగారికి చెబుతా – మీరొచ్చినట్టు –

**సన్యాసయ్య**

(తనలో) భోళా సన్నాసి!!...మంచివాడు...కాని (తల వూపుతూ) ఇది శూన్యం..కాని మంచి హుషారైన వాడు...ఫరవాలేదు...మంచి చేసుకుంటే ఉపయోగపడతాడు..ఈ ఇల్లుకూడా పొందికగా, చక్కగా ఉంది.. ఇంట్లో ఉన్నవాళ్లు పరమ సాత్త్వికుల్లా కనిపించారు...కుర్చీలు గట్రా బాగానే ఉన్నాయి గానీ కాస్త పాత సరుకు...(ఓ కుర్చీలో చేరగిలబడి) ఓరీ సన్నాసీ! అదృష్టం అట్లా కలిసిరావాలిరా!...వెతుకుతున్న తీగే కాలికి తగిలింది ఫో!! (లోపల నుంచి శబ్దం)

(భార్యా, భర్తా ప్రవేశిస్తారు)

**సన్యాసయ్య**

(ఆప్యాయంగా) శాంతయ్యగారూ! మధురమ్మగారూ! నమస్కారాలు..

**శాంతమూర్తి**

అరె! మీరా సన్యాసయ్యగారూ! ఎంత శుభదినం!!

**మధురం**

రండి, రండి...చాలా సంతోషం –

**శాంతమూర్తి**

చూశావా! మొన్న చెప్పాం....ఇవ్వాళ వచ్చేశారు!

**మధురం**

సరిగ్గా సమయానికొచ్చారు –

**సన్యాసయ్య**

(సంతోషంగా) చెప్పరూ? ఏమిటి విశేషం?

**మధురం**

ఏమీలేదు...మేం ప్రశాంతంగా ఇంటి దగ్గర ఉన్నప్పుడు వచ్చారూ – అని.

**సన్యాసయ్య**

చాలా సంతోషం!

**మధురం**

చూడండి సన్యాసయ్యగారూ –

**సన్యాసయ్య**

అమ్మా!

**శాంతమూర్తి**

(అతని ఎడం చేతిని లాగుతూ) క్షమించాలి...నేను ముందు –

**మధురం**

(అతని కుడి చేతిని లాగుతూ) కాదు...నేను ముందు –

**శాంతమూర్తి**

నేను ముందు వచ్చాను...ముందుగా వచ్చితిన్

**మధురం**

నేను ముందు చూశాను..మును ముందుగా నర్జును నేను చూసితిన్ –

**సన్యాసయ్య**

ఆహాహా! ముందుగ వచ్చితీవు, మును ముందుగ నర్జును నేను చూచితిన్ – అన్నట్టుగా వుంది – మీ పోటీ! ఆహా! ఏం ఆలుమగలండీ!

**మధురం**

మీరాయన మాటలు వినకండి..ఆయన ఇహ చాట భారతం విప్పుతాడు..

**శాంతమూర్తి**

నేను! చాట భారతం!! నువ్వు జల్లెడరామాయణం విప్పుతావ్!! ఇహ ఏక ప్రవాహమే!...

**మధురం**

ఒట్టి చెత్త మాట్లాడేది నువ్వే!

**శాంతమూర్తి**

చెత్తా?

**మధురం**

ఆహా!! పరమ చెత్త!!

**శాంతమూర్తి**

దేవుడు నీకు కాస్తంత బుర్రయివ్వలేదు గాని, బానెడు నోరిచ్చాడు...

**మధురం**

నీకు బుర్రా లేదు; నోరూ లేదు...ఒట్టి మట్టి బుర్ర –

**శాంతమూర్తి**

నన్నేమన్నావ్?

**మధురం**

మట్టి బుర్ర అన్నాను...

**శాంతమూర్తి**

అంటావ్ అంటావ్..... పెద్దమనిషి ఉన్నాడని విర్రవీగుతున్నావ్....ముందు ఆ చెయ్యి వదిలి పెడతావా పెట్టవా?

**మధురం**

నువ్వే వదిలి పెట్టు –

**శాంతమూర్తి**

వదిలిపెట్టూ అన్నాను.

**మధురం**

నువ్వే వదులు అన్నాను.

**సన్యాసయ్య**

(అటూ ఇటూ లాగడం వల్ల గూడనెప్పి పుట్టి) ఓ! (అంటాడు బాధతో)

**మధురం**

విన్నావా! పాపం ఆయన్ని అరిచేటట్టు చేస్తున్నావ్!

**సన్యాసయ్య**

అయ్య! అమ్మా! మీరేదో చాలా పనితొందరలో ఉన్నట్టు కనిపిస్తుంది....మరోసారి తమ దర్శనం చేసుకుంటాను.

**శాంతమూర్తి**

అబ్బే బొత్తిగా పని లేదండి.

**మధురం**

ఉంటే మాత్రం! మీకన్నా ఎక్కువా?

**శాంతమూర్తి**

అందుకే – మీరు వెళ్ళనక్కరలేదు...(పక్కనుంచి ఓ కుర్చీ తెచ్చివేసి) కూర్చొండి.

**సన్యాసయ్య**

ఎందుకుండీ మీకీ శ్రమ?

**మధురం**

(మరో కుర్చీ తెచ్చివేసి) మీరు వెళ్ళనే వెళ్ళొద్దు...కూర్చోండి. (అని తాను తెచ్చిన కుర్చీ చూపిస్తుంది)

**సన్యాసయ్య**

అట్లాగే....

**శాంతమూర్తి**

అందులో కాదు ఇందులో -

**సన్యాసయ్య**

అయ్యా -

**మధురం**

ఇందులో -

**సన్యాసయ్య**

అమ్మా -

**శాంతమూర్తి**

కాదు. ఇందులో -

**మధురం**

కానేకాదు. ఇందులో......

**సన్యాసయ్య**

అయ్యా! మీయిద్దరికీ శ్రమ వద్దు...నిలబడే వుంటాను...

**శాంతమూర్తి**

కూర్చోండి..ఇందులో. ఎంతసేపు ఇట్లా? పాపం సన్యాసయ్యగారికి కాస్త మనశ్శాంతి కూడా లేకుండా చేస్తున్నావ్....

**మధురం**

కూర్చోండి......

**సన్యాసయ్య**

సరే, సరే! మీ సంతోషం కోసం అట్లాగే కూర్చుంటాను.

**మధురం**

(సన్యాసయ్య కూర్చునే సమయానికి అతని కిందికి తాను తెచ్చిన కుర్చీ లాగుతుంది)

ఇక్కడ కూర్చోండి-

**సన్యాసయ్య**

(ఆమె వంక చూచి, చిరునవ్వుతో) పోనీ అట్లాగే (అని దాన్లో కూర్చోబోతాడు)

**శాంతమూర్తి**

(గబగబా అటువెళ్ళి) అందులో కాదు; నా మాట వినండి -

(ఒక వైపు అతి మధురం సన్యాసయ్య బుజాలు పట్టుకుని కూర్చోబెడుతుంది. శాంతమూర్తి సన్యాసయ్య కూర్చోబోతున్న కుర్చీని ఇవతలికి లాగుతాడు...సన్యాసయ్య ధాం అని కిందపడతాడు)

**సన్యాసయ్య**

అయ్యో! అయ్యో!

**మధురం**

చూశావా దద్దమ్మా! ఏం చేశావో?

**శాంతమూర్తి**

నేనేనా? నువు మాత్రం కారణం కాదు? సన్యాసయ్యగారికి యిష్టం లేని కుర్చీలో నువ్వే కుదేశావు...మొహం పగిలుంటే ఏం చేసేదానివి? అన్నీ యింతే! దద్దమ్మా అని దద్దమ్మ – (సన్యాసయ్యతో) సన్యాసయ్యగారూ! దెబ్బలు బాగా తగలలేదు కదా!

**సన్యాసయ్య**

(ఏడుపు గొంతుతో) దెబ్బలు తగలక ఛస్తాయటయ్యా! నడుం విరగలేదు –

**శాంతమూర్తి**

(ఆనందంగా) ఆ మాట అన్నారు. చాలా సంతోషం! ఇంకా కొంచెం అట్లా కిటికీ దగ్గరకి రండి..కాస్త గాలి బాగా వస్తుంది.

**సన్యాసయ్య**

(తనలో) ఇక్కడికి రాకుండా వుంటే ఎంత బావుండేది!

**మధురం**

ఇదుగో ఈ కుర్చీ పీట కాళ్ళకింద వేసుకోండి...పాపం! కొంచెం నొప్పులు తగ్గుతాయి –

**సన్యాసయ్య**

అక్కర్లేదండి –

**మధురం**

(ఆయన కాళ్ళకింద వేస్తూ) కాళ్ళు పెట్టుకోండి –

**శాంతమూర్తి**

(సోఫాలో ఉన్నదిండు తీసుకువచ్చి) ఇది కూడా వేసుకోండి. మెత్తగా ఉంటుంది.

**మధురం**

ఇది వేసుకోండి..ఇంకా మెత్తగా ఉంటుంది...(దిండు తెచ్చి వేస్తుంది)

**శాంతమూర్తి**

ఇది – (అని మరో దిండు తెచ్చి వేస్తాడు)

**మధురం**

(ఇట్లా ఉందా నీ పని అనుకుని ఒక చిన్న కుర్చీ పీట తెచ్చి) ఇది వేసుకోండి –

(ఇది జరుగుతున్నంతసేపూ "అబ్బె, వద్దండి – అయ్యో వద్దండి; వద్దు బాబూ వద్దు, ఇంకోటా?" అంటూ వుంటాడు సన్యాసయ్య.... ఇప్పుడు మొహం కూడా కనిపించకుండా సన్యాసయ్య పూర్తిగా మునిగిపోతాడు)

**శాంతమూర్తి**

నేను చేసిన ప్రతీదానికీ ఎడ్డెం అంటే తెడ్డం అంటావు కదూ? (అని మధురం వేసిన మొదటి కుర్చీ పీటను ఒక్క తన్ను తన్నుతాడు. పీట, దిళ్ళు వాటి మీద పీట – అన్నీ కింద పడతాయి....వాటి మీద సన్యాసయ్య పడిపోతాడు)

**సన్యాసయ్య**

(కాళ్ళు చేతులు పైకి ఎత్తి పడిపోతాడు) బాబోయ్!...

**శాంతమూర్తి**

ఏమిటి ప్రతి దానికీ – ఊరికే అట్లా పడిపోతున్నారు...బొత్తిగా కుదురు లేదండీ మీకు సన్యాసయ్యగారూ!

**మధురం**

(పడ్డవాడిని లేపుతూ) నువ్వు...నువ్వు ఆయన అంతు చూడకుండా వదిలేటట్టు లేవు!

**సన్యాసయ్య**

(కొంచెం అధికారంతో) ఇద్దరూ కాసేపు వూరుకుంటారా?

**మధురం**

నాకిష్టమైతే ఊరుకుంటాను; నా యిష్టం –

**శాంతమూర్తి**

నీకిష్టమైతేనా?

**మధురం**

ఆహా!!

**శాంతమూర్తి**

(కోపంతో పళ్ళు బిగిస్తూ) ఓ! అంతేనా?

**మధురం**

నాకిప్పుడు యిష్టంలేదు; కనుక నేను ఊరుకోను.

**శాంతమూర్తి**

ఊరుకోకపోతే ఉరేసుకో!

**మధురం**

నేనేం చవటని కాదు –

**శాంతమూర్తి**

అదుగో! మాటలు మీరుతున్నావు!! నేను చవటను కాదు అని నువ్వు అంటుంటే నేను చవటననా నీ ఉద్దేశ్యం?

**మధురం**

ఏం? నువ్వే ఎందుకు కావాలి?....ఈ సన్యాసయ్యగారు కాకూడదా?

**సన్యాసయ్య**

నిజమేనమ్మా! నేను చవటనే!!

**శాంతమూర్తి**

మీరూరుకోండి సన్యాసయ్యగారూ! అయితే మాత్రం?

**మధురం**

ఇహ అనవసరంగా మాట్లాడకు – వాగుడుకాయి!

**శాంతమూర్తి**

నువ్వే వూరుకో – ఫాక్టరీ గొట్టంలా ఒకటే లొడలొడ –

**మధురం**

నువ్వు లేవు? చిమ్నీ గొట్టం! రైల్ ఇంజన్ గొట్టం....గొట్టం....గొట్టం.....గొట్టం –

**శాంతమూర్తి**

(సీరియస్‌గా సన్యాసయ్యతో) ఏం జీవితమండీ ఇది?

**మధురం**

చాడీలు చెప్పు....ఊ...కానీ.....పనీ పాటాలేకుండా పొద్దస్తమానం ఇంటి దగ్గరుండి పెళ్ళాం ఆస్తి అరిగిపోయేలా తిని కూర్చోడం కాదు. పాపం! మా నాన్న చెమటోడ్చి సంపాదించిన ఆస్తి –

**శాంతమూర్తి**

ఏమిటి! మీ నాన్న – చెమటోడ్చి....దేశంలో ఉన్న సగంమంది జనం పొట్టలు కొట్టే కాదూ – మీ నాన్న సంపాదించింది!

**మధురం**

ఆ! మీ నాన్న సంపాదించాడుగా! చేసిన అప్పులు తీర్చలేక అప్పులాళ్ళు ఇంటిమీద పడితే దొడ్డిదోవన పారిపోయిన మీ నాన్న సంగతే చెప్పుకోవాలి!!

**శాంతమూర్తి**

(సన్యాసయ్యతో) వింటున్నారుగా!

**సన్యాసయ్య**

(చాలా నిరాకారుడుగా) ఏమిటో! దేశం అంతా కాలంగాని కాలంలో ఒక్కసారి చల్లబడిపోయిందండీ!

**శాంతమూర్తి**

(భార్యతో) నీ అసలు రంగు బయట పెట్టేటట్టు చేస్తున్నావ్, జాగ్రత్త!

**మధురం**

నా.....అసలు సంగతి....చెప్పు.....ఎంత దమ్ములున్నాయో చూస్తాను –

**శాంతమూర్తి**

నిన్ను ఎటువంటి పరిస్థితుల్లో చూసి, జాలిపడి, కాపాడి, పెళ్ళి చేసుకున్నానో చెబితే –

**మధురం**

ఆ! చేసుకున్నావులే మా లావు పెళ్ళి!

**శాంతమూర్తి**

కాక? నేను చేసుకోకపోతే జన్మకి పెళ్ళయ్యేదికాదు – ఎక్కడో బజార్లో –

**మధురం**

ఇహ మాట్లాడావా.....చూసుకో –

**శాంతమూర్తి**

(కాలుతట్టి) ఏం చేస్తావ్?

**సన్యాసయ్య**

(రాజీ కోసం తాపత్రయపడిపోతూ) అంత ఆవేశపడిపోకండి...మధురం గారు చెప్పింది కొంచెం సబబుగానే ఉన్నట్లు తోస్తోంది......

**శాంతమూర్తి**

సబబు?

**సన్యాసయ్య**

(చిరునవ్వుతో తల పంకిస్తూ) అవును..

**శాంతమూర్తి**

సబబు?

**సన్యాసయ్య**

అంటే –

**శాంతమూర్తి**

సబబు...నాల్రోజులపాటు ఈ లోకంలో ఉండాలని లేదా ఏం?

**సన్యాసయ్య**

అబ్బే! అదేంలేదు.....ఊరికే మాటవరసకి – దాన్ని గురించి పట్టించుకోకండి – మరిచిపోండి...

**శాంతమూర్తి**

మా రోజుల్లో చచ్చు పుచ్చు మాటలు చాలా విన్నానుగాని, ఇంత అధమస్తపు మాట యీ జన్మలో వినలేదు.

**సన్యాసయ్య**

క్షమించమన్నానుగా!

**శాంతమూర్తి**

సబుబు!

**సన్యాసయ్య**

ఒక్క మాట చెప్పనివ్వండి.

**శాంతమూర్తి**

సబబు! (అని మత్తెక్కిన మదగజంలా ఊగుతూ వుంటాడు)

**సన్యాసయ్య**

ఒక్క మాట వినండి.

**శాంతమూర్తి**

(అటూ ఇటూ పరిగెత్తుతూ) ఏదీ! ఒక కర్ర ఇట్టా ఇవ్వండి..కర్ర...ఇవ్వాళ యీ సన్యాసయ్యగారి నడుం విరగ్గొడతాను..సహనానికైనా హద్దులుంటాయి...ఇహనా వల్ల కాదు....ఆడదాని ఆకారంలో ఉన్న ఆ పిశాచి, ఆ భూతం, ఆ రక్కసి....నన్ను ప్రతిక్షణం నరకయాతన పెట్టే మనిషి....నా శరీరంలో ప్రతి అంగాన్ని కొద్ది కొద్దిగా కాల్చి రగిలిస్తున్న ఆడది చెప్పింది సబబు!

**సన్యాసయ్య**

అయ్యా! ఒక్క మనవి –

**మధురం**

ఆ! ఆ మాటకేం పట్టించుకోకండి.....ఆయనకి మతిస్థిమితం తప్పింది..

**శాంతమూర్తి**

ఆవిడ చెప్పింది సబబు అంటున్న మీరెంత బేసబబు మనుషులో మీకు తెలియడం లేదు – ఇంత మందమతిని నా జీవితంలో చూడలేదు –

**సన్యాసయ్య**

(వెధవ నవ్వు నవ్వి) నాకూ అట్లాగే అనిపిస్తుంది సుమండీ, నన్ను చూసుకుంటే!

**శాంతమూర్తి**

మీరు నా స్థానంలో ఉంటే మీకు తెలిసేది...మూడు వందల అరవై రోజులూ ఇరవై నాలుగు గంటలూ వేపుకు తింటూ వుంటే మీకు తెలిసేది....ఆ వేపుడును కరకరా నములుతూ ఆనందిస్తూ వుంటే మీకు తెలిసేది – ఊరికే సబబు అనగానే సరిగాదు.

**మధురం**

(సన్యాసయ్యతో) చూశారా, చూశారా! ఇహ లాభంలేదు...తీసికెళ్ళి పిచ్చి ఆసుపత్రిలో పడేస్తేగాని యీ మనిషికి బుద్ధిరాదు.

**శాంతమూర్తి**

పిచ్చాసుపత్రి! నన్ను!! నా జీవితాన్ని పిచ్చి పట్టించి పీడించుకుతినే పిచ్చిది ఎవరు? చెప్పరేం, ఎవరు? (సన్యాసయ్య చొక్కా పట్టుకు లాగుతూ) సన్యాసయ్యగారూ! ఎవరిది పిచ్చి; చెప్పండి....నేనుతాగే నీళ్ళలో మందు కలిపిందెవరు. నేను తినే అన్నంలో విషం కలపాలని ప్రయత్నించిదెవరు? చెప్పమనవయ్యా –

(అని లాగే సరికి చొక్కా చినిగిపోయింది)

**మధురం**

నేను...నేను విషం కలిపానన్న వాళ్ళదే పిచ్చి! మతిస్థిమితం లేకపోతేనే ఆ పిచ్చి పిచ్చివాగుడు...ఏమంటారు సన్యాసయ్యగారూ! మాట్లాడవేమయ్యా!

(అని చొక్కా రెండో పక్క లాగుతుంది. అటూ ప్రక్కకూడా చినుగుతుంది)

**శాంతమూర్తి**

చెప్పమనవయ్యా! – అన్నిట్లో కాస్త కాస్త విషం కలుపుతుందో లేదో –

**మధురం**

చెప్పవేమయ్యా! అదంతా అబద్ధమని –

**సన్యాసయ్య**

అయ్యా – అమ్మ.......(అంటూ యిద్దర్నీ బతిమాలే ప్రయత్నం చేశాడు)

**మధురం**

అబద్ధమో కాదో – క్షణంలో, క్షణంలో నిరూపిస్తా –

(అంటూ గబగబా లోపలికి వెళ్ళిపోతుంది)

**శాంతమూర్తి**

నువ్వు క్షణంలో నిరూపిస్తావ్! నువ్వు ఎంత కేటునెంబరు ఒకటివో అరక్షణంలో నిరూపిస్తా – (అంటూ రెండో వైపుకు వెళ్ళిపోతాడు)

**సన్యాసయ్య**

ఇద్దరు పిచ్చి మనుషుల మధ్య చిక్కుకుపోయాను? ఏది దారి? (అటూ ఇటూ చూసి) ఇద్దరూ ఏదో పెద్ద వ్యూహం మీదే వచ్చేటట్టున్నారు?..ఈలోగా చప్పుడు చెయ్యకుండా బతుకు జీవుడా అంటూ మనం బయటకు జారుకుంటూ – (అంటూ వెళ్ళబోతాడు...ఎదురుగా చెవులయ్య వస్తాడు.)

(ఈ సీనులో అంతా చెవులయ్య సంజ్ఞలతో సంభాషిస్తాడు)

**చెవులయ్య**

ఎక్కడికి? (అన్నట్టు సంజ్ఞ) (వెడుతున్న వాడిని ఆపుతాడు)

**సన్యాసయ్య**

ఏమయ్యా! పెద్దమనిషి!! వీళ్ళు అన్యోన్య దంపతులన్నావే! వీళ్ళను మించి ఆతిథ్యం ఇచ్చేవాళ్ళు ఈ వూరి మొత్తం మీద లేరన్నావే! (ఏడుపుమొహంతో) నన్ను యీ ఇంట్లో కెందుకు రానిచ్చావయ్యా?

(ఈ మాటలకి చెవులయ్య నాలుక జాపి, పళ్ళకిందకి నొక్కి ఆశ్చర్యార్థకాలతో అభినయిస్తాడు)

**సన్యాసయ్య**

నేను చెప్పిన ఒక్క మాటవింటేనా? (విన లేదా అన్నట్లు చెవులయ్య ప్రశ్న) విని ఏడిస్తే నాయీ అఘోరింపు ఎందుకు? ఇటు వాళ్ళు అటు వాళ్ళు పడి యీ పళంగా కుళ్ళబొడిచేశారు గదయ్యా! (అట్లాగా! అన్నట్లు ఆశ్చర్యార్థకంగా పెడతాడు మొహం చెవులయ్య)

**సన్యాసయ్య**

పిల్లికి చెలగాటం....ఎలక్కి ప్రాణ సంకటం....ఇప్పుడు ఇద్దరూ ఏదో కుట్ర పన్నడం కోసం లోపలికి వెళ్ళారు...ఈ లోగా ఇక్కడనుంచి ఉడాయించకపోతే ప్రమాదం...(వెళ్ళబోతాడు)

(చెవులయ్య 'తప్పు' అన్నట్టు సంజ్ఞ. వెళ్ళిపోతే తన గొంతు కోస్తారనే సంజ్ఞ)

**సన్యాసయ్య**

నాయనా! వెడితే నీ అంతు చూస్తారు..ఉంటే నా అంతు చూస్తారు..ఏది దారి?

(అని వెళ్ళడానికి బతిమాలుతాడు....సన్యాసయ్య చెవులయ్యకి వెనక సైడ్‌వింగ్ దాకా నెట్టుకుంటూ పోవడం, చెవులయ్య తప్పు, వాళ్ళు వస్తారు అని చెబుతూ తిరిగి వెనక్కి నెట్టుకుంటూ రావడం జరుగుతుంది.)

**సన్యాసయ్య**

నన్ను పోనీవయ్య! నీకు పుణ్యం ఉంటుంది...(తప్పు అన్నాడు చెవులయ్య) నేను వెళ్ళకపోతే – ఇహ నీకు దక్కనయ్యా – ('అంతేగదా' అన్నాడు) (ఇహ హతాశుడై) పోనీ ఒక పని చేసిపెడతావా? (అడగండి – దానికేం భాగ్యం) నాకిక్కడ శారీరక, మానసిక రుగ్మతలేమన్నా సంభవిస్తే – కాస్త ఆసుపత్రికి జేరేయ్ నాయనా– చచ్చి నీ కడుపున పుడతాను...(ఎంతమాట! తప్పకుండా చేరుస్తాను)

**సన్యాసయ్య**

(కోపమొచ్చి) కాస్త ఆ స్వాతికం ఆపి ఆంగికం తగలడనియ్యవయ్యా! ప్రాణాలు కడబట్టి నేను ఏడుస్తుంటే – నీకిదంతా ఆటగా వుంది!!

**చెవులయ్య**

"తప్పు, తప్పు" (అన్నాడు సంజ్ఞలతో)

(ఇంతలో లోపలనుంచి 'సన్యాసయ్యగారూ' అని పిలుపు...చెవులయ్య – అడుగో – మా అయ్యగారు వస్తున్నాడు – అని చూపులతో చెబుతూ వెళ్ళిపోతాడు)

**శాంతమూర్తి**

సన్యాసయ్యగారూ! మీరు నన్ను క్షమించాలి...మీరు వచ్చి ఇంత సేపాయె! మీకు తగిన మర్యాద చెయ్యలేకపోయాను, చూశారా!

**సన్యాసయ్య**

(ఆశ్చర్యం నటిస్తూ) ఎప్పుడూ? ఛ! ఛ! మీరు మర్యాదరామన్నకి మారు పేరు కదండీ! అట్లా అనుకోకండి...మీ ఇంట్లో నాకు జరిగిన అతిథి మర్యాద – ఎప్పుడూ ఎవ్వరికీ జరిగి వుండదు – ఏం మర్యాద, ఏం మర్యాద!! మరి నాకు సెలవు ఇప్పించండి..వెళ్ళొస్తాను.

**శాంతమూర్తి**

అప్పుడేనా?

**సన్యాసయ్య**

అమ్మో! చాలా జరూరు పని మరిచిపోయొచ్చాను....క్షమించాలి.

**శాంతమూర్తి**

నిజంగానా!

**సన్యాసయ్య**

నిజ్జంగానండి!

**శాంతమూర్తి**

అమ్మో! వెళ్ళేముందు కాసిన మజ్జిగో, ఒక షర్బతో, కనీసం కాసిన మంచినీళ్ళో తాగకుండా వెళ్ళడం కుదరదండీ –

**సన్యాసయ్య**

అయ్యా! ఎట్లాగయినా నా మీద దయ ఉంచి కుదిరించుకోండి.

**శాంతమూర్తి**

కుదరదంటే కుదరదండీ! ఏదో ఒకటి తాగకుండా ఇక్కడనుంచి వెళ్ళిపోతానని అనడానికి మీకు మనసెలా ఒప్పిందండీ! మన భవిష్యత్ స్నేహానికి నాందిగా మీరు ఏదో ఒకటి పుచ్చుకుతీరాలి....మీరు తీసుకోకపోతే నాకు చాలా బాధగా ఉంటుంది....నా మీద మీకెందుకనో కోపం వచ్చిందనుకోవాల్సి ఉంటుంది నేను. (దూరంగా ఉన్న చెవులయ్యతో) చెవులయ్యా! చక్కగా నిమ్మకాయ షర్బత్ చేసి తీసుకురా!

**సన్యాసయ్య**

(అయిష్టంగానే) సరే! కానివ్వండి..

**శాంతమూర్తి**

అట్లా అన్నారు బాగుంది.

**సన్యాసయ్య**

కాని, మీ భార్యాభర్తలు మధ్య వుండే కలతల్లోకి నన్ను లాగనంటేనే పుచ్చుకుంటాను...నేనేదో పక్షపాతినని మీరో, మీ భార్యామణిగారో అనుకోవచ్చు.... పైగా నా చొక్కా రెండో వైపును రక్షించుకోవలసిన బాధ్యత ఉంది, చూడండి –

**శాంతమూర్తి**

సరే! మీరన్నట్లుగానే కానివ్వండి.

**సన్యాసయ్య**

ఒప్పుకున్నట్టేగా! (అని చేతిని అందిస్తాడు)

**శాంతమూర్తి**

(అతని వీపు మీద గట్టిగా చరిచి) ఒప్పుకున్నట్టే –

**సన్యాసయ్య**

అయితే మనం యిట్లా కూచుందాం.......(ఇద్దరూ కూర్చీల్లో కూర్చుని ఒకరికేసి ఒకరు చూసుకుంటారు. మెల్లగా ఒక్కని ఒకళ్ళు చూసి చిరునవ్వు నవ్వుకుంటారు)

**శాంతమూర్తి**

(ఉత్సాహంగా) మనిద్దరం దగ్గరి స్నేహితులం కాబోతున్నామని నాకు తెలిసి పోయిందండీ!

**సన్యాసయ్య**

నిజమా! నా ఉద్దేశ్యం కూడా అచ్చంగా అదేనండి.

**శాంతమూర్తి**

మీరు నేనంటే చాలా స్నేహంగా ఉన్నారు....(సన్యాసయ్య వినయంగా దణ్ణం పెడతాడు) నేరుగా నేను ఇట్లా అంటున్నానని మీరేమీ అనుకోకూడదు సుమండీ! అతికి పోయినట్టు ఉండే మీ మాటలు, అందులో ఉండుకున్న నిగూఢమైన అర్ధాలు, సామెతలు వగైరాలు – మామూలు వాళ్ళకి అబ్బేనా? అయితే – ఒక్క విషయం మాత్రం మీతో చెప్పక తప్పదండీ – మీరేమనుకున్నా సరే!

**సన్యాసయ్య**

అనుకునేదేముంది, చెప్పండి..

**శాంతమూర్తి**

అదే!....మీరు నిష్కర్షగా మాట్లాడే పద్ధతి ఉందే! ముక్కుకు సూటిగా, నిర్మొహమాటంగా ఉండడం మీ ప్రత్యేకత అంటాను నేను...ఏమంటారు?

**సన్యాసయ్య**

(వినయంతోనే, అయినా విజయోత్సాహంతో) ఏదో, మీ మంచితనం –

**శాంతమూర్తి**

అన్నారా! మీ మంచితనం మీకు కనిపించదండీ! మీరు ఇంత నిర్మొహమాటి గనక – నాకొక్క విషయం చెప్పండి....నాన్చుడాలు, డొంక తిరుగుడు మాటలూ మీకూ నచ్చవ్, నాకూ నచ్చవ్ – అందుకని సూటిగా చెప్పాలి –

**సన్యాసయ్య**

అడగండి –

**శాంతమూర్తి**

ప్రపంచంలో – మీరు చూసినంతలో – అకటావికటం, తల పొగరు, అఘాయిత్యం – అన్నీ కలబోసుకున్న మనిషిమా ఆవిడేనని మీరు ఒప్పుకుంటారా, లేదా?

**సన్యాసయ్య**

(అతన్ని వారిస్తూ) అదుగో – మీ వ్యక్తిగత విషయం – ఊహూ –

**శాంతమూర్తి**

నిర్మొహమాట మనిషినని ఇప్పుడే చెప్పారు –

**సన్యాసయ్య**

మీరటువంటివి అడగకూడదు, నేను చెప్పకుడదు...

**శాంతమూర్తి**

అంతే......అంటే...మీరు ఒప్పుకున్నట్టేగా?

**సన్యాసయ్య**

అదేమిటండోయ్?

**శాంతమూర్తి**

ఒక్క మొహమేనా? చేసే పనులు? ఎంత క్రూరత్వం? ఎంత పొగరు? ఇంతెందుకు; ఒక చిన్న ఉదాహరణ చెబుతాను.

**సన్యాసయ్య**

నాకేం చెప్పొద్దు మహాప్రభో...! నా ఉద్దేశ్యంలో –

**శాంతమూర్తి**

నన్ను చెప్పనివ్వండి....ఆ తరువాత మీరు ఎంత సేపు ఏం చెప్పినా వింటాను....పడుకుంటామా? మంచం చివరిదాకా తోసుకుంటూ పోతుందండీ? అంతేనా? రాత్రంగా అటూ ఇటూ తిరుగుతున్నట్టు నటన....అటూ తిరుగుతూ ఒక తన్ను... ఇటు తిరుగుతూ ఒక తన్ను...(అంటూ సన్యాసయ్యని తన్నుతూ వుంటాడు)

**సన్యాసయ్య**

అయ్యో! అయ్యో! అట్లా తంతారేంటండి?

**శాంతమూర్తి**

అంతేనండీ?....అఘాయిత్యం కాకపోతే – దిండు పట్టుకుని పైకి జరుగుతున్నట్టు జుట్టు పట్టుకుపైకి పాకుతుందండీ! (అంటూ జుట్టు పీకుతాడు)

**సన్యాసయ్య**

అబ్బా!.....

**శాంతమూర్తి**

నెప్పి పుట్టిందా? పుడుతుందండీ...ప్రతిరాత్రీ ఇదే వరసనుకోండి...పొద్దున్నే లేస్తుందా? ఆవులింత ఒళ్ళు విరుచుకుంటున్నట్టు నటించి మొహంమీద ఒక్కటిస్తుందండీ! (అని ఆవులించి, ఒళ్ళు విరుచుకుని చేత్తో సన్యాసయ్యని కొడతాడు) ఇది ఏమన్నా బావుదంటారా?

**సన్యాసయ్య**

బావుందండోయ్! ఆవిడ చేసినవన్నీ మళ్ళీ చేసి నా కాళ్ళు, చేతులూ, మొహం విరిచేస్తున్నారు...ఇదేమన్నా సబబుగా వుందా మీకు? బుద్ధి గడ్డితిని మీ ఇంటికొచ్చాను. ఇహ – నన్ను పుతంకాసినా మీ ఇంటికి రాను కాదు గదా, దీని చాయలకి కూడా కనిపించను....

(అని నమస్కారం చేస్తూవుండగా అతిమధురం ప్రవేశం)

(అతి వేగంగా వచ్చింది. ఆమె చేతిలో ఒక గ్లాసు)

(ఆ గ్లాసును సన్యాసయ్య నోటిదగ్గర పెట్టి)

**మధురం**

తాగండి.......

**సన్యాసయ్య**

(అదిరి పడి) ఇదేమిటి?

**మధురం**

తాగండి.

**శాంతమూర్తి**

ఏమిటి? నువ్వింకా బ్రతికేవున్నావా?

**మధురం**

నీకేమన్నా అయిందేమో! నేను నిక్షేపంలా ఉన్నాను....తాగండి....తాగి అప్పుడు చెప్పండి....

**శాంతమూర్తి**

ఏలేశ్వరం వెళ్ళినా శనేశ్వరం తప్పలేదన్నట్టు, హాయిగా, కులాసాగా ఆనందంగా, సంతోషంగా నేను మన సన్యాసయ్యగారు మాట్లాడుకుంటుంటే మధ్య నీ అజమాయిషీ ఏమిటీ? కదులు....

**మధురం**

ఛస్తే కదలను..

**శాంతమూర్తి**

నువ్వు ఇట్లా ఎందుకు కదులుతావు? చెప్తా.....

(అని తలపంకించి లోపలికి వెళ్ళిపోతాడు)

**మధురం**

అమ్మయ్య! పీడా వదిలిపోయింది......

(అని శాంతమూర్తి వెళ్ళిన వింగ్ దాకా వెళ్ళి కాలు తాటించి వస్తుంది. ఈలోగా)

**సన్యాసయ్య**

ఈవిడకి పిచ్చో, ఆయనకు పిచ్చో తెలియడం లేదు....ఇక్కణ్ణుంచి క్షేమంగా బయటకు తీసుకుపో తండ్రీ! ఏడుకొండలవాడా! నీ కొండకు వచ్చి –

**మధురం**

(మళ్ళీ వెనకాలకు వచ్చి) ఇప్పుడు తాగండి....

**సన్యాసయ్య**

ఒద్దు....

**మధురం**

మొహమాటపడకండి......మీరు తాగి చూడండి –

**సన్యాసయ్య**

వద్దంటున్నానుగా!...ఇహ నేను వెడతాను......అవతల జరూరు పని వుంది.

**మధురం**

అదేమిటి? అప్పుడే? అంత అకస్మాత్తుగానా?

**సన్యాసయ్య**

ఇంటి దగ్గరే ఓ జరూరు పని జ్ఞాపకం వచ్చింది...వెళతాను....వెళ్ళాలి....వెళ్ళితీరాలి.

**మధురం**

(చాలా సీరియస్‌గా) సరే! మీ యిష్టం.....కాని వెళ్ళే ముందు ఒక చిన్న సహాయం చెయ్యగలరా?

**సన్యాసయ్య**

అమ్మమ్మ! ఎంతమాట...! చెప్పండి......

**మధురం**

(సీరియస్‌గానే) నన్ను మీతో కూడా తీసుకువెళ్ళండి –

**సన్యాసయ్య**

(బిక్కమొహంతో) అదేమిటమ్మా? ఎట్లా!

**మధురం**

ఈ నరకంలోనే ఉండి పొమ్మంటారా? .......తీసుకుపొండి –

**సన్యాసయ్య**

అమ్మా! నన్ను కనికరించు....నన్ను వెళ్ళిపోనీ –

**మధురం**

తీసుకుపోరు……అంతేనా? నాకేం? మరోక్షణంలో ఓ అతి దారుణమైన దృశ్యం చూస్తారు ఇక్కడే!

**సన్యాసయ్య**

(తనకేదో మూడిందని) అమ్మ! బ్రహ్మచారిముండావాణ్ణి! నేరక ఇక్కడికి వచ్చాను…దయచేసి…నాకు విముక్తి ప్రసాదించు –

**మధురం**

అదేం లాభం లేదు!…..మరో క్షణంలో మీరు ఇక్కడ జరిగే అతిదారుణమైన దృశ్యానికి కారకులవుతారు – ఆ తరువాత మీయిష్టం!

**సన్యాసయ్య**

నేనా!

**మధురం**

అక్షరాలా! మీరు "దేవుడా" అని మూడు అక్షరాలు చెప్పేలోగా మీ ముందుకు ఓ శవం పడివుంటుంది… రక్తం మడుగులో – శవం….

**సన్యాసయ్య**

ఓరి దేవుడా!….(అని నాలిక కరుచుకుని) కాదు, కాదు….అమ్మా! నేను చేసిన తప్పేమిటి చెప్పండి….నన్నెందు కిట్లా సావకాశంగా చంపుకుతింటున్నారు?

**మధురం**

మీరన్నదే నిజం……దేన్నీ తెగేదాకా లాగకూడదు….అవునా?……(అని అతని మీది మీదికి పోతూ) మరి పదేళ్ళపాటు ఎట్లా కాపురం చేశావని అడగరేం?

**సన్యాసయ్య**

మీ కాపురం గంగలో కలవా! నా కెందుకమ్మా మీ కాపురం గొడవ?

**మధురం**

అక్కర్లేదులెండి….మీ కెందుకు ఆ గొడవ?….మీదేం పోయింది? అట్లాగే అంటారు….(అని కోపంగా దగ్గరకి వచ్చి) కాళ్ళు చేతులు కట్టి పడేసి రాత్రిళ్ళు పస్తులు పెడితే తెలుస్తుంది మీకు!! రోజూ రాత్రిళ్ళు ఇంటికి వస్తూనే అయినదానికీ కాని దానికీ చెంపదెబ్బలు తింటే తెలుస్తుంది మీకు! అవునా?

**సన్యాసయ్య**

అమ్మా!…తినకుండానే……తెలుస్తుందమ్మా!

**మధురం**

(మెల్లమెల్లగా ఆయన మీదకు పోతూ) కొట్టడంతో ఆగుతాట్టండీ ఈయన! పొట్టలో పొడుస్తాడు… గిచ్చుతాడండీ! మామూలుగా అనుకున్నారా? ఇట్లా చూపుడువేలు బొటనవేలు పెట్టి ఈ పక్కన గట్టిగా పట్టుకుని చిన్నప్పుడు వీధిబడి మాస్టారు తొడపాశం పెట్టినట్టు పెడతాడండీ! ఇట్లా – (అంటూ సన్యాసయ్యను గిచ్చడం మొదలుపెడుతుంది) ఇట్లా…..ఇట్లా….

(ఆమె అట్లా గిచ్చుతుంటే సన్యాసయ్య తెలుగు భాషలో ఉన్న అన్ని అచ్చులను అరుస్తూ ఉంటాడు... ఆ.....ఈ.....ఉ....అప్పుడు వస్తాడు శాంతమూర్తి చేతిలో మరో గ్లాసు పట్టుకుని)

**శాంతమూర్తి**

(సన్యాసయ్య దగ్గరకి వచ్చి) ఇది తాగిచూడండి –

**సన్యాసయ్య**

మళ్ళీ ఇదొకటా? ఇదేమిటి మహాప్రభూ?

**శాంతమూర్తి**

విషం!...ప్రపంచంలో ఉన్న విషసర్పాలన్నింటికన్న ప్రమాదకరమైన పాము విషం!!..తాగవయ్యా!.... అప్పుడుకాని నీ పని తక్కున కుదరదు.

**సన్యాసయ్య**

అయ్యా! మీ మాట నమ్ముతాను.

**మధురం**

(మొగుడితో) నాకు తెలుసు నీ టక్కరి వేషం! (సన్యాసయ్యతో) తాగండి....(అని తాను తెచ్చిన గ్లాసు ఇస్తుంది)

**సన్యాసయ్య**

నాక్కక్కర్లేదండీ..

**శాంతమూర్తి**

ఇది తాగండి.....

**సన్యాసయ్య**

ఒద్దంటుంటే –

**మధురం**

(శాంతమూర్తి గ్లాసు వాసన చూసి) అబ్బా! వాసనే దుర్భరంగా ఉంది!

**శాంతమూర్తి**

(భార్య గ్లాసు చూపిస్తూ) అది వారంరోజుల నాటి గంజి! నాకు తెలియదూ!

**మధురం**

నీకేం తెలుసు? (సన్యాసయ్యతో) ఇది తాగండి.

**శాంతమూర్తి**

ఊహూ...ఇది తాగండి....

**సన్యాసయ్య**

నాక్కక్కర్లేదు.....అక్కర్లేదు......అక్కర్లేదు.....(పెద్ద అరుపునుంచి ఏడుపుదాకా)

**శాంతమూర్తి**

అయ్యో! ఈన మన అతిథి....తాగకపోతే తప్పుకాదూ?

**మధురం**

అతిథిదేవోభవ అన్నారు....

**శాంత,మధురం**

తాగితీరాల్సిందేనండి.....(ఇద్దరూ వాళ్ళవాళ్ళ గ్లాసుల్ని ఆయన నోటి దగ్గరకు తెస్తారు)

**సన్యాసయ్య**

నాకక్కర్లేదు మహాప్రభో.....(అని పళ్ళు కరుచుకుంటాడు గట్టిగా)

**శాంతమూర్తి**

మీరు పళ్ళు కరుచుకుంటే నోరు తెరిపించడం మాకు చేతకాదనా? (అని గట్టిగా బుగ్గలు నొక్కుతాడు. ఆ....ఆ....అంటూ ఉంటాడు సన్యాసయ్య)

**మధురం**

అట్లా పసిపిల్లవాడికి ఆముదం పోసినట్టు పోస్తావ్....

**శాంతమూర్తి**

నువ్వు కోడిపెట్టకి వడ్లగింజలు తినిపించినట్టు తినిపిస్తున్నావ్!

**మధురం**

నువ్వు గేదెకు గడ్డి పెట్టినట్టు పెడుతున్నావ్!

**శాంతమూర్తి**

నువ్వు మేకకి ఆకులు పెట్టినట్టు పెడుతున్నావ్!

**మధురం**

మాటలు మితిమీరి వస్తున్నాయ్!

**శాంతమూర్తి**

నువ్వంటే ఊరుకునేవాళ్ళెవరూ లేరిక్కడ?

**మధురం**

గాడిదలాగా గయ్‌గయ్‌న పడితే మాట్లాడలేదని లెక్క –

**శాంతమూర్తి**

నువ్వే గాడిదవి! నక్కవి, పిల్లివి......చెవుల పిల్లివి –

**మధురం**

గాడిదా! ఇదుగో (అని చేతిలో ఉన్న గ్లాసులో ఉన్న షర్బతు అతని మీద విసురుతుంది....అది సన్యాసయ్య మీద పడుతుంది)

**సన్యాసయ్య**

ఓ.....

**మధురం**

అయ్యో! చూడలేదు...క్షమించాలి.....మీ మీద పడుతుందనుకోలేదు.....

**శాంతమూర్తి**

గుడ్డిపక్షి....చూడలేదు...క్షమించాలి.....పెద్దమనిషి మీద అట్లా పోస్తే నేనూరుకుంటానా? (అని తాను పోస్తాడు...కావాలని సన్యాసయ్య వైపు)

**సన్యాసయ్య**

అయ్యో......అయ్యో........

**మధురం**

(కోపంతో) నేనేం చేస్తే అది చెయ్యడం కాదు....మగాడి వైతే పౌరుషం ఉన్న పని చెయ్యి –

**శాంతమూర్తి**

ఇందాక సరిగ్గా గురి చూడలేదు....ఇప్పుడు చూస్తాగా.......ఈ సారిగా గురి తప్పదు.....(అంటూ జేబులోంచి రివాల్వర్ తీస్తాడు) ఇప్పుడు చూడు....అంటూ మధురం మీదికి గురిపెడతాడు.

**మధురం**

అమ్మో! రక్షించండి....రక్షించండి...(అని సన్యాసయ్య వెనకకి వెళ్ళి దాక్కుంటుంది)

**శాంతమూర్తి**

ఇవ్వాళతో నీ పీడ వదిలిపోవాలి....

(శాంతమూర్తి మధురంని కాల్చాలని అలంగం తిరుగుతూ వుంటాడు....సన్యాసయ్యని పట్టుకుని అతని వెనక దాక్కుని మధురం.....స్టేజీ అంతా తిరుగుతుంది)

**సన్యాసయ్య**

నన్ను ఒదిలిపెట్టు....ఇహచాలు....నన్ను వదలండి.....

**శాంతమూర్తి**

కదలకండి....అడ్డం లేవయ్యా –

**మధురం**

వద్దు వద్దు.....అడ్డం లేవద్దు.......

**శాంతమూర్తి**

తరువాత అనుకుని ప్రయోజనం లేదు...నేను పిస్తోలు పేల్చబోతున్నాను అడ్డులేవండి.....

**మధురం**

అక్కడే నిలబడండి...తప్పుకుంటే కాల్చి పారేస్తాడు...రక్షించండి...ఎట్లా గయినా నా ప్రాణాలు తియ్యడానికి చూస్తున్నాడు....

**శాంతమూర్తి**

అడ్డం లేవరన్నమాట! మీ దురదృష్టం....ముందు వాళ్ళని కాలిస్తే కాని వెనక ఉన్నవాళ్ళు బయట పడరు.....

**సన్యాసయ్య**

అమ్మా! దయదలచి నన్ను వదలిపెట్టండి...ఇంకా నాలుగు రోజులు బతకాలని ఉంది నాకు.....ఇవ్వాళ లేచి ఎవరి మొహం చూశానో –

**మధురం**

ఆ! నాకో గొప్ప ఆలోచన వచ్చింది....(అని లైట్లు ఆపి) ఆ! ఇప్పుడు కాల్చు ఎట్లా కాలుస్తావో!

(స్టేజీ, ఆడిటోరియం – రెండూ చీకటిలో ఉన్నాయి....మాటలు, విసిరిన వస్తువుల తాలూకా చప్పుళ్ళు వినిపిస్తున్నాయి.)

**మధురం**

నన్ను చంపుతావు కదూ! ఈ దెబ్బరుచిచూడు.....

(దెబ్బ కొట్టిన చప్పుడు)

**సన్యాసయ్య**

అమ్మో! కొట్టింది నన్నమ్మో!

**శాంతమూర్తి**

ఇది కాచుకో –

**సన్యాసయ్య**

అమ్మో! నన్ను కొడతారేమర్రో?

**మధురం**

రాక్షసుడా! (మళ్ళీ దెబ్బ)

**శాంతమూర్తి**

దున్నపోతా!

(ప్రతి దెబ్బా సన్యాసయ్యకే తగులుతుండడం వల్ల అబ్బో, అయ్యో, అమ్మో – అంటూ గోలపెడతాడు)

**మధురం**

నీ రోగం కుదురుస్తాను ఆగు....ఇదుగో పిండి దెబ్బ (కుమ్మరించిన చప్పుడు)

**శాంతమూర్తి**

ఇదుగో కారం దెబ్బ!

**సన్యాసయ్య**

అయ్య! ఇది మీకు న్యాయం కాదు....చీకట్లో కట్టి పడేసి వంటిట్లో వస్తువులన్నీ నా మీద పొయ్యడం భావ్యం కాదు.

**శాంతమూర్తి**

నువ్వాగవయ్యా! దీని పని చెబుతా – దాని సామాన్లన్నీ దాచుకుంది కదూ! బీరువాలో! అది ఇవ్వాళ స్మాష్...

**మధురం**

దాన్ని ముట్టుకుంటే పిచ్చికుక్కను కరిచినట్లు కరుస్తాను......

(శాంతమూర్తి, మధురం ఇద్దరూ అటు ఇటూ పరిగెత్తుతారు)

**సన్యాసయ్య**

అయ్యో! అయ్యో! నా మోహం మీద నుంచి పరిగెత్తుతున్నారండి....

**శాంతమూర్తి**

భడవాకానా నిన్ను పట్టుకుని చితకకొడితే కాని –

**మధురం**

పట్టుకున్నప్పుడు కదా!

**శాంతమూర్తి**

పిల్లిలా పరిగెత్తడం చాతనవును –

**మధురం**

నక్కలా పీక్కుతినడం నాకు చేతకాదు –

(పరుగెత్తుతూ సన్యాసయ్యని తన్నుతూ వుంటారు)

(సన్యాసయ్య అయ్యో ఊరుకోండరా మీకేం పోయే కాలంరా – ఎరక్కపోయి వచ్చాన్రా దేవుడా – అంటూ ఏడుస్తూ ఉంటాడు)

**శాంతమూర్తి**

ఇహ ఇవాళ నీ అయుష్షు మూడినట్టే – నడు – నువ్వు ఎక్కడనక్కినా నిన్ను కాల్చకవదలను – కదలకు...

(అంటూ లైటు వేస్తాడు)

(సన్యాసయ్య ఓ మూలగా నక్కి వుంటాడు. శాంతమూర్తి బయటకు లాగుతాడు మెడబెట్టి. ఆయన వెనకాల దాక్కున్న మధురం పరిగెత్తుతుంది. సన్యాసయ్యని తన్నుకుంటూ....రెండో వైపునుంచి తన్నుకుంటూ శాంతమూర్తి. ఒకరిని ఒకరు తరుముతూ తెరలోకి వెడతారు...తల ఎత్తే సరికి సన్యాసయ్య ఒంటినిండా పిండి, కారం.....రకరకాల రంగులు. కళ్ళు కనిపించవు...ఆపసోపాలు పడుతూ లేచికూర్చుని)

**సన్యాసయ్య**

ఈ రాక్షసుల చేతుల్లో పడ్డానేమిట్రా దేవుడా? (మెల్లగా లేవబోతుంటే కిందపిండి నున్నగా ఉండడం వల్ల దానిలో జారి పడతాడు.....వెళ్ళబోతూ ఉండగా)

**శాంతమూర్తి**

(తెరలో లోపలనించి తొంగి చూస్తూ) వెళ్ళకండి సన్యాసయ్యగారు మంచిపెసరట్టు, ఉప్మా –

**మధురం**

ఆ తరువాత అమృతం లాంటి కాఫీ – వెళ్ళకండి....

(సన్యాసయ్య 'బాబోయ్' అంటూ ఒక్క పరుగున నిష్క్రమణ)

Q Q Q

# చిన్నలు: పెద్దలు

ఓ హైస్కూలులో ఓ మాస్టారుగది. విశాల మైన గదిలో ఎదురుగా కనిపించే కిటికీలోంచి వెనుకవైపు తోట, ఆటస్థలం కనిపిస్తయ్. కిటికీకి ప్రక్కనే బయటనుంచి ప్రవేశానికి ఓ ద్వారం వుంది. మరోప్రక్కన వెయిటింగ్ రూమ్‌కు పోయేందుకు ద్వారం. గదిలో పుస్తకాల షెల్ఫు, కొన్ని పటాలు, ఓ టేబిలు, మూడు కుర్చీలు; టేబిలు మీద చిందర వందరగా కాగితాలు – మాస్టరు, పాత విద్యార్థి బయటి నుంచి ప్రవేశిస్తారు:

మాస్ట: నీకీ గది జ్ఞాపకం ఉందా?

పాత: (ఉత్సాహంతో) జ్ఞాపకమా? – అంతా నిన్న చూసినట్లుగా ఉంది! (షెల్ఫు చూపుతూ) ఆ పుస్తకాలు – (వాటిని పరిక్షిస్తూ) వీటి పేర్లు కూడా నేను మరచిపోలేదు. (గోడవైపు తిరిగి ఈ ఫొటోలు – ఆ పాత గడియారం.

మాస్ట: గడియారం ఇప్పుడు సరిగ్గా పనిచెయ్యడం లేదు.

పాత: (తన మామూలు ధోరణిలో) ఈ కిటికీలో నుంచి కనిపించే ప్రకృతి దృశ్యాలు! (చూస్తూ) ఒకే వరుసలో వున్న ఆ కొబ్బరి చెట్లు – ఓ! ఇవన్నీ చూస్తూ యిలా నిలబడితే అన్నమూ, నీళ్లు అక్కర లేదు.

మాస్ట: (తనూ అటే వచ్చి చూపిస్తూ) టెన్నస్ కోర్టు వేయించాం.

పాత: అలాగా! (మళ్ళీ గదిలో పచార్లు చేస్తూ) ఈ గదిలో ఇట్లా వుండడం ఎంత హాయిగా వుంది? ఎంత ప్రశాంతంత? సాధారణంగా ఏ బడిలోనూ కనిపించనిది! కాని ఆ హాస్టలు చూడండి; ఇప్పటికీ అలాగే వుంది. ఆ చచ్చిపోతున్న గోడలూ, సున్నం చెరిగిపోయి లోపలనుంచి, వెక్కిరిస్తున్నట్లు కనిపిస్తున్న రాళ్ళు – చూస్తే, పెరుగుతున్న పిల్లలకు నాగరికమైన నివాసాల దృష్టి ఏర్పడడం అసాధ్యంలా కనిపిస్తున్నది – (గదిలో ఓ మూల చూస్తూ) మీ యమధర్మరాజు గారు ఏడండీ?

మాస్ట: ప్రస్తుతం ఆ మూల వుండడం లేదు. దానితో కోపాలు, పోట్లాటలు ఎక్కువైనై.

పాత: అవును....విన్నాను.

మాస్ట: అది యిప్పుడు సాధారణంగా బయటకు రావడం లేదు – ఎప్పుడో పెద్ద శిక్షలకు తప్ప – వచ్చినప్పుడు మాత్రం వుపయోగించడం లేదన్న కోపాన్నంతా అప్పుడే వెళ్ళగక్కుతుంది. (అంటూ షెల్ఫు పైన వున్న పేము బెత్తాన్ని తీస్తాడు)

పాత: ఏదీ! ఒక్కసారి చూడనివ్వండి. (తీసుకుని) అరె! ఇది కూడా మరలేదే?

మాస్ట: పొరపాటు పడ్డావ్! నువ్వు వెళ్ళిన తర్వాత ఇది 'అయిదోదో, అరోదో'.

పాత: దానికి కూడా పతనం ఉన్నదన్నమాట.

మాస్ట: 'ప్రతి వస్తువూ పతనం కాకతప్పదు' అన్న మాత్రానికి బెత్తం కూడా తలవంచవలసిందే!

పాత: ఇదీ అచ్చంగా పాతదానిలానే వుంది. (అటూ ఇటూ విసిరి) అదే మోత! దీన్ని చూస్తుంటే ఆ రోజులన్నీ నిన్న జరిగినట్లుగా వున్నయ్.

మాస్ట: నీకు ఒక్క అనుభవమైనా జ్ఞాపకం ఉందా?

పాత: కొన్ని వందలు! ఆ రోజుల్లో ఎంత అల్లరి చేసేవాణ్ణి! నా ప్రవర్తన ఎంత అపవస్యంగా, అసహ్యకరంగా ఉండేది!..మీకు ఎంత కష్టాన్ని కలిగించాను!..మీరు నన్ను గురించి ఏమనుకునేవాళ్లు?

మాస్ట: చాల మంచివాణ్ణనుకునేవాణ్ణి.

పాత: ఇప్పుడు – పోనీ పాతవాళ్ళు? హెడ్ మాస్టరుగారు?

మాస్ట: హెడ్‌మాస్టరుగారు ఉద్యోగం వదులుకున్నారు తెలుసా?

పాత: రిటైర్ అయ్యారా?

మాస్ట: వాళ్ళు ఎక్స్‌టెన్ షన్ ఇస్తానన్నారు. కాని క్రిందటేడు ఆయన కళ్ళు ఆపరేట్ చేశారు. అప్పటినుంచీ ఆయనకు కులాసా లేదు.

పాత: పాపం, అలాగా! ఇక్కడే వుంటున్నారా?

మాస్ట: ఆ! అట్లా వున్నా ఇప్పటికీ యింకా స్కూలుకు వస్తూనే వున్నారు. స్కూలు వ్యవహారాల్లో ఆయన ఇంకా జోక్యం వుంది...రోజూ ఈ పాటికి వచ్చేవారే, ఇవాళ్యా రావాలి.

పాత: చాలా మంచివారు – వేదాంతి కూడా కదూ? మాకు, పాఠం మధ్యలో ఆపేసి, గంటల తరబడి బైబిలు గురించి, భగవద్గీత గురించి వుపన్యాసం యిచ్చేవారు.

మాస్ట: ఇంకా యిప్పటికీ అంత దృఢంగానూ ఉన్నారు...నేనప్పుడే ముసలివాణ్ణయిపోతున్నాను.

పాత: మీరా? అప్పుడేనా? హెడ్‌మాస్టరిలో వృద్యాప్యం వచ్చినకొద్దీ హుషారు హెచ్చింది...ప్రతి మనిషినీ ఎంత చక్కగా అర్థం చేసుకొనేవారు! మేము వేసం కాలం సెలవులకు ఇళ్ళకు వెళ్ళబోయేముందు ప్రతి వాళ్ళనూ పిలిచి పరామర్శించి పంపేవారు.. నేనూ వెళ్ళాను. 'చూడు రాజా! నువ్వీ సంవత్సరం వృధాగా కాలం వెళ్ళబుచ్చినందుకు జీవితాంతం విచారిస్తావ్!' అన్నారు.

మాస్ట: ఆ మాట అక్షరాలా నిజమయిందా?

పాత: నేను దాని విషయం చాలా రోజులు మరిచిపోయాను. కాని చాలా కాలం తర్వాత, నేను నా మనసులోని భావాలను బయటకు వెళ్ళబుచ్చాలన్న కాంక్ష, వచ్చినప్పుడు – నాకు తెలిసింది నా అసమర్ధతకు కారణం.

మాస్ట: ఏమిటది?

పాత: నాకు బావాలు ఉన్నవి కాని భాష లేదు. ఆ రోజుల్లో తెలుగు క్లాసులకు వేటికీ రానిలోటు నా కిప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నది. దానికోసం నిజంగా నేను జీవితాంతం విచారించవలసి వచ్చింది.

మాస్ట: గతించిన జీవితాలను గురించి – అందులోనూ విద్యార్థి జీవితాన్ని గురించి – విచారించని వాళ్ళు వుండరు. ప్రతివాళ్ళు ఏదోవిధంగా తప్పటడుకు వేసినవాళ్ళే! నేను చదువుకునే నాటి రోజులు తీసుకో –

పాత: కాని ఆ రోజులే గొప్పవి! ఆ జీవితం ఎన్ని మధుర స్మృతులనిస్తుంది? పోట్లాటలు, ఇంతలో మళ్ళీ స్నేహం! బాధపెట్టే స్మృతుల్లో కూడా ఆనందం లేకపోలేదని నా వుద్దేశ్యం. ఉదాహరణకి ఈ బెత్తం చూడండి.

మాస్ట: (చిరునవ్వుతో) దాని నుంచి నువ్వు తప్పించుకోలేవు సుమా!

పాత: తప్పించుకోవాలని నాకు కూడా లేదు..దాన్ని..చూస్తుంటే, అన్ని బాధలకూ తార్కాణంగా మిగిలివున్న

చిహ్నంలా వుంది. కాని అది చాలా మందికి కష్టాన్ని కూడా కలిగించింది –

మాస్ట: నాకు కావలసింది అదే!

పాత: అంటే, బాధ హృదయానికి కాదు. శరీరానికి మాత్రమే! ఆ దృశ్యం ఇప్పటికీ నా కళ్ళకు కట్టినట్లుగా వుంది – భయం భయంగా నేను తలుపు తట్టడం..."లోపలకురా" భరించలేని నిశ్శబ్దం. నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ నా భయపడే గొంతుక...."నన్ను పిలింపించరా మాస్టారూ" 'ఎందుకు పిలిపించానో నీకు తెలియదూ?"..మళ్ళీ నిశ్శబ్దం. "క్రిందటి సారి నీకేం చెప్పానో జ్ఞాపకం ఉందా?" "......"...."ఇంకంటే బాగుపడడం నీకు యిష్టం లేదా?"....."నాకేం తెలుసునండీ" అనేవాణ్ణి నేను –

మాస్ట: (నవ్వుతూ) అవునవును...అంతే!

పాత: "సరే! నువ్వు చెప్పిన తప్పుకు శిక్ష ఏమిటో నీకు తెలుసుకదా? నీకు చాలాసార్లు చెప్పి చూశాను మాటలతో నీకు బుద్ధి రాదని తేలిపోయింది. నీకు శిక్ష నాలుగు దెబ్బలు. మరోసారి కూడా ఇటువంటి పనే చేశావో ఆరు – ఊ ఈ కుర్చీ మీదుగా వుంగు –" ఈ కుర్చీనే! అవునా?

(అవునని తల వూపుతాడు మాస్టరు)

నేను ఇలా వండేవాణ్ణి (అలా చేస్తాడు) మళ్ళీ నిశ్శబ్దం...భరించలేని దీర్ఘమైన నిశ్శబ్దం. అప్పుడు –

మాస్ట: పోనిద్దూ, అప్పటి సంగతి యిప్పుడెందుకు? దాన్ని అక్కడే వదిలేద్దాం?

పాత: అబ్బే! ఇది క్లైమాక్సు సీనండీ! ఎలా వదిలి పెడతాం? ఆ తరువాత, అంతా అయిపోయిన తర్వాత, నాకోసం ఆతృతతో వుత్సాహంతో వేచివున్న ఆశేషమైన, ప్రజానీకం...నన్ను ఎలా సత్కరించాలలో కావాలి వాళ్లకు. అప్పుడు చెప్పకపోతే మర్నాడు స్నానం చేసేటప్పుడయినా ఆ సత్కారం తాలూకు మిగిలిన చిహ్నాల కోసం వీపు వెదుకుతారు.....(మళ్ళీ ప్రపంచంలోకి వచ్చి) ఇన్ని జరిగినా, ఆ జ్ఞాపకాలే ఆనందమయంగా వుంటయ్..

(మాస్టరు చేతి గడియారం చూసుకుంటారు)

పాత: మిమ్మల్ని విసిగించడం లేదు కదా?

మాస్ట: అబ్బే! కాని నువ్వు కొంచెంసేపు పక్కరూములోకి పోవాలి...శిక్ష తీసుకోవలసిన ఓ కుర్రాడు ఇప్పుడు వస్తాడు.

పాత: ఏం చేశాడతను?

మాస్ట: నువ్వు చేసిన తప్పులే?

పాత: మిగిలిన మాస్టర్లు రిపోర్టు ఇచ్చారా?

మాస్ట: ఈ టరమ్‌లో, ఇది ఐదోది! వట్టి కోతి – నన్ను ఇంతగా విసిగించినా కుర్రాడింతవరకు లేడు.

పాత: అతన్నేం చేస్తారిప్పుడు?

మాస్ట: నువ్వు ఎప్పుడూ కావలసిన విషయాలకన్నా ఎక్కువ తెలుసుకుంటావెందుకు? విజిటర్స్ రూమ్‌లోకి వెళ్ళి క్షణం కూర్చో....దోవ జ్ఞాపకం ఉందా?

(విజిటర్స్ రూము తలుపు తీయడానికి వెడతాడు)

పాత: (చప్పున) వద్దండి...నన్నిక్కడ దాక్కోనివ్వండి.

మాస్ట: (ఆశ్చర్యంతో) దాక్కుంటావా?

పాత: అవును...ఈ ఒక్క ప్రార్థన -

మాస్ట: కాని అది బావుంటుందా?

పాత: నేనిక్కడ వున్నానని అతనికి తెలియదుగా?

మాస్ట: (అయిష్టంగానే, గడియారం చూసుకుంటూ) సరే!

పాత: థాంక్స్...మీ మేలు ఎన్నడూ మరువలేను.

(ప్రక్కనే తలుపు పక్కన వున్న కర్టెన్ వెనుక దాక్కుంటాడు)

(తలుపు చప్పుడు)

మాస్ట: లోపలకు రా!

(బయటినుంచి ఓ కుర్రాడు వస్తాడు. వయస్సు పదమూడు, పధ్నాలుగేళ్ళు వుంటాయి)

విద్యా: నన్ను పిలిపించారా మాస్టారు?

మాస్ట: ఎందుకు పిలిపించానో నీకు తెలియదూ?

(అర్థంకాని తోలుబొమ్మ మొహం పెడతాడు కుర్రాడు)

రాం! కైలాసరావుగారి దగ్గరనుంచి నాకు మరో రిపోర్టు వచ్చింది. నీకు క్రిందటి సారి ఏం చెప్పానో జ్ఞాపం ఉందా?

(జవాబు చెప్పడు)

జ్ఞాపకం ఉందా?

విద్యా: (రహస్యంగా మాట్లాడుతున్నట్టు) ఉందండి?

మాస్ట: ఇంతకంటె బాగుపడడం నీకేం యిష్టంలేదా?

విద్యా: నాకేం తెలుసునండీ?

మాస్ట: సరే! నువ్వు చేసిన తప్పుకు శిక్ష ఏమిటో తెలుసు కదూ? నీకు చాలా సార్లు చెప్పి చూశాను. నీకు మాటలతో బుద్ధిరాదని తేలిపోయింది. నీకు శిక్ష - (పాత విద్యార్థి దాక్కున్న వైపుకు చూస్తూ) నాలుగు దెబ్బలు - మరోసారి ఇటువంటి పని చేశావో, ఆరు - కుర్చీమీదుగా వంగు -

(కొట్టడానికి బెత్తం తీసుకుంటాడు - కుర్రవాడు తన కెంతో అనుభవం వున్నట్లుగా కుర్చీమీదకు వంగుతాడు. పాత విద్యార్థి తెరచాటునుంచి తొంగి చూసి, మాస్టరు బెత్తం ఎత్తిన సమయానికి 'మాస్టరు!' అని వారిస్తూ వాళ్ల మధ్యకు వచ్చి నిలబడతాడు)

పాత: చాలా అదృష్టవంతుడివోయ్! నేనే నువ్వైతే ఎంత బావుణ్ణు? (మాస్టారు కోపతో అతని వైపు తిరుగుతాడు) పొరపాటు మాస్టారూ! నేను బయటకు రాకుండా వుండలేకపోయాను..నీ పేరేమిటి? రామం. రామ్! నువ్వు ఎంత అదృష్టవంతుడివో నీకు తెలియదు. నా మాటలు నమ్ము....నేను ఇవన్నీ అనుభవించినవాడినే! నేను ఈ స్కూలు పాత విద్యార్థిని. ఇక్కడ ఏడు సంవత్సరాలు చదివాను. నువ్వున్న పరిస్థితుల్లో నేను కొన్ని వందలసార్లు వున్నాను. ఆ కుర్చీమీదగానే వంగి, భూదేవిని నేనెన్నిసార్లు ప్రార్థించానో, నన్ను కూడా తనలో చేర్చుకోమని! ఆ రోజులు! ఎంత హాయిగా గడిచేవి? ముసలితనాన్నుంచి పడుచుతనానికి రావడంకోసం తన ఆత్మను అమ్ముకున్న వేదాంతిలా నేను కూడా ఒక సారి చిన్నవాడినై, ఇక్కడకు వచ్చి, పిల్లలతో కలిసి ఆటలాడుతూ, హాస్టలులో వుడికీ, వుడకని తిండి తింటూ, అర్థం లేని పుస్తకాలు

చదువుతూ, అల్లరి చేస్తూ; ఇలా కుర్చీ మీదకు వంగి దెబ్బలు తింటూ, ప్రతి రోజూ – అట్లాగే వుంటే ఎంత ఆనందం? కాని నాకు ఆ అదృష్టం లేదు. ఆ రోజులు మళ్ళీ రావు. ఆ జీవితాన్ని నేనిక అనుభవించలేను. అందువల్లనే నువ్వు అదృష్టవంతుడివి....చాలా –

మాస్ట: నువ్వు వెళ్ళొచ్చు, రాం –

విద్యా: (సంతోషంతో) అలాగే సార్!

(త్వరగా వెళ్ళిపోతాడు. కొంచెం సేపు నిశ్శబ్దం)

పాత: (తలఎత్తి) క్షమించండి మాస్టారు! నేను మాట్లాడకుండా వుండలేకపొయ్యాను. నేను చేసింది తప్పే! కాని నా ఆవేశాన్ని ఆపుకోలేకపోయాను. నేను చేసింది క్షమించరాని నేరం.

మాస్ట: (ఎంతో నిగ్రహంతో) నిన్ను నేను తేలిగ్గా క్షమించగలను..ఇంకా నువ్వు చిన్నవాడివి.

పాత: (ఆశ్చర్యంతో) చిన్నవాడినా?

మాస్ట: అవును..చాలా చిన్నవాడివి.

పాత: మీరు నిజంగా అంటున్నారా? (అవునని తలూపుతాడు మాస్టారు) నేను చేసిన తప్పుకు చిన్నవాణ్ణన్న సాకుతో క్షమాపణ కోరలేను...నేను చిన్నవాణ్ణి తెలియక కాదు బయటకు వచ్చింది. మీకు చెప్పానుగా ఆవేశం నన్నలా దాచి వుంచలేకపోయింది.

మాస్ట: అవునవును....చెప్పావ్!

పాత: మీరర్థం చేసుకోలేరా నన్ను? – మీరు – మీరు ఉపాధ్యాయులు...నా వంటి వాళ్ళను అనేకులు చూసివుంటారు..ఇక్కడ మరోక్షణంవుంటే నాకు పిచ్చి ఎక్కేటట్లుగా వుంది...కాని ఆ రోజుల్ని, ఆ ఆనందాన్ని ఎలా మరిచిపోవడం?

మాస్ట: ఉపాధ్యాయుల సంగతి బాగానే చెప్పావ్! కాని నువ్వట్లా మాటిమాటికి "ఆ ఆనందం, ఆ సంతోషం, ఆ రోజులు" అంటూ వుంటే నేను వినలేను.

పాత: వినలేకపోవచ్చు. కాని అది నిజం!

(మాస్టరు నవ్వుతాడు)

పాత: నువ్వుతాన్నారా? బహుశః మీ స్కూలు జీవితం మీకు ఉత్సాహంగా వుండి వుండదు.

మాస్ట: చాలా బావుండేది.

పాత: మిర? ఓ! దేన్ని గురించి చెడుగా వూహించుకుంటున్నారు మీరు! మీ వయస్సు వచ్చేవరకు నేను కూడా అంతే! కాని మీరు ఇప్పుడూ అంత సంతోషంగా వున్నారని చెప్పగలరా?

మాస్ట: అంటే, నువ్వు ఇదివరకు వున్నంత హాయిగా ఇప్పుడు లేవా?

పాత: లేను, లేను.....మీకు తెలిసివుంటే?

మాస్ట: ఆ! తెలిసివుంటే..

పాత: ప్రతి మనషి ఏదో విషయాలు ఊహించుకొని బాధపడతాడు. నేనూ అటువంటి వాణ్ణే! ప్రతి మనిషికీ ఆశలూ, ఆశయాలు ఏవో వుంటయ్.......నాకూ అంతే! నేను మిగిలిన వాళ్ళకంటె బలహీనుణ్ణి కావచ్చు; అంతమాత్రాన ప్రపంచం నన్ను పూర్తిగా వెలివెయ్యవలసిందేనా?

(మాస్టర్ సిగరెట్ ముట్టిస్తారు)

ప్రతి విద్యార్థి స్కూలు వదిలే ముందు ఎంతో హాయిగా, భవిష్యత్తు మీద ఆశతో వుంటాడు. అమాయకత్వంతో జీవితం మొదలు పెడతాడు. ప్రపంచమంతా ఆనంద నిలయంలా కనిపిస్తుంది మొదట...కాని త్వరలో తెలుసుకుంటాడు. అది కేవలం 'భ్రమ' అని – తాను ఎందుకు పనికి రాని వాడని, సంఘానికి వేస్టుపేపరునని – ప్రతకటం దేనికన్న ప్రశ్నే బయలుదేరుతుంది. జీవితంలో వున్న ఆశలూ, ఆశయాలూ అన్నీ అంతరిస్తయ్! అదీ ప్రపంచం నాకు చేసిపెట్టిన సహాయం! నాలో మానవత్వాన్ని మంట గలిపింది. ఆశయాలను అణగద్రొక్కింది. ఇదీ ప్రపంచం నాకు చేసిన సహాయం! ఈ ప్రపంచమంటే నాకు అసహ్యం! పరమ అసహ్యం!! నాకు మనుషులన్నా, మమతలన్నా ద్వేషం రగులుతోంది –

మాస్ట: అందని మనిపళ్ళు వగరేమో?

పాత: నిజం మాస్టారు! నాకు శాంతి కావాలి. అంతటా గాలించాను. ఎక్కడా దొరకలేదు. కొద్దికాలం క్రితమే జరిగిన అనుభవాల జ్ఞాపకాలు ప్రాణాలను తినివేస్తుంటే, నాకు చివరకు జరిగిన విషయాలను స్మృతికి తెచ్చుకుని, మనస్సును శాంతిపరుచుకోవడం –

మాస్ట: నిజం, నిజం.

పాత: నాకు జీవితం మీద విరక్తి పట్టలేదు. యాత్రలు చేస్తే శాంతి దొరుకుతుందనుకున్నాను. అది దొరక్కపోగా, ఇంకా మనోవ్యథ ఎక్కువైంది. ప్రపంచాన్ని చూసిన కొద్దీ బ్రతుకుదామన్న ఆశ అంతరించింది. నేను బ్రతికితే ఒకే ఒక్క వ్యక్తికోసం –

మాస్ట: (అర్థమైనట్లుగా) ఓ!

పాత: చిరకు......తప్పక.....ఆ ఆశా వదులుకున్నాను. అట్లా వదులుకోవలసి వచ్చింది. (భావాలతో వ్యక్తీకరించలేక మూగబాధ పడతాడు)

మాస్ట: అప్పుడు నీకు వెనకటి స్కూలు జ్ఞాపకం వచ్చిందన్నమాట.

పాత: అవును..అకస్మాత్తుగా జ్ఞాపకం వచ్చింది – స్మృతి తప్పినవాడికి సంజీవిలా – ఈ గది, ఆ తోట, ఆ పుస్తకాలు, అన్నీ – మళ్ళీ నాకు కొంచెం వూరట కలిగించినయ్. కాని ఏ లాభం? అవే నన్ను బాధపెడుతున్నాయ్. ఆ అడ్డంకులు ఎరుగని పిల్లలు! నేను కూడా వాళ్ళలో ఒకణ్ణై పోతే – (చేతుల్లో ముఖం దాచుకుంటాడు – మాస్టరు కొంచెం అసహనంతో బుజాలు కుదిస్తాడు)

పాత: ఏ మనిషికైనా ఇంత బాధ వుంటుందని నేను కలలో కూడా అనుకోలేదు. జీవితంలో ప్రవేశించడం అంటే సంతోషానికి నిచ్చెన వేశాననుకున్నాను. (వ్యంగ్యంగా నవ్వుతూ) నేను ఇవన్నీ చెప్పి మిమ్మల్ని బాధ పెడుతున్నానా? కాని హృదయంలో బాధలు మరొకరికి చెప్పుకుంటే, ప్రాణం తేలిక పడుతుంది....నేను కలలు కన్నాను, కవిత్వం వ్రాశాను, ఆమెను గురించి –ఆమె అందం, తెలివి తేటలు – అదంతా ఓ కల! నేను మళ్ళీ ఆమెను చూడలేదు. ఆమె జీవితంలోనుంచి నేను నిష్క్రమించాలి...ఆమెను కాస్తున్న కత్తుల పహారాలోంచి నిస్సహాయంగా నా వైపు చూచినప్పుడు నా అసహాయత అసమర్థత తెలిసివచ్చాయ్...జీవించడం వృధా అనిపించింది. నేనెంత బాధ పడ్డానో, పడుతున్నానో ప్రపంచానికి తెలియదు.

(కుర్చీలో కూర్చుంటాడు. రెండు క్షణాలసేపు నిశ్శబ్దం. ప్రతి క్షణానికీ మాస్టరు ముఖ కవళికలు మారుతూ వుంటయ్. చివరకు పెద్దగా నవ్వుతాడు. పాత విద్యార్థికిదేమీ అర్థం కాదు.)

మాస్టర్: (బాధ అణుచుకుంటూ) అర్థం లేని మాటలు చాలా చెప్పావ్! నువ్వెంత బాధపడుతున్నావో ప్రపంచానికి తెలియదా! కొన్ని లక్షలమందికి తెలుసు..అందకా ఎందుకు? నాకు తెలుసు!

(పాత విద్యార్థి ఆశ్చర్యంగా చూస్తాడు.

ఇప్పుడు నేను చెప్పవలసినవి కూడా రెండు మాటలు వున్నయ్.

పాత: ఏమిటవి?

మాస్టర్: నువు చాలా అదృష్టవంతుడివి. చాలా –

పాత: నేనా? అంటే ?

మాస్టర్: అర్థం కాలేదా? ఇందాక మరో పరిస్థితిలో నువ్వు రామానికి చెప్పిన హితమే! పరిస్థితులు మారినయ్, మనుషులు మారారు. అంతే!

పాత: దానికీ, దీనికి సంబంధం ఏమిటో నాకేమీ అర్థం కావడం లేదు.

మాస్టర్: సంబంధం లేకపోవచ్చు. కాని నువ్వు రామాన్ని చూసి అసూయపడడానికి అవకాశం లేదు. నిన్ను చూసి నేను అసూయపడడానికి నాకు అన్నీ అవకాశాలే!

పాత: (మాట్లాడడేకపోతాడు) మీరా! మీరు! –

మాస్టర్: ఏం? అర్థం కాలేదా? కాని, నీ వయసులో వున్నప్పుడు నేను నీకంటె తెలివిగలవాణ్ణి కాదు...నిన్ను ఇంతకంటె బాగుచెయ్యడం కూడా అనవసరమే! ఇందాక వేదాంతిని గురించి మాట్లాడావ్! ఆ వేదాంతి నీ మాదిరిగా యువకుడుగా మారాలని చేశాడు. చదువుకునే రోజులు అర్థం లేనవి. ఒకరినొకరు అర్థం చేసుకోలేని ఆ రోజుల్లో సుఖమేమిటి? జరిగిపోయిన ప్రతిదీ మనకు బావుంటుంది కాబట్టి ప్రతివాళ్ళూ పొగుడుతున్నారు. నిజానికి కోరవలసింది యవ్వనం.

పాత: కాని ఈ వయసులో నేను పడుతున్న బాధలు చూస్తే, ఈ విధంగా జీవితాన్ని మరోక్షణం గడపలేననిపిస్తుంది.

మాస్టర్: రామం అంతే! అతను పడుతున్న బాధలను మార్చావ్! నీ బాధల్ని అనుభవాల క్రింద మార్చావ్! నీ బాధల్ని నేనూ అంతే! నేనూ ఆ బాధలన్నీ పడ్డాను. బాణంలా వంగిన ప్రేయసి కనుబొమ్మల మీద నేను పద్యాలు వ్రాశాను. గాలిలో మేడలు కట్టాను. అవి బుడగలా, క్షణంలో హరించిపోవడం చూశాను. ఆత్మహత్యా ప్రయత్నం నిరంతరం నన్ను వేధించింది. మళ్ళీ ఎక్కడో వెలుగు; బ్రతకాలని ఆశ! మళ్ళీ నిస్పృమ, నిరాశ! అలా ఆశా నిరాశల మధ్య అల్లీ బిల్లీ తిరిగాను. చివరకు మిగిలేది ఆనందానిచ్చే గతించిన, బాధాకరమైన స్మృతులు!

పాత: (లేస్తూ) నిజం! బాధల్లో మాత్రం ఆనందం లేదా?

మాస్టర్: కాని ఆ రోజులే నా జీవితంలో నిజంగా హాయిగా వున్నవి.

పాత: నిజం?

మాస్టర్: చూడడానికి అబద్ధంగానే ఉంటుంది. కాని నా మాటలన్నీ అప్పుడే నమ్మలేవు. నేనూ నీ వయసులో అంతే!

పాత: నిజంగా మీరు సుఖంగా లేరా?

మాస్టర్: నిజం చెప్పాలంటే అంతే మరి?

పాత: ఇంత శాంతియుతమైన, పవిత్రమైన వుద్యోగంలో కూడా సుఖంలేదా?

మాస్ట: ఈ వుద్యోగం ముళ్ళమీద ఉన్న పక్కలాంటిది?

పాత: మీ జీవితంలో ఏదో ఘోరమైన విషాద సంఘటన జరిగి వుండకపోతే –

మాస్ట: ప్రతి జీవితానికి సాధారణంగా తప్పని సంఘటనల కంటె నా జీవితంలో మరో విషాద సంఘటన లేదు.

పాత: అంటే?

మాస్ట: అప్పటికే వ్రాయబడ్డ జీవితాన్ని ఎన్ని కన్నీళ్ళతోనైనా మార్చలేము.

పాత: అది నా సంగతి!

మాస్ట: నీ ఒక్కడి సంగతే కాదు; ప్రపంచం సంగతి! నిజంగా నిన్ను చూసి నేను అసూయపడుతున్నాను. నీకున్న స్వేచ్ఛ వూహించలేని భవిష్యత్తుకోసం నీకున్న అవకాశాలు – ఇవంటే నాకు అసూయ! నేను జీవితంలో స్థిరపడిపోయాను! స్థిరపడిపోయిన మనిషి మారలేడు. సగం జీవితం నిద్రలో నివసిస్తే, మిగిలిన సగం గడియారంలా ప్రతి రోజూ ఏదో ఒక పనిచెయ్యడంలో గడిచిపోయింది. నెలలు తరబడి, సంవత్సరాల పర్యంతం ఇదే పని! పాడిందే మళ్ళీ పాడడం! పాత పుస్తకాలు, పాత పాఠాలు, ఇదే రకం పిల్లలు, ఇవేమాదిరి దైనందిన కృత్యాలు – ఇలాంటి యంత్రంలాంటి మనసుకు విశ్రాంతి ఎలా దొరుకుతుంది? ఇది ఒక్క స్కూలు మాస్టరు ఉద్యోగానికే కాదు. ప్రతి మనిషీ ఇంతే! నువ్విప్పుడే చెప్పావ్, ఆత్మహత్య చేసుకుందామని అనుకున్నానని – కాని ఆ పనినిచెయ్యకపోవడానికి నీకిప్పుడు లక్ష కారణాలు కనిపిస్తాయ్. ముఖ్యమైనది ఏమిటో తెలుసా? ఆత్మహత్య చేసుకోవడం చాలా కష్టమైన పని, మనకు దాన్ని చేరుకునే శక్తి లేదు.

(కొంచెం సేపు నిశ్శబ్దం)

ఇప్పుడు తెలిసిందా, నీవు ఒక్కడివే కష్టపడలేదని! నువ్వు బాధపడుతున్నప్పుడు, ఎదటివాళ్ళకన్న తక్కువ బాధనే పడుతున్నావని సంతోషించు....అంతే!

పాత: నేనెప్పుడూ అనుకోలేదు....మీరు కూడా – (ప్రైవేటు ద్వారం చప్పుడవుతుంది. మరుక్షణంలో రిటైరైన హెడ్ మాస్లరుగారు వస్తారు...నవ్వితే ముడతలు పడే ముఖం; వయసు యాభైఐదు, అరవైల మధ్య)

మాస్ట: ఓ! హెడ్ మాస్టారుగారా?

హెడ్: నేను లోపలకు రావచ్చా?...వచ్చిన తర్వాత ఆ ప్రశ్న అవసరమే అనుకో! (పాత విద్యార్థిని చూస్తూ) నిన్నెక్కడో చూసినట్టుగా వుంది!

పాత: (మాస్టరుతో) నా పేరు చెప్పకండి....నా మొహం ఆయనకు చూపలేను.

హెడ్: (నవ్వుతూ) ఓ! రాజారావు కదూ!

పాత: (తల వంచి) అవును...ఎన్నడూ తెలుగు పాఠాలు చదవని "మొద్దురాజా" –

మాస్ట: ఇప్పుడు పద్యాలు రాస్తున్నాడు.

హెడ్: (ఎక్కువ పరిచయం వుంది. అందువలన ఏకవచన ప్రయోగమో!) నీకూ కొన్నింటిని రుచి చూపిస్తున్నాడా యేమిటి?

మాస్ట: అతనికి తెలియకుండానె రుచి చూపిస్తున్నాడు.

హెడ్: అక్కడే వచ్చింది చిక్కు.

మాస్టర్: అందుకే నేనతన్ని చూసి అసూయపడడం.

హెడ్: అసూయ?

మాస్టర్: నా బాధలు, కష్టాలు....

హెడ్: కష్టాలా? ఎన్నాళ్ళనుంచి నీకీ కష్టాలు?

మాస్టర్: మీకు చెప్పాలి.....చెబుతాను....మీరొక్కరే సానుభూతి చూపగలరు...నేను 'రాజా'కి చెబుతున్నా నిప్పుడే, పెద్దతనం రావడమంటే ఏమిటో!

హెడ్: నువ్వా? పెద్దతనం రావడమంటే ఏమిటో నువ్వు చెబుతున్నావా? (నవ్వుతాడు)

మాస్టర్: మీరు నవ్వగలరు..నవ్వడం మీకు అలవాటై పోయింది. మీకు వేదాంతం సులువుగా పట్టుబడ్డది. వేదాంతి అయినవాళ్ళు ముసలివాళ్ళు కావడం చాలా తేలిక.

హెడ్: ఆ వేదాంతాన్ని అట్లా వుండనీ. కాని, నువ్విప్పుడే ముసలివాడివయ్యానని నీ వుద్దేశ్యమా?

మాస్టర్: అలాగే అనిపిస్తోంది.

హెడ్: (నవ్వుతూ) బావుంది. అయితే, నీ సంగతే నీకు తెలియదన్నమాట! (మాస్టరు ఆశ్చర్యంగా చూస్తాడు) నిన్ను గురించి నేను చెప్పనా?

మాస్టర్: (ఆశ్చర్యంతో) మీరా?..చెప్పండి.

హెడ్: నువ్వెవరివో నీకు తెలియచెప్పాలి. పెద్దవాణ్ణి – మంచైనా, చెడైనా నా మాట విను...నువు చాలా అదృష్టవంతుడివి.

మాస్టర్: నేనా?.....నేను!

(పాత విద్యార్థి ఆశ్చర్యంతో చూస్తుంటాడు)

హెడ్: జీవితంలో సంతృప్తి అనేది వుంటే, నీకు తెలివితేటలు వుండి, అవి నిన్ను అంధుణ్ణి చెయ్యకుండా వుంటే, నీకు, మనిషి జీవితంలో కోరుకునే అత్యుత్తమమైన శాంతియుతమైన జీవితం లభించింది. ఇటువంటి వాతావరణంలో వుండడం అంటే – అదేమీ తక్కువ అదృష్టం కాదు.

మాస్టర్: నేనూ జీవితంలో నిరాశనూ, దుఃఖాలను అనుభవించిన వాణ్ణే!

హెడ్: (ఎగతాళిగా) అలాగా?..ఇంతకూ నువ్వనేదేమిటి? నీ జీవితంలో సుఖంలేదని – బావుంది. చూడు...ఓ మనిషిని తీసుకో? అతను జీవితంలో తనుకోరుకున్న అమ్మాయినే పెళ్ళిచేసుకున్నాడు. ప్రతి నిముషమూ, ఎంతో ఆనందంతో పసిపిల్లలతో ఆడుకుంటూ, వాళ్ల మనస్సులకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని, వినోదాన్ని, విజ్ఞానాన్ని కలిగిస్తూ – ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడుపుతున్నాడు...అంతకన్నా ఆ మనిషికేం కావాలి?

పాత: అవును...ఇంకేం కావాలి?

హెడ్: ఏం కావాలో అతనికే తెలుస్తుంది. కాని కొన్నాళ్ళ ఆగాలి...ఎన్నాళ్ళో తెలుసా? నా వయసు వచ్చేవారకు! అతని ఉద్యోగం పోయి తర్వాత, జీవితంలో 'నా' అనే వాళ్ళందరూ తననను వీడిపోయిన తర్వాత; తన అలవాట్లే తనకు భారమై బ్రతకడానికి ఆధారం లేనప్పుడు – అప్పుడు తెలుస్తుంది. అప్పుడూ, నీకు జీవితం మీద విరక్తి పుట్టడం, నీ బాధలన్నీ ఏకరువు పెట్టడం! అప్పుడు తన గతించిన జీవితంవైపుకు

చూపు మళ్ళించుకొని, జరిగిపోయిన విషయాలలతో మనసును సంతృప్తి పరుచుకుంటూ ఆ ఆనందం మళ్ళీ రాదని, తనకు జీవితంలో సౌఖ్యం లేదని అప్పడనాలి – (ఇంతా గంభీరంగా చెప్పి మళ్ళీ నవ్వుతాడు)

మాస్ట: నాకు చాలా ఆశ్చర్యంగా వుంది.

హెడ్: అవునవును – ఇక ఇంతటితో ఈ అంశాన్ని ముగిస్తే బావుంటుందేమో!

పాత: లేదండీ! ఇది ఏకాంకిక......మరో అంశాన్ని ప్రారంభించడానికి వీలులేదు..నాకు జవాబు చెప్పండి. మీరు నాకన్న ఎక్కువ బాధలు అనుభవించారా?

మాస్ట: నాకన్న –?

(హెడ్‌మాస్టరు నవ్వుతాడు)

పాత: నాకు తెలిసింది. మనం అందరం చెప్పిందీ నిజమే. మన జీవితం ఆనందమయం గానూ వుంది; దుఃఖపూరితంగానూ వుంది. దుఃఖం మనలో మనకి, ఆనందం యితరుల మనస్సులకి – నాకిప్పుడర్థమైంది. జీవితం ఓపెద్ద హేళన కావ్యం....ఆ హేళన చేస్తున్నది నన్ను........మనల్ని.....మానవులందరిని! ఈ నాటకంలో మనం నటిస్తున్నాం – కాదు – నటింప చేయబడుతున్నాం. ఈ నాటకానికి పేరేమిటి? 'ఆనంద ఎక్కడ' ప్రతివాడూ ప్రక్క వాడు ఆనందంగా వున్నాడనుకోవడం, వాడి మీద అసూయపడడం. కాని, ఆ వ్యక్తి జీవితంలోను అగ్నిపర్వతాలున్నాయిని అతని అన్వేషణ ఆనందం కోసమేనని యితనికేం తెలుసు? 'ఆనందం ఎక్కడ?'...ఎక్కడా లేదు....ఎ..క్క..డా! ఏ వయసులోనూ లేదు....మాయ! ఇంద్రజాలం! ఖరీదులేని తమాషా!

(హెడ్ మాస్టరు నవ్వుతాడు)

ఈ విషాదాంత నాటకంలో ఎవరైనా నవ్వగలుగుతున్నారంటే, వాళ్లు నటకులు కారు. కేవలం ప్రేక్షకులు మాత్రమే! వంచన జరుగుతూ వుండగా దూరంనుంచి చూచినవాళ్ళు మాత్రమే!

(మాటలురావు.....క్షణం నిశ్శబ్దం)

హెడ్: (చిరునవ్వుతో) అయిపోయిందా?

పాత: (కావాలనే) ఆ!

(వీళ్ళు మాట్లాడుతుండగా కిటికీలోనుంచి ఫుట్‌బాల్ వడిగా లోపలికి వస్తుంది)

మాస్ట: (కోపంగా) ఎవరీపని చేసింది? వీళ్ళకు లక్షసార్లు చెప్పాను? (కిటికీ దగ్గరకుపోయి) ఎవరీ ఫుట్‌బాలును లోపలకు తన్నింది?

విద్యా: (లోపలనుంచే) పొరపాటున....

మాస్ట: నువ్వా! రాం! కాస్త కనుమరగైందో లేదో అప్పుడే అల్లరి మొదలుపెట్టావ్? ఈ గది దగ్గర గోలచెయ్యొద్దని ఎన్నిసార్లు చెప్పాను? మీకు మాటల్తో చెబితే లాభంలేదు....రాం! లోపలికిరా ఇప్పుడే! (హెడ్ మాస్టరు గారు దగ్గరకు వస్తూ) వెధవ! వీడిని మీరైతే ఏం చేస్తారు?

హెడ్: ఇతన్ని గురించేనా నాకిదివరకు చెప్పింది?

మాస్ట: అవునండీ...నా ప్రాణాలు కొరికేస్తున్నాడు. మీరు చూడండి, ఏం చెయ్యగలరో!

(విద్యార్థి భయంగా లోపలకు వస్తాడు)

ఏం, రామం! ఈ సారి ఏం చెయ్యదల్చుకున్నావ్? (మాట్లాడడు) మామూలు పాటే నన్నమాట! ఇక్కడ ఆడొద్దని చెప్పాను, జ్ఞాపకం ఉందా?

విద్యా: మరిచపోయానండి...

మాస్ట: ఓ! నీ మరుపుకు ఏదో ఒక మందు ఆలోచించాలి. (హెడ్‌మాస్టారుతో) మీ వుద్దేశ్యం ఏమిటండీ?

హెడ్: అట్లా ఎందుకు మరిచిపోయావు రాం?

విద్యా: (భయంగా) నేను కొంచెం సంతోషంగా వున్నానండీ!

మాస్ట: దెబ్బలు తప్పాయన్న సంతోషమా?

విద్యా: (సిగ్గుతో) అవునండి.

మాస్ట: అంటే?

హెడ్: అంటే అతను సంతోషించడానికి చెప్పిన కారణం మరెవ్వరూ బహుశః చెప్పరు. అది అతని ప్రత్యేకత.

పాత: ఆ ప్రత్యేకతే అసలు కారణాన్ని రుజువు చేస్తున్నది కూడా!

మాస్ట: అతని దొక్కడిదేనా ప్రత్యేకత?

పాత: కాదు......అతను అతని క్లాసుకంతకూ ప్రతి నిధి. ప్రతి కుర్రవాడూ అటువంటివాడే! నాకది బాగా అనుభవం! విద్యార్థి దశే మనిషి ఆనందకరమైన దశల్లో ఒకటనుకున్నాను. కాని అదే – అదొక్కటే – సంతోషదాయకమైంది. మీరు విన్నారుగా అతని ఆనందం! నాలుగు దెబ్బలు తినడం తప్పితే అతని కానందం. బాధ్యతలు లేని జీవితంలో ఏ చిన్న బాధ తప్పినా ఆనందమే! (అందర్నీ చూచి) ఓ! నేను మీకు అడ్డం వచ్చినట్టున్నాను.

మాస్ట: ఫరవాలేదు. ఇది చలా ఆశ్చర్యకరమైన ఆనందం. దీన్ని గురించి మీకేమైనా తెలుసా మాస్టారు?

హెడ్: ఆనందరకరమైన విషయాలను తప్పకుండా ప్రోత్సాహించాలి..అటువంటివే మానసిక వికాసానికి దోహకాలు.

మాస్ట: సరే! నీకు మరోసారి సంతోషాన్ని కలగచేస్తున్నాను...ఈ సారి నువ్వు హెడ్ మాస్టరుగారికి కృతజ్ఞత చెప్పుకోవాలి. కాని ఈసారి సంతోషాన్ని కొంచెం హద్దుల్లో వుంచుకో.

విద్యా: (సంతోషంగా) అట్లాగే మాస్టారు!

మాస్ట: ఆ బంతి పట్టుకో –

(హెడ్ మాస్టరుగారు దాన్ని యివ్వబోతూ వుండగా, ఆయనకో ఆలోచన తడుతుంది)

హెడ్: నువ్వు చదువుకునే రోజుల్లో పుట్‌బాల్ బాగా ఆడేవాడివి కదూ, రాజా?

పాత: ఫరవాలేదు.....మూడేళ్ళు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్‌కు వెళ్ళాను.

హెడ్: అవునవును. అయితే, నేను పాత విద్యార్థుల టీమ్‌కు, స్కూలు టీమ్‌కు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేద్దామనుకుంటున్నాను. రేపు శనివారం..నువ్వు కూడా ఆడరాదా?

పాత: తప్పకుండా ఆడతాను. కాని, నేను మానేసి చాలా రోజులైంది.

హెడ్: ఫరవాలేదు....శనివారం యింకా మూడు రోజులుంది..ఈలోగా ప్రాక్టీస్ చెయ్యొచ్చు.

పాత: అవును...

హెడ్: (చిరునవ్వుతో) ఆవేశమా?

పాత: అవును...గతించిన జ్ఞాపకాలు, చిన్నతనం మిగిల్చిన మధురస్మృతులు....మళ్ళీ అప్పటి మాదిరిగా ఆడడం ఆనందం కాక మరెమిటి?

మాస్ట: ఓహో! మరొకరు ఆనందంగా ఉన్నారా! బావుంది..ఫుటాల్ ఆడడంలో ఆనందం వుందా మాస్టారు? నిజమే! అడ్డంకులు లేని ఆటస్థలంలో ఆడుకోవడం ఆనందమే!

(ఓ క్షణం నిశ్శబ్దం)

విద్యా: బంతి ఇస్తారా అండి?

హెడ్: ఓ! బంతా! (ఇస్తాడు)

విద్యా: (వెడుతూ తిరిగివచ్చి) మరిచిపోయాను మాస్టారు...రామమోహనరావు...ఇందాక చెప్పమన్నాడండీ.... అతనికి గవర్నమెంటు ప్రైజు వచ్చిందదండి.

మాస్ట: నిజంగా! (ఆనందంతో) వాడు రాలేదేం?

విద్యా: వాళ్ల నాన్నగారికి టెలిగ్రాం ఇచ్చి వస్తానన్నాడండీ?

మాస్ట: మొదట్లో తప్పుతాడనుకునేవాణ్ణి....వాడికే మొదటి బహుమానం వచ్చింది.

హెడ్: వాళ్ళందరూ అంతే!!

మాస్ట: పనికి వచ్చే కుర్రాడని దగ్గర కూర్చోబెట్టుకుని మరీ చెప్పాను. నిజంగా నాకు చెప్పలేనంతం ఆనందంగా వుంది. నేను చెప్పాను చూడండి, వాడు కొద్దిరోజుల్లో గొప్ప స్కాలర్ అయిపోతాడు. (హెడ్ మాస్టరు గారు ఏదో చెప్పబోతాడు) మీరు చెప్పేది నాకు తెలుసు మాస్టారు. నాకికప్పుడు స్వర్గంలో వున్నంత ఆనందంగా వుంది. (విద్యార్థితో) రామ్‌మోహన్‌రావు రాగానే నేను రమ్మన్నానని చెప్పు...(విద్యార్థి వెళ్ళిపోతాడు) మీరునిజం చెప్పారు మాస్టారు. మీరెప్పుడూ నిజమే చెబుతారు. మేము నిజంగా అదృష్టవంతులం..మీకు బాధలు వున్నయ్; నిజమే! కాని అవి మీరు అనుభవించేవాటిలో ఎన్నో వంతు? మేము వాటినినుంచి తప్పించుకోవచ్చు; మరిచిపోవచ్చు... కాని మీకా అవకాశం లేదు.

హెడ్: నేను చెప్పానా ఆ మాట?

మాస్ట: చెప్పలేదా?

పాత: చెప్పి నన్ను గాడిదను చేశారు?

మాస్ట: నన్నూ అంతే! మీ వయసు వచ్చేసరికి మేం ఎంతగా మారిపోతామో?

హెడ్: వగైరా వగైరా అంతేనా

పాత: ఆ మాటలు చెప్పి భూమి బద్దలయ్యేటట్టు నవ్వారు.

హెడ్: నానా పని చేశానని వినడం నాకు చాలా సంతోషంగా వుంది.

మాస్ట: నిజంగానా?

హెడ్: నిజంగానే, నిజంగానే నిఖిలలోకం హసిస్తుందా? మానవాళికి నిజంగానే మంచి కాలం రహిస్తుందా? పాతకాలం నాటి ప్రశ్న..

పాత: మాకు ఆ ప్రశ్నకే సమాధానం చెప్పండి. మీరు నిజంగా అన్ని బాధలు అనుభవిస్తూనే సుఖంగా వున్నారా? మీ బాధల్ని, భారాల్ని ఎన్నడైనా మరిచపోగలరా?

హెడ్: నేను.....నేను (మళ్ళీ నవ్వుతాడు)

పాత: నవ్వకండి...నవ్వకండి....మీరు నిజంగా మరిచిపోలేరు.

హెడ్: మరిచిపోలేవా? ఓ! మరిచిపోలేనన్న మాట! బావుంది. మీరిద్దరూ ఎంత తమాషాగా అయిన మనుషులో మీకే తెలియదు.......

(మళ్ళీ నవ్వుతాడు)

మాస్ట: (కొంచెం అసహనంతో) మీ సంతోషం కొంచెం ఎక్కువ మోతాదులో వున్నట్టుంది.

హెడ్: అదేకదా కావలసింది.

మాస్ట: అంటే –

హెడ్: ఈ 'అంటే'లతో నన్ను విసిగిస్తున్నారు..చూడండి..నేనెప్పుడైనా ఆనందరహితంగా కనుపించానా? సానుభూతి కోరేవిధంగా ప్రవర్తించానా? అందులోనూ మా సానుభూతి?

మాస్ట: (నమ్మలేక) ప్రవర్తించలేదా?

హెడ్: ఓ! మీరు నన్ను బ్రతకనిచ్చేటట్టుగా లేరు. మీరు పొందే ఆనందానికి నేను అసూయ పడ్డానని మీరు అనుకునేటట్లుగా నేను ప్రవర్తించాలని మీ వుద్దేశ్యం – మిమ్మల్ని గురించి మీకే ఏ కోశానా తెలియదు. (కుర్చీలో కూర్చుంటాడు) నిజానికి నేను బాధపడడానికి నాకు బాధ ఏమీ లేదు. ముసలితనంలో ఆనందానికి రెండు విషయాలుంటే చాలు. మంచి మనసు, మంచి జ్ఞాపకశక్తి – ఈ రెండూ నాకున్నాయనే నా వుద్దేశ్యం. అదీకాక చుట్టూరావున్న ఆనందాన్ని ఆస్వాదించే శక్తి వుంది...ఇది వుంటే ముసలితనం తప్పక భరించతగ్గదే! అందమైన జీవిత నాటకం..దానిమీద హాయిని గూర్చే వ్యాఖ్య – బడి రోజులకన్నా, యౌవన ప్రారంభంలో తప్పటడుగులకన్న ఆవేశకరమైన ఆనందకరమైన జీవితనాటకాన్ని గురించి వ్యాఖ్య! ఇటువంటి నాటకం – ఎన్ని కొత్త పాత్రలు ప్రవేశించినా, యథాప్రకారం నడిచే నాటకం – దాని ముగింపు అసలు ముగింపంటూ వుంటే – ఎప్పటికైనా సుఖాంతమే! నేను దాన్ని అనుభవిస్తున్నాను; ఆనందిస్తున్నాను..

(కొంచెంసేపు నిశ్శబ్దం)

మాస్ట: మిమ్మల్ని చూసి నేనసూయ పడుతున్నాను, మాస్టారూ!

పాత: నేను కూడా!

హెడ్: బావుంది...చాలా బావుంది...ఈ నాటకం ఓ! ఏకాంకిక అన్నావు కదూ! అవును...చాలా బావుంది మొదటి బహుమతి ఇవ్వాలి కదూ, దీనికి! నాటకం అయిపోయింది, ఇక వెళ్ళి ఆడుకోండి –

పాత: పొద్దుపోయింది...సెలవు తీసుకుంటాం –

(ముందు హెడ్ మాస్టారుగారికి, తరువాత ప్రేక్షకులకు నమస్కరిస్తూ వుండగా..........తెర)

# జననీ జన్మభూమీ

**(నాటిక)**

ఇందులో పాత్రలు

| | |
|---|---|
| రాజారావు | తండ్రి |
| ప్రతాప్ | రెండో కొడుకు |
| విజయ్ | మూడో కొడుకు |
| విక్రమ్ | మనుమడు |
| పక్కింటి పెరుమాళ్లు | |
| ఇద్దరు సోల్జర్లు | |

ఒక మధ్య తరగతి ఇంట్లో ముందు గది. ఒక ప్రక్కగా ఒక పడకకుర్చీ. దాని పక్కనే పాతకాలం కొయ్యకుర్చీలు రెండు వున్నాయి. ఎడమమూల – కుర్చీలకు ప్రక్కగా ఒక బెంచీ, కుడి మూల పడకకుర్చీ ప్రక్కగా ఒక టేబులు ఉన్నాయి.

వెలుపలి నుంచి గదిలోకి వచ్చే ద్వారం కాక కుడివైపున వెనుక ఇంట్లోకి పోయేందుకు ఒక ద్వారం; మధ్యలో మేడ మీదకు పోయేందుకు మరో ద్వారం ఉన్నాయి. మధ్య ద్వారం పైన అంటే స్టేజికి మధ్య భాగంలో – ఒక సైనికుడి ఫోటో, దానికి ఓ పూలదండ ఉన్నాయి. గదిలో గోడలకు గాంధీ, నెహ్రూ, సుభాష్ బోస్ పటాలు వివరంగా కన్పిస్తూ వుంటాయి.

ఇవి కాక టేబుల్ మీద మరో యువకుని ఫోటో – దాని మీదనే, ఒక ప్రక్క బొత్తిగా పెట్టి పేపర్లు – ఉన్నాయి.

తెర లేచేసరికి –

ప్రతాప్ – తన దేశభక్తికి నిదర్శనంగా యుద్ధానికి ఒక కాలును బలి ఇచ్చినవాడు – ఓ కర్రసాయంతో నడుస్తూ గదిలోకి వస్తాడు. ముందుగా అన్నగారి ఫోటో దగ్గరకు వెళ్ళి, దానివంక చూచి నిట్టూర్చి, టేబుల్ దగ్గరకు వచ్చి దానిమీద ఉన్న తమ్ముడి ఫోటో వైపు తదేక దృష్టితో చూచి విచారవదనంతో ప్రక్కనే ఉన్న కుర్చీలో కూర్చుని ఆనాటి పేపరు అందుకుంటాడు. అతడు ఆత్రంగా పేపరు చదువుతున్న సమయంలో విక్రమ్ అడుగులో అడుగులేసుకుంటూ అక్కడకు వస్తాడు.

విక్రమ్

(మెల్లగా) బాబాయ్!...బాబాయ్!!

(ప్రతాప్ పేపరు చదవడంలో నిమగ్నుడై విక్రమ్ మాటలు వినిపించుకోడు)

(ఇంకా కొంచెం పెద్దగా) బాబాయ్!

**ప్రతాప్**

(తల ఎత్తి) ఏమిటి విక్రమ్? ఏమయింది?

**విక్రమ్**

(బిగ్గరగా మాట్లాడవద్దని వారిస్తూ) ష్! (అంటూ లోపలకు చూపి సైగ చేస్తాడు)

**ప్రతాప్**

ఏమిటిరా?

**విక్రమ్**

తాతయ్య, కొత్త బట్టలు, కోటూ అన్నీ వేసుకుని ఎక్కడికో ప్రయాణం అవుతున్నాడు

**ప్రతాప్**

నిజంగా?

**విక్రమ్**

అవును బాబాయ్.....ఇంకా, లోపల్లోపల ఏదో గొణుక్కుంటున్నాడు కూడానూ -

**ప్రతాప్**

అయితే తాతయ్య అన్నంత పనీ చేస్తున్నాడన్న మాట!......(వేచి, తనలో తాను అనుకుంటున్నట్లు) ప్చ్! ఈ ముసలితనంలో నాన్నకు ఎంత భరించలేని బాధ!

**విక్రమ్**

బాబాయ్! మొన్న చిన్న బాబాయి దగ్గరనుంచి ఉత్తరం వచ్చిన దగ్గర్నుంచీ తాతయ్య ఇంతే ఎప్పుడు తనలో తాను ఏదో మాట్లాడుకోవడమే!....నాకు దగ్గరకు వెళ్లాలంటేనే భయంగా ఉంది.

**ప్రతాప్**

(విక్రమ్ బుజం తట్టి) ఫరవాలేదు విక్రమ్...భయం ఎందుకూ?

(పక్కింటి పెరుమాళ్ళు వస్తాడు. అనవసర ప్రసంగమూ, అధిక ప్రసంగమూ ఆయన ప్రత్యేక హక్కులు)

**పెరుమాళ్లు**

ఓహో, ప్రతాప్! ఇక్కడా వున్నావ్! అవునులే పాపం! ఎక్కడికి పోగలవూ, యీ యుద్ధం ధర్మమా అని! ఆ! అన్నట్టు మీ విజయ్ సంగతేమన్నా తెలిసిందా!

**ప్రతాప్**

అయ్యో! తెలియకేం?.....మా వాడికేమండీ? బ్రహ్మాండంగా వున్నాడు. వాడు మొన్నటి యుద్ధంలో చూపిన ప్రజ్ఞను పేపర్లన్నీ వేనోళ్ళ పొగిడాయి కదండీ! మీరు చూడలేదా?

**పెరుమాళ్ళు**

అయ్యో! చూడకేం! ఊరంతా అదే మాటగా! (రహస్యంగా) అయినా నాకు తెలియక అడుగుతాను -

అంతంత ప్రమాదకరమైన పనులు చేయడమెందుకయ్యా, తిని కూర్చోక -? (లేచి) మా వాడు కూడా యుద్ధంలోకి వెడతానన్నాడు, జ్ఞాపకం వుందిగా! ఎందుకు? ఇట్లా, "ఎవరి కొరివిరా, నీ నెత్తి నెక్కించుకున్నావు?" అనిపించుకోవడానికా? అబ్బే - హాయిగా, సుష్టుగా తిని అనుభవించడానికి గాని -

ప్రతాప్

(నవ్వి) పోనీ, అందుకోసమైనా పంపించక పోయారా?

పెరుమాళ్లు

(కూర్చుని) పంపించేవాడినే! బొత్తిగా యుద్ధం ముమ్మరంగా వుందే అని చూస్తూన్నా - కాస్త తగ్గనీ -

విక్రమ్

తగ్గిం తరువాత అయితే, ఊరికే తినడానికే మీరూ చేరొచ్చుగా తాతగారూ?

పెరుమాళ్ళు

ఓహో! నువ్వూ మాటలు నేర్చావే!

విక్రమ్

దాని దేముందిలెండి. ఈ రోజుల్లో అని పుట్టే మనుషులు పుడుతున్నారు.

పెరుమాళ్ళు

(అది వినిపించనట్లుగా) అది సరే! ఇదుగో ప్రతాప్! నాకు మాత్రం ఇట్లా యుద్ధాల్లోకి పోవడాలు, చావడాలు, కాళ్ళు విరగ్గొట్టుకోవడాలు గిట్టవనుకో! నీకు తెలియదూ, మా వాడూ పోతానన్నాడు. వాళ్ళమ్మ ఒకటే శోకన్నాలు... ఫ్చ్ఫ్చ్.....మీ అమ్మ వుంటే నిన్ను మాత్రం పంపించేదటలే! - ఆ! ఏమన్నానూ? మావాడు కూడా ఏమైనా సరే పోతాను, ధాం, ధూం అంటూ ఎగిరాడు. నేనూరుకుంటానా? అక్కడికి పోయి కాళ్లు విరగ్గొట్టించుకోవడం ఎందుకని, నేనే విరగ్గొట్టి మూల కూర్చో బెడతాను, రారా, అన్నాను - అంతే గప్‌చిప్......కుక్కిన పేనులా మూలకూర్చున్నాడనుకో!

ప్రతాప్

పాపం! మీరు అంత పనీ చెయ్యలేదు గదా!

పెరుమాళ్ళు

ఆ పని నేను చెయ్యడమెందుకయ్యా! వాడి పెళ్ళాంలేదూ? అదే చేస్తుంది....మరి వాడికి పెళ్ళెందుకు చేశామను కున్నావ్?

విక్రమ్

ఎందుకు? ఆవిడొచ్చి మీ అబ్బాయి కాళ్లు విరగ్గొట్టడానికా?

పెరుమాళ్ళు

ఆహా! ఫరవాలేదు.....తరిఫీదు సరైన మార్గంలోనే ఉంది - ఆ! ఇంతకూ వచ్చాను చెప్మా....ఆ, అవునవును. మీ నాన్నగారితో మాట్లాడిపోదామని -

ప్రతాప్

ఏమని?

పెరుమాళ్ళు

అదే! యుద్ధమేమో ముమ్మరంగా సాగుతోందా? ఎక్కడ చూసినా చావులే...ఎట్లాగైనా సరే కొడుకును పిలిపించుకోండి. ఆ తరువాత నేను చెప్పలేదనేరు – అని చెప్పిపోదామని వచ్చాను....ఎంతైనా కడసారి కొడుకు కదా! (విక్రమ్ వాకిట్లోకి వెడతాడు)

ప్రతాప్

పెరుమాళ్ళు గారూ! ఆ పని మాత్రం చేయకండి. విజయ్‌ని గురించి నాన్న అసలే గాభరా పడుతున్నాడు. ఇప్పుడు మీరు కూడా ఇలా చెబితే నాన్న మనసు ఇంకా వికలం అయిపోతుంది.

పెరుమాళ్ళు

అదేమిటయ్యా! మీ మంచి కోసమే చెబుతున్నానుగాని –

(ఇంతలో రాజారావు గారు వస్తారు. మనిషి బాగా కృశించి వున్నాడు. వయసును మించి జీవితంలో మానసిక వ్యధ ఆయనను ముసలివాడిని చేసింది....మెల్లగా లోపలకు వస్తాడు. కొత్త బట్టలు, కోటు, గొడుగు – ఎక్కడికో ప్రయాణంలో వున్నట్టు కనిపిస్తాడు.

ప్రతాప్‌ను చూచి, కొంచెం తబ్బిబ్బు అయ్యి అతనితో మాట్లాడకుండానే వాకిట్లోకి వెళ్ళబోతాడు)

ప్రతాప్

(దగ్గరగా వెళ్ళి) నాన్నగారూ!

తండ్రి

(ఇబ్బందిగా ముఖంపెట్టి) ఏమీ లేదు ప్రతాప్! ఒక్కసారి ముఖ్యమంత్రిగారి దగ్గరకు వెళ్ళి వద్దామని – (ముందుకు వచ్చి) ఎవరది, పెరుమాళ్ళా?

పెరుమాళ్ళు

అవునండీ, నేనే! ఎక్కడికో ప్రయాణం అయినారు?

ప్రతాప్

సరే, పెరుమాళ్ళు గారూ? నాన్నగారు తొందరలో వున్నారు –

పెరుమాళ్ళు

అయ్యో అలాగే!.....నాన్నగారికి మాత్రం తెలియదూ? అందుకేగా ముఖ్యమంత్రిగారి దగ్గరకు వెళ్తున్నారు?..అవును మరి! ఎంత ప్రచండమైన యుద్ధం ఎవరు బ్రతకుతారో, ఎవరు –

ప్రతాప్

(గట్టిగా) పెరుమాళ్ళూ! ఆ విషయాలన్నీ మాకూ తెలుసు! – ఇక వెళ్ళిరా –

**పెరుమాళ్ళు**

అట్లాగే – ఏదో పెద్దవాడు, పాపం ఒక కొడుకు చూస్తే అట్లా అయిపోయాడు, మరోడు –(అని ప్రతాప్ వంక చూస్తాడు. ప్రతాప్ ఉరిమినట్లు చూసేసరికి; భయపడి – )

సరే ! వస్తా......... (అంటూ త్వరగా వెళ్ళిపోతాడు)

**తండ్రి**

అతనన్నదీ నిజమే ప్రతాప్!

**ప్రతాప్**

ఇప్పుడు అంత దిగులు పడవలసిందేమీ లేదు నాన్నగారూ!

**తండ్రి**

నేనూ స్వాతంత్ర్య యోధుణ్ణే! దేశం కోసం నా ఆస్తిపాస్తుల్ని, నా యౌవనోద్రేకాలను, నా భార్యాబిడ్డల సౌఖ్యాన్ని, నా సర్వస్వాన్ని త్యాగం చేసినవాణ్ణే! కాని –

**ప్రతాప్**

కాని ఇలా పంపడానికి ప్రభుత్వం ఒప్పుకోదు నాన్నా! యుద్ధంలో చేరిన ప్రతి వీరుడూ దేశ మాత సేవకు అంకితం అయిన సేవకుడే! వాళ్ళకు తల్లి దండ్రులు, మాన ప్రాణాలు, ప్రేమాభిమానాలు....అన్నీ మాతృభూమే!

**తండ్రి**

అందుకే!.....ఇవ్వాళ ఆఖరు ప్రయత్నం...యుద్ధం ముమ్మరంగా జరుగుతోంది...నాకెందుకో భయంగా ఉంది. నా తండ్రిని మరోసారి చూడాలని ఆత్రంగా వుంది....(దీనంగా) నా ఆశ అడియాశ కాదుగదా!

**ప్రతాప్**

ఛ! అలా అనకండి నాన్నా! విజయ్ ఎంత ధైర్యసాహసాలు కలవాడు! మనకు మన వంశానికి, మన దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకువస్తాడు నాన్నా!

**తండ్రి**

నాకు తెలుసు ప్రతాప్! నా కొడుకులు ముగ్గురూ మూడు రత్నాలు! ఒకడు మాతృరక్షణలో యుద్ధభూమిలో మరణించిన వీరుడు. మరొకడు యుద్ధం చేస్తూ శత్రువుల తుపాకి గుళ్ళకు తాను వికలాంగుడైనా లెక్కచేయక పోరిన యోధుడు.....ఇక నా చిట్టి తండ్రి.......

(దు:ఖం ముంచుకువిచ్చ మాట్లాడలేకపోతాడు)

**ప్రతాప్**

ఇదంతా మీరు పెట్టి భిక్షే నాన్న! నాకు అంతా నిన్న చూసినట్లు జ్ఞాపకం వుంది...నాకు అప్పుడు ఎనిమిదేళ్ళు. మీరందరూ సత్యాగ్రహం నడుపుతున్న రోజులు. ఒకసారి సత్యాగ్రహం చేసినందుకు మిమ్మల్ని పోలీసులు కొట్టారు. కాళ్ళు, చేతులు అన్నీ వాచిపోయాయి...అర్ధరాత్రి మెల్లగా మమ్మల్ని

చూడడానికి ఇంటికి వచ్చారు. అప్పుడు విజయ్ పసివాడు. మీరు వచ్చేసరికి వాడికి కాలులో ముల్లు గుచ్చుకుని ఏడుస్తున్నాడు. అప్పుడు మీరు, మీ దెబ్బలకు కూడా లెక్కచెయ్యక ఆ ముల్లును తీసి, కాపుకాస్తూ, "బాబూ! దేశరక్షణలో ఇంతకన్నా పెద్ద బాధలు పడవలసి వుంటుంది, ఈ కాస్త దానికే ఏడుస్తారా? అంటూ విజయ్‌ని సముదాయించారు...దేశం అంటే మా కున్న భక్తి ప్రపత్తులు మిమ్మల్ని చూచి నేర్చుకున్నవే నాన్నా!

**తండ్రి**

అవును ప్రతాప్....అందుకే – అంత శ్రమపడి సాధించినందుకే దేశస్వాతంత్ర్యం అంటే నాకు వల్లమాలిన అభిమానం. ఆ స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకోవాలి. భారతదేశం ప్రపంచంలో ఉత్కృష్టమైన దేశంగా నిలబడాలి. అందుకోసం తన సైన్య సంపదను పెంచుకోవాలి. ఇదీ నా అభిప్రాయం, నా నమ్మకం.....అందుకే మిమ్మల్ని సైన్యంలో చేర్చాను. చిన్ననాటి నుంచీ ఆ భావాలు మీ మనస్సుల్లో నాటుకునేటట్లు చేశాను.

**ప్రతాప్**

విజయ్ కూడా తనను దేశానికి అంకితం చేసుకున్నది అందుకే నాన్నా! వాడిని ఆపడం మనకు ఎంత కష్టం అయిందో మీకు జ్ఞాపకం లేదూ?

**తండ్రి**

అవును ప్రతాప్. నేను నిలబడ్డ కొమ్మను నా చేతుల్తోనే నరుక్కున్నట్టయింది. ఈ ముసలితనంలో నాకు అండగా వుండవలసిన ఒక్క కొడుకునూ దూరం చేసుకున్నాను.

**ప్రతాప్**

అలా అనకండి నాన్నా! మీరు ప్రభుత్వానికీ, సైన్యాధికారులకూ ఉత్తరాలు వ్రాశారు కదా! దానివలన ఫలితం వుండి తీరుతుంది.

**తండ్రి**

ఏనాడు ఈ నాయకులను ఒక్కకోరిక కోరలేదు. అందరూ నాతో జైళ్ళలో ఉన్నవారే. ఇదే నా చివరి కోరిక అని వ్రాశాను. నాకున్న పలుకుబడినంతా వుపయోగించి అయినాసరే చిన్న బాబును ఒక్కసారి చూడాలి.....ప్రతాప్ ఇదంతా చూస్తే నేను పిచ్చివాణ్ణవుతున్నానని పిస్తోంది కదూ!. పుత్ర వ్యామోహం అంటే ఇదే నాయనా! అందులోనూ, పెద్దతనం ముంచుకొస్తుంది. ఈ చివరి క్షణాల్లో నా కడసారి కొడుకు – ఎవరిని ఆరు నెలల పసిగుడ్డుగా వున్ననాటి నుంచీ యీ చేతులతో ఎత్తుకొని పెంచానో, వాడు, ఆ చిట్టి తండ్రి – నా ప్రక్కనే వుండకపోతే, పోయే ప్రాణం కూడా గొంతుకలో ఆడిపోతుంది ప్రతాప్....
.....ఇక వాడు కూడా యుద్ధానికి ఆహుతి అయితే –

**ప్రతాప్**

(వారిస్తూ) నాన్నా!

**తండ్రి**

అలా జరగదు. జరగకూడదు. కాని ఒకవేళ అలా జరిగితే మీ నాన్న బ్రతకడు.

అలా అనకండి నాన్న!

**తండ్రి**

కాదురా! ఈ ముసలి ప్రాణం పోయేలోగా – ఒక్కసారి – ఒక్కసారి వాడిన కళ్ళారా చూసి, మనసారా ఆశీర్వదించి పంపితే నా మనస్సు కుదుట పడుతుంది....నీకు జ్ఞాపకం వుందా ప్రతాప్! ఆరు నెలల క్రితం వాడు యుద్ధంలోకి పోయే రోజున కోపంలో నేను ఏమన్నానో జ్ఞాపకం వుందా? “వెళ్ళు, వెళ్ళరా” అన్నాను. రణరంగంలోకి పోతున్న కొడుకును ఆశీర్వదించే పద్ధతి అదేనా? “క్షేమంగా వెళ్ళిరా, నాయనా” అనాలి. కాని, కాని ఎంతటి అపశకునం? ఆ మాటలకు నా చిన్ని తండ్రి పసిహృదయం ఎంత అలమటించిందో!

**ప్రతాప్**

అవి కోపంలో అన్న మాటలు నాన్నా! విజయ్‌కు ఆ మాత్రం తెలియదా?

**తండ్రి**

అంతే కాదురా! విజయ్‌కి జాతకరీత్యా ఇప్పుడో పెద్దగండం ఉంది. అది గడిచి బైటపడితే విజయుడు విజయ శంఖమే పూరిస్తాడు...ప్రతాప్! ఈ దిగులు అహోరాత్రులూ నా గుండెల్ని ఎలా పిండి చేస్తుందో తెలుసా? అబ్బా!....

(దు:ఖాన్ని దిగమింగే ప్రయత్నంచేస్తూ, కుర్చీలో కూర్చుంటాడు....ఇంతలో వాకిట్లో నుంచి విక్రమ్ బిగ్గరగా అరుస్తూ వస్తాడు)

**విక్రమ్**

తాతయ్యా.......బాబాయ్.....తాతయ్యా.......(లోపలకు వచ్చి) తాతయ్యా! ఇదుగో! చిన్న బాబాయ్ దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది –

**తండ్రి**

ఏమిటీ! విజయ్ దగ్గర్నుంచా? ఏదీ, ఏదీ?–

(కవరు తీసుకుని, దానిని ఆప్యాయంగా ఒకసారి స్పృశించి, ప్రతాప్‌కిస్తూ) వెధవది నాకు కళ్ళు సరిగా ఆనవు... నువ్వు చదువు ప్రతాప్...

**ప్రతాప్**

(చదువుతూ)

నాన్నగారూ, మీ ఉత్తరం అందింది.

మీ ఆరోగ్యాన్ని గురించి నాకు ఎంతో ఆందోళనగా ఉంది...

**తండ్రి**

మా నాయనే! అయితే ఈ ముసలి తండ్రిని చూడడానికి తప్పకుండా వస్తావురా!

**ప్రతాప్**

(చదువుతూ) ఇక్కడ యుద్ధం ముమ్మరంగా వుంది. ప్రతి సైనికుడూ తన ప్రాణాలనయినా ఒడ్డడానికి సమధికోత్సాహంతో ఉర్రూతలూగుతున్నాడు..ఈ సమయంలో మా మా సైనకి స్థావరాలను వదిలి రాకూడదని మాకు గట్టి ఉత్తరువు –

**తండ్రి**

అయింది...అనుకున్నంతా అయింది..ఇక నిన్ను చివరిసారి కూడా చేసే ఆశలేదు.....లేదు......

**ప్రతాప్**

విను నాన్నా!

(చదువుతూ) అయినా ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రత్యేకమైన తాఖీదు ప్రకారం నాకు నాలుగు రోజుల పాటు సెలవు మంజూరయింది.

**తండ్రి**

అయిందీ, అయిందీ!..ఎప్పుడు, ఎప్పుడు వస్తున్నాడురా వాడు?

**ప్రతాప్**

(చదువుతూ) "నేను మంగళవారం బయలుదేరి గురువారం సాయంకాలానికి మీ దగ్గర వుంటాను" (తాను, తండ్రితో) అంటే ఇవ్వాళే నాన్నా! ఇహ ఏక్షణంలో నన్నా రావచ్చునన్న మాట

**తండ్రి**

నిజంగా అలాగే రాశాడుట్రా? ఏదీ, నన్ను చూడనీ! (చూడడానికి వ్యర్థ ప్రయత్నం చేసి) పాడు దృష్టి అవసరానికి ఆని ఏడవదు...(ఉత్తరం తీసుకుని) నాన్నా! వస్తున్నావురా! ఇవ్వాళ ఎంత పర్వదినంరా! స్వాతంత్ర్యం వచ్చిన నాడు కూడా నాకు ఇంత ఆనందంగా లేదురా.....ప్రతాప్! ఇంకా కదలవేం? బయలుదేరు, స్టేషనుకు వెళ్దొద్దూ?

**ప్రతాప్**

ఎలా నాన్నా? వాడు ఎప్పుడు, ఎలా వస్తాడో తెలియదు. మనం అటుపోయి, వాడు యిటువచ్చినా రావచ్చు. అందుకని ఇక్కడే వుండి ఎదురు చూద్దాం –

**తండ్రి**

అవునురా! అదీ నిజమే! నా తండ్రి ఇక్కడ వుండేది రెండు రోజులే! అందులో ఏ ఒక్క క్షణం పోగొట్టుకున్నా లోపమే కదరా! ప్రతాప్!...ఈసారి వాడు యుద్ధానికి వెళ్ళకుండా చేయటేమంటావా?

**ప్రతాప్**

అది ఎలా నాన్నా! సెలవు పూర్తికాగానే వాడు వెళ్ళితీరాలి...

**తండ్రి**

సరే, కాని!..ముందు వాడిని కళ్ళారా చూసుకోనీ – ఈ సారి వెళ్ళేటప్పుడు మాత్రం వాడిని మనసారా ఆశీర్వదించే పంపుతాను...(ఫోటో దగ్గరకు వెళ్ళి, దానిని తీసుకుంటూ) విజయ్! నీ తండ్రి జీవితాన్ని మళ్ళీ నందనవనం చేయిడానికి వస్తున్నావు కదూ! ఆ రోజున – ఆరు నెలల క్రితం – నాతో పోట్లాడి వెళ్ళావు కదూ! అందుకు శిక్ష ఏమిటో తెలుసా? నువ్వు రాగానే ఈ ఆరునెలల వియోగాన్ని అంతం చేసేటంతగా హృదయానికి హత్తుకోవాలి.

(ఆనందంతో కన్నీరు కారుస్తూ)

రా విజయ్! రెండు రోజులు కాదు, రెండు క్షణాలు కన్పించిపో! మీ నాన్నకు నువ్వంటే కోపం లేదని, నీ అభ్యున్నతి, ఆనందాలే ఆయన పరమావధి అనీ తెలుసుకోవడానికి రా. నీ కోసం అహోరాత్రులూ అలమటించే తండ్రికోసం రా నాయనా రా – (ఏదో కలలో విహరిస్తున్నట్టు) అప్పుడే నువ్వు వెళ్ళి ఆరునెలలు అయింది...అంతా నిన్న జరిగినట్లుగా వుంది..

(తండ్రి కలలో మాదిరిగా ఊహాలోకంలో నిమగ్నుడై వుంటాడు)

**ఫ్లాష్ బ్యాక్**

లైట్లు ఒక్కసారిగా ఆరి వెలుగుతాయి.

ఫ్యాష్‌బ్యాక్.

(ప్రతాప్ ఒక్కడూ వుంటాడు...తండ్రి లోపలకు వస్తూ)

**తండ్రి**

వాకిలి గుమ్మం వైపు చూచి) బాబూ... విజయ్.....

**ప్రతాప్**

ఇంకా రాలేదు నాన్నా –

**తండ్రి**

ఎవరో తలుపు కొడుతున్నారు రా!

**ప్రతాప్**

బయటి తలుపు తీసు వుంది నాన్నా –

**తండ్రి**

అలాగా! ఇంకా రాలేరు కదూ!!

(అంటూ దిగులుగా వెళ్ళిపోతాడు ప్రతాప్ కూడా తమ్ముని ఫోటో వంక చూచి నిట్టూర్చి కుర్చీలో కూర్చుంటాడు. విజయ్ వస్తాడు...మెల్లగా రహస్యంగా)

**విజయ్ః**

(రహస్యంగా) అన్నయ్యా!

ప్రతాప్

(ఆనందంగా) విజయ్!

విజయ్

(వారిస్తూ) ష్! నాన్న ఎక్కడున్నాడు?

ప్రతాప్

(తండ్రి వెళ్ళిన వైపు చూపిస్తూ) ఏమయింది?

విజయ్

(ఆనందంగా కవరు చూపిస్తూ) ఇచ్చారు.

ప్రతాప్

(ఆశ్చర్యంగా) ఏకంగా అర్డరే!

విజయ్

అవును..(గర్వంగా) నా అన్నయ్యలిద్దరి సంగతీ చెప్పాను...రేపేవచ్చి వాళ్ళను కలుసుకోవాలన్నారు...కల్నల్ ఏవో రెండు మూడు ప్రశ్నలడిగాడు..మీ నాన్నగారు నాకు తెలుసు...ఆయనతో చెప్పావా? అన్నారు..

ప్రతాప్

చిక్కేనే....ఏమన్నావ్?

విజయ్

మొదట ఆయన ఆశయం అదేనండి..కాని. ఇప్పుడు సంశయిస్తున్నారని చెప్పాను.

ప్రతాప్

అవును విజయ్.....ఇంత జరిగాక ఏ తండ్రీ కొడుకును సైన్యంలోకి మాత్రం పంపడు.

విజయ్

కాని నాకేమని పిస్తోందో తెలుసా? మా అన్నయ్యలకు జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకోవాలి. దెబ్బకు దెబ్బ కొట్టాలి. అదీ నా ఆశయం –

ప్రతాప్

కాని నాన్న మాట కూడా అంత తీసి వెయ్యవలసింది కాదు విజయ్....నాన్న యీ ఆరు నెలల్లో అరవై యేళ్ళ ముసలి వాడయినాడు.

విజయ్

అందుకని?

ప్రతాప్

అందుకని, నాన్నకు ఇష్టం లేకుండా నువ్వు వెళ్ళడం మంచిది కాదు, అంటున్నాను.

విజయ్

అన్నయ్యా! నువ్వు – నువ్వేనా ఇలా అంటున్నది!!

ప్రతాప్

తమ్ముడూ! నువ్వు వీరుడవై విజయం సాధించడం నాకుమాత్రం గర్వకారణం కాదూ? కాని నాన్న విషయంలో కూడా మనం ఆలోచించొద్దూ?...నువ్వు వెళ్ళి మూడు రోజులైంది..ఆయనకు నిద్రాహారాలు లేవు. నువ్వు తను తెలియకుండా ఎక్కడ సైన్యంలో చేరతావోనని ఆయన ప్రతిక్షణం బాధపడుతున్నారు. "కాదు నాన్నా! ఒక స్నేహితుడి దగ్గరకు వెళ్ళాడు" అని నేనే ఆయనను సముదాయించాను. తీరా యీ విషయం ఆయనకు తెలిస్తే–

విజయ్

అదే నా భయంకూడా అన్నయ్యా! ఇప్పుడు నాన్నతో యీ విషంయం చెబితే ఎలానూ వెళ్ళనివ్వరు...అందుకని నాన్న యీ మూణ్ణాళ్ళనుంచీ ఏమనుకుంటున్నాడో, ఇప్పుడూ అదే అనుకోనీ –

ప్రతాప్

అంటే –

విజయ్

నేను నాన్నకు చెప్పకుండానే వెళ్ళిపోతాను. పోయి ట్రయినింగ్‌లో చేరగానే ఉత్తరం వ్రాస్తాను.

ప్రతాప్

నాన్నకు నచ్చచెప్పి చూద్దాం –

విజయ్

వృధాశ్రమ అన్నయ్యా!

ప్రతాప్

పోనీ విజయ్! ఆయనకు ఆరోగ్యం కొంచెం బాగున్న తరువాత పోగూడదా?

విజయ్

అన్నయ్యా! దేశానికి నాతో వున్న అవసరాన్ని కొన్నాళ్ళు వాయిదా వెయ్యమనడం భావ్యమా? ఇది చావు బ్రతుకుల మధ్య, గౌరవాగౌరవాల మధ్య, జీవితాశయాల మధ్య జరుగుతున్న సంఘర్షణ...ఇవన్నీ నీకు మాత్రం తెలియవా అన్నయ్యా! నన్ను ఇలాగే వెళ్ళిపోనీ....నాన్నకు తరువాత తెలిసినా ఇబ్బంది లేదు...

ప్రతాప్

తమ్ముడూ! నీ వుద్వేగం హర్షించదగ్గదే! కాని నాన్న సంగతి – ఆయనకు మాత్రం దేశం అంటే ఎంత ప్రేమ, ఎంత గౌరవం, ఎంత భక్తి? ఆయన కాదుట్రా మనలో యీ భావాలు ఉద్బుద్ధం చేస్తుంది?

విజయ్

నిజమే! కాని ఇప్పుడు ? ప్రతి ముసలి తండ్రిమాదిరిగానే నాన్న కూడా ఇప్పుడు స్వార్ధపరుడౌతున్నాడు.

ప్రతాప్

విజయ్! ఏమిటీ! నాన్న స్వార్ధపరుడా! (ఉద్వేగంతో) అవునురా, అవును. కన్నకొడుకులను ఇద్దర్నీ గర్వంగా

వీపుచరిచి యుద్ధానికి పంపడం స్వార్థమే! వీరమరణం పొందిన కొడుకును చూచి కంట తడి పెట్టకపోగా, ఇది నాకు గర్వకారణం అనడం స్వార్థమే! తన రెండో కొడుకు యుద్ధంలో వికలాంగుడైనవాడు – జీవచ్ఛవంలా తన ఎదుటనే బ్రతుకుతుంటే విచారించపోవడం స్వార్థమే! అవునురా! ఇవన్నీ స్వార్థంతో చేసిన పనులే కాదూ?

**విజయ్**

(ప్రతాప్ దగ్గరకు వచ్చి, అతని చేతులు పట్టుకుని) మన్నించు అన్నయ్యా! నా వుద్దేశ్యం అదికాదు. దేశం నలుమూలలా మహా సముద్రంలా పెల్లుబుకుతున్న మీ దేశరక్షణోద్యమంలో నేనూ భాగస్వామిని కావాలని నా ఉబలాటం. అంతేకాని నాన్న తప్పును పట్టేటంత గొప్పవాడినా! అయినా, నేనేం చెయ్యగలను చెప్పు. నాలో ప్రతి అణువు నన్ను సైనికుణ్ణి కమ్మని మేల్కొలుపుతుంది.

**ప్రతాప్**

(నవ్వుతూ) నాకు తెలుసు తమ్ముడూ నీ వుద్వేగం! నువ్వన్నదీ నిజమే!

నాలో అణువణువూ
నన్ను ద్యుద్ధం చేస్తున్నది
నాలో ప్రతినెత్తురు చుక్కా
నా ప్రజ ఉద్రేకంలా ఉరకలు వేస్తున్నది.
నా కోసం నా దేశం కోసం,
నా గౌరవ పరిరక్షణ కోసం
జరుగుతున్న ఈ యజ్ఞంలో
నను సమిధను కానివ్వండి
కలకాలం జీవించేందుకు
నన్నిపుడే ఆత్మార్పణ కానివ్వండి –

**విజయ్**

అవునన్నయ్యా! అదే, అదే! సరిగ్గా నా వుద్దేశ్యం కూడా అదే! ..అయితే ఆలస్యం అయిపోతుంది. నేను వెళ్ళి సామాన్లు తెచ్చుకుంటానన్నయ్యా

(అంటూ త్వరాగా వెళ్ళిపోతాడు. ప్రతాప్ దీర్ఘంగా ఆలోచిస్తూ తమ్ముడి ఫోటోను చేతిలోకి తీసుకుని ఇప్పుడే చదివిన గేయాన్ని తిరిగి చదువుతూ రాస్తూ వుంటాడు. విక్రమ్ వస్తాడు – పుస్తకాలతో)

**విక్రమ్**

అమ్మ దొంగా! నాకు చెప్పలేదేం బాబాయ్?

**ప్రతాప్**

ఏమిటి విక్రమ్?

**విక్రమ్**

నువ్వు పాటలు బాగా రాస్తావుట! నాకు ఒక్కటీ నేర్పలేదేం బాబాయ్?

ప్రతాప్

నీకు వద్దు విక్రమ్.....నువ్వు పెద్దవాడివయ్యేసరికి నీకూ, దేశానికీ నా పాటలు అక్కర వుండకూడదు...

విక్రమ్

ఎందుకని?

ప్రతాప్

ఏమీలేదు.....ఆ! ఆ పాటలు నేర్చుకుంటే తాతయ్య నిన్ను కోప్పడతాడు.

విక్రమ్

తాతయ్యెందుకు కోప్పడతాడు? అడిగొస్తానుండు –

(ఇంతలో పెరుమాళ్ళు వస్తాడు)

పెరుమాళ్ళు

ఎవరు? ప్రతాపా?..విన్నావా ఈ సంగతి? నాకు తెలియక అడుగుతాను..ఈ కాలం పిల్లలంతా ఇంత బరితెగించారేమంట?

ప్రతాప్

ఏమయింది?

పెరుమాళ్ళు

మీ విజయ్ సైన్యంలో చేరేది చాలక మా వాణ్ణికూడా లాక్కుపోవడం ఎందుకూ? నాకు తెలియకడుగుతాను, హాయిగా చల్ల కదలకుండా ఇంట్లో కూర్చోండర్రా అంటే వీళ్ళకీ దుర్బుద్ధి ఏమిటంట?

ప్రతాప్

(నవ్వి) ఒక్కొక్కళ్ళకీ ఒక్కొక్క దుర్బుద్ధి వుంటుందండీ! మీరు ముప్పూటలూ తింటూ చీట్ల పేకతో మీ ఆస్తి అంతా ఖరారవుడి చుట్టించుకోవడం మీ మంచి బుద్ధా? ఏ బుద్ధి నున్నాడో మీ అబ్బాయి సైన్యంలో చేరతానంటే అది దుర్బుద్ధా?

(విక్రమ్ తాతగారితో సహా వస్తాడు)

తండ్రి

ఏమిట్రా విక్రమ్? నువ్వు రానురాను మరీ చిన్నపిల్లవాడివై పోతున్నావు?

విక్రమ్

కాదు తాతయ్య! బాబాయి అన్నీ అబద్ధాలు చెబుతున్నాడు..బాబాయి రాశిన పాటలు నేను నేర్చుకుంటే నువ్వు కోప్పడతావంటున్నాడు! చూశావా!..నాకు కూడా నేర్పమని చెప్పు తాతయ్యా!

తండ్రి

(విషాదంగా నవ్వి) ఇంకా పెద్దవాడివయ్యాక అలాగే నేర్చుకుందువుగాని నాన్నా! ఇప్పుడు పోయి చదువుకో! ఏరా విజయ్ రాలేదు కదా?

(ప్రతాప్ తలవంచుకొని మాట్లాడదు)

ఎక్కడున్నాడో కబురు కూడా చేయలేదుగా?

**విక్రమ్**

అదేమిటి తాతయ్యా! విజయ్ బాబాయ్ ఎప్పుడో వస్తే!

**పెరుమాళ్ళు**

అవునండీ! చాలాసేపైందిగా వచ్చి! మావాడు, మీవాడు కలిసే నిర్వాకం చేస్తున్నారట!...(అనుమానంగా) అయితే. మీ వాడు కూడా మీకు చెప్పి వెళ్ళలేదన్నమాట! ఔరా! ఎంత సాహసం!

(ముసలాయన బిత్తరపోయి పెరుమాళ్ళు వంక చూస్తాడు)

**ప్రతాప్**

(పెరుమాళ్ళతో) ఎందుకయ్యా! అట్లా పిలవని పేరంటానికొస్తావ్?

**పెరుమాళ్ళు**

బావుందయ్యా! కూసే గాడిదొచ్చి మేసేగాడిదని చెడగొట్టిందనీ! మీ తమ్ముడు వచ్చి మా అబ్బాయిని లాక్కుపోతే లేదుగాని, నేను అడిగితే తప్పొచ్చిందా? దీనికంతకీ కారణం మా వెధవ వెర్రివెంగళప్ప కావడమే! గరిట కాల్చి వాత పెడితే వెధవ ఎక్కడికి కదుల్తాడో చూస్తా (అంటూ వెళ్ళిపోతాడు)

**విక్రమ్**

బాబాయ్ పై గదిలో ఏమిటో సర్దుకుంటున్నాడు – నేను వెళ్ళి పిల్చుకొస్తాను తాతయ్యా!

(లోనికి వెడతాడు)

(ఇంతలో మరో గుమ్మంలోనుంచి విజయ్ వస్తాడు. ప్రయాణానికి సిద్ధమై...అకస్మాత్తుగా తండ్రిని చూసి నిర్ఘాంతపోతాడు. సంచీ అక్కడ పెట్టి, తండ్రికి దగ్గరగా వచ్చాడు.)

**ప్రతాప్**

నాన్నా, విజయ్......

**తండ్రి**

ప్రతాప్! చెప్పవలసింది ఏమన్నా వుంటే వాడినే చెప్పనీ!

**విజయ్**

నేను వెళ్ళడానికే నిశ్చయించుకున్నాను నాన్నా!

**తండ్రి**

ఎక్కడికి?

**విజయ్**

మాతృఋణం తీర్చుకోవడానికి.

**తండ్రి**

పితృఋణం తీర్చుకోవలసిన అవసరం లేదనుకున్నావా?

విజయ్

నాన్నగారూ! మీకు మాత్రం తెలియదూ? ఏ ఒకవ్యక్తి తృప్తికోసం దేశం కోసం మేము చెయ్యవలసిన విధిని – విడనాడకూడదని మాకు ఉగ్గుపాలతో నూరి పోసింది మీరు కాదూ?

తండ్రి

అవునురా! అవును! అలా చేసినందుకు ఇప్పుడు మంచి శిక్షే విధిస్తున్నావు!

ప్రతాప్

అలా అనకండి నాన్నా! విజయ్ మాత్రం బాధగా లేదంటారా. కాని –

తండ్రి

ప్రతాప్! నేనూ ఒకప్పుడు సైనికుణ్ణే! మాతృశృంఖలాలు విచ్ఛేదన కోసం జరిగిన ప్రతి మహోద్యమంలోను నేనూ ఒక సైనికుణ్ణె ముందు నిలిచాను...మాతృసేవలో వుండే ఆనందం నాకూ తెలుసు.....కాని – కాని, విజయ్! పెద్దతనంతో పాటు స్వార్ధం కూడా ముంచుకు వస్తున్నదేమో నాఉ.....ఇది మనోవ్యధ విజయ్.....మనో వ్యధ..నువ్వు ఆరు నెలల పసికూనవు..మీ అమ్మ మరణిస్తూ మీ ముగ్గుర్ని నా చేతుల్లో పెట్టి "పిల్లలు జాగ్రత్త సుమండీ" అంటూ మరణించింది.

అలాగే జాగ్రత్తగా పెంచాను...ముగ్గురికి ఒక్క కంచంలో అన్నం కలిపిపెట్టే వాడిని. ఆ అన్నంలోనే మాతృభక్తిని కూడా రంగరించి మీచేత గోరుముద్దలు తినిపించాను. నాకు తెలుసు, నా బిడ్డలు అకుంఠిత ధైర్య సాహసోపేతులని, మాతృరక్షణకు కంకణం కట్టుకున్న ధీరోదాత్తులని. కాని ఇవ్వాళ అనిపిస్తున్నది, చేసింది పొరపాటు అని.

విజయ్

కాదు నాన్నగారూ! ఎన్నటికీ కాదు. అదే మాకీనాడు శ్రీరామరక్ష.

తండ్రి

కాని నా సంగతి నువ్వు ఆలోచించడం లేదు విజయ్......ఇద్దరు కొడుకులు..ఒకడు శవంగా, మరొకడు జీవచ్ఛవంగా నా ముందుకు వచ్చినప్పుడు నా హృదయం ఒక్కసారిగా వెయ్యి ముక్కలైంది..ఇంకా నేను బ్రతికి వున్నానంటే కారణం తెలుసా? నువ్వే........

ప్రతాప్

అవును విజయ్.....నాన్నగారు అన్నది అక్షరాలా నిజం.....నాన్న గారు ముసలివారయ్యారు. నేనా, అవిటి వాణ్ణి. విక్రమ్ చిన్నవాడు. ముగ్గురమూ ఆసరా లేనివాళ్ళమే! నువ్వు లేకుండా మా ముగ్గురి జీవితాలను ఒక్కసారి ఆలోచించు.

తండ్రి

అవున్నాయనా! ఒక కొడుకు ఎలానూ పోయాడు. మరోడు హతగాత్రుడు. మాకీ చివరిరోజుల్లో గుక్కెడు గంజి పోసేవాళ్ళు కూడా లేకుండా చేసిపోతావా? నా మాటవిను విజయ్...చనిపోయిన ఆ అన్నయ్య కోసం నీ ఎదట కన్పించే యీ అన్నయ్యకోసం, నా కోసం ఈ ప్రయత్నం మాను.

ప్రతాప్

అవును తమ్ముడూ! ముగ్గురు గుడ్డివాళ్లను నడివీధిలో వదిలివేసి నట్టుగా వుంది మా పని. మా జీవితానందం నువ్వు. నువ్వే!

విజయ్

అన్నయ్య! ఇప్పుడే కదూ, నీకు ఏ ఆటంకమూ చెప్పను, నీ ఇష్టం అన్నావు. నువ్వు నాన్నకు నచ్చ చెప్పవలసింది పోయి....

తండ్రి

ఇందులో నచ్చ చెప్పే టందుకేముందిరా? నువ్వే ఆలోచించు. నా యీ ముసలితనంలో నాకు మనో ధైర్యాన్ని, ఆనందాన్ని యిస్తావనుకున్నా, కాని ఈ గుండెలమీద ఇంకా కుంపటి రగిలించి వెళ్ళకు. మాతృదేశం రక్షణకు వేలాది తనయులు ముందుకు ఉరుకుతున్నారు. కాని నాకు – నాకు ఉన్నది ఒక్కడే కొడుకు ఒ....క్క....డే. కొ......డు......కు.–

(ఈ మాటలకు విజయ్ మ్రాన్పడిపోతాడు. విచలితుడౌతాడు...కాని మరుక్షణంలో ఏదో నిశ్చయించుకుని ధైర్యం చిక్కబట్టుకుని – తాను తన సామాను తీసుకుని తండ్రి దగ్గరకు వస్తాడు "వస్తాను నాన్నగారూ!" అంటాడు. తండ్రి ముందు బిత్తరపోతాడు. తరువాత కోపం ముంచుకువస్తుంది)

తండ్రి

కాటికి కాళ్ళుకాచుకొని కూర్చున్న తండ్రి మాటను కూడా కాదని వెడుతున్నావు...మంచిదే! నేనూ ఒకప్పుడు నా తల్లిదండ్రులను కాదని ఇలానే చేశాను. ఇప్పుడు పశ్చాత్తాపడుతున్నాను. ఒకనాడు నువ్వుకూడా ఈ ముసలి తండ్రికి నువ్వు కలిగించిన వ్యధకు పశ్చాత్తప్తుడివి కాకపోతావా?..ఈ సంగతి నేను పోయిన తరువాత కాని నీకు తెలిసిరాదురా –

ప్రతాప్

(వారిస్తూ) నాన్నా –

విజయ్

క్షమించండి నా నిశ్చయం మారదు.....త్వరలోనే విజయంతో తిరిగిరావాలని ఆశీర్వదించండి.

తండ్రి

(పట్టరాని కోపంతో) ఆ, వస్తావు....వెళ్ళురా, వెళ్ళు. కన్నతండ్రి ఇంత ప్రాధేయపడి అడిగినా నీ హృదయం కరగలేదు కదూ! వెళ్ళు. నా ముందు నుంచి తక్షనం వెళ్ళు – వెళ్ళు......

(తండ్రి కుర్చీలో కూర్చుండిపోతాడు. విజయ్ మెల్లగా తండ్రి దగ్గరకు వచ్చి ఆయనకు నమస్కరించి, అన్నగారి పటానికి నమస్కరించి, చిన్న అన్నగారి అనుమతి తీసుకుని వెళ్ళిపోతాడు.

తండ్రి దీనంగా మతి లేనవాడిలా చూస్తూ వుంటాడు...ప్రతాప్ అటు తమ్ముణ్ణి కాదనలేక, ఇటు తండ్రిని అనునయించనూ లేక బాధపడుతూ వుంటాడు...)

**తండ్రి**

(కొడుకు పోయిన దిక్కుగా చూస్తూ)

విజయ్!....ఈ ముసలి తండ్రి కంటె నీకు దేశమే ముఖ్యంకదూ! (అని పిలుస్తూ) బాబూ విజయ్.......(అంటూ అరుస్తాడు..విషాదంగా –)

**ఫ్లాష్‌బ్యాక్ అయిపోతుంది.**

(తిరిగి లైట్లు వెలిగి ఆరిపోతాయి......తండ్రితోపాటు ప్రతాప్ కూడా ఏదో ఊహాలోకంలో విమరించినట్లుగా ఉన్నాడు....

తండ్రి, తిరిగి యీ ప్రపంచంలోకి తిరిగి వచ్చాడు.)

**తండ్రి**

బాబూ.....విజయ్! వస్తున్నావు కదూ......

(చేతిలోని ఫోటో క్రిందపెట్టేస్తాడు. వాకిట్లో ఎవరో వచ్చిన చప్పుడు)

**తండ్రి**

ఎవరూ?....

(పెరుమాళ్ళు వస్తాడు)

**పెరుమాళ్ళు**

నేను రాజారావుగారూ! పెరుమాళ్ళుని –

**తండ్రి**

నువ్వా!

**పెరుమాళ్ళు**

అబ్బాయి వస్తున్నాడని విన్నాను....నిజమేనేమో తెలుసుకు పోదామని –

**తండ్రి**

నిజమేనయ్యా! ఈ పాటికి వస్తూ వుండాలి....నా తండ్రి విజయుడై ఇంటికి వస్తున్నాడయ్యా!

**పెరుమాళ్ళు**

అవునవును..మీరు మాత్రం పట్టుదలతో మీ అబ్బాయిని రప్పించుకొంటున్నారు. మా వాడు యుద్ధంలోకి పోతే నేను పిలిపించుకోగలిగే వాడనా? మీ సామర్థ్యం, పలుకుబడి

(వాకిట్లో "రాజారావుగారూ" అని పిలుపు)

**తండ్రి**

ఎవరది? ..బాబు వచ్చినట్టున్నాడురా! చూడు...

**ప్రతాప్**

ఎవరది?

(గుమ్మం వరకు పోగానే అతనికి ఇద్దరు సోల్జర్లు ఎదురుగా వస్తారు)

ఎవరు?

**సోల్జరు 1**

మేము...మేము విజయ్ తోటి సైనికులం..యుద్ధభూమినుంచి విజయ్‌తోపాటు వచ్చాం.

**పెరుమాళ్ళు**

ఓహో మీ నాన్నలు కూడా మిమ్మల్ని పిలిపించుకుంటున్నారా యేం? ఎందుకయ్యా! ముసలివాళ్ళను కష్టపెడుతూ ఉద్యోగాలు! (అంటూ తన తెలివికి తనే మురిసిపోతున్నట్టు నవ్వుతాడు)

**తండ్రి**

మరి మా విజయ్ ఏడి బాబు?

**సోల్జర్ 2**

వస్తున్నాడు...మాతోనే వచ్చాడు..

**తండ్రి**

ఏడీ..వాడి కోసమే కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నాం..ఇంకా తండ్రిని ఏడ్పించాలని చూస్తున్నాడు కదూ!

**సోల్జర్ 1**

విజయ్ చూపిన మహత్తరమైన ధైర్య సాహసాలకి ప్రభుత్వం ఎంతగానో అభినందిస్తోంది....ఇదుగో! ఇది అభినందన పత్రం..

**తండ్రి**

(తీసుకుని) నిజంగా!! నా బిడ్డ! అవును నా బిడ్డ చెయ్యకపోతే ఎవరు చేస్తారయ్యా?....అదుగో ! (పటం చూపిస్తూ) నా పెద్ద కొడుకు.....సంవత్సరం క్రితం ఇదే యుద్ధంలో మాతృరక్షణ కోసం, యుద్ధభూమిలో మరణించిన వీరాగ్రేసరుడు!! నా యీ రెండో బిడ్డను చూశారా? యుద్ధంలో తుపాకీ గుండ్లు దూసుకుపోయి అంగవైకల్యం వచ్చినా అట్లాగే వైరి వీరులను చెండాడిన యోధుడు! అటువంటి అన్నటకు తమ్ముడు..వాడు, వాడు కాకపోతే ఎవరు చూపుతారయ్యా ధైర్యసాహసాలు?

(మళ్ళీ ఆ అభినందన పత్రం చూచి, ప్రతాప్‌కు ఇస్తాడు. ప్రతాప్ అభినందన పత్రం చూచి నిర్ఘాంతపోతాడు. అతనికి పట్టరాని దు:ఖం కలుగుతుంది. కాని తండ్రికి చూపకుండా దిగమ్రింగడానికి ప్రయత్నిస్తూ వుంటాడు.)

**సోల్జర్ 2**

అంతేకాదు..మొన్నటి యుద్ధంలో విజయ్ ఎన్నో శత్రువుల టాంకులను ధ్వంసం చేశాడు. ఎందరో శత్రువులను హతమార్చాడు. ఇదంతా ఒక్కడూ – ఎవ్వరి సహాయం లేకుండా చేసి ఎంతో పరాక్రమమూ ప్రదర్శించాడు. అందుకు గాను అతన్ని అభినందిస్తూ, అతని కుటుంబానికి ఏభైవేల నగదు కూడా బహూకరింపబడింది.

(ప్రతాప్ దు:ఖం ఇనుమడిస్తుంది. "నాన్నా" అంటూ ఏదో చెప్పబోతాడు. తండ్రి దానిని గమనించడు.)

**తండ్రి**

నాకు తెలుసు! నా తండ్రి నాకు కీర్తి ప్రతిష్టలు తెస్తాడని..ఏడీ, నా తండ్రి ఏడీ?...బాబూ....విజయ్.....

**సోల్జర్ 1**

తీసుకుని వస్తాం –

(సోల్జర్లు బయటకు వెడతారు. ప్రతాప్ తండ్రికి తన దు:ఖం చూపలేక ముఖం చాటేసుకుంటాడు.అప్పుడే వచ్చిన విక్రమ్‌ను దగ్గరకు తీసుకుంటాడు. తండ్రి ఆత్రంగా రెండు అడుగులు వేస్తాడు)

**తండ్రి**

(ప్రతాప్ దగ్గరగా వచ్చి) ఇంకా విజయ్‌కి నా మీద కోపం తగ్గలేదల్లే ఉంది ప్రతాప్! విజయ్ (రెండు అడుగులు వేస్తాడు)

**ప్రతాప్**

(ఎంతో బాధతో, మెల్లగా, ఏడుస్తూ)

నా.....న్నా!

సైనికులు మరణించిన విజయ్‌ని ఒక శవపేటికలో తీసుకుని వస్తారు. ఆ పేటిక వంక చూసేసరికి తండ్రికి సర్వమూ తెలుస్తుంది. ఆ పేటిక వైపు, ప్రతాప్ వైపు, సోల్జర్‌ల వైపు పిచ్చిగా చూస్తూ వుంటాడు....సోల్జర్లు, పేటిక తెరుస్తారు)

**పెరుమాళ్ళు**

అయ్యో.....అయ్యో......

**తండ్రి**

బా.....బూ!వి....జ....య్! నువ్వా! నిన్ను ఇట్లా చూడడానికేనా నాయనా నేను ఇంకా బ్రతికివుంది! ఇంత అన్యాయం చేసిపోతావా? (దు:ఖిస్తాడు)

**ప్రతాప్**

తమ్ముడూ!..మళ్ళీ వస్తానని చెప్పి వెళ్ళావుకదూ! ఈ అవిటి అన్నయ్యకు శేషజీవితం నందనవనం చేస్తానన్నావు కదూ! నా పాటలు దేశం నలుమూలల్లో ఎలుగెత్తి పాడతానన్నావు –

నా గుండెల్లో గుండెగా,

నా దు:ఖలను దిగమ్రింగే కాల

హరుడిలా నా ముందు ఆనందం

చిందిస్తానన్నావు కదూ!

నువ్వు యీ అవిటివాడికిచ్చిన మాటను ఇలా నిలుపుకున్నావా?..విజయ్......

**పెరుమాళ్ళు**

అనుకున్నంతా అయింది...యుద్ధంలోకి పోవద్దయ్యా అంటే తండ్రి మాట విన్నాడూ?

**సోల్జర్ 1**

రాజారావుగారూ! మీ అబ్బాయి ఎంతటి సాహసకార్యాలు చేశాడో తెలుసా? ఒంటరిగా ఒక కంపెనీని ఎదుర్కోవడమన్నది ఇంతవరకు ఏ సైనికుడు చెయ్యని వీరోచిత కార్యం – అది విజయ్ చేశాడు.....

**సోల్జర్ 2**

దానికి ప్రతిఫలమే ఇది!

**సోల్జర్ 1**

నవ్వుతూ ప్రాణాలు వదిలాడు విజయ్.

**తండ్రి**

(ఇవ్వేమీ వినకుండా) నాన్నా.....ఇంకా నీకు నాన్న మీద కోపంగానే వుంది కదూ?..మాట్లాడవూ?

**ప్రతాప్**

నా.....న్నా....

**తండ్రి**

(వినిపించుకోకుండా) నీ మాట వినడం కోసం, నిన్ను చూసి ఆశీర్వదించడం కోసం, ఆరు నెలలనుంచీ కలలు కంటున్నాను రా!

**విక్రమ్**

(ఏడుస్తూ) బాబాయ్! చిన్న బాబాయ్ –

**ప్రతాప్**

విక్రమ్!...చిన్న బాబాయ్ ఇంక లేవడు నాన్నా...మనతో మాట్లాడడు..చిన్నబాబాయ్ చనిపోయాడు నాన్నా!

**తండ్రి**

విజయ్! ఇదంతా నేను చేసుకున్నదే! నువ్వు యుద్ధంలోకి వెడతానన్నప్పుడు కోపంతో "వెళ్ళు" అన్నాను కదూ! నా అపశకునపు మాటలే నీ పాలిటి తుపాకి గుళ్ళు అయ్యాయి నాయనా!

**ప్రతాప్**

ఊరుకోనాన్నా! విచారించి ఏం లాభం? మనల్ని దురదృష్టం ఇలా వెంటాడుతోంది. మన అందర్నీ అనాథలను చేసిపోయాడు వాడు...

**తండ్రి**

విజయ్! నా మీద కోపమయితే నాతో మాట్లాడకు...కాని నీ చిన్నన్నయ్యడా! నీ కోసం వచ్చాడు..కళ్ళు విప్పి చూడు నాయనా! ఇడుగో! నువ్వు నిజమైన దేశ సేవకుణ్ణి చేయాలని కలలు కన్న నీ విక్రమ్..నిన్ను గురించి

అడుగుతున్నాడు...మమ్మల్ని అందర్నీ ఏం చేసి పోయావు బాబూ!

**సోల్జర్ 1**

అతని అకాల మరణానికి సానుభూతిగా అతని కుటుంబానికి యిచ్చిన ఏభైవేల రూపాయల పారితోషికం ఇదిగో - (చెక్కు ఇస్తాడు)

**తండ్రి**

(చెక్కు విసిరిపారేస్తూ) నా తండ్రే ఈ లోకంలో లేనప్పుడు నాకీ డబ్బుతో పనేమిటి?

**పెరుమాళ్ళు**

పోయిన కొడుకుతో మనమూ పోతామా? అందుకని సిరి వస్తూ వుంటే మోకాలు అడ్డుతామా? (చెక్కు తీసుకోబోతాడు)

**తండ్రి**

పెరుమాళ్ళూ! డబ్బుతో మనుషుల ప్రాణాలను వెలకట్టలేరు - అందులోనూ నా విజయ్ ప్రాణాలను - వెళ్ళండి..అందరూ వెళ్ళండి....

**సోల్జర్ 1**

బాబూ! మీరు కొంచెం స్వస్థత పొందాలి. ...మనుషుల జీవితాలకు ఎవ్వరూ డబ్బుతో వెలకట్టలేరు. నిజమే! కాని దేశం కోసం తాన తృణప్రాయంగా ప్రాణాలర్పించిన అతని మీద ఆధారపడియున్న అతని కుటుంబ సభ్యులకు ప్రభుత్వం సహాయం చేసి తీరాలి. అందుకే ఈ పారితోషికం -

**పెరుమాళ్ళు**

ఇదంతా దురదృష్టం కాకపోతే - కొడుకు వస్తున్నాడు కదా అని కొండంత సంబరంతో ఎదురు చూస్తూ వుండడం ఏమిటి? ఇంతలో యీ ఘోరకవి ఏమిటి? ప్చ్....ఏమిటో!

**తండ్రి**

భగవాన్!.....ఈ శిక్ష పగవాడికి కూడా వద్దు.......అరగంట క్రింత కొడుకు వస్తున్నాడన్న ఆనందం.....ఇప్పుడు కొడుకు రానే రాడన్న దు:ఖం ఇంతలో నా గుండెల్లో మిణుకు మిణుకుమంటున్న ఆ చిన్నదీపం కూడా ఆర్పావా? ఇంకా నేను బ్రతికెందుకు? విజయ్! నేనూ నీ దగ్గరకే వస్తున్నాను నాయనా! (అంటూ ఆ శవపేటికికు తలకొట్టుకుంటాడు)

**ప్రతాప్**

(దు:ఖంతో) నాన్నా! మీరే అలా అంటే నా గతి ఏమిటి? నా బ్రతకును గురించి నే నేమనుకోవాలి? నన్ను చూచిన ప్రతి నిముషం మీకు తీరని వ్యధగా వుంటుందని నీకు తెలుసు.....కాని మన ఇద్దరం (విక్రమ్‌ను చూపుతూ) ఈ పసివాడికోసమేనా జీవించాలి.....తప్పదు...

**విక్రమ్**

(ఏడుస్తూ) తాతయ్యా!

**తండ్రి**

విక్రమ్ (కొంచెం తేరుకుని  సైనికులతో) బాబూ! విజయ్ వెళ్ళిపోతూ ఈ ముసలి తండ్రికి ఏమీ చెప్పిపోలేదూ?... కనీసం నన్ను క్షమించాననైనా చెప్పలేదూ?

**సోల్జర్ 2**

క్షమించండి.......బలమైన గాయలు తగిలాక విజయ్‌ని మా స్థావరాలకు చేర్చాం...అప్పటికింకా స్పృహ ఉంది అతనికి...అప్పుడు విజయ్ మా కల్నల్‌ను ఒక తుది కోరికి కోరాడు..తన దేహాన్ని తన తండ్రికి వప్పగించాలని ....సాధారణంగా అలా జరగదు. కాని విజయ్ చూపిన పరాక్రమానికి ప్రతిగా మా కల్నల్ తద్వారా ప్రభుత్వం అందుకు అంగీకరించాయి.

**ప్రతాప్**

అంతేనా? ఇంకేమీ చెప్పలేదూ?

**సోల్జర్ 2**

అంతేకాదు..విజయ్ తన చివరి విన్నపంగా తండ్రి గారికి వ్రాయించిన ఉత్తరాన్ని వారి అందించాలని కూడా మాకు వుత్తరువు.

**తండ్రి**

ఎవరు! విజయ్! నాకు వుత్తరం వ్రాశాడా? ఏదీ? నా బాబు వ్రాసిన వుత్తరం ఏదీ? నన్ను చూడనివ్వండి.....

(సోల్జర్ 1 ఉత్తరం తీసి ఇస్తాడు.)

**తండ్రి**

ఓహో! నేను చదువుకోగలిగితే ఎంత బావుండును?..ప్రతాప్ త్వరగా చదువు.....

**ప్రతాప్**

(ఉత్తరం తీసుకుని చదువుతాడు)

నాన్నగారూ –

నమస్కారాలు.. మిమ్మల్ని చూడాలన్న కొండంత ఆశతో వస్తున్నాను. కాని విధి కృతం – మీరు నన్ను చూడగలుగుతున్నారు. కాని నేనే మిమ్మల్ని చూడకుండా వెళ్ళిపోతున్నాను. క్షమించండి ఆనాడు మీ కోరికి నెరవేర్చలేదు. ఈనాడు నెరవేర్చడం లేదు. ఎంతటి కృతఘ్నుణ్ణి –

**తండ్రి**

బా.........బూ!.....(ఏడుస్తాడు)

**ప్రతాప్**

(దు:ఖాన్ని మ్రింగి, చదువుతూ)

నాన్నగారూ! జరిగిన యీ సంఘటన మిమ్మల్ని ఎంత క్రుంగదీస్తుందో నాకు తెలుసు...కాని మీరు ధైర్య చిక్కబెట్టుకోవాలి..మీరు నాకు ఉగ్గుపాలతో – ఎవరి రక్షణ కోసం ప్రాణాలను సైతం త్యాగం చెయ్యాలన్న సూత్రాన్ని రంగరించి పోశారో – ఆ మాతృభూమికి నన్ను నేను త్యాగం చేసుకున్నాను. ఇవ్వాళ నాకు ఎంతో గర్వంగా వుంది.. మీరు నాకు తండ్రి అయినందుకు నేను ఎంతో గర్విస్తున్నాను.

(తండ్రి విషాదంగా నవ్వుతాడు)

కాని – నాన్నగారూ –

మీరు చిరకాలంగా నమ్మిన ఈ సూత్రాన్ని మధ్యలో కలిగిన యీ విఘాతం తో విస్మరించకండి. మీ ముద్దుల కొడుకు చివరి కోరిక ఇది: మీ ధ్యేయం, మీ త్యాగం, అమోఘమైనవి. భారత జాతిని ఏనాటికైనా రక్షించగల సూత్రం అదే!

నాన్నా ఇదే సూత్రాన్ని మన కుటుంబం లోని ప్రతి నలుసూ నేర్చుకునేటట్లు, మీలా, అన్నయ్యల్లా, నాలా, దేశమాత రక్షణార్ధం, ప్రాణాలనయినా ఆనందంగా, గర్వంగా త్యజించగలిగేటట్లు చేసే బాధ్యత మీది.... ఇంతే సంగతులు మీకు అన్నయ్యకు ఎన్నివేల నమస్కారాలు చేసినా తక్కువే! విక్రమ్‌ను నిజమైన వీరుణ్ని చేయండి. ప్రతి యువకుణ్ణీ దేశం పిలుస్తోంది. జైహింద్......

మీ విజయ్.

**ప్రతాప్**

ఎంతటి నిజం చెప్పావు విజయ్. నీ నిదానమే మాకు ఊపిరి నీ నమ్మకమే మాకు ఊపిరి నీ నమ్మకమే మీకు మార్గదర్శి ఆదర్శం. నిన్నూ, నీ సాహసకార్యాలను జ్ఞాపకం తెచ్చుకుంటేనే మా ఒళ్ళు పులకరిస్తోంది – నువ్వు చెప్పిందే నిజం విజయ్..నువు చెప్పిందే నిజం. మాలో ప్రతి ఒకడూ సైనికుడే మాలో ప్రతి ఒకడూ దేశమాత పాదాల దగ్గర భక్తి వినమ్రతలతో పడి ఉండే పాదరేణువే! నీలా ధైర్యంగా సాహసంగా, నమ్మకంగా వుండాలని, ఉద్బోధించావు...నీ మాటలు నిజం తమ్ముడూ, నీ మాట నిజం – మాతృదేవోభవ మాతృదేవో భవ..

**తండ్రి**

(ఉత్తరం తీసుకుని, తదేకంగా చూస్తూ)

అవును..విజయ్! బ్రతికి వుండీ, మరణించీ కూడా నాన్నకు మంచి పాఠం నేర్పావునాయనా! ఎంతటి సత్యం చెప్పావు! స్వార్ధంకోసం, ఇన్ని యేళ్ళనా ఆశయాలనూ ఒక్క క్షణంలో కాలదన్నావు. నా మాతృదేశాన్ని ఇన్నాళ్ళ కొలిచి, ఆపదలో వెన్ను యిచ్చిన సైనికుడిలా, పిరికిపంద నయ్యాను – క్షమించు విజయ్...నీ కడసారి కోర్కె వమ్ము కానివ్వను. మన వంశంలో పుట్టిన ప్రతి నలుసూ దేశసేవకు అంకితమయిన వీరుడే! నేను –? నేనూ వీరుణ్ణే! నేనూ సైనికుణ్ణే అదుగో! దేశం పిలుస్తోంది. నా దేశం పిలుస్తోంది.

వందే మాతరం!

వందేమాతరం!!

వందే...........

(అని బిగ్గరగా నినాదం చేస్తూ....కొడుకు శవపేటిక ప్రక్కనే క్రింద పడిపోతాడు)

అందరూ అదుర్దాగా అతని దగ్గరకు పరిగెత్తుకువస్తూ వుండగా తెర.

తెర వెనక విషాదంగా,

“జననీ జన్మభూమిశ్చ

స్వర్గాదపి గరీయసి”

# కల........కాపురం

మహానగరపు సంకీర్ణ ధ్వనులు రథోత్సవం నాడు జరిగే మహోత్సవంలా అట్టహాసంగా వినిపిస్తూ వుంటయ్.... జనం చేసే రొద. మిల్లుల కూతలు. వాహనాల అరుపులు. మొదలగు ధ్వనులు –

**సత్యం:** క్షణం తీరిక లేని ఇరవయ్యో శతాబ్దం మనవుడిలా, నగరం నిరంతరం ఏదో ధ్వని చేస్తూనే వుంది. సాయంకాలం ఆరు గంటల వేళ మా మహారాజ సౌధానికి ఎదురుగా నిలబడితే, నన్ను చూచుకున్న నాకే జాలి, నాలో నాకే గర్వం......చెరిపివేసిన ముగ్గులు, చెదిరిపోయిన కాంతిలో, చెదిరిపోయే హృదయాలతో, విరిగిపోయిన జీవిత సకలాలను అతికించుకోవాలని ఆరాటపడే మనుషులే యీ మేడలో ఉన్నారు...ఉన్నవాళ్ళు చాలక నాలుగు రోజుల్నించి కొత్తగా యీ అమ్మాయి కనిపిస్తోంది. చిత్రంగా ఉంది యీవిడ మనస్తత్వం....

ఒక్కొక్కప్పుడు చీమచిటుక్కుమన్నా బెదిరిపోతుంది....ఒకప్పుడు బ్రహ్మాండం బ్రద్దలై పోయినా చలించదు....ఇంత సేపటినుంచి ఇక్కడ నిలబడ్డాను. ఆవిడ దారికి అడ్డంగాలేస్తే లోపలకు వెడదామని. ఆవిడ యీ ధ్యాసలో వున్నట్టు లేదు.....ఏమండీ, మిమ్మల్నే. కొంచెం అడ్డులేస్తారా......?

జానకి: కంగారుగా – ఓ.....చూడలేదు.

**సత్యం:** చూసికూడా లేవకుండా వుండడానికి నామీద మీకేమయినా పగా..? పరధ్యానంలో వున్నట్టున్నారు.

**జానకి:** అవునండి. కొంచెంసేపు ఇలా వరండాలో నిలబడితే, యీ లోకాన్నే మరిచిపోయి హాయిగా వుండవచ్చు.

**సత్యం:** హాయిగా వుండడానికి ఇదో కొత్తమార్గం ఉందని నా కింతవరకు తెలియదు. సుమండీ...అయినా ఆ వరండాలో నిలబడినా కనిపించే వన్నీ పాత ముఖాలేగా...మచ్చుకు ఓ పది రకాల కార్లు, పదిరకాల మనుష్యులు –

**జానకి:** అంతేనంటారా, యీ అవధుల నన్నింటిని దాటి ఆవలి తీరం చూడలేమా? నిత్యమూ శాంతీ, సౌఖ్యమూ వెలిసే ప్రశాంతమైన ప్రదేశం, భ్రాంతిని మింగి, శాంతిని ప్రసరింపచేసే కాంతి –

**సత్యం:** (నవ్వుతూ) బావుందండీ...వెనకటి వేదాంతులందరూ వున్నదానికి మెరుగులు దిద్దిన వారే....మీరు అసలు ఏమీ లేకుండానే అంతస్థులు కట్టేస్తున్నారే...వసంతోదయాన్ని ప్రకృతిని వర్ణించేటప్పుడు కనీసం సరివి చెట్లని, సముద్రం ఇసుకనూ జ్ఞాపకం వుంచుకోండి...ఓ నేను ఇక్కడే నిలబడి మాట్లాడుతున్నాను..ఇప్పుడైనా లోపలకు రానిస్తారా?

**జానకి:** అరె, నేను అడ్డంగా వున్నానా, క్షమించండి.

**సత్యం:** ఫరవాలేదులెండి...మీరు అడ్డుగా వున్నా, లెమ్మనగానే లేచారు. లేవని వాళ్ళ మాట.....అడ్డు ఆటంకాలు తొలగమనగానే తొలిగితే రూళ్ళ కర్రలా జీవితం సాఫీగానే నడిచేది కదండీ...

**జానకి:** ఇప్పుడు మాత్రం...........

సత్యం: దాని తాత్పర్యం ఇప్పుడలా లేదనే....ఆ, చూడండి. చిన్నప్పుడు నన్ను 'టిక్కు టిక్కు' అని పిలిచేవాళ్ళు. అది గడియారానికి పర్సానిఫికేషన్. ఆ రోజుల్లో నేను చాలా నియమంగా పనులు చేసేవాణ్ణి...ఇప్పటికీ నేను గడియారం లాంటి మనిషినేనండి..మీరు కీ ఇచ్చి వదిలితే, కీ పూర్తి అయేదాకా అలారం ఆగదు. అందువల్ల ఇచ్చేటప్పుడు కొంచెం జాగ్రత్తగా, తగు మోతాదులో ఇవ్వండి.

జానకి: మీరు ఎక్కువగా మాట్లాడుతున్నామంటారా. నాకు మంచినీళ్ళ కుండలా వుంది...నాలుగు రోజులయింది వచ్చి.....ఒక్కరూ మాట్లాడరే. ఇదే మా పిన్నిగారి ఊరు అయితేనా? ఆ వూళ్ళో నేను వెళ్ళగానే, ఎరిగిన వాళ్ళు, ఎరగని వాళ్ళు అంతా వచ్చి ఆప్యాయంగా పలకరించే వాళ్ళు.

సత్యం: ఇది మీ పిన్నిగారి వూరుకాదా......వస్తానండి....యీ యముడి కోసం కొన్ని జీవాలు కాచుకుని ఉంటాయి.

జానకి: అదేమిటి...?

సత్యం: ఉత్ప్రేక్ష లెండి...మరోసారి చెబుతాను. ఇప్పటికి సెలవు. (నవ్వుతూ వెళ్ళిపోతాడు)

పెను తుఫాను మళ్ళీ రణగొణ ధ్వనులు..హోరుగాలి వీస్తుంది

సుందరి తలుపు తడుతుంది.

జానకి: మీరా సుందరి పిన్నిగారూ! ఎవరోననుకున్నాను. గుండె గతుక్కుమంది.

సుందరి: పాడైపోయిన మున్సిపాలిటీ రోడ్లమాదిరిగా ప్రతినిముషం గతుక్కుమనడం గుండెలకు మంచిది కాదు జానకీ.

జానకి: కాకపోతే మనవి సిమెంటు రోడ్లా పిన్నిగారూ?

సుందరి: కావనుకో, అయినా మనం అనుకోవడంలో వుంది...ఒక రకం జీవితానికి అలవాటుపడి పోతే గడియారం ముల్లులా, సంవత్సరాలు అలాగే దొర్లుకుపోతాయ్.

జానకి: ఏమోనండి. నాకు భయం వేస్తుంది...పదిరోజులయిందా ఇక్కడికి వచ్చి, అప్పుడే మొహం మొత్తింది యీ పట్నం. నాకు ఇక్కడి పరిసరాలతో పరిచయం లేకపోయినా అప్పుడే విరక్తి కలిగింది. అయినా ఇది నా బాధల తుఫానుకు హర్బరులా పనిచేస్తుందన్న ధైర్యంతో వున్నాను....అయినా ఏం వూరండీ....ఎప్పుడు చూసినా అదే హడావుడి, అదే జనం, సాయంకాలం అయ్యేసరికి అవే వాడిపోయిన పూలు. ఎంతకాలమని ఇలా?

సుందరి: పదిరోజులకే నువ్వు ఇలా అంటున్నావు పదేళ్ళు వున్నవాళ్ళ సంగతి ఏమని చెబుతావు?

జానకి: పదేళ్ళా.......?......మీరేనా.....?

సుందరి: ఆహా......అక్షరాలానూ.

జానకి: ఒక్క క్షణం కూడా సుఖమూ, శాంతీ లేకుండా...

సుందరి: మా ఆయన అంటూ వుంటారులే – అవి చాలా ఖరీదు, మనం కొనలేం.....అని.

జానకి: అవును పిన్నిగారూ...అయినా కనిపించని గమ్యం కోసం ప్రాకులాడ్డంలో మనిషి ఇంత శ్రమను ఎందుకు వృథా చేస్తున్నాడా అనిపిస్తోంది.

**సుందరి:** ఆ గమ్యాన్ని చేరాలనే వుద్దేశ్యమే. పాపం అయితేనేం?..కొందరు పుట్టికెక్క కుండానే స్వర్గానికి నిచ్చెనలు వేస్తారు. మా విశ్వనాథం లాంటి వాళ్ళు అదీ లేకుండా సౌఖ్యాలు తమ కాళ్ళ ముందుకు రావాలంటారు.

**జానకి:** విశ్వనాథం గారెవరూ?

**సుందరి:** మా మరిది.....రావాలి, ఇవ్వాళో రేపో?

**జానకి:** ఇంకా బాబుగారు వచ్చేవేళ కాలేదా.

**సుందరి:** అప్పుడే ఎక్కడమ్మా...? ఇంకా ఎనిమిది కాలేదుగా.....అందుకే – ఒంటరి దానికి – ఏం చేస్తున్నావో చూచిపోదామని వచ్చాను.

**జానకి:** ఏం చేస్తాం పిన్నిగారూ? చెయ్యడానికి రెండే పనులు కనిపిస్తున్నాయి. ఒకటి గతాన్ని తలుచుకుని బాధపడడం, రెండు భవిష్యత్తును వూహించుకుని భయపడడం. ఎటుచూచినా బాధే అయినప్పుడు...

**సుందరి:** నీ దంతా చిత్రం జానకీ, అసలిప్పుడు బ్రతకనట్లే మాట్లాడుతావు.

**జానకి:** నిజం పిన్నిగారూ, మనలాంటి వాళ్ళకు వర్తమానం వుండదు. గతమూ, భవిష్యత్తు రెండే.

**సుందరి:** ఆ సత్యమూ నీలానే మాట్లాడుతాడు.

**జానకి:** ఆయనగారు మీకేమయినా చుట్టమా?

**సుందరి:** చుట్టంకంటే ఎక్కువవాడమ్మా, యీ మహాపట్టణంలో ఆప్యాయతే కరువైందతనికి, మమ్మల్ని స్వంతవాళ్ళ కంటే ఎక్కువగా చూసుకుంటాడు.

**జానకి:** మనిషి పైకి నవ్వుతూ మాట్లాడినా లోపల యింకా అంత ఉన్నారనిపిస్తుందండి నాకు.

**సుందరి:** మనిషి పూర్తిగా బయట పడడం ఎవరిలోనూ ఉండదు. జానకీ, ప్రపంచకానికి యివ్వకుండా జాగ్రత్తగా దాచుకునే గుప్తధనం ప్రతి వాళ్ళకు యింతో అంతో ఉండక తప్పదు.

**జానకి:** ఏమైనా మనిషి త్వరగా బయటపడే రకం కాదు.

**సుందరి:** అంత స్వల్ప పరిచయంతో అటువంటి అభిప్రాయాలు పారేయకూడదు జానకీ – రాజకీయ నాయకుల్లా – సత్యం ఎంత బోళా మనిషో తెలుసా? కొన్నాళ్ళు పరిచయం కానీ, అతను ఎటువంటి వాడో నీకే తెలుస్తుంది.

**జానకి:** అందుకు కాదండీ, ఎప్పుడూ, మాట్లడితే వేదాంతిలా మాట్లాడతారు. లేకపోతే విప్లవ కారుడిలా మాట్లాడుతారు.

**సుందరి:** మా వారు అతన్ని గురించి ఏమంటారో తెలుసా? సత్యం బయటకు అలోచించుకునే మనిషి. ప్రపంచంలో అందరూ అలా వుంటే మనిషికీ మనిషికీ యీ యీర్ష్యలూ, మాత్సర్యాలూ వుండనే వుండవు అంటారు. నువ్వేమో మనిషే బయటకి కనిపించడంటావు.

**జానకి:** పోనివ్వండి.....అంత తేలికగా నా అభిప్రాయాలను మార్చుకోలేను...పైగా అయన ఆడవాళ్ళను గురించి మాట్లాడిన రెండు ముక్కలు చాలు, ఆయన పట్ల ఏ స్త్రీకైనా విముఖత కలగడానికి.

**సుందరి:** నువ్వలా అనుకుంటున్నావా, నేను అతను ఆడవాళ్ళను గురించి చేప్పే ప్రతి అక్షరమూ నిజమేనంటాను.

జానకి: పోనివ్వండి...ఇక ఆయన విషయం వదిలేద్దాం...ఇంతసేపూ మనం ఆయనను గురించి మాట్లాడుకున్నామని తెలిసినా క్షమించరు మనల్ని......

సుందరి: అంతా విడ్డూరంగా మాట్లాడతావ్, జానకీ వస్తాను, బాబుగారు వచ్చే వేళయింది.

........................

హోరుమన్న గాలి కొంచెం సేపు వీచి ఆగిపోతుంది. ఇంతలో జనం చేసే కోలాహలం, దాని వెనక రైలు కూత, మిల్లుకూత, వాహనాల సకిలింపులు....ఇత్యాది ధ్వనులు, గడియారం ఎనిమిది కొట్టడం వినిపిస్తుంది. సైరన్ మ్రోగుతుంది.............

మాధవ: హల్లో.........సత్యం......సత్యం.

సత్యం: ఓ, మీరా అన్నయ్యగారూ, ఉలిక్కి పడ్డాను.

మాధవ: ఏం......? పరధ్యానంలో వున్నావనుకుంటాను. ప్రేయసిని గురించి కలలు కనడానికి రోడ్డే దొరికిందా? బళ్లూ అవి ఉంటయ్ జాగ్రత్త.

సత్యం: ప్రస్తుతానికి నాకు నేనే ప్రేయసినండి. యీ ఆత్మానురాగం అంతం అయ్యే దాకా మనకు ప్రేయసి అవసరం లేదు...మీరింత ఆలస్యంగా బయలుదేరారేం?

మాధవ: ఆలస్యమా? టైం ఎంతయిందేమిటి?

సత్యం: ఇప్పుడేగా సైరన్ కూసింది. ఎనిమిది గంటలయింది. మీ లెక్కకు పెందలాడే....

మాధవ: పెందలాడే వెళ్ళి ఏం చెయ్యాలంటావ్?

సత్యం: అదేమిటి? వదినగారు కాచుకుని కూర్చోరూ.......

మాధవ: పోనీలే, దానికి మాత్రం అంతకన్న పనేముంది.....? పదేళ్ళనుంచి నిత్యం జరిగే వ్యవహారమేగా?

సత్యం: ఏమిటోనండీ...ఏడువందలు పెట్టి ఎద్దును కొంటే ఎప్పటి కాటు ఇట్టిట్టే – అని జీవితం మార్పులు లేకుండా రోడ్డురోలరులా అలా పోతూనే వుండడం నేను భరించలేనండీ......వెనక వచ్చినప్పుడు వున్నంత ధైర్యమూ, పట్టుదలా నాలో లేవేమో ననిపిస్తుంది.

మాధవ: జీవితం మీద ఇంత చిన్న వయస్సులోనే అటువంటి అభిప్రాయాలు కలగడం మంచిది కాదు, తమ్ముడూ, ఇంకా పెళ్ళి చేసుకుని, సంసారం చెయ్యవలసిన వాడవు.

సత్యం: ఆ మాట తలుచుకుంటేనే భయం వేస్తుంది. నేను సంపాదించేది నాకే చాలీచాలక అవస్థ పడుతున్నాను... మరొకళ్ళను పోషించడం ఎలా చెప్పండి. దాని వల్ల పొందగలిగే ఆనందం కంటే విషాదం, విరక్తి ఎక్కువనుకుంటాను.

మాధవ: అలా అంటే నేను ఒప్పుకోను. వివాహమైన తరువాత కనీసం కొన్నాళ్ళయినా మీ బాధలకు మీరు అతీతులుగా ఉంటారు. నా విషయం తీసుకో. ఆరేడేళ్ళ క్రితం వరకూ నేనూ ఈరకం జీవితం నుంచి పొందగలిగినది తక్కువేం కాదు. తరువాత మా జీవితాల్లో నిర్లిప్తత ప్రబలింది....భూత భవిష్యద్వర్తమానాల

తలుపులన్నీ మూయబడ్డ తరువాత జీవితమంటే ఏదో నిరాదరణ. ఏ పని చేస్తున్నా యంత్రంలా, మనకు పట్టనట్లు చెయ్యడం –

**సత్యం:** ఏమిటోనండి. మీ భీభత్సంలో నుంచి తప్పుకుని కొన్నాళ్ళు బయటపడదామని ఎంతగానో వుంది.

**మాధవ:** ఇది పద్మవ్యూహం తమ్ముడూ, లోపలకు రావడమే నీ యిష్టం. బయటకు పోవడం అంత తేలికైన పని కాదు. అదే చేతనయివుంటే బాధపడుతున్నామని తెలిసికూడా ఇంతమంది జనం ఎందుకు యీ రకం జీవితాన్ని నిరాకరించడం లేదంటావ్......

**సత్యం:** అలాగే అనిపిస్తోంది...కాని ఆశ్చర్యం, మూడేళ్ళయిందా ఇక్కడకు వచ్చి, ఇన్ని బాధలు పడుతున్నా, ఇక్కడే ఉండాలినిపిస్తోంది. కాని, మా వూరు, మా వాళ్ళు, యీ సంగతులే జ్ఞాపకం రావు. వచ్చినా వాళ్ళు కేవలం మనకు తెలిసిన ఎవరో మనుష్యులనుకుంటాను, కాని, రక్త సంబంధీకులనిగాని, నా వాళ్ళనిగాని నాకు తలపే రావడం లేదు.

**మాధవ:** అందులో ఆశ్చర్యం ఏముంది? నువ్వు ఇప్పుడిలాగే యీ బ్రతుకుకు అలవాటు పడుతున్నావు....అయితే బ్రతుకులో నీకు కొన్ని ఆశయాలు వున్నయ్. వాటి నిర్వహణలో ఆనందం ఉంది. ఇంటి దగ్గర ఆదర్శాల కోసం పోట్లాడి వచ్చావు. స్వేచ్ఛగా బ్రతకాలని, కాలానికి, భావానికి బానిసకాకూడదని వచ్చావు. నువ్వు కష్టపడ్డా నీకు నువ్వు నిలదొక్కుకోవడంలో నీకు మనశ్శాంతి వుంది. అందువల్ల బ్రతుకునుంచి నీకు ఏదో రకమైన తృప్తి లభిస్తోంది.

**సత్యం:** మరి మీరు.......?

**మాధవ:** ఏముంది? నేనూ ఒకప్పుడు కలలుగన్న వాడినే, నాకు పెద్ద ఉద్యోగాలు చెయ్యాలని, ఊళ్ళు ఏలాలని అభిప్రాయాలు వుండేవి. కాని ప్రస్తుతం వాటినన్నింటిని చెరిపివేసుకొని దారి చూసుకుంటూ నడుస్తున్నాను. నేను చెరిపి వెయ్యడం ఏమిటిలే, అవే చెరిగి పోయినయ్యి. ఇన్నాళ్ళ అనుభవం తరువాత నాకు తెలిసిన ఒకే ఒక విషయం ఏమిటో తెలుసా? జీవితం నుంచి మనం అతిగా ఏమీ ఆశించకూడదు అని –

**సత్యం:** జీవితంలో మీకు ఆకర్షణే లేదంటారు.......?

**మాధవ:** వుండడానికి మనం ఏంచేసుకోగలుగుతున్నామని....? ఆకర్షణ సంగతి అలా వుంచు, ముందు అసహ్యం కలుగుతుంది. బయట జరిగే సంఘర్షణకు తట్టుకునే బలం లేదు.....ఇంటికి రావాలంటే భయం.. మా ఆవిడా, పిల్లలూ కోరిన వరాల్లో ఏ ఒక్కటీ తీర్చలేకపోయానన్న సిగ్గు.

**సత్యం:** అందువల్లన్న మాట మీరు ఆలస్యంగా ఇంటికి వెళ్ళడం.

**మాధవ:** అందుకే ఇంటికి వెళ్ళేసరికి పిల్లలయినా నిద్రపోయి వుంటారు. ఇల్లాలిని ఎలాగో వూరుకో బెట్టొచ్చు. ప్రతి రోజూ ఏదో కావాలని వాళ్ళు అడగడం, ఇవ్వాళ మాదిరిగా ప్రతి రోజూ మన జేబుల్లో ఏమీ వుండకపోవడం. ఇది నిత్యం జరిగే వ్యవహారం..చిన్నప్పుడు గుది బండల్ని మెడలో కట్టి, మనల్ని బండి కట్టేవాళ్ళు.

**సత్యం:** ఇవ్వాళ మీరు మరీ విచిత్రంగా మాట్లాడుతున్నారు. మిమ్మల్ని చూస్తుంటే అప్పుడే ముసలి వారయ్యారనిపిస్తోంది.

మాధవ:   ఏమో? ఎందుక కాకూడదు? శరీరంతో పాటే మనస్సు కూడా పెరగాలని ఎక్కడా లేదుగా?

సత్యం:   అవునవును. ఇదిగో ఇంటికి వచ్చాంలెండి....ఆ అమ్మాయిని చూశారా...అన్నగారూ...శరీరానికి తగ్గంత మనసు జానకిలో పెరగలేదని నా అభిప్రాయం. అతి సున్నితమయిన మనిషి..పైగా ఏ మాటన్నా త బుజాలు తడుముకుని గాయపడుతుంది. అదేం ఖర్మో........మొన్న ఆడవాళ్ళను గురించి ఏవో రెండు ముక్కలు అన్నానో, లేదో – ఇంకెక్కడిది, శివశక్తిలా మీద పడ్డది. మీరు పైకి నవ్వుతూ కనిపిస్తే అలాంటి వారే ననుకున్నాను. ఇంతటి వారనుకోలేదు అంది 'త' మీద ఒత్తుతూ.

మాధవ:  నువ్వు మాత్రం అలా మాట్లాడడం బావుందా? అంత స్వేచ్ఛగా నీ అభిప్రాయాలను జనం మీదికి వదలకు. అంతర్యాల్లో సంతోషించవలసింది ఒక్కదాచుకున్న రహస్యాల వల్లనే. పదపద. ఆ అమ్మాయితో రాజీపడు.

సత్యం:   నాకు మాత్రం ఆ అమ్మాయితో పోట్లాడాలిన వున్నదంటారా? వస్తాను.

.............................

మాధవ:  సుందరీ.......సుందరీ.....

సుందరి: (తలుపు తీసి) ఇంత ఆలస్యమయిందేం?

మాధవ:  సమాధానం కూడా ఆ ప్రశ్నలోనే వుంది.

సుందరి: కాఫీ పొడి తీసుకువచ్చారా?

మాధవ:  అబ్బా, మళ్ళీ మొదలా?.....ఒక్క క్షణం విశ్రాంతి తీసుకోనిద్దూ.......

జానకి:   అంత మరీ విసుక్కుంటే ఎలా బాబుగారూ..........?

మాధవ:  నువ్వా జానకీ, యీ ఆడవాళ్ళకు ఎంత స్వజాతి పక్షపాతం, ఆఫీసులో అడ్డమైన చాకిరీ చేసి ఇక్కడకు వచ్చానా? సానుభూతి చూపడం పోయి సాధించడం మొదలుపెడితే ఏం దారి?

సుందరి: బావుందండీ, ఇప్పుడు నేను సాధించానా?

జానకి:   రేపు ప్రొద్దున్నే ముదు కాఫీకోసం అడిగేది మీరే.

మాధవ:  పోనీ అప్పుడు దెప్పినా ఆనందంగా వుండును.....నువ్వు కూడా పెళ్ళి చేసుకోవలసింది. అప్పుడు తెలిసేది.

సుందరి: ఆ........అదొక్కటే తక్కువ.

జానకి:   యీ మాత్రంగా బ్రతకతలుచుకోనివ్వరా బాబుగారూ?

మాధవ:  ఎట్లా బ్రతకనివ్వగలం చెప్పు. పుట్టిన ప్రతి మనిషీ ఏవో కొన్ని అనివార్యమైన కారణాలు ఉంటే తప్ప. లేకపోతే పెళ్ళి చేసుకుతీరాలి. పిల్లల్నీ కనాలి.

జానకి:   ఆ తరువాత?

మాధవ:  ఏముంది? వాళ్ళకు చదువులూ, పెళ్ళిళ్ళూ, మళ్ళీ వాళ్ళకు పిల్లలూ –

జానకి:   పెళ్ళంటే నాకందుకే భయం బాబుగారూ, ఇన్ని కాపురాలు చూశానా అందరి ఇళ్ళల్లోనూ మగవాడు

ఆడదాన్ని అనుమానంగా చూడడం, ఆడది మగవాణ్ణి అనుమానంగా చూడడం. నేను యీ పట్నం వచ్చి నన్ను నేను రక్షించుకోపోయినట్లయితే యీ సరికి కాళ్ళు, చేతులూ కట్టైనా నా పెళ్ళి చేసే వాళ్ళు మావాళ్లు.

**మాధవ:** చెప్పవూ...తెరవెనుక నాటకం చాలా జరిగిందంటావ్...

**జానకి:** ప్రతివాళ్ళూ తెరవెనుక అంతోయింతో నటన ఉండకుండా వుంటుందంటారా? కొందరికి కేవలం వెనకనే వుంటుంది.

**సుందరి:** అంతమాత్రానికే ఆడవాళ్ళు అలా అందర్నీ ఎదిరించి రావడం ప్రమాదమమ్మా.

**జానకి:** ఆ సత్యంగారు మాట్లాడినట్లు మాట్లాడకండి పిన్నిగారూ. జీవితమంటే నాకు ఏవో కొన్ని నిర్దేశితమైన భావాలు వున్నయ్. అవి నా కళ్ళ ముందే సమూలంగా నాశనం చేస్తుంటే చూస్తూ వూరుకోగలనా? నేను కాదు ఏ స్త్రీ అయినా అంతే –

**మాధవ:** పొరపాటు జానకీ.....మా సుందరి వంటి వాళ్ళు ఆ వర్గంలో చేరరు. వీళ్ళు కేవలం ఆడవాళ్లు. పరిస్థితుల్ని సౌమ్యంగా ఎదిరించగలిగినంత వరకు ఎదిరిస్తారు. ఆ గీటు దాటితే తలవంచుతారు.

**జానకి:** అందరూ నా లాంటి వాళ్ళేనని నేను మాత్రం అంటానా బాబుగారూ, నేనైనా మరొక పరిస్థితిలో మామయ్యను ఎదిరించగలనా? నాన్నగారు పోయిన దగ్గర్నుంచి ఆయన చేస్తున్న అన్యాయాలు, మా ఆస్థిని అడ్డువుంచుకొని పరువు పేరిట ఆయన సాగిస్తున్న కుతంత్రాలు చూచి చూచి విరక్తి కలిగింది. మా నాన్న గారే ఇలా రెండో పెళ్ళివాడికి, పిల్లల్ని కనడం కోసమే పెళ్ళిచేసుకుంటానంటున్న వాడికి నన్నిచ్చి పెళ్ళి చేస్తానంటే కాదనేదాన్ని కాదేమో.

**సుందరి:** నువ్వేమో ఇలాగంటావా. ఆ రంగారావుగారమ్మాయి చూడు. బంగారం లాంటి పిల్ల. ఆ అమ్మాయికి ఏం తక్కువ అయినాయని? ఆయన నాలుగు వేలయినా అప్పుచేసి కూతురు పెళ్ళిచేద్దామని అనుకుంటుంటే, యీవిడ ఆ హోటలాయనతో తుస్సుమంది. ఆవిడకు ఏం తక్కువంటావ్. తీరా వెళ్ళిందా? వాడేం చేశాడో,నిన్న సాయంకాలం మళ్లీ అమ్మా, నాన్న దగ్గరకు తిరిగివచ్చింది.

**మాధవ:** ఎప్పుడొచ్చింది? వాళ్ళ నాన్న ఏమంటున్నాడు?

**సుందరి:** ఏమంటాడు? కస్సుబుస్సు మంటున్నాడు. తల్లి లేవలేని స్థితిలో వుందా పిల్లను ఏమైనా అంటే ఆవిడ యిప్పుడే హరీమనేటట్లు వుంది. తప్పుతుందా? చచ్చినట్లు రానిచ్చాడు.

**జానకి:** ఎందువల్ల వచ్చేసిందంటారు?

**సుందరి:** ఏమో. ఏం చెప్పగలం? వాడు ఏమన్నాడో?

**జానకి:** ఇహ ఆ అమ్మాయిని కాకులు పొడిచినట్లు పొడుస్తారు కాబోలు, యిక్కడి వాళ్ళంతా.

**సుందరి:** ముల్లు వచ్చి అరిటాకుమీద పడ్డా, అరిటాకు వచ్చి ముల్లు మీద పడ్డా నష్టం ఎవరికంటావ్?

**మాధవ:** సుందరిని కదిలించకు జానకీ....మహా పతివ్రతల జాబితాలో చేర్చవలసింది.

**సుందరి:** అంతంత బిరుదులెందుకు లెండి?

**మాధవ:** మన ప్రజలు అన్నిరకాల వాళ్ళని తలో విధంగా సన్మానం చేసి బిరుదులూ, సత్కారాలు చేస్తున్నారు,

కాని ఇటువంటి పతివ్రతలకు ఏటేటా కాంపిటీషను పెట్టి, జిల్లాలవారిగానో, రాష్ట్రాలవారిగానో గెల్చినవాళ్ళకి తలా ఒక వెయ్యి రూపాయలు ముట్ట చెప్పకూడదు.? ఏం జానకీ, సలహా ఎలా వుంది?

**జానకి:** సలహా కేం బాబుగారూ, అందుకే మిమ్ముల్ని ప్రభుత్వం సలహాదారుగా వేసుకోలేదు.

**సుందరి:** బాగా చెప్పావు. ఊకదంపుడు ఉపన్యాసాలు ఎన్నైనా చెప్పవచ్చు. పిల్లలిద్దరికి జ్వరాలు తగులుకున్నాయని నిన్ననగా చెప్పాను. ఇంతవరకు చూచె తీరిక లేదు.

**మాధవ:** భార్యశిరోత్నం అడగవలసిన ప్రశ్న అడిగావు..తీసుకురా వాళ్లను. ఏం చేస్తున్నారు?

**సుందరి:** ఇప్పుడే నిద్రపోయినట్టున్నారు.

**మాధవ:** రగిలించకు సప్తభుజంగాలను అన్నాడు. వాళ్ళను లేపకు.

**జానకి:** (నవ్వుతూ) అబ్బే. పసిపిల్లలు వాళ్లనలా అనడం బాగులేదండీ.

**మాధవ:** నీలాంటి వాళ్ళే వెనకటికి యుద్ధానికిపోయే సైనికులను చూసి నవ్వారట. ఒకడు ప్రక్కవాడిని అడిగాడు వాళ్ళెందుకు నవ్వుతున్నారని. వాడి సమాధానం ఏమిటో తెలుసా? యుద్ధానికి పోతుంది మనంకాని, వాళ్ళు కాదుగా, అందుకు.....అట్లా ఉంది నీ వరస.

**జానకి:** యీ యుద్ధంలోకి నన్నూ దిగమంటారు.

**మాధవ:** అమ్మమ్మ, ఎంతమాట, నేను అనని వాటిని నా మీద రుద్దకు. అందంగా వుండదు.

**సుందరి:** సత్యంలా మాట్లాడుతున్నారేం? అతనంతే అన్నంలో అధరవుల దగ్గరనుంచీ, సిగరెట్లతో సహా సినిమాల దాకా ఏమి  అందంగా లేవంటాడు.

**జానకి:** ఆయన ఏంచేస్తూ ఉంటారండీ?

**మాధవ:** నువ్వు చేస్తున్న పనే.

**జానకి:** అంటే మిషన్ కుడతారా?

**మాధవ:** లేదనుకో, నీ మాదిరిగానే ఆదర్శాలకోసం ఇల్లు వదిలి వచ్చాడు. ఆ సైకిలు వేసుకొని నాలుగు పేటలూ తిరిగి ప్రయివేట్లు చెప్పుకుంటాడు. ఉదయానే ఇంటింటికీ తిరిగి కాఫీపొడి ఇచ్చివస్తాడు.

**జానకి:** మరి అటువంటి వారేనా, ప్రతిది అందంగా లేదనడం?

**సుందరి:** అదేమిటి జానకి, అటువంటి మనిషికి అందంగా వుండకూడనివి ఏమీ ఉండవా?

**జానకి:** ఉండవని నేనంటానా? దేనికైనా అవధులు వున్నాయండీ.

**మాధవ:** అత్మగతమైన ఆనందానికి, అనుభూతికి అవధులున్నాయనుకోవడం ఆత్మవంచన జానకీ. ఈ రకం ఆత్మవంచనే నేనూ సుందరీ పూర్తిగా చేసుకుంటున్నాం. నువ్వు సగం –

**జానకి:** సామరస్యంగా కలిసిమెలిసి బ్రతకడానికి వంచన కొంచమో,గొప్పో వుండకతప్పదు.

**సుందరి:** అది లేదు కాబట్టి సత్యం అంటే నీకు పడదన్నమాట?

**జానకి:** నేను కాదనను, కాని అది ఒక్కటే కారణం కాదు. ఆయన మాదిరిగా నేనూ ఇల్లు వదిలి వచ్చానన్న

సానుభూతి ఆయనకు వుండవచ్చు....కాని స్వతంత్ర్యంగా బ్రతకడానికి ఆడదానికి అధికారం లేదనే మనిషితో ఏం మాట్లాడతాం?

**మాధవ:** నువ్వు అతన్ని అర్థం చేసుకున్నది అంతవరకేనన్న మాట. తొందరపడకు. సత్యం లాంటి వాళ్ళు అంత తేలిగ్గా కొరుకుడు పడరు.

**జానకి:** మీ సలహా తప్పక జ్ఞాపకం ఉంచుకుంటాను. ఆయన మీద నాకేమైనా పగా? వస్తానండీ. పొద్దుపోయింది. వస్తాను పిన్నిగారూ.

సుందరి: మంచిదమ్మా.........

ఓ క్షణం నిశ్శబ్దం. తలుపులు వేసిన చప్పుడు –

**జానకి:** ఎవరక్కడ? ఎవరమ్మా మీరు? మాట్లాడరే?

**కమల:** నా పేరు కమల. మేమూ ఆ మూల భాగంలో ఉంటున్నాము.

**జానకి:** అంటే మీరు రంగారావుగారి అమ్మాయి?

**కమల:** అవునండీ, మీకెలా తెలిసింది?

**జానకి:** ఊహించాను...అంతే. మరి ఇక్కడ నిలబడ్డారేం?

**కమల:** అదంతా ఓ కథలెండి......

**జానకి:** అంటే మీ నాన్నగారు ఏమన్నా అన్నారా?

**కమల:** నన్ను అనని వాళ్లంటూ వుంటారా ఇప్పుడు?

**జానకి:** ధైర్యంగా వుండండి.....పరిస్థితుల తాకిడికి మనం పడిపోవడం సహజం. అప్పుడు నిలదొక్కు కోవడంలోనే ఆత్మశక్తి కనిపిస్తుంది. గాభరా పడకు. నాకు తెలుసు, ఇప్పుడు కనిపించిన ప్రతివాళ్ళు నిన్ను ఎలా చూస్తారో....కాని వాళ్ళెవళ్ళ కోసమో కాదు నువ్వు బ్రతుకుతున్నది. ఆ సంగతి జ్ఞాపకం ఉంచుకో...

**కమల:** అలాగే, ఇంతవరకూ మంచిగా మాట్లాడింది మీరొక్కరే....వచ్చిన దగ్గరనుంచి చూస్తున్నాను. నన్నందరూ అసహ్యంగా ఎగతాళిగా చూడడమే. ఇంట్లోనే అలా ఉంటే బయటి సంగతులెందుకు లెండి.

**జానకి:** జీవితం నుంచి తాము సుఖపడలేరు. ఎవరైనా సుఖపడడానికి ప్రయత్నించినా వాళ్ళు క్షమించలేరు. ఇప్పుడు ఇంతకు దగ్గ వేరే మార్గం లేదు. కనీసం మనం ఒకళ్ళనొకళ్ళమయినా కాపాడుకుందాం.

**కమల:** అంటే మీరు?

**జానకి:** పదండి, గదిలోకి వెళ్ళి మాట్లాడుకుందాం...

...............

విషాద సంగీతం వినిపించి ఆగిపోతుంది.

**జానకి:** రా కమలా ఇంతరాత్రి వేళ వచ్చావేం?

**కమల:** ఏముంటయ్ జానకీ? ఎప్పుడు చెప్పుకున్నా మన బాధలేగా....

**జానకి:** నాన్నగారేమయినా అన్నారా?

**కమల:** ఆయన మాటలు పట్టించుకోకుండా వుండడం అలవాటయిపోయింది. కాని ఇక్కడ ప్రతి ఇంట్లోనూ..ప్రతి స్త్రీ – నాకు బాధగా వుంది అదీ తోటి ఆడదాన్ని అర్థం చేసుకోలేరు.

**జానకి:** ఆడదాన్ని ఆడది అర్ధం చేసుకుంటే ఇన్ని అనర్ధాలు వుంటయ్యా? మనం మగ వాళ్ళేదో మన అభ్యుదయానికి అడ్డం వస్తున్నారని అపవాదులు వేస్తాం. కాని మనకు నిత్యమూ ఎదురు దెబ్బలు తగిలేవి, ఆడవాళ్ళ కంకర రాళ్ళవలనే. తెలుసా?

**కమల:** ఇందాక ఆ సుశీలమ్మగారు అంటోంది – ఇంకా సిగ్గువిడిచి ఎలా బజారున పడ్డదో చూడండి – అని. మళ్ళీ యిక్కడకు ఎందుకు వచ్చానా అనిపిస్తోంది. అమ్మ మంచం పట్టిందని తెలియక పోతే మళ్ళీ తిరిగి వచ్చేదాన్నా….?

**జానకి:** ఏ నుయ్యో గొయ్యో చూసుకుండేదానివి. అంతేనా?

**కమల:** అంతకాక – ఇంకే చెయ్యగలం చెప్పు.

**జానకి:** అచ్చుమైన అబలవంటే నువ్వు కమలా. ఇప్పుడైనా అటువంటి పిచ్చిపిచ్చి పనులు మాను…అటువంటి పరిస్థితులు నిత్యం జీవితంలో ఎన్నో ఏర్పడినయ్..నీ మాదిరిగా అనుకుంటే కనీసం పదిసార్లయినా ఆత్మహత్య చేసుకోవలసింది నేను.

**కమల:** అందుకేనా ఇంట్లోనుంచి వచ్చేసింది?

**జానకి:** అది నరకకూపం కమలా….అక్కడ ఒక్క క్షణం బ్రతకలేకపోయాను. నాన్న గారు బ్రతికి వుండగా ఇంటర్ పూర్తిచేశాను. నన్ను ఆ తరువాత అమ్మ పోరు, మామయ్య బలవంతం నాచేత చదువు మాన్పించినయ్. నన్ను చాటు వేసుకుని ఆ వూళ్ళో మా మామయ్య ఆడే నాటకాలు చూస్తుంటే, ఆయనను కట్టేసి నిలువునా, ఒంటికి నిప్పంటించి అంటించాలనిపించేది.

**కమల:** నువ్వు చదువుకున్నదానవు జానకీ. అందువల్ల ఎలాగో నీ కాళ్ళ మీద నువ్వు నిలబడగలుగుతున్నావ్.

**జానకి:** నా చదువుకు, ఇప్పుడు నేను చేస్తున్న ఉద్యోగానికి ఏమిటి సంబంధం? నేను చదువుకున్న పుస్తకాలు ఎక్కడా కుట్టుపనిని గురించి చెప్పలేదు. నాలుగు రోజులు పాటు నేర్చుకుంటే నువ్వూ నా కంటే ఎక్కువే చెయ్యగలవు.

**కమల:** అటువంటి దేదో ఒకటి చెయ్యాలి. జీవితాన్ని గురించి ఎన్ని కలలు కన్నాను. తీరా ఎక్కడం, వెంటనే పడడం తెలుసుకున్న తరువాతగాని, నేను ఎక్కింది ములగ చెట్టని తెలుసుకోలేకపోయాను. ఇప్పుడు మళ్ళీ చెట్టు ఎక్కడం నేర్చుకోవాలంటే మాటలా?

**జానకి:** అలాగని చేతులు చాచి వూరుకుంటామా? ఏదో ఒకటి చెయ్యాలిగాని – నా విషయం చూడు….ప్రతి నిముషం ఏదో భయం. మా యింటిదగ్గర వాళ్ళు వచ్చారని, నన్ను తాళ్ళతో కట్టి, మళ్ళీ మా వూరు తీసుకు వెళ్ళారని అక్కడ ఎక్కడా వెలుతురు లేని చీకటి కొట్లో పారేశారని – ఇవి రాత్రిళ్ళు నా కలలు. ఒంటరిగా వుంటానా ఏడవడానికైనా ధైర్యం ఉండదు. ఇదంతా చూస్తుంటే సత్యంగారు చెప్పింది నిజమనిపిస్తోంది నాకు.

…………………………

మళ్ళా హోరుమన్న గాలి.........అది తగ్గిపోగానే గుడి గంటలు. దాని తరువాత మహారాజు దర్బారుకు విచ్చేటప్పుడు వినిపించే స్వాగత సంగీతం.......ఆగిపోగానే తలుపు తట్టిన చప్పుడు..

**సత్యం:** ఎవరది? తలుపు తీసే ఉంది. లోపలకు రండి....ఎవరు?

**జానకి:** నేనండి. జానకిని చీకటిలో కూర్చున్నారేం, లైటు వెయ్యనా?

**సత్యం:** అరె, అప్పుడే చీకటి పడ్డదే...

**జానకి:** ఏడుగంటలు దాటుతుంటే ఇప్పుడు చీకటి పడడం ఏమిటి?

**సత్యం:** గడియారం కొనుక్కోలేనా? టైం సరిగ్గా తెలియదు. నిలబడే వున్నారు. కూర్చోండి. ఎవరో చెప్పినట్టు – కూర్చుండ మాయింట కుర్చీలు లేవు చిరిచాపయే అంక పీఠినంతు.

**జానకి:** నేను వచ్చి ఇన్నాళ్ళయినా మీ రూముకు ఒక్కసారయినా రాలేదే.....ఇప్పుడ అకస్మాత్తుగా, అనుకోకుండా రావడం మీకు ఆశ్చర్యంగా లేదూ?

**సత్యం:** గాలి పీటం వేస్తుంటే గాలిపటం ఆ దిక్కుకు వీస్తుంది మరి – ఏమిటి ఇలా వచ్చారు? అలా అడగడం సభ్యత కాదనుకోండి....అయినా మీ మొహం మీది చెమటని మీరు నిత్యం తుడిచేసుకోవడం చూస్తుంటే అడగడమే అవసరమనిపించింది. నా వల్ల మీకేం కావాలి. ఆదర్శాల మోతాదులు మాత్రం నా దగ్గర యింకా ఒకటి రెండు వున్నయ్.....అంతకంటే ఏం యివ్వగలను......? అభాగ్యుణ్ణి.

**జానకి:** నేను ఇక్కడికి గాయపడి వచ్చాను. సత్యంగారూ, ఎంతో బాధలో వచ్చాను. మీరు సానుభూతి చూపి సహాయం చేస్తారనుకున్నాను....కాని.....

**సత్యం:** సానుభూతికేం..? ఎంతైనా చూపగలను. ఇక సహాయం అంటారా జీవితంలో ఇప్పటికే ఎన్నో దెబ్బలు తిని వున్నాను.

**జానకి:** నా కోసం మీరేమీ చెయ్యనక్కరలేదు. నాకు ఎటు చూసినా అంధకారంగా వుంది....కొంచెం ఎటుపోవాలో చెప్పండి.

**సత్యం:** ఎలాగండి..నా దగ్గర బ్యాటరీ లైటు కూడా లేదే....

**జానకి:** ఇప్పుడేనా వ్యంగ్యాలు వెక్కిరింతలు? మీ కాళ్ళు పట్టుకుంటాను సత్యంగారూ...

**సత్యం:** అమ్మమ్మ.....ఇప్పుడే బజారంతా తిరిగివచ్చాను దుమ్ముపట్టి వున్నాయ్...అయితే నేనేం చెయ్యగలనంటారు?

**జానకి:** మీరు చెయ్యగలరనే తెలిసి వచ్చాను. నిరాకరిస్తే కావాలనే నిరాకరించారనుకుంటాను.

**సత్యం:** తోచిన సలహా చెప్పడానికి అభ్యంతరం ఎంతమాత్రం వుండదు. చెప్పండి. అంత ముంచుకుపోయే విషయం ఏమిటి?

**జానకి:** నిజంగా ముంచుకు పోయే విషయమేనండీ...మామయ్య పట్నం వచ్చాడు. నేను ఇక్కడ ఉన్నాను అని ఎలా పసిగట్టాడో ఇంట్లో ఉన్నానో లేదో చూసిరమ్మని మా వూరు కుర్రాడిని ఒకతన్ని పంపించాడు. నేనతన్ని ఎన్నో విధాల బ్రతిమాలాను, నేనిక్కడున్నట్టు చెప్పొద్దని. వాడి మొహం మీద నా మీద అసహ్యం ప్రతి

అంగుళం కనిపించింది. వాడు నా మాట వినలేదు. మామయ్యనను తీసుకు వస్తానని వెళ్ళాడు. వాళ్ళు ఏ క్షణాల వచ్చినా రావచ్చు.

**సత్యం:** రానివ్వండి. రానని చెప్పండి. బలవంతాన లాక్కుపోతారా?

**జానకి:** ఏమయినా చేస్తారు. మామయ్య సంగతి మీకు తెలియదు. తీరా వచ్చిన తరువాత వాళ్ళు ఇక్కడ చేసే రభస చూసిన తరువాతనైనా లొంగిపోతానేమో.....యీ గండం గడిచి బయటపడితే ఆ తరువాత ప్రపంచం అంతా ఎదురైనా నిలబడతాను.

**సత్యం:** అంత అవసరం వుండదు లెండి.

**జానకి:** అయినా ఒక్క మాట అడుగుతాను నిజం చెప్పండి..

(తలుపు తట్టిన చప్పుడు)

**జానకి:** అరుగోనండీ, వాళ్ళే వాళ్ళ ఎదట పడ్డానా మరి వెయ్యి జన్మలెత్తినా స్వేచ్ఛగా బ్రతకలేను. ఎలా?

**సత్యం:** ఆ వంట గదిలోకి వెళ్లి తలుపు వేసుకోండి.

ఓ క్షణం నిశ్శబ్దం. మళ్ళీ ఎవరో బయట కేకలు వేస్తారు.

**సత్యం:** ఎవరండీ?...ఎవరు కావాలి మీరు.....?

**మామ:** ఏమండీ, మీ మేడలో జానకీ అనే అమ్మాయి వుండాలండీ, ఎక్కడుంటుందో మీకు తెలుసా?

**సత్యం:** యీ మేడలో ముప్ఫై కాపరాలు వున్నయండి. ప్రతి కాపురంలోనూ నలుగురైదుగురు అమ్మాయిలు ఉంటారు. వాళ్ళందరి పేర్లు నాకెలా తెలుస్తాయో చెప్పండి......?

**మామ:** అంటే, అదికాదండీ......అమ్మాయంటే మరి చిన్నది కాదు.....అందులోనూ యీ మూలగదిలో ఉన్నదని మావాడు చెప్పాడు.

**సత్యం:** అయితే అక్కడికే వెళ్ళండి.....

**మామ:** అంటే, అదికాదండీ. అక్కడకు వెళ్ళేవచ్చాం......అది తాళం వేసి వున్నదండీ.....

**సత్యం:** అంటే, లేదన్నమాట.

**మామ:** అంటే, అదికాదండీ. ఎక్కడకు వెళ్ళిందో మీకేమయినా తెలుసునా అని.......

**సత్యం:** అంటే, ఆ రూములో వున్న ఆవిడ సంగతేనా మీరు అడిగేది......

**మామ:** మరేనండీ.......

**సత్యం:** ఇందాక ఆ అమ్మాయికోసం ఎవరో వచ్చారు........

**మామ:** అవునండీ. మా వాడే. నేనే పంపించాను. ఎవ్వరికీ చెప్పకుండా వచ్చింది. హు.....దీని టక్కులు వీడికి తెలియదనుకుంది....పరువు ప్రతిష్టలు నట్టేట కలిపి....

**సత్యం:** ఆ......అచ్చుగా ఆ అమ్మాయి మీ లానే అంది.....

**మామ:** అంటే, అదికాదండీ, మీతో అలాగని అన్నదా......

**సత్యం:** నాతోటండీ? నన్ను అంత వెధవకింద కట్టారే........

మామ:	అంటే అదికాదండీ. ఆ అమ్మాయి అన్నదంటుంటేను.....మీతోనేమో ననుకున్నాను.

సత్యం:	మరెప్పుడు అనుకోకండి. రూము ఖాళీచేస్తూ ఆ ప్రక్కవాళ్ళతో చెబుతున్నది. నేనిక్కడికి రావడం మామయ్యకెంత అప్రతిష్ట? నేను మళ్ళీ మా వూరు వెళ్లి మా మామయ్య పరువు కాపాడుతాను.......అని...

మామ:	అందీ......అంటుంది..అంటుంది.....ఇవన్నీ నాకు తెలియవనుకుంది......

సత్యం:	ఇంతకూ ఆవిడ మీకేం కావాలండీ?

మామ:	స్వయానా మేనకోడలు. మా అక్క కూతురు.

సత్యం:	అలాగా.....మరి ఎందుకు వచ్చిందంటారు...?

మామ:	చెట్టు చెడేకాలం......ఏం చెబుతాం? కనిపించకుండా పోతుందా? నూతులపాడు పంచాయితీ ప్రెసిడెంటు సంగతి దానికేం తెలుసు...? గౌరవం కాస్తా గడ్డలు చేసి.....

సత్యం:	అలాగటండీ, ఆ సంగతి అమ్మాయి వున్నప్పుడు చెప్పినా బావుండేది. మీ పరువుని, ప్రతిష్టని కులాసాగా మళ్ళీ మీకు అప్పచెప్పేవాడ్ని......

మామ:	అయినా ఎక్కడికి పోతుంది లెండి?

సత్యం:	పాపం, ఆ అమ్మాయి మీ పరువు కోసం బాధపడుతున్నట్టుగానే కనిపించిందండి?

మామ:	యీ టక్కులు నాదగ్గరటండీ.....యీ శషబిషలు శవా లక్ష చూశాను. ప్రపంచంలో ఎక్కడున్నా ముక్కుకు తాడుకట్టి లాక్కురానూ......

సత్యం:	అయ్యో....ఎందుకు లాక్కురాలేరూ.....? అందులోనూ మీ వంటివాళ్ళు మీకేదయినా సహాయం కావలిస్తే నన్నడగడానికి సంకోచించకండి. తప్పకుండా చేస్తాను.

మామ:	అట్లాగే బాబూ....నీకున్న జ్ఞానం దానికుంటేనా?

సత్యం:	అవునవును...వుంటే ఇటువంటి పనులు చేస్తుందా? పరువుగా తానూ బ్రతకదూ?

మామ:	బాగా చెప్పారు.........

సత్యం:	అందులోనూ మీ వంటి వాళ్ళకు తలవంపులు తెచ్చేటట్లుగా ఇటువంటి పనులు చేస్తే ఎలా చెప్పండి? అందుకనే, ఆడవాళ్ళను ఒక చేతిక్రింద వుంచాలన్నారు.

మామ:	బుద్ధిమంతుడివి....ఆ, ఇక్కడకు వస్తే మాత్రం కొంచెం కబురు చెయ్యి. నూతలపాడు పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు అంటే నాకు సరాసరి వస్తుంది ఉత్తరం.

సత్యం:	అనకపోతే మాత్రం రాదటండీ.....

మామ:	వస్తాను మరి.....జ్ఞాపకముంచుకో.....

సత్యం:	ఎంతమాట, యీ వూళ్ళో ఎక్కడకనిపించినా సరాసరి మీకు రవాణా చెయ్యనుటండీ.

మామ:	మంచివాడివి....వస్తా.....

సత్యం:	చిత్తం..........వెళ్ళిరండి.........

అమ్మయ్య పరువు ప్రతిష్టలు వెళ్ళిపోయ్యినయ్.....మీరు బయటకు రావచ్చు జానకీదేవిగారు......

జానకి: వెళ్ళిపోయారా....? రక్షించారు.....

సత్యం: ఇలా ప్రతిసారీ రక్షించలేను. వాళ్ళు మళ్ళీ రారని నమ్మకం ఏమీ లేదుగా......మీరు చెప్పదలుచుకున్నదేమిటో చెప్పండి....ప్రతిసారీ ఇలా అబద్ధం చెప్పలేను.

జానకి: నిజం. నేనూ తప్పు చేసినదానిలా గడియగడియకూ దాక్కోలేను.

సత్యం: అబ్బే, అందుకు కాదు...ఇందాక ఏదో అడుగుతూ ఆపివేశారు.

జానకి: అడగకుండానే ఒక విషయం తెలుసుకున్నాను.

సత్యం: ఏమిటది?

జానకి: మీరు దయాస్వభావులని.....ఇంతవరకు మిమ్మల్ని చులకనా చూస్తూ వచ్చాను. నేను.....అయినా సమయానికి ......

సత్యం: ఆగండి జానకీదేవిగారు.....అలా మొదలుపెడితే ఎక్కడికి తేలం......మీరు చెప్పదలుచుకున్నది చెప్పండి.

జానకి: ఉండండి....అలా తరుముకు వెడితే పరుగెత్తలేను...అసలే మనసు ఆందోళనగా వుంది.

సత్యం: ఇహ పరవాలేదు....నెమ్మదిగా చెప్పండి...క్లుప్తంగా, సూటిగా మాత్రం చెప్పండి.

జానకి: ఇవ్వాళ మీ మాటలు వింటుంటే నాకేదో వినూత్నమైన కాంతి కనిపిస్తోంది. ఇన్నాళ్ళూ నన్ను గురించి మీ అభిప్రాయం ఏమిటి?

సత్యం: అబ్బే, ఏమీ లేదు.

జానకి: మీరు దాస్తున్నారు.

సత్యం: దాచడమే యిద్దరికి మంచిది.

జానకి: పోనివ్వండి...ఇప్పుడిప్పుడే ప్రపంచంతో పాటు మీరు నాకు అర్థం అవుతున్నారు...బాధపడే హృదయాలు ఇలాగే ముకుళించుకుపోతాయి కాబోలు...

సత్యం: అవును. మళ్ళీ ఏ సూర్యకిరాణాలో, చంద్రకిరణాలో ప్రసరించాలి మరి.....

జానకి: ఒక్కమాట చెప్పండి...వ్యక్తిగా నేను సుఖాన్ని ఆశించడం తప్పా.....?

సత్యం: ప్రక్కవాళ్ళకు బాధలేకుండా –

జానకి: ఆ మాత్రం నాకు తెలుసనుకోండి. అది కాదు. ప్రపంచంకోసం, ప్రక్క వాళ్ళ ఇష్టాల కోసం మన అనుభూతులు చంపుకోవాలా అని.

సత్యం: అవసరం లేదు.....పైగా అలా చెయ్యడం వల్ల వ్యక్తి జీవితానికే విఘాతం.

జానకి: చిన్నతనం నుంచి మానసికోద్వేగాలంటే భయం......దేనిని గురించి తీవ్రంగా ఆలోచించే దాన్ని కాదు. ఒకవేళ ఆలోచించి ఏదైనా నిర్ణయానికి వస్తే అలా వచ్చినందుకే భయపడిపోయేదానిని.

సత్యం: కారణం ఏమంటారు?

జానకి: పరిస్థితులు, చుట్టూ ఉన్న మనుషులు, ఏవైతేనేం? మానసికంగా ఆనందం పొందడానికి నా కేమీ

అధికారం లేదని అనుకునేదాన్ని. అందువల్లనే మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను.

సత్యం: అటువంటి వారు ఇందరిని ఎదిరించి ఎలా రాగలిగారు?

జానకి: ఏమిటో అణచిపెట్టుకున్న వుద్వేగం ఒక్కసారి నాలో ప్రజ్వలించింది. కొన్ని నెలల పాటు నాలో ఒక్కటే ఆలోచన....మా మామయ్యమీద పగ ఎలా తీర్చుకోవాలా అని.

సత్యం: పగతీర్చుకొనే అంతటి అపరాధం మీ మామయ్య ఏం చేశాడంటారు?

జానకి: ఆయన చెయ్యని దేమిటి? మా ఆస్థిని చేజిక్కించుకున్నాడు. దానిని అడ్డం వుంచుకుని పంచాయితీ బోర్డుకు ప్రెసిడెంటు అయ్యాడు. చివరకు నన్ను అమ్మి తాను లాభం పొందాలనుకున్నాడు.

సత్యం: అర్థ అయింది. మన అభిప్రాయాలను అంతగా అణుచుకోవడం వల్లనే యీ భూకంపాలు రావడం. రబ్బరు బంతిని మీర వత్తితే బద్దలు కాక ఏమవుతుంది. జీవితాన్ని అర్థంచేసుకోవడానికి హృదయం కావాలి, దయాదాక్షిణ్యాలు కావాలి....అంతే కాని తర్కం, మేథ పనిచేస్తాయా?

జానకి: దానికి వుదాహరణం నేనే.....ప్రతి రాత్రీ మిమ్ముల్ని గురించే ఆలోచించేదాన్ని....మీ మనస్తత్వాన్ని, మీ పనుల్ని బేరీజు వేసి తూచేదాన్ని, నాకు తెలిసిందేమిటి?

సత్యం: అనుభూతులంటే హడలి పారిపోయే వాళ్ళు ఇతరులను అర్థం చేసుకుని ఆదరించలేరు.

జానకి: నిజం.......ఇన్నాళ్ళు ఇతరులకోసం బ్రతికాను. నా కో వ్యక్తిత్వం వున్నదన్న సంగతి మరిచిపోవడానికి ప్రయిత్నించాను...ఎటు చూచినా స్వార్థమే కనిపించింది. ఇన్నాళ్ళూ ఎందుకు భయపడే దాన్నంటారు. చీమచిటుక్కుమన్నా ఉలిక్కిపడే దాన్ని. ఇప్పుడా దౌర్భాగ్యస్థితిలో లేను. ఇంతవరకు మానవత్వం పట్ల విశ్వాసం నశించేస్థితిలో వున్నాను.

సత్యం: ఆపారే.....? చెప్పండి.

జానకి: ఆలోచలు చెదిరిపోతున్నాయి. మామయ్య ఉపన్యాసాలు ఇచ్చేవాడు – రాజకీయాలు, సంఘం, పార్టీలు, పరువు ప్రతిష్టలు – ఇవి ఆయన సర్వస్వం. ఇవ్వాళ మీ మాటలు వల్ల కాని నీకు తెలిసిరాలేదు.

సత్యం: ఆయనకు తెలియదుకాని, ప్రతిక్షనం కుళ్ళువైపుకు నడుస్తున్న నేటి సాంఘిక వ్యవస్థలో మానవుడికి కాంతి చూపగలిగినవి ఒక్క అనుభూతులే. సాంఘికం గానూ, రాజకీయంగానూ మార్పులు తాత్కాలికాలు. నిత్యం సజీవంగా వుండేవి వ్యక్తిగతంగా వుండే మన ఆనందమే. కాళిదాసు శకుంతల నెన్నిసార్లు చూచినా ఏడుపొస్తుంది. కింగ్ లియర్ చూస్తే ప్రతిసారీ భయమేస్తుంది.

జానకి: ఇంతవరకూ ఆదర్శాలను నెమరు వేసుకోవడమే సరిపోయింది. వాటికి అనుగుణంగా అనుభవాలను సరిదిద్దుకోవడం తెలియడం లేదు.

సత్యం: అందుకు మీ హృదయాన్ని నమ్ముకోండి...ఇతరుల ఆనందంకోసం నీ ఆత్మను చంపుకోవడం స్వార్థత్యాగమనిపించదు. స్వార్థత్యాగం దయతోనూ, స్నేహంతోనూ వుంది.

జానకి: దయలో ఉన్న ఆదరం ఇప్పుడే చూశాను. ఇక స్నేహంలో మాధుర్యం తెలుసుకుంటాను.

సత్యం: దయవున్నప్పుడే స్నేహానికి స్థానం ఉంటుంది. స్వార్ద మాత్సర్యాలకు అతీత మైన దయాగుణం మీలో వుంటే స్నేహం మిమ్మల్ని విడవదు........

జానకి: నా హృదయవేదనను మీరు సరిగా తెలుసుకున్నారు. నాకు ఇప్పుడు బాధ ఏమిటో తెలుసా? హృదయం విప్పి మాట్లాడుకునే స్నేహితులు లేరని.

సత్యం: మీరేకాదు. మానవ హృదయం తరతరాల నుంచి శ్రమిస్తున్నదీ, ఆరాటపడుతున్నదీ యీ శక్తి కోసమే......ఇంతకారు చీకట్లోనూ, ఆ కాంతి కోసమో మన యీ అన్వేషణ.

జానకి: ఇవ్వాళ నా జీవితంలో కొత్త పూలు పూయించాను. నా హృదయంలో జ్యోతిని వెలిగించారు.

సత్యం: మీరు మాత్రం. చీకటిగా వున్న నా గదిలో చిరుదీపం వెలిగించిది మీరేకదా......

జానకి: (నవ్వుతూ) అది మా స్త్రీ ధర్మం సత్యంగారూ –

.................

జానకి: పిన్నిగారూ.......పిన్నిగారూ

సుందరి: వస్తున్నా. రా జానకీ, ఎక్కడా కనిపించడంలేదు యీ మధ్య.

జానకి: పాపం కమలకి మీర అంత భయం ఏమండీ. వుద్యోగంలో చేరిందా, ఒంటరిగా బజారున రావడానికి బెదిరిపోతుంది. అటువంటిది.

సుందరి: ధైర్యంగా పనులు చెయ్యగలిగినా అటువంటి వాళ్ళే చెయ్యాలి జానకీ......ఉద్యోగం ఎలా వుంది?

జానకి: సలక్షణంగా ఉంది.....ఈ నెలాగితే కమలక్కూడా నెలవారి జీతం ఏర్పాటు చేస్తారు.

సుందరి: పోనీలే పాపం....వేడినీళ్ళకు చన్నీళ్ళు తోడు.

జానకి: ఆ సానుభూతి వాళ్ళ నాన్నగారికి లేదు సుమండీ......ఆయన ఎంతసేపూ తన కూతురు బైటకు వెళ్ళి ఉద్యోగం చేస్తే తన పరువు పోతుందంటాడు.

సుందరి: ఏమిటోలే జానకి.....వాళ్ళందరూ ఏర్పడిపోయిన మనుషులు. ఈ జన్మకు మరలేరు.

జానకి: మళ్ళీ సుఖాలు కావాలి. దాని కోసం అప్పులు చెయ్యాలి. మగవాడే గాడిదలే బరువంతా మొయ్యాలి.

సుందరి: ఏమిటో ఒక్కొక్కళ్ళకీ ఒక్కొక్క మతం.

(తలుపు తట్టిన చప్పుడు)

జానకి: బాబుగారేమో?

సుందరి: అప్పుడే వచ్చే వేళయిందా.....విశ్వనాథం, నువ్వా, రా రా.........వస్తాననే అనుకుంటున్నాం యివ్వాళో రేపో.....

విశ్వ: ఒక్కడ్నే రాలేదు వదినా......మీ చెల్లెలు కూడా వచ్చింది.

సుందరి: బావుంది, రా రాజీ, రామ్మా.....రాజీ యీ అమ్మాయి జానకి అని మన మేడలో అద్దెకుంటున్నది.

విశ్వ: మేడెప్పుడు కొన్నారు వదినా......

రాజీ: మీరిచ్చిన డబ్బుతోనేనటగా కొన్నది.....

జానకి: నమస్కారమండీ......

రాజీ: నమస్తే.........

సుందరి: ఏం రాజీ.....ఇన్నాళ్ళకి తీరిందా.......

రాజీ: ఇన్నాళ్లికైనా తీరింది మాకేగా అక్కా.....మీరు ఒక్కసారి కూడా అటువేపుకు రాలేదుగా.....

సుందరి: ఎక్కడా......వారికి సెలవు దొరకాలి......యీ పిల్లల్నందర్నీ వేసుకురావాలంటే?

విశ్వ: రైలు పెట్టె కాంట్రాక్టు తీసుకురావాలంటారు.

జానకి: వస్తాను పిన్నిగారూ........వస్తానండీ.....

సుందరి: తీరిక చూసుకురా........బాబుగారు కూడా వస్తారా.....

జానకి: అలాగే.........

సుందరి: ఏం రాజీ కులాసానా?

రాజీ: ఏదో వున్నాము. కులాసాకు అంతెక్కడక్కా......సముద్రానికి మాదిరిగానే సుఖానికి కూఆ అవతలి గట్టు కన్పించవు.

సుందరి: అబ్బా.....వేదాంతం నేర్చావే......

విశ్వ: పండిత పుత్రిగ్గా వదినా....ఎంతయినా......

రాజీ: బ్రతుకులోంచి మనం నేర్చుకున్నదే నిజమయిన వేదాంతం అక్కా....నా మాటకేం...నీ ఒంట్లో ఎలాగున్నది?

సుందరి: ఏదో వున్నదమ్మా?

విశ్వ: అన్నయ్య ఇంకా ఆఫీసునుంచి రాలేదు కాబోలు....ఏమంటున్నారు?

సుందరి: ఏమంటారు...రోజు రోజుకూ నీరసించిపోతున్నారు యీ ఆఫీసు పనితో?

విశ్వ: వచ్చిన ఉద్యోగాలన్నింటినీ కాలదన్ని ఆ రోజున అన్నయ్య ఎన్ని ఆశలతో దీనిలో చేరాడు. తలుచుకుంటే భయం వేస్తుంది.

సుందరి: అవును మరీ...ఇప్పుడు చూస్తుంటేనే దిగులుగా ఉంది....అన్నట్లు విశ్వం నీ ఉద్యోగమెలా వుంది?

విశ్వ: నా ఉద్యోగమా, యింతకాలం నన్ను అంటిపెట్టుకున్నదంటావా అది.....యీ రోజుల్లో పెళ్ళాలే మొగుళ్ళని విసిరేసి పోతున్నారే.....

రాజీ: చాతకాకపోతే ఉపమానాలెందుకండీ.........

సుందరి: ఉద్యోగం వదులుకుని ఏం చేద్దామని.....

విశ్వ: నాకు ఈ ఉద్యోగాలంటే అసహ్యము వదినా.....హాయిగా కాలుమీద కాలు వేసుకుని గడపవలసిన జీవితం.

రాజీ: ఆ......మీ తాతలు సంపాదిచిపెట్టింది ఏమన్నా ఉంటే అలా – చేసినా అందంగా ఉండును.

విశ్వ: మా మామగారుండగా ఇబ్బందేముంది చెప్పు......

రాజీ: అదేగా భరవాసా మరి.........

(తలుపు చప్పుడు)

సుందరి: మీరా......వచ్చారా.......

మాధవ: అయ్యో రాకెక్కడికి పోతాను.....

సుందరి: విశ్వనాథం, రాజీ వచ్చారండీ.....

మాధవ: (ఆత్రంగా) ఏదీ.....యిప్పుడేనట్రా రావడం...ఏం రాజమ్మా.....కులాసానా.....

విశ్వ: మా కులాసాకేంటే అన్నయ్యా.....నువ్వు మరీ చిక్కిపోయావు. నల్ల బడ్డావు కూడాను. మీ పాడు ఉద్యోగం నిన్ను తినేస్తుంది.

మాధవ: అవున్రా......

సుందరి: మీ తమ్ముడు ఉద్యోగానికి రాజీనామా యిచ్చాట్ట తెలుసునా.....

విశ్వ: నేను కాదు వదినా రాజీనామా ఇచ్చింది. అదే నాకు విడాకులిచ్చింది.

రాజీ: ఏరాయి అయితేనేం......పళ్ళూడ్డమేగా జరిగింది.

(జానకి, సత్యం ప్రవేశం)

మాధవ: రా తమ్ముడూ, రా........మీ ఇద్దరూ రాజీ పడ్డట్టున్నారే.....

సత్యం: తప్పుతుందా చెప్పండి....వెనకటి కొకాయన ఇంగ్లీషులో అన్నాడు లెండి – జీవితం రాజీల తోరణం అని.

జానకి: దాన్ని మీరు తెలుగులో అన్నారు అవునా?

సత్యం: అవుననక తప్పదు మరి......నమస్కారం విశ్వనాథంగారూ......కులాసానా......

విశ్వ: ఏదో మీ దయవల్ల......

సత్యం: నేనూ గొప్పవాణ్ణవుతున్నానన్నమాట.

విశ్వ: ఒకప్పుడు మాత్రం కాదా చెప్పండి...తేడా అల్లా ఇదివరకు లోపల, ఇప్పుడు బయట....

సత్యం: ఆ గొప్పతనం కాస్తా బయటికొసేత, లోపల ఖాళీ ఏర్పడుతుందేమో నని నా భయం.....

విశ్వ: బాగా అన్నారు...నా భయం ఏమిటో తెలుసా.....బయటా లోపలా అంతా నిండుగా ఉండదేమోనని.

రాజీ: చెయ్యయినా చాపక నోట్లోకి పండు రావాలి, కడుపు నిండాలంటే ఎలాగా............

మాధవ: జీవితం నుంచి మరీ అంత ఎక్కువ ఫలితాన్ని ఆశించకురా......ఎక్కువ ఫలితాన్ని ఆశించమంటే నిన్ను నీవు దగా చేసుకుంటటున్నావన్నమాట.

సత్యం: చల్లని వేళ సత్యం చెప్పారు అన్నగారూ......

మాధవ: మరో సత్యం కూడా చెప్పబోతున్నాను సత్యం....విన్రా విశ్వం.....సుందరీ .....విను.........యివ్వాళా నా ఉద్యోగానికి రాజీనామా యిచ్చాను.

సుందరి అండ్ విశ్వం: రాజీనామానా?.....ఏం......?

మాధవ: ఎన్నాళ్ళీ బాధ. యిన్నాళ్ళూ అది నా రక్తం పీల్చేసింది. అయిన నా అసంతృప్తిని ప్రక్కవాళ్ల ఆనందంకోసం అణుచుకుని బ్రతికాను. కాని యికనన్ను నేను నిగ్రహించుకోలేను. యీ బాధనుంచి విముక్తి

కావాలి నాకు. అందుకే రాజీనామా యిచ్చాను.

సుందరి: మరి ఎలాగండీ?

**విశ్వ:** మరో ఉద్యోగమేమయినా చూశావా అన్నయ్యా.....

**రాజీ:** ఆ మాట అడగడానికి మీకు అధికారం లేదు. మీరు ఏం చూసుకుని ఉన్న ఉద్యోగం వదిలారు.

**సుందరి:** అదికాదు రాజీ......ఇప్పుడు మళ్ళీ ఉద్యోగం ఎలా దొరుకుతుంది.

**సత్యం:** అదే దొరుకుతుంది వదినగారూ, అనుక్షణం మనలో కొంత భాగాన్ని మనమే కొరుక్కుతింటూ, ఎంతకాలం బ్రతకడం....యీ నాటికయినా యీ బురద నుంచి బయటపడ్డారు అన్నయ్యగారు.....కొంచెంసేపు పరుగెత్తడం మానేసి నిలబడి ఆలోచిస్తే మనం పోవలసిన పూలతోట కనిపించకమానదు.

**మాధవ:** బాగా చెప్పేవు తమ్ముడు.....ఆ దృష్టితోనే ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాను. జీవితంలో మనం కొన్ని పొంద వలసినప్పుడు పొందిన కొన్నింటికి రాజీనామా ఇవ్వక తప్పదు.

**జానకి:** అందుకే యిందాక సత్యంగారు అచ్చతెలుగులో సెలవిచ్చారు చూడండి రాజీల తోరణం అని......

**సుందరి:** అవును జానకీ అంతే. అందరమూ రాజీపడ్డాము. యిక భోజనాలకు లేవండి. జానకీ, సత్యం – మీరిద్దరూ కూడా ఇవ్వాళిక్కడే...

**మాధవ:** నిజమయిన యిల్లాలివంటే నువ్వు సుందరీ.....కాళ్ళుగడుగు సత్యం.....

**సత్యం:** సరే, మా రాజీకి మీరు సాక్షులుగా ఉంటానంటే కాదంటామా.....పద జానకీ...........

0తసంపూర్తి

# రాజదండం

నాగభూషణ్

పాత్రలు

రావుసాహెబ్ డాక్టర్ పోలయ్య నాయుడు, డాక్టరు వరదయ్య, ఆచార్య వెంకటరత్నం, ప్రొఫెసర్ సోమయాజులు, చెన్నకేశవులు, భాస్కర్, బంగారు, మూర్తి

(ఆంధ్రదేశం నడిగడ్డమీద అరవై యేళ్లనుంచీ అనవరతం విద్యాసేవ చేస్తున్న ఓ కళాశాలలో ఆఫీసుగది. ముందు వరండా. ఆఫీసు గది రెండు భాగాలు. ఒక దానిలో గుమాస్తాలు, ఆఫీసు మేనేజరు, స్టెనో టైపిస్టు కూర్చోడానికి స్థానాలు; రెండవది ప్రిన్సిపాలుగారు తమను చూడవచ్చిన వారికి దర్శనం యిచ్చే గది. బయటనుంచి, అధ్యాపకుల గదినుంచి రెండు పక్కలా వరండా లోకి రెండు ద్వారాలు. ఆఫీసుగది నుంచి లోపలకు మరో ద్వారం

ఉదయం పది గంటలు కావస్తున్నది. ఆఫీసు మేనేజరు దేవసహాయం ఏమిటో ఆత్రంగా వెతకుతూ వుంటాడు. పొట్టిగా, నల్లగా – గుండులాంటి మనిషి – లోతైన కళ్ళు. అవకాశం వస్తే ఎవరినైనా మట్టుబెట్టడానికి వెనుదీయని తత్వం. “అందితే జుట్టు, అందకపోతే కాళ్ళు” – ఇదీ అతని జీవితంలో అతనికి వున్న ఒకే ఒక్క నియమం....వెనుక వైపు రైటర్ల చప్పుడుకు ఓ క్షణంసేపు చికాకుపడి బంగారును కేకవేస్తాడు.)

దేవ : బంగారూ, బంగారూ........

బంగా : అయ్యా!

దేవ : ఎక్కడ చచ్చావ్?

బంగా : వచ్చానుసార్!

దేవ : ఏడవలేకపోయావు!....ఆ టైపు రైటర్లతో వాళ్ళు టైపు చేస్తున్నారా, సంగీతం పాడుతున్నారా?

బంగా : కనుక్కునివస్తాను సార్.

దేవ : ఓరి నీ ఇల్లు బంగారం కాను, నీకు ఒక్క మాటా అర్థం కాదేం ఖర్మ – వాళ్ళను అంత గట్టిగా టైపు చెయ్యొద్దను –

బంగా : అదా సార్!....అలాగే సార్...(వెడతాడు. దేవసహాయం ‘ఛీ, ఛీ’ అనుకుంటూ మళ్ళీ తన పుస్తకాలలో పడతాడు. ఇంతలో డాక్టరు వరదయ్య ఆదుర్దాగా వస్తాడు. సూటు, కిందచెప్పులు, నలిగిన టై, చెదిరిన జుట్టు)

వర : సహాయంగారూ, సహాయం గారూ! కొంపలంటుకున్నాయి. మీరు ఏదో ఒకదారి చూపాలి.

దేవ : (కంగారుగా) ఏం జరిగిందండీ?

వర : ఏం జరిగిందేమిటండీ? ఇప్పుడు ప్రిన్సిపాలుగారు వచ్చి అడిగితే ఏమని సమాధానం చెప్పను? ఈ వారం నా జాతకంలో వ్రాసివుందిలెండి – 'అధికారులచే అవమానం, దండన' అని – తప్పుతుందా?

దేవ : అసలు ఏం జరిగిందో చెప్పండి.

వర : అదే! బంగారంలాంటి ఆ స్పెక్ట్రామీటరు బద్దలయి వూరుకుంది.

దేవ : (నిట్టూర్చి) ఇంతేనా? దీనికేటండీ యింతహంగామా చేశారు?

వర : అదేమిటండీ! సానుభూతయినా చూపుతారు గదా, అని మీ దగ్గరకు వస్తే –

దేవ : దానికి ఇంత భయం ఎందుకండీ?

వర : ఇప్పుడు ప్రిన్సిపాలుగారు వస్తే ఏమని సమాధానం చెప్పను?

దేవ : ఏం జరిగిందో అదే చెప్పండ.ఇ

వర : ఏం జరిగిందో నాకుమాత్రం తెలిసి ఏడిస్తే గదండీ. కాలేజికి నేనే ముందు వచ్చాను. వచ్చి చూచేసరికి బ్రద్దలయి కనిపించింది.

దేవ : దానికి మీరు మాత్రం ఏం చేస్తారు? పోనీ, అటెండర్లు ఎవరైనా చూశారేమో కనుక్కోకపోయారా?

వర : వాళ్ళు నా తరువాత రావడం చూస్తూనే ఏమని అడగను?

దేవ : నన్ను ఎదురు ప్రశ్నే వేసుకు కూర్చుంటే ఎలాగండీ? వెళ్లి మీ డిపార్టుమెంటు వాళ్ళనీ, పిల్లల్నీ అడగండి. వాళ్ళకు తెలుసునేమో!

వర : ఏం అడిగితే ఏం లాభం లెండి....అమ్మపెట్టే నాలుగూ తినాలని వ్రాసివుంది. తప్పించడం మన తరమా?

దేవ : ఎందుకండీ అంత బెంబేలు పడతారు. అంతగా ఎవ్వరూ చెప్పకపోతే ప్రిన్సిపాలు గారితో చెబుతానని బెదిరించండి.

వర : అయ్యో, ఖర్మ! వాళ్ళుమాత్రం తిరిగి బెదిరించరండీ!

దేవ : ఇంత పిరికిగుండె వుంటే ఒక డిపార్టుమెంటుకు హెడ్‌గా ఎలా పని చెయ్యగలరండీ?

వర : మీరూ అదేమాట అన్నారూ – అవును లెండి...రాజుగారు పిల్లి అంటే పిల్లి, ఎలుక అంటే ఎలుక – నా మాట ఎవరు వింటారు కనుక...వస్తాను.

(వరదయ్య వెళ్ళిపోతాడు. దేవసహాయం నవ్వుకుంటాడు. ఇంతలో మూర్తి స్టెనో టైపిస్టు వస్తాడు)

దేవ : ఏమండి మూర్తిగారూ! ఎన్నిసార్లు చెప్పాను, తొమ్మిదిన్నరకల్లా యిక్కడ వుండాలి – అని.....ఇప్పుడు టైం ఎంతయింది?

మూర్తి : క్షమించండి....తొమ్మిదింటికే బయలుదేరాను...తీరా బయలుదేరబోతూ వుండగా చిన్నవాడు అరుగు

మీదనుంచి పడి చెయి విరుచుకున్నాడు. త్వరగా డాక్టరు దగ్గరకు తీసుకువెళ్లి యిలా వచ్చాను.

దేవ : ఇటువంటి దెబ్బలూ, ప్రమాదాలూ మీకు పరిపాటయిపోయాయి. చెప్పదలుచుకున్న వారు అస్తమానమూ ఒకే కారణం చెప్పడం కంటె, అప్పుడప్పుడు కొత్తవి చెప్పడం చాలా అవసరం.

మూర్తి : హరి, హరీ! ఎంత మాట మీకు లేని పోనివి కల్పించి చెప్పవలసిన అవసరం ఏముందండీ? జరిగింది అంతే – అందరూ చిన్నపిల్లలు. ఎవడో ఒకడు ఏదో అఘాయిత్యం చేస్తూవుంటాడు.

దేవ : ఆ నెపంతో పనులు మానేస్తే ఎలాగనే నేనడిగేది...నిన్న అనగా యిచ్చిన కాగితాలు యింకా మీరు పూర్తి చెయ్యలేదు. ఇంకా అర్జంటు టపాలు వున్నాయి....ఇవన్నీ ఎప్పుడు అవుతాయి? కొంచెం ఆలస్యమయితే ఆయన నా మీద పడతారు.

మూర్తి : క్షమించండి..తప్పయిపోయింది. అన్నీ ఇప్పుడే చేసి ఇస్తాను.

(తన సీటులోకి పోయి కూర్చుంటాడు)

దేవ : బంగారూ, బంగారూ...(బిగ్గరగా) ఓ నీ ఇల్లు బంగారంకాను, ఒక్క క్షణంలో మాయం అవుతావేరా?

బంగా : వస్తున్నాను సార్...

దేవ : ఏం అఘోరిస్తున్నావు?

బంగా : అదేనండి....కారుమోత వినిపిస్తేనూ –

దేవ : (సర్దుకుని) అయ్యగారు వస్తున్నారా?

బంగా : కాదండీ...ఎవరో కొత్తవారు –

దేవ : ఇంతవరకు ఆ సోమయాజులుగారు రాలేదు చూడూ? ఎవరికి ఎంతని చెప్పగలం? (మూర్తి వంక చూస్తూ) ఏమండీ మూర్తిగారూ! మీకు సోమయాజులుగారు కనిపించారా?

మూర్తి : లేదండీ...

దేవ : చూస్తున్నానుగా!...ఇప్పుడేమీ యిలా పట్టనట్లుగా తిరుగుతారా, ఇదే ప్రిన్సిపాలుగారి ముందేమో అతి వినయంగా, 'అలాగే, అలాగే' అంటారు.

బంగా : మరి పెద్ద దొరగారు కదా బాబు –

దేవ : మరి ఆ పెద్ద దొరగారు వాళ్ళను అడగడం పోయి నా మీద స్వారీ చేస్తారెందుకు? (నలువైపులా చూసి) సరే! మనకెందుకు? గోడలకు చెవులుంటాయంటారు.

బంగా : అంతేకదు బాబూ! మరి సోమయాజులు గారిని పిలుచుకురమ్మంటారా?

దేవ : అది కూడా ఎందుకులే? పైగా ఆయన వచ్చి నీ మీద పెత్తనం సాగిస్తాడు....కానీ? తినవలసినవి నాలుగూ నేనే తింటాను. ఆ! ఓ కప్పు కాఫీ తెచ్చిపెట్టు.

బంగా : అలాగే బాబూ!

దేవ : ఆ! వద్దులే! నేనే వెళ్ళితాగుతాను.

(బంగారు వెడతాడు. ఓ క్షణం తరువాత కొన్ని కాగితాలు మూర్తి బల్లమీద వుంచి దేవసహాయం వాకిటిలోకి వెడతాడు. ఆయన వెళ్ళడం చూసి మూర్తి టైపు చెయ్యడం ఆపి, ఇచ్చిన కాగితాలు ఒకసారి చూచి, నిట్టూర్చి, ఒళ్ళు విరుచుకుంటాడు. ఇంతలో సోమయాజులు వస్తాడు. వినయవంతుడు. కాని కళ్లెనుక మనోనిశ్చయం ఎప్పుడూ కనిపిస్తూనే వుంటుంది. అవసరం అయితే ఏం చెయ్యడానికైనా వెనుదీయని మనిషి)

సోమ : మూర్తిగారూ!

మూర్తి : (కంగారు పడిలేస్తూ) అయ్యా! –

సోమ : (నవ్వి) నేనేలెండి...ఏమిటి అలిసిపోయినట్టున్నారు...మేనేజరుగారేడి?

మూర్తి : ఇప్పుడే అలా వెళ్ళారు...మీ కోసమే అడుగుతున్నట్లున్నారు.

సోమ : ఎందుకు?

మూర్తి : నాకేం తెలుస్తుంది బాబూ?

సోమ : అవునులెండి....ఆయన మాటలు ఆయనకే తెలియవు. పైగా ఒక్క క్షణం ఆలస్యమయితే అంతా ముంచుకుపోయినట్లు మాట్లాడుతాడు....ఆ లైబ్రరీలిస్టు గురించి ప్రిన్సిపాలుగారికి ఆయనకు కూడా చెప్పమన్నాను....ఇంతవరకు చెప్పలేదు....ప్రిన్సిపాలుగారు ఏమైనా వచ్చివెళ్ళారా?

సోమ : ఓ! మరిచిపోయాను. ఇవ్వాళ క్లబ్బులో ఆయన ఉపన్యాసం ఉంది.

మూర్తి : అయితే యీ పూట కాలేజీకి రారా బాబూ!

సోమ : రాననే చెప్పారు....ఏం?

మూర్తి : ఏం లేదండి! మా చిన్న పిల్లవాడు ఆడుకుంటూ, ఆడుకుంటూ చెయ్యి విరుచుకున్నాడు. డాక్టరుగారి దగ్గరకు వెళ్లి వాడిని యింటికి పంపి నేను యిలా వచ్చాను.

సోమ : అయ్యో! సెలవు పెట్టకపోయారా?

మూర్తి : పదినిముషాలు ఆలస్యమయినందుకు మేనేజరు గారు –

(అడుగుల చప్పుడు కావడంతో ఆపివేస్తాడు. భాస్కర్ వస్తాడు. యువకుడు. మంచితనం మనసులో గూడు కట్టుకున్న మనిషి. ఎర్రగా, కందిపోయేలా వుంటాడు...అమ్మాయివంటి స్వభావం...లోపల ఏమీ దాచుకోలేని మనిషి.)

భాస్క : నమస్కారం...ప్రిన్సిపాలుగారు వచ్చారా?

సోమ : (నమస్కారాన్ని అందుకుని) ఏం? ఏమైనా పనివుందా?

భాస్క : నన్ను పదిగంటలకల్లా కాలేజీకి వచ్చి కలుసుకోమన్నారు.

సోమ : పదిగంటలకు ఆయనకు క్లబ్బులో వుపన్యాసంవుంటే మిమ్మల్ని ఎలా రమ్మంటారండీ!

భాస్క : మీరు పొరపాడలేదు కదా! తనకు మరో పని ఏమీ లేదనీ, ఇద్దరం కూర్చుని ఏదో డాక్యుమెంట్లు చూడాలని అన్నారు.

మూర్తి : మరిచిపోయివుంటారు.

సోమ : అవును..చాలా పెద్దవారా? మరిచపోయవడానికి కూడా అవకాశం లేకపోలేదు.

భాస్క : అంటే – యింకా దేనికైనా అవకాశం వున్నదనా?

సోమ : అబ్బే! అలా అని కాదు..నాతో గంట క్రితమే యీ సంగతి చెప్పారు.

భాస్క : చచ్చాం! నేను భోజనం కూడా చేసిరాలేదే!

సోమ : పోనీ, ఇప్పుడు చేసిరండి.

భాస్క : ఎందుకులెండి. ఈ లోగానే ఆయనవస్తే మళ్ళీ ప్రమాదం. ఎందుకు? మన పనేదో మనం జాగ్రత్త చేసుకుంటే సరి –

సోమ : ఏమిటండీ అంతభయం!...ప్రతిరోజూ చూస్తున్నాను; ఇక్కడవున్న ప్రతిమనిషికీ రెండోవాడంటే భయమే! మనం నియమంగా మన పనిలో లోటురానివ్వకుండా వుంటే భయపడడం ఎందుకు?

మూర్తి : అలా అంటారేమిటండీ! వారిని ఆశ్రయించుకొని బ్రతికేవాళ్ళం. వాళ్ళు చెప్పినట్టల్లా చేయకపోతే, మొదటికే మోసం రాదూ?

సోమ : మీ విధిని మీరు సక్రమంగా నెరవేరుస్తూ వుంటే, యింకా మొదటికే మోసం ఎందుకు వస్తుంది?

భాస్క : మీ పిచ్చిగాని, పనిచేసే వాడివటండీ రోజులు? డబ్బు వుండాలి, లేకుంటే డబ్బున్న వాడి ప్రాపకం వుండాలి –

సోమ : అందుకోసం, చీమ చిటుక్కుమన్నా భయపడుతూ ఎన్నాళ్ళు జీవితం గడపగలదు?...ఒక్క క్షణం కూడా హాయిగా బ్రతకలేని జీవితం ఎందుకు?

మూర్తి : బాబూ! ఏదో పెద్దవాణ్ణి; ఇన్నాళ్ళ అనుభవంతో చెబుతున్నాను....మన హాయి మాట అలా వుంచండి మనం వుద్యోగం చేయడం వల్ల యింట్లో పిల్లా జెల్లా అయినా హాయిగా వుంటారు..ఈ భయమూ, యీ శ్రమా వాళ్ళ కోసం –

(ఇంతలో దేవసహాయం రాకను గమనించి మధ్యలోనే ఆపివేస్తాడు)

దేవ : ఏమండీ మూర్తిగారు! ఇచ్చిన పని పూర్తి కాలేదు; వుపన్యాసాలు దంచుతున్నారా?

(ఇంతలో ముందుకు వచ్చి, సోమయాజులును చూచి తమాయించుకుని)

ఓ! మీరా! ఎప్పుడువచ్చారు?.....కూర్చోండి.....(తన సీటు దగ్గరకు వచ్చి) ఏమండీ మూర్తిగారూ! పూర్తిచేశారా?

మూర్తి : (తడబడుతూ) అదే...అవుతోంది...ఇప్పుడే ఇస్తాను.

సోమ : (మూర్తిగారి స్థితి చూసి జాలిపడి) అబ్బే! వాళ్ళ అబ్బాయికి కట్టు కట్టించి యింటికి పంపారట. ఎలా వుంటుందోనని బాదపడుతున్నారు.

దేవ : బాధపడడమంటే వుపన్యాసాలివ్వడం కాబోలు!....అయినా సోమయాజులు గారూ! ఇవన్నీ నాకెందుకు? నాకు కావలసింది పని అది పూర్తయితే నాకు మిగిలిన విషయాలే అక్కరలేదు.

సోమ : ప్రాణం కంటే, పని ఎక్కువటండీ!

మూర్తి : మేనేజరు గారూ, పిల్లవాడిని చూచి, భోజనం చేసి ఓ అరగంటలో వస్తాను.

దేవ : వచ్చి పూర్తిగా అరగంట కాలేదు, అప్పుడే వెడితే ఎలానండీ? ఈ పనంతా యెవరు చేస్తారు? ఇంతమాత్రాన రాకుండా వుంటే పోయేదిగా?

మూర్తి : మీకు చెప్పిపోదామని వచ్చాను...ఈ పని కాస్తా పూర్తిచేసివచ్చి సెలవు పెడతాను.

దేవ : ఎంతపని వుండో తెలిసివుండి కూడా సెలవు పెడతారా? ప్రిన్సిపాలుగారితో చెప్పగలిగితే వెళ్ళండి... నాకెంతమాత్రమూ అభ్యంతరం లేదు.

భాస్క : పోనీ పని పూర్తిచేసే వెళ్ళండి మూర్తిగారూ! మీరు వెళ్ళడం, యీలోగా ప్రిన్సిపాలుగారు రావడం, పని యేమీ కాకపోవడం, యివన్నీ ఎందుకు?

సోమ : మిస్టర్ భాస్కర్!...నీ మాటలు చూస్తే – మీరు మూర్తిగారు చెప్పిన విషయాలను నమ్మకనైనా పోవాలి; లేకుంటే మీకు సానుభూతి అనే మాట ఏకోసానా లేకుండా నైనా వుండాలి – అనిపిస్తోంది. మీరు ఆ పరిస్థితులలో వుంటే ఏం చేసేవారు? ఒక్కసారి ఆలోచించండి.

దేవ : ఏదో మాటవరసకి అనుకోవడమే కాని, వుండాలంటే మాత్రం మనం అటువంటి పరిస్థితుల్లో వుండొద్దూ?

సోమ : మీ జీవితం మీద మీకు అంత భరోసా వుంటే నేను చెప్పలేను.....ఇబ్బందులు అందరికీ వస్తాయి. ఒక్కరోజు సెలవు యివ్వడం వల్ల మీకు పోయింది ఏమీ లేదు.

దేవ : అమ్మమ్మ! ఆ మాట మాత్రం అడగకండి. నా బాధ్యత మీద అటువంటి పని చెయ్యలేను...చెయ్యను.

మూర్తి : అయ్యా! నా మూలంగా ఈ తగాదా ఎందుకు? పనిచేసే వెడతాను.

సోమ : ఎందుకండీ అంత జారిపోతారు! మనం అక్రమాలూ, అన్యాయాలూ చెయ్యమంటున్నామా? ఇంట్లో ఇబ్బందిగా వున్నది కనక సెలవు ఇవ్వమంటున్నాం. ఇంత కష్టపడి యిక్కడ పనిచేస్తున్న వాళ్ళకు ఆ మాత్రం హక్కులేదా?

భాస్క : అదేమిటండీ! సెలవు తీసుకోవడం మనకు కాలేజీ వారు కల్పించిన ఓ సౌకర్యం తప్పిస్తే, అది హక్కు కాదు –

సోమ : (కొంచెం కోపంతో) ఏమిటీ?

భాస్క : (సర్దుకుని) అహా – అని ప్రిన్సిపాలుగారు అంటారు కదా – అని.

మూర్తి : పోనివ్వండి...ప్రిన్సిపాలుగారు వచ్చిన తర్వాతే వెడతాను.

సోమ : మీరు వెళ్లండి.....నేను చూసుకుంటాను.

దేవ : ఏమండోయ్, సోమయాజులుగారు! అంత మాట చెప్పేముందు కొంత స్తోమత చూసుకోవాలి. అనవసరంగా మీరు అపాయంలో చిక్కుకుంటే, తరువాత నన్ను అనవద్దు.

భాస్క : మాస్టారు! అంతబాధ ఎందుకు? ప్రిన్సిపాలు గారు వచ్చేస్తారా – ఈలోగా యీ హంగామా అంతా

సోమ : మీరు కూడా హంగామా అంటారేమండీ! మనకు మాత్రం అవసరాలు, కష్టాలు రావా?

(అనుకుంటూ విసురుగా అధ్యాపకుల గదిలోకి వెళ్ళిపోతాడు. మూర్తి నిట్టూర్చి తనకుర్చీలో కూర్చుని, పనిచేయడం మొదలుపెడతాడు. దేవసహాయం, భాస్కర్ ప్రక్కనున్న గదిలోకి వస్తారు.)

దేవ : చూశారా భాస్కర్ గారూ! సోమయాజులు గారు అంతవారు, యింతవారు అని వూరికే గొప్పలు చెప్పేవారే! చూశారుగా, అయ్యగారి ప్రతాపం! తిన్నయింటి వాసాలు లెక్కపెడుతున్నాడు. ఈయన యిక్కడే వుండిపోవాలని ప్రిన్సిపాలుగారు ఎంత ప్రయత్నం చేశారో తెలుసా? అవును లెండి..పాముకు పాలుపోస్తే మాత్రం కాటు వెయ్యడం మాని, ముద్దు పెట్టుకుంటుందా?

భాస్క : ఆయన అలా మాట్లాడారు కాని, ప్రిన్సిపాలుగారంటే ఆయనకు నిజంగా ఎంతో గౌరవం.

దేవ : ఈ కబుర్లు కేంలెండి...గౌరవం వున్న మనిషయితే మాట్లాడే పద్ధతి ఇదేనా?

భాస్క : అవుననుకోండి –

(ఇంతలో బయటినుంచి ప్రిన్సిపాలు శ్రీ రావుసాహెబ్ డాక్టర్ పోలయ్యానాయుడుగారు వస్తారు. ఏభై ఏళ్ళ మనిషి...పాంటు, జోధ్‌పూర్ కోటు, కళ్ళజుడు – మెడను ఓ ప్రక్కకు పెట్టి పైకి చూస్తూ మాట్లాడడం ఆయన అలవాటు. నిశ్చయాన్ని తెలియ చేసే కళ్లు మాటమాటకు అహంభావాన్ని సూచించే చేష్టలు – ఆ మనిషిని చూడగానే ఎవరైనా గమనించే విషయాలు. ఆయన వెనకవచ్చే చెన్నకేశవులు ప్రిన్సిపాలుగారి ప్రాపకంకోసం పాటుపడుతున్న మనిషి. అతివినయం, అతి జాగ్రత్త, అతి గాంభీర్యం – మనిషిలో ఏ గుణమూ మితంగా లేదనిపిస్తుంది.)

ప్రిన్సి : అమెరికాలో అందరూ అదేమాట అనుకో....నాకు తెలియక అడుగుతాను మిస్టర్ కేశవులూ! అటు సాంఘికంగాను, యిటు విద్యా విషయకంగాను దేశానికి సేవచేసే వాళ్ళు ఎంతమంది వున్నారంటావు?

చెన్న : ఎందరుంటారండీ? రెండోవాడిని చూపించండి – అందులోనూ ఆంధ్రదేశంలోటండీ –

ప్రిన్సి : వాళ్ళు అదేమాట! ప్రతివాళ్ళూ – మీరు ఇండియాలో పుట్టవలసినవారు కాదనడమే!

చెన్న : అది మాత్రం నిజం కాదటండీ! తెలివిగల వానిని కూడా పైకి రానివ్వకపోవడం ఒక్క యీదేశంలో తప్ప – ఎక్కడా లేదనుకోండి.

(ప్రిన్సిపాలు నవ్వుతాడు. ఇంతలో భాస్కర్, దేవసహాయం వచ్చి నమస్కరిస్తారు. ప్రిన్సిపాలు చేతులతో ఓ విచిత్రమైన విన్యాసం చేసి వారిని ఆశీర్వదించినట్లు నమస్కారాన్ని స్వీకరిస్తాడు)

భాస్క : నమస్తే....మీరు యీ పూట రారని –

ప్రిన్సి : ఓ!...అప్పుడే మీదాకా వచ్చిందా?...అవును. క్లబ్బులో ఇవ్వాళ నా ఉపన్యాసం వుంది. కాని పని తొందరవల్ల రాలేకపోతున్నాని చెప్పాను. వాళ్ళు వదిలిపెట్టారా? "మీ కోసం ప్రోగ్రాం సాయంకాలానికి మార్చుకుంటాం. రాక తప్పదు" అన్నారు. ఇప్పుడు కూడా ఒప్పుకోకపోతే, 'చూశావా! వీడికి ఎంత గర్వమో' అంటారు.

దేవ : పాపం! మీరు రావాలని వాళ్ళు అంతగా అనుకుంటున్నప్పుడు వాళ్ళను నిరుత్సాహపరచడం –

చెన్న : భావ్యం కాదంటారు. అంతేనా? గొప్పవాళ్ళు రావాలనుకున్నప్పుడు సంవత్సరాలయినా ఆగవలసిందే! ఆనాడు శ్రీకృష్ణపరమాత్మ దర్శనం కావడానికి మునులు ఎన్ని యుగాలు తపస్సు చెయ్యలేదు?

(ప్రిన్సిపాలుగారు నవ్వుతాడు)

దేవ : నవ్వడం కాదండీ! చెన్నకేశవులు చెప్పిన దానిలో చాలా నిజం వుంది...మీ వుపన్యాసంవినే అదృష్టం – అది మాత్రం ఎందరికి వుంటుంది, చెప్పండి?

ప్రిన్సి : (నవ్వుతూ) ఏదో, మీ అందరి ప్రేమాభిమానాలవల్ల మీకలా అనిపిస్తున్నది...మీ అందరితో కలిసివుండడం నాకు చాలా ఆనందంగా వుంది..ఆ! ఇంకా నిలబడే వున్నారు. కూర్చోండి..

చెన్న : ఫరవాలేదు.....దానికేం! (అంటూ కూర్చుంటాడు.)

భాస్క : (కూర్చుంటూ) నన్ను ఎందుకో రమ్మన్నారట?

ప్రిన్సి : మిమ్మల్నా! ఎందుకబ్బా! ఆ! అన్నట్లు సోమయాజులుగారు ఆ లైబ్రరీ లెక్కలన్నీ పూర్తిచేశారా?

భాస్క : నేను అడగలేదండీ?

దేవ : ఇంకా అవుతున్నాయని చెప్పారు.

ప్రిన్సి : పని ఇచ్చిన తరువాత యింత నానుస్తూ చెయ్యడమే నాకు బావుండదు. అంత అయిష్టంగా వుంటే చెప్పకూడదూ?

భాస్క : ఆయన అయిష్టంగా వున్నట్లు నాకు తోచడంలేదండీ! మార్పులు చాలా వున్నాయిని, మీతో మాట్లాడాలని చెప్పారు.

ప్రిన్సి : నాకు తెలియనట్లుగా చెబుతారేం భాస్కర్! ఆ పని ఎన్నాళ్ళు చెయ్యాలి? ఈ వెధవ చిన్న పనికోసం వారం రోజులు తీసుకుంటే యీ ప్రిన్సిపాలు పని ఎన్నాళ్ళు చెయ్యగలనంటారు?

(భాస్కర్ మాట్లాడడు)

చెన్న : మావంటి వాళ్ళకది సాధ్యమటండీ! ఎంత బాధ్యత, ఎంత శ్రమా! సామాన్యులవల్ల అవుతుందండీ!

ప్రిన్సి : నేను ఒక్కడినే చెయ్యలేనని నాకు తెలుసు. అందువల్లనే మీ సహాయం నాకు ఎప్పుడూ అవసరం.

చెన్న : ఎంతమాట! మీరు 'ఉ' అనాలి కాని, ఎంత పనయినా అవలీలగా చేసి పెట్టంటండీ!

ప్రిన్సి : ఇంతటి వాళ్ళు నాకుఅండగా వున్నారు కనుకనే, యీ పదవిని యింత సమర్థతతో నిర్వహించ గలుగుతున్నాను. ఆ! మిస్టర్ చెన్నకేశవులూ! రేపు సాయంత్రం నాకు ఇండియా–అమెరికా మైత్రిసంఘం – ఆంధ్రశాఖవారు సన్మానం చేస్తున్నారు. మీరు కూడా నా వెంట రావాలి. మీకు అభ్యంతరం లేక పోతే, కావాలసిన ఏర్పాట్లు అవీ –

చెన్న : అంతకంటేనా –

ప్రిన్సి : ఫోనుచేసి రైలులో రెండు సీట్లు రిజర్వు చేయించండి.

చెన్న : సాయంకాలంలోగా అన్నీ కనుక్కుంటాను.

(అని వెళ్ళబోతాడు)

ప్రిన్సి : బైదిబై, మీరు బజారుదాకా వెడుతూ వుంటే కొంచెం టైలర్‌ని కనుక్కోండి – కొత్త సూట్లు పూర్తిచేశాడేమో

చెన్న : తప్పకుండా కనుక్కుంటాను. వస్తాను......(నమస్కారం చేసి వెళ్ళిపోతాడు. అతని వంక జాలిగా చూస్తాడు భాస్కర్)

ఆ! మిస్టర్ దేవసహాయం! ఇవ్వాళ పంపవలసిన ఉత్తరాలన్నీ పూర్తి అయ్యాయా?

దేవ : ఎక్కడండీ? ఆ మూర్తిగారికి నిన్న యిచ్చినవే పూర్తికాలేదు.

ప్రిన్సి : ఏం? ఎందుకని?

దేవ : వాళ్ళ అబ్బాయి క్రిందపడి చెయ్యి విరుచుకున్నాడట! అది కొంత ఆలస్యం...తీరా కాలేజీకి వచ్చాక ఉపన్యాసాలతో కొంత ఆలస్యం....ఇంటికి వెళ్ళి మళ్ళీ వస్తానని కొంతసేపు –

ప్రిన్సి : అలాఅయితే ఇక్కడ పనిచెయ్యనక్కరలేదని చెప్పలేకపోయారా?

భాస్క : నిజంగా వాళ్ళ అబ్బాయి చెయ్యి విరిగిందటండీ! – అందుకని –

ప్రిన్సి : అందువల్ల యిక్కడ పని చెయ్యకపోతే ఎలా జరుగుతుందండీ? (మూర్తిని కేకవేస్తూ) మూర్తిగారూ! మూర్తిగారూ! (మూర్తి వచ్చి భయపడుతూ చేతులు కట్టుకు నిలబడతాడు)

ప్రిన్సి : ఏమండీ! పనులు చెయ్యడమంటే ఇలాగేనా?

మూర్తి : కాదండీ!....ఇంటిదగ్గర –

ప్రిన్సి : ఇంటిదగ్గర విషయాలకు, కాలేజీ పనులకు ముడిపెట్టవద్దని లక్షసార్లు చెప్పాను...ఇంకా మీకా సంగతి తెలియకపోతే, యింటిదగ్గర వుండిపోవడమే మంచిది. పనిచెయ్యకుండా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చునే వాళ్ళు నాకు అక్కరలేదు.

భాస్క : (కొంచెం జంకుతూనే) పాపం! ఆయన పనిచేసే వెడతానన్నారండీ –

ప్రిన్సి : అయితే – చేసి వెళ్ళమనండి.

భాస్క : అదే! ఇంకా భోజనం చేసిరాలేదట! హాస్పిటల్ నుంచి అలాగే కాలేజీకి వచ్చారట!...అందువల్ల –

దేవ : అందువల్ల భోజనం చేసిన వచ్చిన తరువాత తీరికిగా యీ పనులన్నీ చేస్తారట!

ప్రిన్సి : ఏ పనులు ఎప్పుడు చెయ్యాలో, ఏవి తొందర పనులో తెలియకపోతే మీరు నిక్షేపంలా మానివేయవచ్చు. మాకు పని కావడం ప్రధానం. పనిచెయ్యకుండా వూరికే మేపడం మాకు చేతకాదు.

భాస్క : (వారిస్తూ) ప్రిన్సిపాల్‌గారూ!

ప్రిన్సి : ఏం?

భాస్క : (సంబాళించుకుని) ఆహా!...ఆయన పెద్దవారు. పనిచెయ్యకుండా ఉండాలన్నా అభిప్రాయం ఆయనకు మాత్రం వుంటుందా? (ఈ మాటలు అంటూవుండగా సోమయాజులు వస్తాడు)

ప్రిన్సి : మిస్టర్ భాస్కర్! నాకు ఈ విషయాలేమీ తెలియవంటారా? నాకు ఎన్నాళ్ళ అనుభవం వుందో తెలుసా? మీ వయస్సెంత –

సోమ : నమస్తే! ఏమండీ మూర్తిగారూ! మీరింకా ఇంటికి వెళ్ళిరాలా?

ప్రిన్సి : ఎందుకు?

దేవం : ఇందాకటనుంచి సోమయాజులుగారే ఆయన ఇంటికి వెళ్ళిరావాలిని మద్దతుయిచ్చారు.

సోమ : తప్పా?

దేవ : తప్పునికాదు...పని పూర్తికాకుండా –

సోమ : పని పూర్తికావడానికి ఎంతసేపు పడుతుంది? ఆయన ఓ గంటలో భోజనం చేసి వచ్చి మీ పని పూర్తి చేసి యివ్వలేడా? గంటలోనే అంతతొందరా?

మూర్తి : తొందరేనండీ....తప్పునాదే! పూర్తిచేసే వెడతాను...

సోమ : కాదు డాక్టర్....ఆయన ఎందుకులే అని అలా అంటున్నారు. కొడుకుకు చెయ్యి విరిగింది. ఎలా వున్నరో తెలియదు. తాను భోజనం చెయ్యలేదు. ఈ పరిస్థితుల్లో ఆయన తన పనిని మాత్రం సక్రమంగా ఎలా చెయ్యగలరు చెప్పండి...అందుకే ఇంటికి వెళ్ళిరమ్మన్నాను.

ప్రిన్సి : వెళ్ళి రమ్మనడానికి వేరే మనుష్యులున్నారు....అది మీ పదవికి మించినది.

సోమ : దీనిలో పదవుల ప్రసక్తి ఏమున్నదండీ?

దేవ : ఎందుకు లేదు? ఇందాక 'అంతా నేను చూసుకుంటాను. మీరు వెళ్ళిరండి' అని మూర్తి గారితో మీరు అనలా?

ప్రిన్సి : అవునా?

సోమ : అవును డాక్టర్!..ఆయన స్థితి ఆలోచించండి. పెద్దవాడు, భోజనం చేయలేదు. పైగా కుర్రవాడికి అపాయకరమైన దెబ్బ – ఇటువంటి సమయంలో ఆయన ఒక గంట యింటికి వెళ్లిరావడానికి అభ్యంతరమా?

ప్రిన్సి : అవన్నీ మాకూ తెలుసు. తెలియకపోయినా చెప్పవలసింది మీరు కాదు. ఆ! మూర్తిగారూ! మీరు ఇంటికి వెళ్ళిరావచ్చు.

మూర్తి : అక్కర్లేదు బాబూ! పని పూర్తిచేసే వెడతాను.

ప్రిన్సి : ఫరవాలేదు....మీరు వెళ్ళిరండి...

(దేవసహాయం బిత్తరపోయాడు. భాస్కర్ జరుగుతున్నదంతా చూస్తూ వూరుకుంటాడు. మూర్తిగారు నమస్కరించి వెళ్ళిపోతాడు)

ప్రిన్సి : మాకు మాత్రం దయ, జాలీ వుండవంటారా సోమయాజులుగారూ! పరిస్థితులను బట్టి పోవాలి. కాని మీరుమాత్రం యిటువంటి సలహాలిచ్చి ముప్పులో పడకండి.

సోమ : అబ్బే! అయన పరిస్థితులవల్ల జాలితో చెప్పానే కాని –

ప్రిన్సి : నాకూ తెలుసుననుకోండి..ఆ! మిస్టర్ దేవసహాయం! యూనివర్సిటీకి పంపవలసిన రికార్డ్సు, బిల్లులు ఒకసారి తీసుకురండి.

(దేవసహాయం అలాగేనని వెడతాడు)

భాస్క : నన్ను ఎందుకో రమ్మన్నారు.

ప్రిన్సి : అదే!...అదే...ఎందుకో జ్ఞాపకం రావడం లేదు. ఒక్క క్షణం ఆగండి..ఆ! సోమయాజులుగారూ! ఈ పదవిలో వున్న సాధకబాధకాలు మీకు తెలియనివి కావు.....నేను చెప్పిన మాటలకు నా ఎదుటనే వ్యతిరేకంగా మాట్లాడితే నన్ను గురించి, నా వుద్యోగాన్ని గురించి కొంచెం జాగ్రత్త తీసుకోవాలి.

సోమ : మీకు వ్యతిరేకంగా చెప్పాలన్న ఆకాంక్ష నాకు అణుమాత్రం కూడా లేదు...మిమ్మల్ని కాని, మీ మాటలను కాని వ్యతిరేకిద్దామన్న అభిప్రాయం అసలే లేదు.

ప్రిన్సి : కాకపోవచ్చు. కాని కాలేజిలో నా మాట వినవలసిన వారి దగ్గర అలా మాట్లాడుతూ వుంటే, దానికి తగిన జాగ్రత్త నేనూ తీసుకోవాలసి వుంటుంది.

సోమ : క్షమించండి.....మీ బాధ కలిగించినట్లున్నాను.

ప్రిన్సి : బాధ ఏమీ లేదు...కొన్ని విషయాలలో మనం ఎంత నిర్దుష్టంగా వుంటే అంత మంచిది.

బంగా : (వచ్చి) అయ్యా! మీకోసం ఎవరో ఫోనులో పిలుస్తున్నారు సార్!

ప్రిన్సి : వస్తున్నాను – (లోపలకు వెడుతూ) ఆ వెంటకరత్నంగారు వస్తే ఆగమని చెప్పు.

బంగా : అలాగే బాబూ!

భాస్క : వెంకటరత్నంగారెందుకు బంగారూ?

బంగా : ఏమో బాబూ!

సోమ : ఇంకా ఎందుకు? ఎక్కడో ఓ చిన్న పొరపాటు కనిపించి వుంటుంది. ఇక దాన్ని సాగదీసి ఆయన ప్రాణాలు తీయడానికి –

భాస్క : మరీ అన్యాయంగా మాట్లాడకండి. ఆయనంటే ప్రిన్సిపాలుగారికి అంత కోపం ఎందుకు?

సోమ : (నవ్వి) ఇంకా మీరు ఎక్కడ వున్నారు భాస్కర్! మీకు కాలేజీని గురించిన ఒక్క సత్యం కూడా తెలియకపోవడం ఆశ్చర్యంగా వుంది.

భాస్క : నాకు అర్థం కావడం లేదు.

సోమ : ఎలా అవుతుంది భాస్కర్! మీకు ఇలాంటి అనుభవాలు కలగాలి...ఏం బంగారూ! నిజం చెప్పు.... నిన్న ఇంగ్లీష్ హెడ్ గారిని ప్రిన్సిపాలుగారు ఎందుకు తిడుతున్నారు?

బంగా : ఏదో బీదవాళ్ళం...మాకేం తెలుస్తుంది బాబూ!

సోమ : ఫరవాలేదు బంగారూ! మేము మాత్రం బీదవాళ్ళం కాదా!

భాస్క : చెప్పు బంగారూ! ఏం జరిగింది?

బంగా : జరగడానికి ఏం ఉంది బాబూ! మొన్న పెద్ద అయ్యగారు యీయన గారిని యింటికి రమ్మన్నారంట! ఈయనగారు వెళ్ళలేదు కాబోలు...ఇక చూడండి బాబూ! ఒక తిట్టుకాదు, ఒక మాట కాదు –

భాస్క : ఏమిటి రాఘవరావుగారినా?

బంగా : అదేం బాబు అలాగంటారు. ఆయన్ని రోజుకొకసారయినా తిట్టకుండా వుండరు బాబూ – ఆ సత్తెకాలం మనిషి ఏమీ ఎదురు చెప్పడు.

భాస్క : నేను నమ్మలేకుండా వున్నాను.

సోమ : మీరు నమ్మలేని నిజాలు యీ కాలేజీలో చాలా వున్నాయి...నిలకడ మీద మీకే తెలుస్తాయి.

(ఆచార్య వెంకటరత్నంగారు వస్తారు. మనిషి పచ్చని పసిమి. నెరసిన జుట్టు. నవ్వుతూ వుండే పెదవులూ, లాల్చీ, గ్లాస్గో ధోవతి మల్లెపువ్వులా వుంటాడ. ఆయన రాగానే యిద్దరూ నమస్కరిస్తారు)

వెంక : (నమస్కారం అందుకుని) ఏమండీ సోమయాజులు గారూ! ప్రిన్సిపాలుగారు రమ్మన్నారట!

సోమ : మాకు అంతవరకే తెలుసునండీ! ఎందుకోమాత్రం తెలియదు.

వెంక : ఎక్కడకు వెళ్ళారు?

భాస్క : లోపల ఫోనులో మాట్లాడుతున్నారు.

వెంక : బంగారూ! నేను వచ్చానని అయ్యగారికి చెప్పు.

బంగా : అట్లాగేనయ్యా! (వెళ్ళిపోతాడు)

వెంక : ఇంటికి కబురు పెట్టి, పిలిపించే తొందరపనేమిటో!

సోమ : ఏలినవారు మనసుకు నచ్చిందే తొందర పని –

వెంక : తీరా వచ్చామా, అడిగిందే అడిగి మన ప్రాణం తీస్తారు. మనం ఏం చెప్పినా వినరు....అంత సహనం లేని మనుషులు ఈ పదవికి తగరండీ –

సోమ : ఇక పొరపాటున నలుగురితో వుండగా వెళ్ళామా, అప్పుడు చూడాలి నాయుడుగారి ప్రతాపం...ఆయన అప్పుడు అనే మాటలు విన్న తరువాత కూడా యింకా వుద్యోగం చేస్తున్నందుకు మనం అనుకోవాలి.

వెంక : మా వంటి వాళ్ళు సరే భాస్కర్! మీ వంటి కుర్రాళ్ళయినా మరో మంచి చోటుకు ఎందుకు పోరు?

సోమ : ఆ మాట అనకండి...భాస్కర్‌కు యిది, భూలోక స్వర్గం –

వెంక : పెద్దవాళ్ళం అయిపోయాం....ఎందుకులే బ్రతికినన్నాళ్ళు బ్రతకమని చూస్తున్నాం కాని – లేకుంటే యిన్ని అక్రమాలు జరుగుతూవుంటే యింకా యిక్కడ వుద్యోగం చేసేవాళ్ళమా?

సోమ : కాలేజీలో ఎవ్వరూ కూడా యీ బ్రహ్మాండమయిన 'షో' వెనుక జరుగుతున్న భాగవతం సంగతే గమనించడం లేదు – ఎందువల్లనో?

వెంక : అయ్యా! వారికివన్నీ ఎందుకు? కాలేజీకి ఎన్నేళ్ళు? డెబ్భై – ఎంతమంది పిల్లలు? రెండువేలమంది. ప్రిన్సిపాలు గారు ఎటువంటివాడు? అబ్బో – చాలా గొప్పవాడు – ఆయనటండీ – ఇవి చాలవుటండీ యీ కాలేజీ గొప్పతనం చాటేందుకు? ఇవన్నీ గమనిస్తున్న వారికి – వెనుక ఏం జరుగుతుందో ఎందుకు?

సోమ : అవునండీ! భాస్కర్‌లా అధికార వర్గాలకు సన్నిహితులైన యీ విషయాలు గమనించడం లేదంటే చాలా ఆశ్చర్యంగా వుంది.

వెంక : అవి అంత తేలికగా కనుపించవండీ....ఎన్నో ఏళ్ళనుంచీ యిక్కడ వున్నాం కనుక లోపలకు ఎంత కళ్ళు, ఎంత మోసం, ఎంత అన్యాయం జరుగుతుందో మనకు తెలుసు – నిన్న వచ్చిన భాస్కర్‌కు ఎలా తెలుస్తుంది?

భాస్క : ఇప్పుడు నాకు ప్రతి విషయం అర్థం అవుతుంది. వెనుక జరిగిన సంఘటనలు నెమరుకు తెచ్చుకుంటే జరుగుతున్న దేమిటో పూర్తిగా అర్థం అవుతోంది.

దేవ : (ఫైళ్ళతో వచ్చి) ఆ! అయ్యా! (ప్రిన్సిపాలుగారు లేరని చూచి, నాలుక కరుచుకొని, వెంకటరత్నంగారికి నమస్కరిస్తూ) ఆ! అయ్యగారు యిక్కడ లేరండీ?

సోమ : లేరు...లోపల ఫోనులో మాట్లాడుతున్నారు. (ఇంతలో ప్రిన్సిపాలుగారు గదిలోకి వస్తారు)

వెంక : నమస్కారమండీ....నన్నెందుకో రమ్మన్నారట!

ప్రిన్సి : అవునండీ....ఆ తెలుగు కాంపోజిషన్ పుస్తకాల సంగతి ఏమిటి?

వెంక : ఏం? ఏమయింది?

ప్రిన్సి : అవి ఎన్నెన్ని వ్రాయించాలో, ఆ మార్కులు రిజిస్టరులో ఎక్కిస్తున్నారో లేదో, అవేమీ ఆఫీసులో తెలియకపోతే ఎలాగండీ?

వెంక : అదేమిటండీ! అన్ని వివరాలూ ఎప్పటికప్పుడు యిస్తూనే వున్నాం కదా!

ప్రిన్సి : అవి చాలవండీ! ఏ విద్యార్థి ఎప్పుడు వ్రాయలేదు! అధమం ఒక్కొక్కరూ ఎన్ని కాంపోజిషన్లు వ్రాయాలి? సంవత్సరానికి ఎన్ని వ్రాయాలి? వ్రాయకపోతే ఆ విద్యార్థిమీద ఏం చర్య తీసుకోవాలి....ఇవన్నీ తెలియవద్దటండీ?

వెంక : ఇవన్నీ ముందుగానే మీతో చెప్పానండీ.

ప్రిన్సి : నాతో చెబితే సరిటండీ! ఎన్ని విషయాలు ఎందరు చెబుతారో...అవన్నీ జ్ఞాపకం వుంచుకోవడమే నా పనా?

వెంక : (కోపం వచ్చింది. కాని అణుచుకుని) అయితే, ఇప్పుడేం చెయ్యమని సెలవు?

ప్రిన్సి : చూడండి...ఇంతగా నేను స్ట్రిక్ట్‌గా వుంటున్నానంటే మన కాలేజీ నలుగురిలో సాటిలేని దనిపించుకోవాలి. సెభాష్ అనిపించుకోవాలినే! ఏమంటారు? (వెంకటరత్నం గారిని ప్రశ్నించి, ప్రశ్నార్థకంగా మిగిలిన వారి వంక చూస్తాడు)

వెంక : అవునవును.

ప్రిన్సి : అందువల్ల – కొందరిని కొన్ని సందర్భాలలో బాధకలిగినా మనం పనులు చేసుకుపోవాలి.

వెంక : అవును...మరి నన్ను యిప్పుడేం చెయ్యమంటారు?

ప్రిన్సి : దానికి చేసేదేమున్నదండి...పని ఎలా జరుగుతతున్నదో వివరంగా ఆఫీసుకు ఓ నివేదిక వ్రాయండి.

వెంక : అలాగే!...(అని వెళ్లబోతూ వుంటాడు)

ప్రిన్సి : ఆ! దానితో పాటు ఆలస్యానికి ఓ వివరణకూడా వ్రాయండి...అది ఆఫీసులో వుండాలి చూడండి.

(వెంకటరత్నంగారు ఓ సారి సీరియస్‌గా ప్రిన్సిపాలుగారివంక చూచి, 'అలాగే' అని వెళ్లిపోతాడు)

ప్రిన్సి : (ఆయన వెళ్ళినవైపు చూచి నవ్వుతూ) ఈ ప్రిన్సిపాలు వుద్యోగం చాలా ఛండాలమయినదనుకోండి. బరువు, బాధ్యతా – పైగా ప్రతివాడినీ కూడదీసుకుని వచ్చే సరికి తలప్రాణం తోకకు వస్తుంది.

భాస్క : అవును....కాని డాక్టర్! మరికొంచెం మెత్తగా, మృదువుగా వుంటే పనులు కావంటారా?

ప్రిన్సి : (నవ్వుతూ) మీకేమీ తెలియదు భాస్కర్! ఏ ఎండకు ఈ గొడుగు పట్టాలి....ఎక్కడ కఠినంగా వుండాలో, ఎక్కడ మెత్తగా వుండాలో నాకు తెలియదంటావా?

దేవ : రికార్డు అడిగారు. ఇదిగోనండి. (అని ఇస్తాడు)

ప్రిన్సి : ఆ! (అని త్రిప్పి) ఇవి మీరిద్దరూ కలిసి కొంచెం చూచిపెట్టండి.

భాస్క : మీకు మరేమీ పనులు లేవుగా సోమయాజులుగారూ!

సోమ : అబ్బే!....(ఇద్దరూ వెళ్ళిపోతారు)

ప్రిన్సి : (ఓ క్షణం ఆగి) ఈయన తను చెడేది కాకుండా, అమాయకుడు భాస్కర్‌నీ దించుతున్నాడనుకుంటాను.

దేవ : ఆ మూర్తిగారి విషయంలో – ఇందాక – ఒకటీ రెండు మాటలా ఈయన అన్నది?

ప్రిన్సి : ఎవరు? భాస్కరా?

దేవ : కాదండీ....సోమయాజులగారే!

ప్రిన్సి : అంటాడు, అంటాడు...చూచి చూచి తోకతెగకోస్తే సరి –

దేవ : ప్రిన్సిపాలుగారు మాత్రం ఏమంటారు? పని వస్తే వెళ్లవద్దంటారా? మీరు వెళ్లండి, నేను చూసుకుంటాను – అంటూ ఒకటా?...నేను చెప్పినా విన్నారనుకున్నారా?

ప్రిన్సి : ఆ కమిటీలో పలుకుబడి చూచుకుని ఎగురుతున్నాడు కాబోలు...ఈ నాయుడు ముందు కుప్పిగంతులు పనికిరావని ఇంకా తెలుసుకోలేదు.

దేవ : ఎలా తెలుసుకుంటాడండీ? తెలియచెప్పాలి.

ప్రిన్సి : (రికార్డు చూస్తూ) అవునవును..ఆ రోజు వస్తుంది....ఇదేమిటి! స్పెక్ట్రామీటరు ధర వేశారెందుకు?

దేవ : అది పగిలిపోయిందండి.

ప్రిన్సి : ఎప్పుడు?

దేవ : ఇవ్వాళ ఉదయమే..వరదయ్యగారు వచ్చి చెప్పివెళ్ళాడు...ఈ సంవత్సరం బడ్జటు లోనే వేస్తే సరిపోతుందిగదా అని –

ప్రిన్సి : ఎలా పోయిందట!

దేవ : ఆయనకు తెలియదటండీ.

ప్రిన్సి : ఛీ, ఛీ! ఒక్క విషయం తెలియదు. ఒక్క పని సరిగా చెయ్యడం చేతకాదు...ఒక సారి చెబితే బుద్ధి వుండొద్దూ? బంగారూ, బంగారూ –

(బంగారు త్వరగా వస్తాడు)

వెళ్ళి వరదయ్యగారిని పిలుచుకురా –

బంగా : ఇప్పుడే రమ్మన్నారా అండీ?

ప్రిన్సి : ఇప్పుడే – ఇక్కడ ఉన్నట్లు రమ్మను.

(బంగారు వెడతాడు)

ప్రిన్సి : ఇటువంటి వాళ్ళందర్నీ పెట్టుకుని పని చెయ్యాల్సివస్తోంది – ఛీ –

దేవ : కాదుటండీ....అసలే శ్రమ, బాధ్యత ఎక్కువ....అందులోనూ ఇటువంటి వాళ్ళుంటే వేరే చెప్పాలా? (ఇంతలో భాస్కర, సోమయాజులు వస్తారు)

సోమ : అన్నీ సవ్యంగానే వున్నాయి...ఇక్కడ ఈ ఒక్క కూడిక తప్పుగా ఉంది...ఒకసారి చూడండి..

దేవ : చూసి తీసుకువస్తాను...(తీసుకుని వెళ్ళి పోయాడు)

(వరదయ్య, భయంగా, త్వరగా వస్తాడు)

ప్రిన్సి : ఏమండీ! ఏమిటి ప్రొద్దున్నే ఘనకార్యం చేశారట!

వర : నేను కాదండీ చేసింది.

ప్రిన్సి : మరి ఎవరు?

వర : నాకు తెలియదండీ –

ప్రిన్సి : చేసింది మీరు కాదు; ఎవరు చేశారో మీకు తెలియదు.....మరి ఏమీ తెలియకుండా చేస్తున్నారండీ పని? అప్పుడు మీరే చెయ్యాలా? బజారున పోయే ఎవడిని తీసుకువచ్చి పెట్టినా చేస్తాడుగా!

వర : అది కాదండీ! నేను వచ్చేసరికే .....!

ప్రిన్సి : మీరు నాకింకేమీ చెప్పకండి...తప్పుచేసి కూడా సమర్థించుకోవడం చూస్తేనే నాకు అసహ్యం వేస్తుంది. ఈ కాలేజీలో రెండో కంటివాడికి తెలియకుండా వెయ్యిరూపాయల సామను పోయిందంటే మీరంతా ఏం చేస్తున్నట్లు? ఎందుకుండీ మీరంతా?

వర : తప్పే అయిపోయింది –

ప్రిన్సి : మీ సంజాయిషీలు నాకేం అక్కర్లేదు....కమిటీకి రేపే సమాధానం ఏమని చెప్పను? చిన్న వస్తువు కనకనా, సర్ది చెప్పడానికి? (వరదయ్య వంకు తిరిగి) ఆ మాత్రం జాగ్రత్త లేకపోయాక మీరు హెడ్ గిరీ వెలగబెట్టడందేనికి? గాడిదలు కాయనా?

(ఎవ్వరూ మాట్లాడరు)

ఛా! ఇంత అసమర్థులైనవాళ్ళతో పనులు పూర్తిచేసుకోవాలి. మళ్ళీ అన్నీ సవ్యంగా వుండాలి. ఎలా?.. ఇంకా ఎందుకు నా ఎదట? వెళ్ళండి....ఆఫీసుకు ఓ సంజాయిషీ, ఓ క్షమాపణ వ్రాసి యివ్వండి.

వర : అలాగే – (భయంగా వెళ్ళబోతాడు)

ప్రిన్సి : చూడండి....ఇది ఆఖరుసారిగా చెబుతున్నాను. ఇంత నిర్లక్ష్యంగా వుద్యోగం చేసే వాళ్ళు నాకు

అక్కర్లేదు. ఆ మాట జ్ఞాపకం వుంచుకోండి.

(వరదయ్య వెనకకు తిరిగినవాడు అలాగే వుండిపోతాడు)

ఇంకేం?...వెళ్ళిరండి.....

(వరదయ్య నమస్కరించి వెళ్ళిపోతాడు. ప్రిన్సిపాలు కూడా 'దేవసహాయం, దేవసహాయం' అనుకుంటూ లోపలకు వెళ్ళిపోతాడు. సోమయాజులు దీర్ఘంగా నిట్టూర్చి భాస్కర్ వంక చూస్తాడు)

భాస్క : ఇన్నాళ్ళు యింత దగ్గరగా తిరిగాను. కాని నాకు ఎన్నడూ యీ విధంగా అనిపించలేదు. నన్ను నేను ఎంతగా ఆత్మవంచన చేసుకున్నానో యిప్పుడు తెలుస్తోంది. ఎంత కపటం! ఎంత మాత్సర్యం! ఎంత గర్వం!! అబ్బ – ఇన్ని దుర్గుణాలు వుంచుకుని కూడా మనుష్యులు పైకి ఎంత గౌరవంగా చెలామణి అవుతున్నారో!

సోమ : (నవ్వి) భాస్కర్! ఇవ్వాళ మీరు తెలుసుకున్నారు కనుక ఇలా బాధపడుతున్నారు..కాని ప్రతిమనిషి మానవత మీద ఎన్ని అకార్యాలు జరుగుతున్నాయో మీకు తెలియదు. మీకు కనిపించేది కుళ్ళిన పండుపైన వున్న రంగే! రుచి చూచినవాళ్ళకి కాని లోపల సంగతి తెలియదు.

భాస్క : ఆయన హెడ్‌కదా! పైగా తనతో ఉద్యోగంలో చేరినవాడు. ఇంత హీనంగా, పశువు కన్న నీచంగా ఆయన ఎలా చూడగలుగుతున్నాడు. ఆయన అలా చూస్తుంటే ఇంకా ఈయన ఎలా ఉండగలుగుతున్నాడు?

సోమ : అదేమిటి భాస్కర్! ప్రిన్సిపాలుగారు సర్వాధికారు...రాజదండం నిరంతరం అధికారానికి ప్రతినిథిగా నిలబడి ఉంటుంది.. మరి ఆయన? పిల్లలు కలవాడు..కోపం వచ్చి వెళ్ళిపోతే రేపు వాకిట్లో నిలబడవలసిందే!

భాస్క : అందుకని – మానాభిమానాలు చంపుకుని అంత అవమానపరుస్తూంటే ఆయన దగ్గరే పని చెయ్యగలడా?

సోమ : మీరింకా జీవితంలో వాస్తవికతను ఎదుర్కోలేదు భాస్కర్. ఆ పరిస్థితుల్లో మీరు వుంటే ఆ బాధ మీకు తెలుస్తుంది. ఇన్ని అన్నా బాధపడకపోవడానికి ఆయన మాత్రం మనిషి కాదా?

భాస్క : ఏమిటో? ...ఇక మీదట – ఇవన్నీ తెలిసాక – ఇక్కడ ఓ క్షణం వుండలేననిపిస్తుంది.

సోమ : ఏదైనా అలవాటు కావాలి చూడండి...

భాస్క : లేదు...ఇది అలవాటు కాదు; చేసుకోవాలని లేదు...ఆ! ఇప్పుడే వస్తాను...(అని స్టాఫ్ రూములోకి పోతాడు. వెనుకగది నుంచి ప్రిన్సిపాలు, వెనుక దేవసహాయం వస్తారు)

ప్రిన్సి : చూశారా సోమయాజులుగారు! ప్రొద్దున్న పార్టీ వుందన్నానా! అది సాయంకాలానికి మార్పించాను...సాయంకాలం విద్యామంత్రిగారు వస్తున్నారు...ఇక వెళ్ళడం కుదరదు...అయినను రిసీవ్ చేసుకోవడానికి స్టేషన్‌కు వెళ్ళాలి ఆ! అన్నట్లుగా రాత్రికి స్టాఫ్ అంతా కలిసి ఆయనకు గ్రాండ్ డిన్నర్ యిస్తే బావుండదూ?

(భాస్కర్ వస్తాడు)

ఓ! మిస్టర్ భాస్కర్ రాత్రికి విద్యామంత్రిగారు విచ్చేస్తున్నారు....స్టాఫ్అంతా కలిసి డిన్నర్ యివ్వాలి.

దేవ : చాలా మంచి ఐడియానండి. అంతకంటే కావలసిందేముంటుంది?

ప్రిన్సి : మీరేమంటారు? (అని ఇద్దరి వంకా చూస్తాడు)

సోమ : బాగానే వుంటుందనుకోండి...కాని అందర్నీ సంప్రదించి చేస్తే –

ప్రిన్సి : ఇప్పుడా –..వ్యవధి చాలా స్వల్పంగా వుంది...చెయ్యవలసింది చాలా వుంది...అందువల్ల (దేవసహాయం వంకు తిరిగి) నోటిసు టైపు చేయించి, అందరకు పంపు.

భాస్క : అందరికీ యిప్పుడు పంపితే అందక పోవచ్చును.

ప్రిన్సి : రానివాళ్ళ కోసం మనం ఏం చెయ్యగలం? మళ్ళీ మళ్ళీ ఆయన రాడుకదా? వచ్చిన యీ ఒక్క అవకాశాన్ని జారవిడుచుకున్న తరువాత మళ్ళీ చింతిస్తాం...సరే! ఇలా అనుమానాలు పెట్టుకు కూర్చుంటే పనులు కావు...టైపు చేయించి సర్క్యులేటు చేయించు.

(దేవసహాయం 'చిత్తం' అని వెళ్ళిపోతాడు) యీ విషయంలో నాకు మీ సహాయం చాలా అవసరం...ఆ! ఒక్క నిమిషం...కలెక్టరుగారితో కూడా చెప్పివస్తాను....(అని వెళ్ళబోతూ, ఆగి) ఆ!..సోమయాజులుగారూ! మీ లైబ్రరీ పనంతా పూర్తి అయిందా?

సోమ : ఎక్కడండీ? చాలా పని మిగిలిపోయింది.

ప్రిన్సి : (వెడుతూ వున్నవాడు, వెనకకు తిరిగివచ్చి) అదేమిటండీ! ఎన్నాళ్ళయింది. మీకు యిచ్చి –

సోమ : చాలా రోజులయిందనుకోండి. కాని అక్కడ ఒక్క పుస్తకం వుండవలసిన చోట లేదు...అయిదువందల పుస్తకాలు కనిపించడంలేదు. ఇవన్నీ ఎలా జరిగాయో ఏమీ బోధపడడం లేదు.

ప్రిన్సి : మరి యిదంతా యిన్నాళ్ళూ నాకు చెప్పలేదేమండీ?

సోమ : మొన్న మీకు చెబుతూ వుండగా మీ ఇష్టం వచ్చినట్లు చెయ్యండి అన్నారు.

ప్రిన్సి : మరి చేశారా?

సోమ : ఎలా? పుస్తకాలు ఏమయ్యాయిన ఎవరిని అడిగిన సమాధానం చెప్పరు. ఎవరికి వారు తెలియవంటారు. ఇచ్చిన గ్రాంటుతో తెచ్చిన పుస్తకాలు సగమే కనిపిస్తున్నాయి.

ప్రిన్సి : ఇన్ని అవకతవకలు ఉంటే ఇప్పుడు చెబుతున్నారా?

సోమ : ఈ సంగతి కూడా మొన్న చెప్పాను.

ప్రిన్సి : ఏం చెప్పారండీ? చెబితే నాకు జ్ఞాపకం వుండదూ?

సోమ : మీరు అలా అంటే ఏమ చెప్పగలను?

ప్రిన్సి : ఇప్పుడేమీ చెప్పొద్దు....ఏంచెయ్యగలమో అది ఆలోచించండి.

సోమ : మీకు ఓ క్షణం తీరిక ఉంటే – అన్నీ చూడడానికి ఓ గంట కంటే ఎక్కువ పట్టదు.

ప్రిన్సి : ఇప్పుడా! అవతల మంత్రిగారు వస్తున్నారు. నాకు రేపు ఉదయం ప్రయాణం వుంది. ఇప్పుడు ఎలా?

సోమ : మరి ఎప్పుడు చూద్దామంటారు?

ప్రిన్సి : తలుచుకున్నప్పుడే తాత పెళ్లి అయితే ఎలా?...వచ్చిన తర్వాత చూద్దాం.

సోమ : మీ ఇష్టం –

ప్రిన్సి : ఆ...ఇప్పుడే వస్తాను....(లోపలకు వెడతాడు)

భాస్క : చూస్తున్న కొద్దీ నాకు మతిపోతున్నది. ఈయనేనా నేను అదివరకు అంతగొప్పగా చిత్రించుకున్న రావుసాహెబ్ డాక్టర్ పోలయ్యనాయుడు – అని.

సోమ : అది మీ తప్పుకాదు...పరిస్థితుల ప్రభావం.

(బంగారు వస్తాడు)

బంగా : అయ్యా! దొరగారు లేరా అండీ?

భాస్క : దొరగారు లోపల మంతనాలు సాగిస్తున్నారు.

సోమ : ఎందుక బంగారూ?

బంగా : ఓ పదిరూపాయలు యిప్పిస్తారేమోననండి. మా యింటి కాడ దానికి ఒళ్ళు ఏం సరిలేదండి ...అది కాస్తా పడకేసిందంటే మీ పని సున్నా...అందుకుని మా రాజుల్ని బతిమాలుకొని –

భాస్క : పోనీ, నీజీతంలో కొంత ముందు తీసుకో..

బంగా : అలాగ ఎలా యిస్తారు బాబూ; నెలాఖరుకు యివ్వడానికే అంత యిది చేస్తారే!

భాస్క : ఎందుకు?

బంగా : ఎందుకేముందు బాబూ! మాలాంటి వాళ్ళు కివ్వడానికి అందరికీ అంతే!....పాతికేళ్ళనుంచీ పని చేస్తున్నానా గదా – నాకు ఇంకా ఏభై రూపాయల జీతం...ఈ రాళ్ళతో గడపాలి బాబూ లంకంత సంసారం

సోమ : అవును బంగారూ! మనగోడు ఎవరికి కావాలి? శ్రమ మనదీ, అనుభవించేది మరొకరూ –

బంగా : ఓ రూపాయి ఎక్కువ చెయ్యమని మొన్న అడిగానండీ....పెద్దయ్యగారు కొట్టొచ్చారు. ఇహ మేనేజరు గారి సంగతి చెప్పనే అక్కర్లేదు. ఆయన జేబులో డబ్బులిచ్చినట్లు బాధ పడతారు. మళ్ళీ అడిగితే నువు చేసే పనికిది చాల్లే అంటారు. మీరు చూస్తున్నారుగా బాబూ! పొద్దున్న ఎనిమిదింటికి వస్తాను. మళ్లీ రాత్రి ఏడింటికి ఇంటికి పోవడం –

సోమ : అవును బంగారూ! పెద్దలు ఇలా ఉన్నంత కాలం మనం ఒక్క అడుగు ముందుకు వెయ్యలేం.

భాస్క : మరి మరోచోట ఉద్యోగం చేసుకోలేకపోయావా?

బంగా : ఎక్కడికి వెళ్ళినా యింతేగా బాబూ?

సోమ : అక్కడ మాత్రం యజమానులు ఉండరా? ఆ అంతరం ఉండనేకూడదు కాని వున్నా తరువాత ప్రతిచోట ఉండి తీరుతుంది. పైగా జీవితంలో పెళ్ళిచేసుకొని పిల్లల్ని కనడం జరిగాక – మనిషి తనకోసం కాక వాళ్ళకోసమే ఎక్కువగా బ్రతుకుతాడు....ఆ సత్యానికి ఎవ్వరూ దూరంగా వుండలేరు.

భాస్క : అధికారం చేతులోకి రాగానే మనుషులు యిలా మారిపోతారో?

సోమ : కనకపు సింహాసనంలో కూర్చోగానే సరి – ఏమైనా జరుగుతుంది.

(చెన్నకేశవులు ఆదుర్దాగా వస్తాడు)

చెన్న : దొరగారూ – ఏరండీ?

భాస్క : ఎవరండీ ఆ దొరగారూ?

చెన్న : అదేనండీ! ప్రిన్సిపాలుగారు.

భాస్క : మరి దొరగారంటారేం?

చెన్న : అదేలెండి..ఏదీ వారు?

భాస్క : వారు వెడుతూ ఎక్కడికి వెడుతున్నారో చెప్పి వెళ్ళలేదు.

చెన్న : అలాగా!

సోమ : ఏమండీ, చెన్నకేశవులుగారూ! వెళ్లినచోట ఏం చేసుకుని వచ్చారు

చెన్న : ఏ పని?

సోమ : అదే! ప్రిన్సిపాలుగారు చెయ్యమన్నది.

చెన్న : ఏం చేస్తే మీ కెందుకు?

సోమ : ఏం లేదు…ప్రభు భక్తి ఎన్నిపాళ్ళు వుందా – అని.

చెన్న : వేళాకోళంగా వున్నదా యేం?

సోమ : అమ్మమ్మ! ఎంత మాట!!

ప్రిన్సి : (వస్తూ) ఆ! డిన్నరుకు కలెక్టరుగారు కూడా వస్తానని మాట ఇచ్చారు. ఓ మిస్టర్ చెన్నకేశవులూ! ఇవ్వాళ రాత్రికి విద్యామంత్రికి డిన్నర్ ఇస్తున్నాం.

చెన్న : మీరా సార్!

సోమ : కాదండీ! స్టాఫ్ అంతా కలిస –

చెన్న : అలాగా!..చాలా బావుందండీ –

ప్రిన్సి : మీరందరూ సహాయం చెయ్యాలి…ఓ! క్షమించండి….ఇది మీ ఫన్‌క్షన్ మాత్రం కాదా?

చెన్న : అయ్యో! మీరు చెప్పాలా?

ప్రిన్సి : ఆ! వెళ్ళిన పనులన్నీ అయ్యాయా?

చెన్న : (బెరుకుగా సోమయాజులు, భాస్కర్‌ల వంక చూచి) అయ్యాయనుకోండి..సీట్లు రిజర్వు చేయించాను. ఇంటి దగ్గర చెప్పి వచ్చాను…పోతే –

ప్రిన్సి : మరి టైలర్ ఏమన్నాడు? ఏమైనా యిస్తానన్నాడా?

చెన్న : (బిక్కచచ్చి) సాయంకాలానికి ఒకటైనా ఇస్తానన్నాడు.

ప్రిన్సి : అఘోరించలేకపోయాడు….అర్జంటుగా కావాలని చెప్పలేకపోయావా?

చెన్న : చెప్పానండీ.

ప్రిన్సి : సరే! (మూర్తి వస్తాడు) ఓ! పెందలాడే వచ్చారే....

(మూర్తి సమాధానం కోసం ఏదో నసుగుతాడు)

సరే మీరు వెళ్ళి పని చూచుకోండి.

(మూర్తి ప్రక్కగదిలోకి వెళ్ళిపోతాడు)

సోమయాజులుగారూ! బజారుకు వెళ్ళి –

సోమ : క్షమించండి...ఇంటి దగ్గర కొంచెం పని వుంది..సాయంకాలం పెందలాడే వస్తాను.

ప్రిన్సి : సరే! మీ యిష్టం....ఇక మీకు తప్పదు మిస్టర్ కేశవులూ బజారుదాకా వెళ్లి హోటలుకు డిన్నర్ ఆర్డర్ యిచ్చిరావాలి.

చెన్న : అలాగేనండి, దానికేం?

సోమ : మరి నేను వస్తానండి.

(ప్రిన్సిపాలు సంజ్ఞతోనే ఆయన వెళ్ళడానికి సమ్మతిని సూచిస్తాడు, చెన్నకేశవులు కూడా నమస్కరించి వెళ్ళిపోతాడు)

భాస్క : నన్ను ఎందుకు రమ్మన్నారో యింకా చెప్పలేదు.

ప్రిన్సి : ఓ! ఐ యామ్ వెరీ సారీ...మిస్టర్ భాస్కర్ ఒక పని చెయ్యండి...రాత్రి డిన్నరయిన తరువాత నాతో పాటు మా యింటికి వస్తే –

భాస్క : క్షమించండి..రాత్రికి డిన్నరుకు కూడా రాలేననుకుంటాను. ఇదివరకే ఓ ఎంగేజిమెంటు వున్నది.

ప్రిన్సి : ఎన్నిపనులుంటే మాత్రం మంత్రిగారికి అందరం కలిసి ఇస్తున్న డిన్నర్‌ను మానుతారా? మనినా డిన్నర్ ఖరీదు మాత్రం అందరూ  భరించాలనుకుంటాను.

భాస్క : డాక్టర్! వెధవ మూడు రూపాయల కోసం వెరిచి డిన్నర్‌కి నేను రావడం లేదని మీరనుకుంటే పొరపాటు పడ్డారన్నమాట!

ప్రిన్సి : అబ్బే! అలా అనుకున్నాని కాదు..కాని యింత అవసరమైనది.

భాస్క : మంత్రిగారికి డిన్నర్ యివ్వడం కంటే ప్రపంచంలో ముఖ్యమైన విషయాలు వుండకూడదని మీ అభిప్రాయమా?

ప్రిన్సి : అలా అని నేనెందుకు అంటాను...పోనీ, డిన్నర్‌కు రాకపోయినా, మా యింటికి –

భాస్క : క్షమించండి...ఇవ్వాళ మాత్రం రాలేను.

ప్రిన్సి : చాలా అవసరమైనపని అయివుంటుంది...మీరు డిన్నరుకు రానక్కరలేదు....కాని యీ పని మాత్రం చెయ్యండి.

భాస్క : క్షమించండి.....ఈ రాత్రికి రాలేనన్నాను కదా?

ప్రిన్సి : మీరు రావాలి...ఇది చాలా అవసరమైన పననుకుంటాను.

భాస్క : అయ్యా! అది కాలేజీపని అయితే ఇవ్వండి. కాలేజీలో వున్నప్పుడు చేసి ఇస్తాను..మీ స్వంత వ్యవహారాలు చూచిపెట్టమని యిక నన్ను వత్తిడి చెయ్యకండి.

ప్రిన్సి : భాస్కర్! మీరు ఏం మాట్లాడుతున్నారో తెలిసే మాట్లాడుతున్నారా?

భాస్క : అంత తెలియకుండా మాట్లాడానికి నేనేం గొప్పవాడిని కాలేదే!

ప్రిన్సి : భాస్కర్! ఆరునెలలు సహవాసం చేస్తే వారు వీరవుతారట! మీ స్నేహం రోజుకు రోజూ చెడ్డవాళ్ళను కోరుతున్నది. మీ మంచి కోరుతున్నాను కనుక –

భాస్క : నాకు ఇన్నేళ్ళు వచ్చాక కూడా ఎవరు మంచి వారో, ఎవరు కాదో మీరు చెప్పాలా?

ప్రిన్సి : అంటే, నేను చెప్పినపని చెయ్యనంటారు?

భాస్క : ఇప్పుడు కాదన్నాను..అంతే!

ప్రిన్సి : నాకు ఇప్పుడే కావాలి.

భాస్క : దానికి సమాధానం ముందే ఇచ్చాను.

ప్రిన్సి : భాస్కర్! అటువంటి కష్టాలకు నేను నెరవను. ఆ కష్టాలు పెట్టదలుచుకున్న వారిని ఆసలు లెక్కచెయ్యను.

భాస్క : డాక్టర్! ఆ కష్టాలు నేను వెరవను. ఆ కష్టాలు పెట్టదలుచుకున్న వారిని అసలు లెక్కచెయ్యను.

ప్రిన్సి : ఎవరితో మాట్లాడుతున్నావో తెలిసే మాట్లాడుతున్నావా?

భాస్క : ఇంకా అంత అంధుడిని కాలేదు డాక్టర్! అంతస్థులు ఎంత పెరిగినా దాని పునాదులు నేల మీద వుంటాయిన మీరు గమనించడం మంచిది.

ప్రిన్సి : ఏమిటి! నాకు నీతులు బోధిస్తున్నావా? మిస్టర్ భాస్కర్! ఇంతవరకు కుర్రవాడివని వూరుకున్నాను.

భాస్క : కుర్రవాడినని జాలికాదు డాక్టర్. మీ పనులన్నీ చేస్తున్నాను కనుక ఊరుకున్నారు. లేకుంటే మీరు చెయ్యగలిగింది ఏముంది? వుద్యోగం తీసేస్తారు? అంతేనా?

ప్రిన్సి : నా క్రింద పనిచేస్తూ – నన్నే యిలా మాట్లాడుతావా?

భాస్క : ఆగ్రహించకండి..మీరు ప్రిన్సిపాలుగారు, అధికారులు అయితే మీకు గొప్ప, మిమ్మల్ని చూచి భయపడేవారికి గొప్ప...ఇన్నాళ్ళూ ఎంత గుడ్డిగా వున్నానో యీనాడు నాకు తెలిసింది. నా ప్రక్కన ఎన్ని మురికి గుండలు వున్నాయో, ఎన్ని కత్తుల బావులున్నాయో యీ రోజు తెలుసుకున్నాను. ఎత గొప్ప వారైనా కొంచెం అణకువ, గౌరవం యిచ్చి తీసుకోవడం, ఎదటివారిని మానవుడిగా చూడడం అవసరం డాక్టర్...

ప్రిన్సి : ఇక మాట్లాడకు..తక్షణం వెళ్ళు...నువ్వు యిక కాలేజీకి రానక్కరలేదు.

భాస్క : నిజం చెప్పినంతమాత్రాన మీరు ఇలా చేస్తారని నాకు తెలుసు..అందువల్ల నేను ముందే ఆ నిశ్చయానికి వచ్చాను. ఇదిగో నా రాజీనామా పత్రం. స్వీకరించండి...మీరు చెప్పినట్టుగా చేస్తూ, మీరు అనేవన్నీ పడడానికి నేను మీ బానిసను కాదు....తోటి మనిషిని ఎలా గౌరవించాలో తెలియక పోతే యికనైనా నేర్చుకోండి.

దేవ : (ఇందాకానే వచ్చి, నిర్ఘాంతపోయి) భాస్కర్ గారూ!....ఏమిటండీ ఇది!

భాస్క : తెలుసుకున్న సత్యానికి ప్రతిఫలం దేవసహాయంగారూ! ఇన్నిన్ని ఘోరాలు తెరవెనుక యిన్ని నాటకాలు

జరుగుతున్నాయని మొదటిసారి యివ్వాళే తెలిసింది. తెలిసిన తరువాత కూడా యీ నాటకంలో నేను పాత్రను కాదలుచుకోలేదు.

ప్రిన్సి : షట్ అప్....నోటికి వచ్చినట్టు మాట్లాడకు.....తలుచుకుంటే నిన్నేమయినా చెయ్యగలను.

భాస్క : (నవ్వి) అయ్యా! తమరు పెద్దలు...అదే మాట మిమ్మల్ని అని మీరు అగౌరవాన్ని ఆపాదించును...ఏ మాట అనవచ్చో, ఏ మాట అనకూడదో నాకు తెలుసు...ఇకనుంచైనా మీరు ఆడుతున్న రెండు పాత్రలు ఒక పాత్రగా కరిగించండి..ద్విపాత్రాభినయం మీ తత్వానికి పడదు...మీరు చెయ్యకలిగింది చెయ్యండి....నోట్లో అక్కరం ముక్క వున్నాక బ్రతకలేకపోను....వస్తాను....ఇంత పరమసత్యాన్ని తెలియచేసినందుకు మీకు చాలా కృతజ్ఞుణ్ణి.

ప్రిన్సి : గెట్ అవుట్....

భాస్క : థాంక్స్...కోపం మనిషిని ఎంత నీచానికైనా దిగజారుస్తుంది...ఇంత కోపాన్ని కలిగించినందుకు క్షమిచండి...వస్తాను...

(అని వెళ్లిపోతాడు)

ప్రిన్సి : ఈ ఫూల్.....వీడా! ....వీడు నన్ను ఇంతగా అవమానపరుస్తాడా! చూస్తానా...(అంటూ త్వరగా వెళ్ళిపోతాడు...బంగారు వస్తాడు...లోపల చూచి ఎవ్వరూ లేకపోవడంతో ప్రక్క గదిలోకి వస్తాడు. భాస్కర్ వెళ్ళిపోబోతు వుంటాడు)

బంగా : ఏం జరిగింది బాబూ?

భాస్క : ఉద్యోగానికి రాజీనామా యిచ్చాను బంగారూ!

బంగా : అదేం బాబూ?

భాస్క : అన్నీ తెలిసిన తరువాత యిక్కడ వుండి పని చెయ్యలేను (ఓ అయిదు రూపాయలు తీసియిచ్చి) వస్తాను బంగారూ! అవసరం అయితే ఇంటికిరా!

బంగా : కనిపెట్టివుండాలి బాబూ! ఏదో బీదోడిని –

(భాస్కర్ నవ్వి, అతని బుజం తట్టి వెళ్ళిపోతాడు...ప్రిన్సిపాలు వస్తాడు)

ప్రిన్సి : బంగారూ....బంగారూ...ఎక్కడ చచ్చావ్?

బంగా : (భాస్కర్ వెళ్ళిన దిక్కుకే చూస్తున్నవాడు యీ లోకానికి వచ్చి) వచ్చాను సార్...

ప్రిన్సి : వెళ్ళి కాఫీ పట్టుకురా –

బంగా : అలాగే బాబూ!

ప్రిన్సి : మూర్తిగారూ! మూర్తిగారూ

(మూర్తి వస్తాడు. ప్రిన్సిపాలుగారు కొంచెం శ్రమచేసి మామూలు మనిషై, అతి ప్రయత్నం మీద నవ్వు ముఖం మీదకు ఆహ్వానిస్తాడు)

ప్రిన్సి : రేపు సన్మానసభలో మాట్లాడవలసిన వుపన్యాసం చెబుతాను. వ్రాసుకోండి.

మూర్తి : వస్తున్నానండి...(మూర్తి కాగితం కలం తెచ్చుకోవడానికి లోపలకు వెడతాడు. ఈ లోగా బంగారు కాఫీ తెస్తాడు. కాఫీ త్రాగుతూ, మూర్తికి చెబుతాడు. ఆయన వ్రాసుకుంటూ వుంటాడు)

ప్రిన్సి : సోదర సోదరీమణులారా!

ఈ రోజు నాకు ఇంత గొప్పగా సన్మానం చేసినందుకు ఇందుకు కారణమైనా ప్రతి ఒక్కరికి నా కృతజ్ఞత. ఈ సన్మానం నా వ్యక్తికికాక, కొంచెమో గొప్పో నేను విద్యాలయాలకు, విద్యాభివృద్ధికి చేసిన శ్రమకే ననుకుంటాను.

నా యీ ముప్ఫయ్ యేళ్ళ అనుభవంలో – నేను గమనించింది ఒక్కటే సత్యం. మానవ పురోగమనానికి, అభ్యుదయానికి ఎన్ని అడ్డంకులు వచ్చినా, ఎన్ని అవాంతరాలు వచ్చినా ఆగకుండా సాగిపోతే ఎప్పటికైనా మనం మన పర్పస్....పర్పస్ –

మూర్తి : వుద్దేశ్యాలను –

ప్రిన్సి : ఆ! వుద్దేశ్యాలను నెరవేర్చుకోగలం – వ్యక్తులకోసం కాదీ సంఘం...సమిష్టి, జీవితానికి ఏ ఒక్క వ్యక్తి అడ్డం వచ్చినా, ఆ వ్యక్తిని దారికి అడ్డం తొలిగించాలి...ఆ పురుగును ఏరివెయ్యాలి. అప్పుడే మనకు విజయం తథ్యం...ఆ సత్యాన్ని గమనించిననాడు మానవుడు నాగరికతలో మరో అడుగు ముందుకు వేశాడన్నమాట –

(అని చెబుతూ వుండగా తెర)

# సంస్కర్తలు

శ్రీ నాగభూషణ్

పాత్రలు

| | |
|---|---|
| గోపీ | అవతారం |
| పిచ్చయ్య | ధర్మారావు |
| పాపారావు | ఆశీర్వాదం |
| జకరయ్య | ప్రసాద్ |
| తాతయ్య | సత్యం |
| సీతారామయ్య | ఏడుకొండలు |
| చిట్టన్న | ఇంకా కొందరు |
| | విద్యార్థులు |

## మొదటి రంగం

మహాపురుషుడి చిటికెన వ్రేలుమీద లేచిన చిత్రమైన కురుపులా, మహానగరానికి మారుమూల, కుళ్ళిపోయిన కురూపిసందులో ఓ యింటిముందు గది...రాక్షసుడి కోరల్లా పొడుచుకువచ్చిన ముందు అరుగులు; చింపిరి జుట్టులా లేచిపోయిన పెంకులు. తాతల నాటి గది తలుపు, అస్థిపంజరంలా వూగులాడుతోంది... చనిపోతున్న వాడిని కూడా బ్రతికించి బాధపెట్టడానికి ప్రయత్నించే డాక్టర్ల ఇంజక్షను మాదిరిగా, తలుపుల ఇహలోకానికి, గదిలోపలి పరలోకానికి మధ్య తాళం అడ్డు తెరగా నిలబడి వుంది.....

ఓ పూర్తిస్వదేశీ వెంట, ఓ పూర్తి విదేశీ వస్తాడు – పూర్వసువాసిని వెంట నడుస్తున్న కాలేజీ పిల్లలా – విదేశీ సరుకు, అవారాబొమ్మ వేసిన సిల్కు జేబుగుడ్డ నోటికి, మూతికి అడ్డం పెట్టుకుంది...దేశివాళీసరుకు ఫక్కున నవ్వింది.

**ప్రసాద్:** ఈ మహారాజసౌధానికి ఈడ్చుకొచ్చావేరా?

**తాతయ్య:** కొంచెం సేపు గుర్రాన్ని ఇక్కడే కట్టివెయ్యాలిరా! ఇదే మహారాజులుంగారి సౌధం.

**ప్రసాద్:** నిజంగా!...ఇక్కడెట్లా వుంటున్నారురా?

**తాతయ్య:** మహారాజులా వుంటున్నాడు!...అయినా, అందరూ నువ్వు ఉండే గదుల్లో వుండాలంటే మాత్రం ఎలా?

ప్రసాద్: అక్కడుంటే నాకు ఇంకా ఇరుకుగా వుంటుంది. నరకం లాంటి ఈ గదుల్లో వుండి చదివితే మాత్రం చదువెలా అబ్బుతుంది?

తాతయ్య: అవునవును...ఇప్పుడు క్లాసులో ఫస్టుమార్కులన్నీ నీవేగా!...గోపీగాడు ఎప్పుడూ ఆఖరి వాడేనాయె!

ప్రసాద్: నువ్వు ఎగతాళి చెయ్యనక్కర్లేదు బ్రదర్! మనకు మార్కులు వచ్చినా, రాకపోయినా ఒక్కటే! మనం చదువుకోసమే చదువుతున్నాం కాని, మార్కుల కోసం కాదోయ్!

తాతయ్య: మార్కులకోసం బతుకుతోంది మీ నాన్న! అవునా?

ప్రసాద్: (ఎగతాళిగా) ఇంత కష్టపడి చివరకు సత్యాన్ని కనిపెట్టావు!

(సత్యం వస్తాడు)

సత్యం: ఎవరినిరా కనిపెట్టింది? నన్నే!

తాతయ్య: నిన్ను కాదురా, సత్యాన్ని.

సత్యం: నేనే సత్యాన్ని, సత్యమే నేను.

ప్రసాద్: ఏడిశావ్...నువ్వు బ్రతికున్న సత్యానివి...తాతయ్య కనుక్కున్నది చచ్చిపోయిన సత్యాన్ని...

సత్యం: అమ్మమ్మలా చెప్పాడు.

ప్రసాద్: సత్యం చెప్పావురా!

సత్యం: మరి సత్యాన్ని కదూ!....ఆ! ఇంతకూ వీడెక్కడికి వెళ్ళాడు?

తాత: ఈసారి ఈ సత్యాన్ని అన్వేషించడం కొంచెం కష్టమైన పనే!

సత్యం: కథానాయకుడి కథానాయిక ఇంటికి వెళ్ళాడేమో?

ప్రసాద్: (బిత్తరపోయి) ఏమిటి? పైత్యం కాని ప్రకోపించలేదు కదా?

సత్యం: ఏం? మందులేస్తావా?

ప్రసాద్: మరో అయిదేళ్ళు ఆగు –

తాత: పోనీలే! ఈ అయిదేళ్ళయినా జనరక్షణ!

ప్రసాద్: (ఇంకా వెనకటిలాగానేవుండి) ఇంతకూ నీ కథానాయిక ఎవర్రా?

సత్యం: నీకు తెలియకపోవడమేమిట్రా?...మన వెంకటరత్నం సిస్టర్ లేదూ?...సుగుణ –

ప్రసాద్: (ఆత్రంగా) ఆ...సుగుణ –?

సత్యం: ఇంకేముంది? అంతే! సుగుణ – ఫుల్‌స్టాప్.

ప్రసాద్: సుగుణా!

సత్యం: అదేమిట్రా! నువ్వే కథానాయకుడులా మూర్ఛపోతావ్! కావలనుకుంటే విలన్‌వి కా!

ప్రసాద్: నాకు విలన్ కావలసిన ఖర్మేరా?...లక్షణంగా హీరోనే అవుతాను.

సత్యం: అయితే గోపీగాడినే విలన్ చేద్దాం!...ఏం చెయ్యడానికైనా వీడు రాందే!

తాతయ్య: వీడికక్కడ పనేమిట్రా?

సత్యం: కథానాయికకు ప్రైవేటు టీచరు హోదాలో వున్నాడు ప్రస్తుతం.

తాతయ్య: అయితే భయంలేదురా ప్రసాద్!...ఇంకా వీళ్ళు మొదటి రంగంలోనే వున్నారు...నీ యిష్టం వచ్చినట్లు కథ మార్చుకోవచ్చు.

ప్రసాద్: అమ్మమ్మలా మాట్లాడకురా తాతయ్య! నాకు భయమేమిటి?...ఇప్పుడు చూస్తావుగా, ఎవరంటే ఎవరికి భయమో?

సత్యం: ఏం చేస్తావేం?

ప్రసాద్: చూస్తూ వుండండి...మీరందరూ మాట్లాడకుండా వూరుకోండి. వాడి నీలుగేమిటో నేను చూస్తాను.

సత్యం: మధ్య నీ నీలుడేమిటి?...అది వాడిష్టం. కాదనడానికి నువ్వెవడివి?

ప్రసాద్: వాడిష్టం అయితే సరా? ఇహ మంచి, చెడ్డా అక్కర్లా? కాలేజీ అంతా ఒక త్రాడుమీద నడుస్తుంటే, వీడు ఎన్ని దమ్ముల్లో కాదనాలి?

సత్యం: ఎన్ని దమ్ముల్తోనయినా కాదంటాడు!

ప్రసాద్: ఇహ మన వాడికి అవసరం రాదా?

తాతయ్య: అట్లా అనకురా, మరి...వీడు కథానాయకుడా! ఎప్పుడు ఏం అవసరం వచ్చినా, రావచ్చు......

(ఇంతలో ధర్మారావు వస్తాడు)

ధర్మా: ఏమిటోయ్! మీ ప్రేమ విహారమంతా ఇక్కడ జేరింది?

సత్యం: ప్రేమ పక్షుల్ని వెదకడానికి!

ధర్మ: గోపీలేడల్లే వుందే!

తాతయ్య: మేమూ అతని కోసమే వచ్చాం.

ధర్మ: ఏమిటి కథ?

ప్రసాద్: గోపీ నిన్న పిచ్చయ్యతో ఇవ్వాళ కాలేజీకి వెడతానన్నాట్ట! వాడితో చెప్పి –

తాతయ్య: నా భయం ఏమిటంటే, వీడు కొంతమందికి హీరోగా! తీరా వీడు వెళ్ళడాన్ని ఆసరా చేసుకుని మిగిలిన వాళ్ళూ వెళ్ళడానికి ప్రయత్నం చేస్తే మొత్తమంతా రసాభాసవుతుంది.

ధర్మ: అందుకని – ?

ప్రసాద్: అందుకని, ఆ వెళ్ళడం ఏమిటో కనుక్కుందామని వచ్చాం.

ధర్మ: మంచిదేననుకో!...కాని వాడు కొన్ని నియమాలు ఆశయాలున్న మనిషి. పైగా బీదవాడు.

ప్రసాద్: అటువంటప్పుడు నియమాలేమిటి?

ధర్మ: అదేమన్న మాట? వాటిమీద నిలబడడం, నిటబడకపోవడం అటుంచితే మనందరికీ లేవా ఆశయాలు, ఆదర్శాలు, నియమాలు!!

సత్యం: ఎందుకుండవూ? ప్రసాద్ చూడు – ఉలెన్ సూటుతో తప్ప బయటకు రాడు. లవెండర్, మైసూరు సాండల్సు తప్ప వాడడు, పార్కర్ సీనియర్‌తో తప్ప రాయడు. ఇవన్నీ వీడి నియమాలు.

తాతయ్య: అంతవరకు ఆపు...అది కాదోయ్, ధర్మారావ్! వాడికి నియమాలు ఉన్నయ్. తప్పులేదు..వాడినే

జాగ్రత్తగా ఉంచుకోమను. కాని వాటివల్ల ప్రక్కవాళ్ళకి బాధ కలుగుతున్నప్పుడు కొంచెం సవరించుకోవాలి, సర్దుకు పోవాలి.

ధర్మ: ఒకవేళ వాడు సవరించుకోడు –

ప్రసాద్: సవరించుకోకపోతే ఏం జరుగుతుందో చెబుదామనే వచ్చాం.

ధర్మ: ఏమిటో ఆ చెప్పేది?

ప్రసాద్: చూస్తావుగా!

సత్యం: చెప్పేది చూడ్డమేమిటిరా? ఇలా క్లిష్టాన్వయాలు ఉంటేనే తెలుగు మాస్టారు మొన్న మైనస్ మార్కులు ఇచ్చారు.

ప్రసాద్: వాడూ, నువ్వూ కలిసి ఏడ్చారు కాని –

తాతయ్య: (ధర్మారావుతో) పోనివ్వండి గొడవ...ఆ కార్నర్ దాకా వెళ్ళి గోపీ వస్తున్నాడేమో చూడు బ్రదర్...త్వరగా మాట్లాడ పోదాం.

(ధర్మారావు వెడతాడు)

(ప్రసాద్‌తో) వాడితో పోట్లాట లంకించుకుంటావేరా?

ప్రసాద్: మరి వాడి మాటలు చూశావుగా!

సత్యం: మాటలు చూడడమేమిట్రా? 'విన్నావా' అనాలి.

ప్రసాద్: ఏదో ఒకటిలే! అడ్డురాకు –

తాతయ్య: వ్యవహారం అంతా ఇప్పుడే బెడిసేటట్లు చేస్తావు నువ్వు! ఆ గోపీగాడే రణపెంకె. వీళ్ళతో ఇట్లా మాట్లాడితే –

ప్రసాద్: ఆ ధర్మిగాడు కవ్వించడమేమిటి మరి?

సత్యం: వాడు కవ్విస్తే నువ్వు ముందుకు దూకాలా?

తాతయ్య: వీడి తత్త్వమే అంత!...వీడిక్కడ వుంటే మన పని ఆవగింజలో అరభాగం కాదు...నిన్న వీడిని ఒప్పించేసరికే చచ్చాం!...అందువల్ల –

సత్యం: ఆ! అందువల్ల – ?

తాతయ్య: వస్తున్నాడుగా! రానీ, చెబుతాను.

ధర్మ: (వస్తూ) రావడం లేదు బ్రదర్.

తాతయ్య: అయితే ఒక్క సాయం చెయ్యి బ్రదర్..గోపీ ఎక్కడ వుంటాడో చూసి –

ధర్మ: నాకేం తెలుసు ఎక్కడ వుంటాడో?

తాతయ్య: ఇందాక పార్కు వైపుకు వెళ్ళాట్ట!...కొండయ్యగారింటికేమైనా వెళ్ళాడేమో కనుక్కుని, అటునుంచి కాలేజీకి తీసుకురా!

ధర్మ: ఊరికే వాడు కాలేజీకి ఎందుకు?

తాతయ్య: వాడిని నువ్వు ఎట్లాగైనా ఒప్పించాలి..వాడు చెబితే వెడతానని మూర్ఖించేవాళ్ళు కొందరు ఆగుతారు.

ధర్మ: నా మాట వింటాడా.

తాతయ్య: మేం చెబితే చచ్చినా వినడు..వింటే, నువ్వు చెబితేనే వినాలి.

ధర్మ: పోనీ – వాడు కాలేజీకి వెడితే మాత్రం నష్టం ఏమిటి.

సత్యం: అట్లా అనకు మరి – తాతయ్య, ప్రసాద్ అండ్ ఫ్రెండ్స్ సమ్మె చేయిస్తున్నారంటే, ఒక్క పురుగు లోపలికి వెళ్ళినా పరువు నష్టమే!

ప్రసాద్: అసలు ఈ సమ్మె ఎందుకు మొదలు పెట్టాం? విద్యార్థుల హక్కులకు సంరంక్షించుకొని విద్యార్థి లోకాన్ని సంస్కరించడం కోసం – ఇంతటి గొప్ప విషయాల్లోనే మనవాళ్ళు సానుభూతి చూపకపోతే నలుగురిలో తల యెత్తుకు తిరగగలమా?

సత్యం: ఎప్పుడూ ఎత్తుకు తిరిగినా తలనొప్పి పుడుతుంది. అందువల్ల అప్పుడప్పుడూ వంచుకుని నడవాలి.

ధర్మ: వాడికిది ఎలాగూ నచ్చదు.

తాతయ్య: మరి, నిన్ను పంపడం ఎందుకు? ఎలాగైనా ఒప్పిస్తావనేగా?

ధర్మ: నేను అడిగి మాత్రం చూస్తాను. వాడిని బలవంతంమాత్రం చెయ్యను.

తాతయ్య: అలా అనకు. వాడి విషయం నీకు వదిలాం.

(ధర్మారావు వెళ్ళిపోతాడు. ముగ్గురూ దీర్ఘంగా నిట్టూరుస్తారు.)

సత్యం: ఒరే, తాతయ్య! నువ్వు రాజకీయనాయకుడివి కాదగ్గ వాడివిరా!

తాతయ్య: అవునురా! పాము చావాకూడదు, కఱ్ఱ విరగాకూడదు.

ప్రసాద్: గోపీ పార్కు రోడ్డున వెళ్ళడం నువ్వు చూశావా?

తాతయ్య: చూస్తే అప్పుడే మాట్లాడేవాడినిగా! ముందు ఈ ధర్మిగాడు కనుచూపు దూరంలో లేకుండా వుంటే, ఈ గోపీని కట్టివెయ్యవచ్చు – సాను దాన భేదోపాయాలు మన చేతుల్లో వుండనే వున్నయ్.

ప్రసాద్: దండెం అక్కర్లేదంటావా?

సత్యం: అంతగా అయితే కథానాయకుడికి విలన్‌కీ కత్తియుద్ధం పెట్టిద్దాం.

తాతయ్య: అటువంటిది చెయ్యకండి. పరువులు పోతాయ్.

సత్యం: ఇప్పుడున్నట్లే!

ప్రసాద్: నీకు లేకపోవచ్చు...నాకు వుంది.

సత్యం: అవునవును...చాలా వుంది.

(ఆశీర్వాదం, పాపారావు వస్తారు)

తాత: ఏరా! మీరిద్దరే వచ్చారు?

ఆశీ: సీతారామయ్యగారు సాయంకాలం ఎక్కడో మీటింగులో మాట్లాడాలిట! గర్భవిరోధాన్ని గురించిట! ...ఉపన్యాసం చెప్పించుకుంటున్నారు.

సత్యం: ఎవరిచేత?

పాపా: మాకు మాత్రం ఏం తెలుసు!...కొత్తవాడు. సిగరెట్లు ఇస్తే రాసి పెట్టేటట్లున్నాడు.

తాత: ఇంతకూ ఆయన ఎప్పుడు వస్తానంటాడు?

ఆశీ: ఏమో?...సాయంకాలం మంత్రిగారు కూడా సభకు వస్తారట –

ప్రసాద్: మన కిక్కడ అర్జంటని చెప్పలా?

పాపా: చెప్పడమేమిటి? చెవిని ఇల్లుకట్టుకు పోరాం.

ప్రసాద్: ఏంమంటాడు?

పాపా: ఆయనకు తీరికలేదు. మరెవ్వరికైనా రికమెండ్ చేస్తానంటారు...రమణయ్య గారింట్లో వారం వుందిటగా! ఆయన్ని పంపి చెప్పిస్తానంటారు.

తాతయ్య: ఈ మాత్రం రికమెండేషన్లు మనం చెయ్యలేం? ఆయన పెద్దవాడని రమ్మన్నాం గాని –

ఆశీ: చివరకు ఒప్పుకున్నారులే! – ఓ అయిదు నిమిషాలు మీరు ఏమైనా సరే వచ్చి వెళ్ళాలన్నాం – సరే, నన్నారు.

తాతయ్య: ఆయన వచ్చేదాకా ఎక్కడ కూర్చోం?..ఇంకా మా వాళ్ళు కొందరు ఒప్పుకోలేదు. ఇప్పుడే రవణగాడి దగ్గరకు, విఠల్ దగ్గరకు వెళ్ళి చెప్పొచ్చాం.

ప్రసాద్: ఎందుకు ఒప్పుకోవడం లేదు.

పాపా: ఏం చెబుతాం? వాళ్ళు దీన్ని చిలిపితగూ అంటున్నారు. ఇంతకంటే 'సిల్లీ'గా జరిగిన స్ట్రైకులు వున్నాయని చెప్పాను – ఇది విద్యార్థులందరి సమస్యరా. ఇవ్వాళ ఆంజనేయుల్ని అన్నారు, రేపు మనల్ని అనరని నమ్మకమేముంది?..ఇట్లా ప్రతి వాడికీ సమాధానం చెప్పేసరికి తన ప్రాణం తోకకు వచ్చింది.

సత్యం: మంత్రసానితనానికి ఒప్పుకున్నాక, ఏం చెయ్యక తప్పుతుంది?

ఆశీ: వాళ్ళు మాత్రం అంతటితో ఒప్పుకున్నారా? మేము ఎప్పుడూ ఆంజనేయులు మాదిరిగా మాస్టర్ని అంత క్లాసులోనే అవమానం చెయ్యం. అంటాడు.

ప్రసాద్: కనీసం ఆంజనేయులు మనకు స్నేహితుడయినందుకైనా ఒప్పుకోవచ్చునే!

పాపా: వాళ్ళనేది అదే! ఆంజనేయులు స్నేహితుడే! కాని వాడు చేసింది మాత్రం తప్పేనంటాడు....

ఆశీ: ఆంజనేయులు మీవంటి వాళ్ళ స్నేహితుడు కాబట్టి, మీరు లీడర్సు కాబట్టి సమ్మె చేస్తున్నారు – అదే మాలాంటి వాళ్ళయితే మీరు ముందుకు వచ్చేవాళ్ళా అని ఎదురు ప్రశ్నలు – !

పాపా: చివరకు ఎట్లాగయితేనేం, ఒప్పుకున్నారులే!

తాతయ్య: ఇప్పటికే ఆలస్యమయింది...వీడు వస్తే ఈలోగా మేం మాట్లాడుకుంటూ వుంటాం. మీరు వెళ్ళి సీతారామయ్యగారిని తీసుకురండి.

పాపా: మీరు ముగ్గురూ ఎందుకు ఇక్కడ? కాలేజీ దగ్గర మన వాళ్ళెవరూ లేరు.

సత్యం: ఇక్కడ వుండి నేను ఉద్ధరించేదేమిటి? నేను కాలేజీ దగ్గరకు వెడుతున్నానురా!

ప్రసాద్: మేం ఇద్దరం ఇక్కడే వుంటాంలే! మీరు మాత్రం త్వరగా రండి........

(ఆశీర్వాదం, పాపారావు, సత్యం వెళ్ళిపోతారు. వెళ్ళిపోతున్న ముందు వాళ్ళఇద్దరి వంక మిగిలిన ఇద్దరూ అసహ్యంగా చూస్తారు.)

**ప్రసాద్:** మొనగాళ్ళు దిగి వచ్చారు!....వాళ్ళ వాళ్ళు ఒప్పుకోలేదట!...రేపు మనతో ఏమీ పనిరాదూ?

**తాతయ్య:** ఈ పాపారావు ఇప్పుడు వాళ్ళవాళ్ళని ఎందుకు ఒప్పించాడంటావ్?....అందుకే!.....రేపు వాళ్ళకేమైనా అవసరం వస్తే – 'చూశారా!' మొన్న మీకు చేశాం' అంటారు.

**తాతయ్య: వాళ్ళకా అభిప్రాయం వుంటే వుండొచ్చు. మనం ఎందుకు అనాలి? హృదయపూర్వకంగానే** సహాయం చేస్తున్నామనుకుందాం.

**ప్రసాద్:** ఇది మనకు కొత్తా? స్వార్థం లేకుండా ఎవరు మటుకు ఇటువంటి సహాయాలు చేస్తారు? ఎట్లాగూ వాళ్ళకు చెడుపేరు రానేవచ్చింది. ఇప్పుడు మనల్ని తెర ముందుకు లాగాలని వీళ్ళ ప్రయత్నం.

**తాతయ్య:** మనకు తెలియదురా? నేను సీతారామయ్యను తీసుకు రమ్మని ఊరికే చెప్పానా? సీతారామయ్య ఎవరో వూళోల జనానికి అందరికీ తెలుసు. ఆయనే వచ్చాడంటే, వాళ్ళ వాళ్ళు వుండరని ఎలా అనుకుటారు?

**ప్రసాద్:** సీతారామయ్య వస్తే పని అవుతుందని నాకు నమ్మకం లేదురా!

**తాతయ్య:** నాకు మాత్రం నమ్మకం ఏడిసిందా? మనల్ని మనం కాపాడుకోవడానికి ఇదొక ఎత్తు. అంతే!

**ప్రసాద్:** ఇందాక సత్యంగాడు చెప్పింది అక్షరాలా సత్యంరా! నువ్వు నూటికి నూరువంతులూ రాజకీయ నాయకుడివి. కాలేజీ దాటు, నిన్ను అమాంతంగా యం.యల్.ఎ.ని చేస్తాం.

**తాత:** అడుగో! గోపీ వస్తున్నాడు.....నువ్వు అనవసరంగా తొందరపడకు.

(గోపీ వస్తాడు. విషాదంలో జీవితాన్వేషణ చేసే మహర్షిలా వుంటాడు. నవ్వినప్పుడు, రాజ్యం పోయిన మహారాజు నవ్వే పోలిక కనిపిస్తుంది.)

**తాతయ్య:** హల్లో! గోపీ! నీ కోసమే వచ్చాం...అరగంటనుంచి కాచుకుని కూర్చున్నాం.

**గోపీ:** అరెరె! అలాగా! కాకిచేత కబురు పంపితే మీ దగ్గరకు నేనే వచ్చేవాణ్ణిగా!...ఆగండి. లోపలకు వెడదాం.

(తాళం తీసి, తలుపులు తోస్తాడు. నిద్రపోతున్న ముసలి వాణ్ణి లేపినప్పుడు వికారంగా ఆవలించి, వికృతంగా నవ్వినట్లుగా ధ్వని చేసి, తెరుచుకుంటయ్ తలుపులు)

**గోపీ:** రండి –

(ఇద్దరూ లోపలికి వస్తారు. క్రింద గచ్చు అయినా చేయని ఒట్టి నేల. మా సవతి అయిన పేదరాలు చిరుగుల పడ్డ ఒంటికి కప్పుకున్నట్లు క్రిందవున్న మట్టిని మరుగు పరచడానికి ప్రయత్నం చేస్తున్న చింకిచాప. దుమ్ము దులపడానికి చాపనెత్తి గదిలో దుమారం లేపుతాడు గోపీ. ప్రసాద్ జేబుగుడ్డతో ముక్కు మూసుకుంటాడు)

(నవ్వుతూ) సారీ కూర్చోండి.

(ప్రసాద్ తన ఉన్ని దుస్తులకు తగిన హోదాలో కూర్చోవడానికి ఏమైనా ఉన్నతాసనం ఉన్నదేమోనని చుట్టూ కలియచూస్తాడు. అతని కష్టాన్ని గుర్తిస్తాడు గోపీ.)

గోపీ: అరుగుమీద అయితే మీరు హాయిగా కూర్చోవచ్చు...పదండి...

ప్రసాద్: థాంక్స్......

(గోపీ చాప అరుగుమీద వేస్తాడు)

తాతయ్య: ఇవాళ స్ట్రైక్ గురించి నీకు తెలిసే వుంటుంది.

గోపీ: అవును...నిన్న పిచ్చయ్య చెప్పాడు.

తాతయ్య: నిన్న వాడితో ఇవ్వాళ కాలేజీకి వెడతానన్నావుట –

గోపీ: అవును.

ప్రసాద్: సమ్మె జరుగుతుంటే, కాలేజీకి వెళ్ళడమేమిటండీ?

గోపీ: మీరు సమ్మె చేయండి...నన్ను మాత్రం కాలేజీకి వెళ్ళనివ్వండి..

ప్రసాద్: అది మీ సంగతి! నేను వెళ్ళినందువల్ల మీకు నష్టంలేదు. కాని వెళ్ళకపోతే నాకు చాలా నష్టాలున్నాయ్.

తాతయ్య: అలా అనకు – ఏ ఒక్క కుర్రాడు లోపలకు పోయినా సమ్మె జయప్రదంగా జరిగినట్లు కాదు.

గోపీ: రెండువంతులు బయటవుండి, ఒక వంతు వెళ్ళినా సమ్మె గెలిచినట్లే నన్నారు!

ప్రసాద్: అది బయటి సమ్మెలండి! మనం విద్యార్థులం. మన హక్కుల్ని మన సంరక్షించుకొని, మనల్ని మనం సంస్కరించుకోకపోతే మనం దేశానికి ముందు ముందు ఏం సేవ చేయగలం?

గోపీ: దేశసేవ చేయడానికి ఈ సమ్మెలే పనికి వస్తాయంటారా?..నా కెందుకో వీటిమీద సానుభూతి లేదు.

ప్రసాద్: అంటే, ఇప్పుడు మేం ఎందుకు సమ్మె చేస్తున్నామో, ఆ కారణం మీద సానుభూతి లేదంటారా?

గోపీ: ఇప్పుడా విషయాలన్నీ ఎందుకు? నేను మాత్రం కాలేజీకి వెళ్ళడానికి ఒప్పుకోండి.

తాత: అది కాదోయ్....పోనీ, నీ అభ్యంతరాలు చెప్పు....అవి మాకు సంబంధించినవైతే మేము చెప్పగలిగినంతవరకు సమాధానం చెబుతాం.

గోపీ: నాకు ఇప్పుడు ఈ సమ్మెమీద అసలు సానుభూతి లేదు.

ప్రసాద్: ఏమిటి!...ఇది మొత్తం విద్యార్థిలోకానికి చెందిన సమస్య! దీనిమీద సానుభూతి లేదా?

గోపీ: నా వుద్దేశ్యం..ఇది వ్యక్తిగతమైన సమస్యేమోనని –

తాత: ప్రస్తుతానికి ఇది వ్యక్తిగతమైనదే అనుకోండి. రేపు మీకే ఇలా అవమానం జరగదని ఎక్కడ వుంది?

ప్రసాద్: అంతమంది పిల్లల ఎదుట – ఓపెన్ క్లాసులో – అంతమంది ఆడపిల్లలు ఉండగా – ఒక కుర్రవాణ్ణి అలా తిట్టడం కంటే ఇంకా అవమానం ఏం వుంటుందండీ? దీన్ని సహిస్తూ వూరుకోమంటారా?

గోపీ: ఊరుకోమని నేనను.....ఒక్క లెక్చరరుదే తప్పయితే నేను సంతోషంగా మీతో కలిసేవాడిని.

ప్రసాద్: అయితే, తప్పంతా కుర్రాడిదేనంటారు?

గోపీ: ఎవరి ఉద్దేశ్యాలు వారివిలెండి.

తాత: పోనివ్వండి, కుర్రాడిదే తప్పనుకుందాం. లెక్చరరు చెయ్యవలసిందదేనా?

గోపీ: పోనీ అతను చేసినదానికి ముందా లెక్చరరుగారికి క్షమాపణ చెప్పమనండి...అప్పుడు లెక్చరరు గారు తన మాటలు ఉపసంహరించుకోకపోతే, అప్పుడు ఈ సమ్మె చెయ్యవచ్చు.

ప్రసాద్: ఇంత జరిగిన తరువాత ఆయన దగ్గరకు వెళ్ళి క్షమాపణ చెప్పుకోమంటారా?

గోపీ: పోనీ, ఆంజనేయులుగారిని కలుసుకొనే చెయ్యండి.

తాతయ్య: మరోగంటలో కాలేజీ టైం అవుతోంది...మన వాళ్ళందరూ అప్పుడే అక్కడకు వెళ్లివుంటారు... పిల్లలకందరికీ చెప్పి వుంచాం...ఈ ఆఖరు క్షణంలో –

గోపీ: నాకు తెలిసింది ఆఖరు క్షణంలో –

ప్రసాద్: మీకు నిన్న సాయంకాలమే తెలుసు –

గోపీ: నేను కాలేజీకి వెళతానన్నట్లుగా కూడా మీకు నిన్న సాయంకాలమే తెలుసు.

తాతయ్య: తెలుసుననుకోండి...మీరు వూరికే అన్నారేమో ననుకున్నాం.

గోపీ: ఇటువంటి విషయాల్లో సరదా ఏమిటండీ?

ప్రసాద్: పర్యవసానం మీరు తేల్చేది మీరు కాలేజీకి వెళ్ళక తప్పదని – అంతేనా?

గోపీ: పరిస్థితులు ఇలాగే ఉంటే, మరి వెళ్ళక తప్పదు.

ప్రసాద్: దీనివల్ల జరగబోయే విషమఫలితాన్ని వూహించుకునే చెబుతున్నారా?...ఇది విద్యార్థులందరికి అవమానకరం.

తాతయ్య: ఊరుకోరా, ప్రసాద్.

గోపీ: (శాంతంగా) ఈ విషయంలో ఆవేశాలూ, ఆర్భాటాలు ఎందుకు ప్రసాద్ గారూ? నాకు యిష్టంలేదు. వెడుతున్నాను...దీనిలో మిమ్మల్ని కాని, విద్యార్థులందరినీ కాని అవమానించడం ఎలా జరిగిందో నా కర్థం కావడం లేదు.

తాతయ్య: తొందర ఎవ్వరికీ మంచిది కాదు. నువ్వూ ఆలోచించు.

గోపీ: నేను ఆలోచించే చెప్పాను.

తాతయ్య: అలా అనకు మరి..ఇప్పుడు నువ్వు, నీ వెనక ఓ యాభైమంది కాలేజీకి వెడితే ఈ సమ్మె ఎందుకు చేస్తున్నట్టు?

గోపీ: ఏమో? ఎవరికి తెలుసు?

తాతయ్య: పోనీ, నీ స్నేహితులం, వచ్చి అడుగుతున్నాం. అందుకోసమేనా నువ్వు ఒక్కపూటా కాలేజీకి మానవచ్చునే!

(సీతారామయ్య, ఆశీర్వాదం, పాపారావు వస్తారు)

సీతా: ఈయనేనట్రా ఇవ్వాళ కాలేజీకి వెడతానన్నది?

పాపా: అవునండీ.

సీతా: ఏమయ్యా! నీ దగ్గరకి మేం కూడా వచ్చి చెప్పవలసి వచ్చిందే! వీళ్ళు చెబితే చాలలా?

గోపీ: మీరు ఎవరో తెలియకుండా కూడా, మిమ్మల్ని రమ్మంటానా నేను?

ఆశీ: ఈయన్నే ఎవగవా! ఈ వూరుకంతకూ ఏకైక నాయకులు సీతారామయ్యగారు.

ప్రసాద్: అంతంత విశేషణాలెందుకులే!

సీతా: (విషపు నవ్వుతో) బాగా అన్నావు.

ఆశీ: ఏం? ఉన్నమాట అన్నాను.

ప్రసాద్: ఉన్నా, అంత ఎత్తేసుకోకూడదు.

గోపీ: మిమ్మల్ని నేను రమ్మనలేదే!

సీతా: రమ్మని నీ నోటితో అనాలా! వచ్చేటట్లు చేస్తే చాలదూ!

గోపీ: మిమ్మల్ని రప్పించే పని నేనేమీ చెయ్యలేదే!

సీతా: ఇవ్వాళ విద్యార్థుల హక్కుల రక్షణకోసం, విద్యార్థి స్వాతంత్ర్య రక్షణ కోసం, విద్యా విధాన సంస్కరణల కోసం ఇంత బ్రహ్మాండంగా సమ్మె జరుగుతుంటే నువ్వు కాలేజీకి వెడతానంటున్నావ్! అంతకన్నా ఏం చెయ్యాలి?

గోపీ: నాకు ఈ సమ్మె మీద సానుభూతి లేదు. నేను వెళ్ళదలుచుకున్నాను....అది మీకేం నష్టం?

సీతా: విద్యార్థిలోకంలో ఇలాంటి అభ్యుదయ శక్తులున్నాయి కనుకనే, దేశం ప్రగతివైపు పురోగమించడం లేదు...సంస్కరణ మన ఆశయం...చెడును ప్రతిఘటించి, కుళ్ళును తొలగించడం మన ఆదర్శం.....విద్యార్థి లోకం సాగిస్తున్న ఈ సంస్కారప్రదమైన సమస్యా పరిష్కారంలో నువ్వూ చేతులు కలపక సానుభూతి లేదంటావా? ఇది విద్యార్థి సమస్య కాదూ?

గోపీ: కావచ్చును...ప్రతి విద్యార్థి సమస్యా విద్యార్థుల కందరకూ సానుభూతి దాయకం అయివుండాలని నియమం ఉన్నదా? నేను బీదవాడిని. నాకు చదువుకోవడం బాధగా వున్నది. మరి నా సమస్యను ఎవ్వరైనా ఒక్కరు ఆలోచించారా? నా కోసం సమ్మెలు చేయనక్కరలేదు. కనీసం సానుభూతి వాక్యమైనా పలికారా?

ప్రసాద్: అవన్నీ ఎందుకు? ఇప్పుడీ సమస్యమీ సానుభూతి నీకెందుకు లేదు?

గోపీ: అది వ్యక్తిగతమైన అభిరుచుల్ని బట్టి వుంటుంది.

తాతయ్య: ఉండడం తప్పు అని ఎవరూ అనరు. కాని అది పరిస్థితులకనుగుణంగా మార్చుకోకపోతే ఎలా? పోనీ ఇంతమంది స్టూడెంట్సు మానేశారు? మీరు కూడా మానినందువల్ల నష్టం ఏమిటి?

గోపీ: ఇందాకటినుంచి చెప్పాను కదండీ. ప్రతి మనషికీ కొన్ని నియమాలు వుంటాయ్. నా వంటివాడు చావడానికైనా ఇష్టపడుతాడు కాని, వాటిని మార్చుకోలేదు.

సీతా: ఇందులో నీ ఆశయాలకు, నియమాలకు విరుద్ధంగా జరిగేదేమిటి? ఇవ్వాళ కాలేజీ లేదనుకో? హాయిగా ఇంట్లో పడుకో.

గోపీ: బయట ఇంత రణగొణధ్వని జరుగుతుంటే, పడుకుంటే మాత్రం నిలవ బుద్ధి పుడుతుందా?

ప్రసాద్: మరీ అంత సంకుచితంగా ఆలోచిస్తారేమండీ?

సీతా: ఇది విద్యార్థి లోకానికే అవమానం...ఇదే రేపు క్లాసులో నీకు జరుగుతుందనుకో?

గోపీ: క్షమించండి. నేనలా అనుకోలేదు..నేను క్లాసులో మాస్టారితో ఎన్నడూ సవాలు చెయ్యను....కుస్తీ పట్టడానికి రమ్మని చేతులు పైకి లాగను.

తాతయ్య: జరిగింది పోనివ్వండి...ఆయన క్లాసులో విద్యార్థులందర్నీ అవమానించడం మీకు తెలియదా?

గోపీ: అవమానం జరగడం నిజమే...విద్యార్థి తప్పు చేశాడని మీరు ఒప్పుకున్నారు. తప్పు చేసిన అతనికి అవమానం జరిగిందని మీరంటున్నారే, చదువలోను వయస్సులోను ఆయనకన్న తక్కువాడు, అంతమంది పిల్లలున్న క్టాసులో చేతులు పైకి లాగి కొట్టడానికి వస్తే ఆయన ఎంత బాధపడి ఉండాలి?

సీతా: మనం వాదించడంకోసం ఇక్కడకు చేరలేదు. ఒక ఉన్నతమైన పథకంతో, కాలేజీ విద్యావిధానంలో జరుగుతున్న అత్యాచారాన్ని నిర్మూలించి, దాన్ని సంస్కరించడానికి సాగిస్తున్న ఈ అహింసా సమరంలో నువ్వూ పాల్గొని దాన్ని విజయవంతం చెయ్.

గోపీ: అదే నాకు ఇష్టంలేదని చెబుతున్నాను.

ప్రసాద్: వారాలు చేసుకుని తినే వెధవలకు కూడా ఎంత అలుసు!

తాత: ప్రసాద్!

ఆశీ: తొందరపడకోయ్!

ప్రసాద్: తొందరేమిటి? వందసార్లు అంటాను.

గోపీ: మీరు ఎన్నిసార్లన్నా నేను కాదనను. మీ దృష్టిలో నేను వెధవను కావచ్చు...నేను వారాలు చేసుకు తింటున్నానని జనానికందరికీ తెలుసు..నన్ను మీరు వ్యక్తిగతంగా గాయపరచదలుచుకుంటే చెయ్యండి.... నాకు అభ్యంతరం లేదు....కాని మిగిలిన నా వంటి వాళ్ళమీద అందరిమీదా మాత్రం నింద మోపకండి...వారాలు తింటూ చదువుకుంటున్నంత మాత్రాన వ్యక్తిగతమైన అభిప్రాయాలు వుండకూడదా?...వాటికి విలువ వుండదా?

తాతయ్య: ఇంత గొడవెందుకు గోపీ! ఈ కాస్త భాగ్యానికి – ఒప్పుకుంటే సరిపోయేదానికి –

గోపీ: నాకు మాత్రం బాధలుండవా?

పాపా: అంత బాధలేమిటో?

గోపీ: ఇవ్వాళ నేను కాలేజీ మానివేస్తాననుకోండి. నేను కావలనుకొనే మానవేశానని ప్రిన్సిపాలుగారికి తెలిసి, ఆయన నా స్కాలర్ ఫిప్ రికమెండ్ చెయ్యకపోతే, రేపటినుంచి నేను వీథుల్లో రిక్షాలాక్కోవాలి..లేకపోతే బిచ్చమెత్తాలి.

తాతయ్య: ప్రిన్సిపాలు ఏమైనా చేస్తే మేం అందరం లేమూ? విద్యార్థుల హక్కుల కోసం పోట్లాడడానికి మేం

ఎప్పుడు వెనుదీయం.

గోపీ: నాకు స్కాలర్ షిప్ ఇవ్వడం నాకు ఉన్న హక్కు ఎలా అవుతుంది?

ప్రసాద్: ఆటవిక శక్తులు అంతిమ విశ్వాసం ఏనాడో విడిచాయని ఆయనకు మాత్రం తెలియదంటారా?.. ఇంతటితో ఆగితే ఫరవాలేదు..నన్ను పోషిస్తున్న ఉదారులున్నారు...వారందరికీ సమాధానం చెప్పుకోవద్దా? నువ్వు కూడా సమ్మెలో పాల్గొన్నావు, అటువంటివాడికి నాయింట్లో కూడు పెట్టనంటే, నన్ను పోషించే నాథులు ఒక్కరున్నారా, మీలో?

సీతా: ఏమిటోయ్, ఒక్క పూట కాలేజీ మానమంటే సవాళ్ళు చేస్తావు!

గోపీ: నాకున్న సాధకబాధలు చెప్పాను...వాటిని మీరు ఎలా స్వీకరించినా నాకు ఇష్టమే!

తాత: ఇంతసేపు మొరాయిస్తావేమోయ్? మంచిగా చెబితే అర్థం చేసుకోవేం?

పాపా: ఎంతో తొందరపనుల్లో ఉన్నా, అన్నింటినీ వదులుకుని వచ్చిన సీతారామయ్యగారి కోసమైనా ఒప్పుకోవేం?

తాత: పోనీ, నువ్వు వెడితే వెళ్ళావ్, నిన్ను చూసి జొరబడే వాళ్ళను రానివ్వకుండా చూడు.

గోపీ: అది మాత్రం నాచేత ఎలా అవుతుంది?

పాపా: 'నేను ఇన్ని కారణాల వల్ల వెడుతున్నాను. మీరు రాకండి' అని చెప్పడమే!

గోపీ: నేను వెడుతూ వాళ్ళను రావద్దంటే వాళ్ళు నన్ను తిట్టరూ?

సీతా: ఇంత శతమొండివి దొరికావేం? రేపు పొద్దున్న నీకు వారాలున్న వాళ్ళకు చెప్పి నీకు తిండి లేకుండా చేస్తే ఏం చేస్తావ్?

గోపీ: మీ పుణ్యమనుకుంటాను.

ప్రసాద్: అప్పుడు వారాలు ఉండనట్టే, నువ్వు కాలేజీకి వస్తే పోయినప్పుడూ అనుకో!

గోపీ: ఇప్పుడైతే మన ఆశయాలను చూసుకునైనా కడుపు నింపు కోవచ్చు. అప్పుడు రెండూ నాశనం అయిపోతాయ్.

సీతా: ఆఖరిసారి చెబుతున్నాను...నేను అసలు ఎవరికీ ఇంత సేపు చెప్పను....

గోపీ: క్షమించండి. నేనేం చెయ్యలేని పరిస్థితుల్లో ఉన్నాను.

ప్రసాద్: ఇంతమంది ఇంతసేపు బ్రతిమాలినందుకైనా ఒప్పుకోవచ్చునే.

గోపీ: బ్రతిమాలించుకోవాలని నాకు సుతారామూ లేదు.

సీతా: ఛస్! ఇతనికి చెప్పినా బుద్ధి వచ్చేటట్లు లేదు...నేను వెడుతున్నాను.

(ఒక మూలకు పోయి నలుగురూ ఏవో గుసగుసలాగతారు. తలలు పంకించి ఏదో ఒక నిశ్చయానికి వచ్చినట్లు సూచిస్తారు...సీతారామయ్య వెళ్ళిపోతాడు)

తాతయ్య: చూడు బ్రదర్! ఇప్పటికీ చాలా లేటయింది. నీతో వాదాలు పెంచుకోవడానికి మాకు టైం లేదు..మరో సారి అడుగుతున్నాను, నువ్వూ, మీ వాళ్ళు ఇవ్వాళ కాలేజీ మానరా?

గోపీ: వాళ్ళ సంగతి నాకు తెలియదు...నా విషయం ఇందాకటి నుంచీ మీకు చెబుతూనే వున్నా ఇంకా

అడిగితే ఏం చెప్పగలను?

ప్రసాద్: కాలేజీ మాననంటావ్!

గోపీ: వెళ్ళాలనే నా సంకల్పం.

ఆశీ: ఇదుగో బ్రదర్!...మేం అడిగిన వాళ్ళందరూ మారు మాట్లాడకుండా ఒప్పుకున్నారు. నువ్వు మాత్రం దిగిచ్చావా?...రాద్ధాంతం లేకుండా ఒప్పుకునే దానికి!

గోపీ: అదేమిటి ఆశీర్వాదంగారూ! రాద్ధాంతం చేస్తున్నది నేనా?...నా యిష్ట ప్రకారం నన్ను పోనివ్వక మీరు ఒత్తిడి చెయ్యడం బావుందా?

పాపా: ఒత్తిడి అంటా వేమిటి? పెద్దవాడు ఆయన వచ్చి చెప్పాకనైనా లేకుండా –

ప్రసాద్: ఇప్పటికీ ఒప్పుకోకపోతే, ఒప్పుకుండేటట్టు చేయవలసి వస్తుంది.

గోపీ: అంటే?

పాపా: అంటే ఏమిటో నీకే తెలుస్తుంది. మర్యాదగా ఒప్పుకో.

గోపీ: ఒప్పుకోకపోతే –

ప్రసాద్: మర్యాద మంట కలుస్తుంది.

గోపీ: మీలాగ నేను మర్యాద మీదనే బ్రతికే మనిషినే కాదు. నన్ను బలవంతంగా ఆపితే తప్పితే – లేకపోతే ఆరు నూరైనా నేను కాలేజీ మానను.

తాతయ్య: అయితే, బలవంతంగానే ఆపవలసివస్తుంది. నువ్వూ, నీతోపాటు నీ ఆరాధకులు ఏ అరవైమందో లోపలికి వెడితే ఇంకా సమ్మె చెడిపోక ఏమవుతుంది?

గోపీ: సరే! మీకు చేతనయింది చెయ్యండి.

ప్రసాద్: పరాయి వూరునుంచి వచ్చి చదువుకుంటున్నావ్!... మేం వూళ్ళోవాళ్ళం! ఎక్కడనుంచో వచ్చి ఇక్కడి వాళ్ళను ఎదిరించడం మంచిది కాదని తెలుసుకో.

గోపీ: పరాఇ వూరయినంత మాత్రాన ఈ వూరు రాగానే మీకు నీడల్లా బ్రతకాలా? వ్యక్తిత్వం చంపుకోవాలా?...అటువంటి నీచమైన పని ఎక్కడ వున్నా, ఎదిరించి తీరుతాను. ఎవరు చెయ్యాలనుకున్నా ఎదిరిస్తాను.

ప్రసాద్: మాటలు జాగ్రత్తగా రానీ! ఎవరనుకున్నావో!

గోపీ: ఎవరో నాకు తెలియదా?...అయినా నేనిప్పుడు తప్పు మాట ఏం అనలేదే!

పాపా: ఇంకా ఏం అనాలి? మేం చేస్తున్నది నీచమైన పని అన్నావు. చాలదూ?

గోపీ: నా దృష్టికిది ఇలానే కనిపిస్తోంది.

ఆశీ: నిన్నూ మేం నీచుణ్ణిగానే చూస్తాం. సరా?

గోపీ: నేను కాదన్నానా? ఇందాక నేను అనమంటేనే అన్నారా ప్రసాద్‌గారు నన్ను 'వారాలు చేసుకునే వెధవ' అని.

తాతయ్య: ఈ గొడవంతా ఎందుకు? మర్యాదగా ఈ పూట కాలేజీకి రాకు.

గోపీ: ఇన్ని చెప్పిన తరువాత కూడా మీరలా అంటే నేనేం చెయ్యగలను?

ప్రసాద్: ఈయనగారిని లాలిస్తూ ఎంతసేపు కూర్చుంటార్రా? టైం అప్పుడే పది కావచ్చింది.

తాతయ్య: ఆఖరిమాట చెప్పు గోపీ. ఇంతమందిమి, ఇన్నిసార్లు అడుగుతున్నాం –

గోపీ: ఎంతమంది ఎన్నిసార్తు అడిగినా నా సమాధానం ఒక్కటే.

ప్రసాద్: ఇట్లా ఎదిరించడం భావ్యం కాదు. ఆలోచించుకో!

గోపీ: ఆలోచించుకునే చెబుతున్నాను.

పాపా: తప్పదంటావ్?

గోపీ: (తల త్రిప్పుతాడు)

ఆశీ: మంచిగా చెబితే ఎందుకు వూరుకుంటాడురా?

పాపా: అమ్మ పెట్టే నాలుగూ పెట్టొద్దూ?

ప్రసాద్: (మీదికి వెళ్ళి) చివరిసారి చెప్పు.

గోపీ: ఇది నాలుగోసారి 'చివరిసారి'.

తాతయ్య: ఛా! 'మంచిమనిషి కొకమాట, మంచిగొడ్డుకొక దెబ్బ' అన్నారు.

గోపీ: నేనూ అదేఅంటాను.

పాపా: మాటలు పారకు. జాగ్రత్త.

గోపీ: నా జాగ్రత్తలో నేను ఎప్పుడూ ఉంటాను.

ప్రసాద్: అంటే, నువ్వు సిద్ధమే నన్నమాట!

గోపీ: కొట్టడానికా! మీకు తెలియదూ, నేను కొట్టలేనని.

ప్రసాద్: అయితే పిచ్చి వాగుడు వాగకు.

గోపీ: అది మీది –

ప్రసాద్: ఫూల్! నన్నే అన్నావ్.

(ఫెళ్ళున చెంప మీద కొడతాడు)

తాతయ్య: ఇప్పుడే కొట్టుకోవడాలు ఎందుకురా? అతనెలాగూ ఒప్పుకోడు...అతన్ని రానివ్వడం మనకు ప్రమాదం –

పాపా: ఇంకా మాటలెందుకురా?...ఆ గదిలో పెట్టి తాళం వేస్తే సరి –

(పాపారావు ఈ మాటలు అన్నదే తడవుగా ప్రసాద్ అతన్ని మెడబెట్టి లోపలికి గెంటుతాడు. గోపీ విడిపించు కోవాలని వ్యర్థ ప్రయత్నం చేస్తాడు. అందరూ లోపలకు వచ్చి బయట తాళం వేస్తారు.)

ప్రసాద్: ఇప్పుడొచ్చి వీణ్ణి రక్షించాలంటే, ఆ సుగుణాదేవిగారే రావాలి! వెధవ, వీడూ ఓ రొమాంటిక్ హీరో, వీడి బ్రతుక్కి!

తాతయ్య: ఇది నలుగురికీ తెలిస్తే మన ఆబోరు దక్కదు.

ఆశీ: ఏం ఫరవాలేదు..అసలు తెలియదనుకో! వూరికి మారు మూల. వీడి గొడవ ఎవరు వింటారు?

విన్నా, మనల్నేం చేస్తారు?

ప్రసాద్: ఇంతమంది ఇంతసేపు బ్రతిమాలాం. లొంగందే! సీతారామయ్య వీడిని శతమొండి అన్నాడు గాని నేను 'సహస్ర మొండి' అంటాను.

పాపా: 'సీతారామయ్యగారూ' అనలేవూ?

ప్రసాద్: నా యిష్టం వచ్చింది నేనంటాను.

తాతయ్య: మళ్ళీ దానికో పోట్లాటా?

ప్రసాద్: లేకపోతే నా యిష్టానికి వీడి అభ్యంతరం ఏమిటి?

పాపా: నీ యిష్టమైతే నీ లోపల అనుకో! బయటకు మాట్లాడేటప్పుడు సభ్యత వుండద్దూ? అట్లా అంటే కొందరికి కష్టం కలగవచ్చు.

ప్రసాద్: ఎవరికే కష్టం కలిగినా, నేను అనేది అనేదే.

పాపా: జాగ్రత్త. అనవసరంగా మాటలు జారకు.

**తాతయ్య:** అబ్బబ్బ! వూరుకోండిరా! మొత్తానికి తెలుగువాళ్ళనిపించారు! అరే ప్రసాద్, నువ్వు త్వరగా కాలేజీకి పద....మీరిద్దరూ మీ వాళ్ళను తీసుకుని కాలేజీకి రండి...మీరు వచ్చేటప్పుడు ఆ ధర్మారావును పట్టుకురండి. వాడికీ సంగతి తెలిస్తే దుమారం లేపుతాడు.

**ఆశీ:** వాడు మావాడుగా! వాడి సంగతి మేం చూసుకుంటాంటే!

(వేరు వేరు ప్రక్కలకు వెళ్ళిపోతారు – తెర)

## రెండో రంగం

కాలేజీకి ఇరవై గజాల దూరంలో, రోడ్డుమీద చాలామంది విద్యార్థులు జండాలు పట్టుకుని నిలబడి వుంటారు. అట్టలమీద 'విద్యార్థుల హక్కుల్ని కాపాడుకోవాలి', 'అభివృద్ధి నిరోధక శక్తుల్ని నాశనం చెయ్యండి', 'సమ్మెను జయప్రదం చెయ్యండి' – అంటూ నినాదాలు వ్రాయబడి వున్నయ్. రోడ్డు మీదనే ఒక ప్రక్కగా ఏడుకొండలు బడ్డీ వుంది. దానికి ముందుగా ఓ బెంచీ. కొందరక్కడ సిగరెట్లు తాగుతూ కూర్చుని, నిలబడి మాట్లాడుకుంటూ వుంటారు.)

**అవతారం:** గోపీ ఎక్కడా కనిపించడేం?

జకరయ్య: నేనూ చాలా సేపట్నుంచి చూస్తున్నాను. కనిపించలేదు.

**అవ:** మీకు కనిపించాడా పాపారావుగారూ?

**పాపా:** లేదండీ –

**తాతయ్య:** (సిగరెట్లు కొంటూ) రూము దగ్గర మాత్రం లేడండీ!...ఎక్కడకు వెళ్ళాడో ఎంత వెతికినా కనిపించలేదు!

**పిచ్చయ్య:** వెంకటరత్నం గారింటికి వెళ్ళాడేమో?

సత్యం: ఆ ఏడ్చే ఏడుపేమిటో సరిగ్గా ఏడవరాదూ! సుగుణగారింటికి వెళ్ళాడేమోనని –

పిచ్చయ్య: అనుమానం వేసింది, అడిగాను.

సత్యం: నిక్షేపంగా అడగవచ్చురా పిచ్చితండ్రీ! అడుగుతూ మధ్య ఈ డొంక తిరుగుడు దేనికి?

జకరయ్య: సత్యంగారూ! తీరా సమ్మె అయిపోయిన తరువాత మన పేర్లు బయటకు వస్తే ఫైను వెయ్యరు కదా?

సత్యం: ఫైన్ అంటారేమిటి? కొందరికి టి.సి.లు ఇచ్చి పంపినా పంపవచ్చు.

జకరయ్య: మనకు కూడా ఇస్తారంటారా?

సత్యం: ఎందుకు ఇవ్వకూడదూ? ఇవ్వడానికి ఒకే ఒక్క సుగుణం మీలో ఉండాలి. మీరు సమ్మెనాడు కాలేజీ దగ్గరకు వచ్చి కొంతమందినైనా లోపలకు వెళ్ళకుండా ఆపారా, లేదా అని.

జకరయ్య: ఆ విషయం ఎలా తెలుస్తుందిలెండి?

సత్యం: ఎందుకు తెలియదండీ? మన వాళ్ళలోనే ఆయనకు వందమంది సి.ఐ.డీలు ఉన్నారు.

జకరయ్య: (బిక్క చచ్చి) ఆ!

తాతయ్య: ఏమిట్రా! అసలే అతను పిరికి గుండె వాడు. అతన్నేమిటి సాగదీస్తున్నావు?

జకరయ్య: అబ్బే! నన్నా!....ఏం లేదు.

సత్యం: ఏమి లేదురా! విద్యార్థుల హక్కులు సంరంక్షించడానికి మనం కంకణం కట్టుకున్నట్టు ప్రిన్సిపాల్ గారికి తెలిస్తే, మనకు టి.సి. ఇచ్చి పంపుతారా అని అడిగాడు. ఎందుకు ఇవ్వరూ అన్నాను.

తాతయ్య: ఏడవలేకపోయావ్......(జకరయ్యతో) ఏమిలేదు బ్రదర్...వాడి మాట నమ్మకు. ఏ ఒక్క కుర్రాడిని తీసివేసినా మేం వూరుకుంటామా?

సత్యం: అవునవును ఊరెట్టుకుంటాడు. అంతగా అయితే మరో సమ్మె మొదటు పెడతాడు...వాళ్ళతో మనకెందుకు గాని, ఏడుకొండలు! ఒక సోడా కొట్టవోయ్.

ఏడు: తీసుకోండి సామీ...ఇంకేమైనా కావాలా? అరటిపళ్ళు తెచ్చినా....

సత్యం: అక్కర్లేదోయ్.........ఇవ్వాళ ఆంజనేయులు పుణ్యమా అని ఆర్గనైజర్ల కందరికీ స్వీట్, కాఫీ మత్తుగా పడ్డది.

ఏడు: నాకు తెలియకడుగుతా ఇదంతా ఎందుకు సామీ?

సత్యం: ఈ పిల్లకాయల హక్కుల కోసం ఏడుకొండలూ!

ఏడు: హక్కులంటే – ?

సత్యం: హక్కులంటే – రైట్స్ ...(తెలుగురాక) హక్కులు అదే!..ఆ! ఈ కొట్టు నీ స్వంతం కదా! అంటే దీని మీద నీకు హక్కువున్నదన్నమాట?

ఏడు: వుంటే – ?

సత్యం: దాన్నెవరయినా ఆక్రమంగా లూటీచేసి, నీ సామాన్లు ఎత్తుకుపోతారనుకో......అప్పుడు నీ వస్తువుల్ని కాపాడు కోవడానికి నీవు ఇటువంటిదే ఏదో చేస్తావు.

ఏడు: మీరు పరాసకాని కంటూ ఉండారు గాని, ఈ బడ్డీని ఎవరు లూటీ చేస్తారు సార్?

సత్యం: చేస్తారని కాదు...ఒక వేళ చేస్తే...

తాతయ్య: (వస్తూ) ఏరా, ఏమిటి ఉపన్యాసాలు దంచుతున్నావ్. ఏడుకొండలు దగ్గర – ?

సత్యం: ఎవ్వరూ వినకపోతే ఏం చేస్తాం? సోడా తాగితే, ఏడు కొండలు ఏం చెప్పినా వింటాడు కదా అని అతనికి చెబుతున్నాను.

తాతయ్య: కాలేజీ మూసింతర్వాత నేను ఎట్లాగూ రాజకీయాల్లోకి చేరతాను. అప్పుడు నా వెంట తీసుకువెళ్ళి ఉపన్యాసాలిప్పిస్తానులే.

సత్యం: బ్రదర్! ఇవి రాజకీయ నాయకులకు మంచి రోజులు కావు. నీతో పాటు నేనూ దెబ్బలు తినాలనా?

ప్రసాద్: తాతయ్యా! ఆ గేటు దగ్గర నుంచోరా! కాఫీ తాగొస్తాను.

సత్యం: అమ్మమ్మా! నాకూ కాఫీ ఇప్పించవురా?

ప్రసాద్: ఇంకా ఎగతాళి పట్టించడానికి?

సత్యం: ఎగతాళి అంటావేరా? నువ్వు సుగుణని ప్రేమించడం నిజం కాదా? ఆ అమ్మాయి –

ప్రసాద్: ఆపరా బాబూ! పుణ్యం ఉంటుంది. ఆలిండియా రేడియో నయంరా!

సత్యం: అందుకే కాఫీ ఇచ్చుకో.

ప్రసాద్: ఇప్పుడే కదరా రెండు స్వీట్లతో సహా తాగావ్.

సత్యం: వూరికే వచ్చేటప్పుడు ఎన్నిసార్లు తాగుతేనేంరా?

ప్రసాద్: సరే, పద.

ఆశీ: ఏం బ్రదర్! ప్రిన్సిపాలు ఏమంటున్నాడు?

తాతయ్య: లొంగి రావడం లేదు బ్రదర్......ఇహ లీడర్స్ అందరూ వెళ్ళి అడగాలి.

ఆశీ: ప్రిన్సిపాలు ఇంతమాత్రానికే దిగివస్తాడని నాకు నమ్మకం లేదు. మనం ఒక్కరోజు చెయ్యడానికే బ్రహ్మ ప్రళయం అయింది.

ఏడు: ఎన్నాళ్ళుంటాది బాబూ, ఇలా?

తాతయ్య: ఏమోనోయ్.......నీ బేరం మాదిరిగా, ఇది ఏ రోజు వ్యవహారం ఆరోజే.

ఆశీ: మా వాళ్ళు చూశావుగా! అప్పుడే నసుగుతున్నారు.

తాతయ్య: ముందు ఇవ్వాళ గడవనీ.

ఆశీ: ఆ అవతారాన్నీ, జకరయ్యనీ చూశారా! గోపీ ఏడని వందసార్లు అడిగారు..

తాతయ్య: మీరు ఒక్కపని చెయ్యండి..వాళ్ళిద్దర్నీ తీసుకువెళ్ళి కాసిని కాఫీ నీళ్ళు పోయించండి. లేకపోతే వాడు యే క్షణాన వాడి దగ్గరకు వెళ్ళినా వెళ్ళొచ్చు.

ఆశీ: అలాగే (వెడతాడు)

(ధర్మారావు వస్తాడు)

ధర్మ: తాతయ్యా! నేనొక్కసారి కాలేజీలోకి వెళ్ళాలోయ్.

తాతయ్య: ఎందుకూ?

ధర్మ: మా నాన్న గారి దగ్గరనుంచి ఏదో ఉత్తరం వచ్చిందట –

తాతయ్య: ఉత్తరానిదేముంది? రేపు తీసుకోవచ్చు.

ధర్మ: అలాకాదు.....ఎక్స్‌ప్రెస్ డెలివరీ అట.

తాతయ్య: అయితే కాలేజీలో ఎందుకు ఇచ్చాడు?

ధర్మ: కాలేజీకి వస్తానేమోనని మన గుమాస్తా బాలకృష్ణ లేడూ? అతనికి ఇచ్చాడట!

(ప్రసాద్, సత్యం వస్తారు)

తాతయ్య: నువ్వు వెళ్ళడం వల్ల మాకు భయం లేదనుకో! కాని –

ప్రసాద్: ఏమిటి? లోపలకు వెళ్ళాలా?

ధర్మ: అవును.

ప్రసాద్: వీల్లేదు.

ధర్మ: ఎందుకని?

తాతయ్య: ప్రతివాడూ ఏదో ఒక మిషతో వెళ్ళాలంటే?

ధర్మ: అంటే నేనూ ఆ మిషనే వెదుతున్నానంటరా? అంత గతి పట్టలేదు...అర్జంటు కాబట్టే అన్నాను.

ప్రసాద్: అంతోటి తొందర ఏమిటో?

తాతయ్య: ఏదో ఉత్తరం వచ్చిందట.

ప్రసాద్: అంత – అర్జంటా?

సత్యం: ప్రేమ లేఖ ఏమోరా?

ధర్మ: దగ్గరదగ్గర అటువంటిదే!....ఏదైతేనేం, అర్జంటయిన తర్వాత.

ప్రసాద్: అయినా వీల్లేదు...నిన్ను పోనిస్తే అందర్నీ పోనివ్వాలి.

ధర్మ: బ్రదర్.....సమ్మెలు అందరి సానుభూతితోను జరపవలసినవి కాని, దౌర్జన్యాలతోను, బెదిరింపులతోను జరగవు.

తాతయ్య: నువ్వు వెళ్ళక తప్పదంటావు!

ధర్మ: ఎందుకు వెళ్ళాలో కూడా చెబితిని. పోనీ, మీరెవరైనా ఆ వుత్తరం ఏ ప్యూన్ చేతనో తెప్పించండి... మీకూ, నాకూ బాధ వుండదు.

తాతయ్య: వాళ్ళెవరూ ఇటు చాయలకే రావడం లేదు. ఇందాక హరిగాడు మాతో మాట్లాడుతుంటే ప్రిన్సిపాలు మొహం వాచేటట్లు కేకలు వేశాడట...

ధర్మ: ఎలా?...పోనీ నేను ఉత్తరం తీసుకోగానే వచ్చేస్తానని నలుగురితోను చెబుతాను.

ప్రసాద్: అందరూ ఆ మిషతోనే బయలుదేరితే?

(పిచ్చయ్య త్వరగా వస్తాడు)

పిచ్చయ్య: అరే ప్రసాద్!...తాతయ్యా! గోపీని ఎవరో గదిలో పెట్టి తాళం వేశారట.

ప్రసాద్: నీకెవరు చెప్పారు?

ధర్మ: నిజంగానా?

పిచ్చయ్య: వాళ్ళెవరో అనుకుంటూ వుండగా విన్నాను.

ప్రసాద్: ఏడిశావు.....ఎవరో తమాషాకు చెప్పి వుంటారు..

(అవతారం వస్తాడు)

ధర్మ: అవతారం! గోపీ కనిపించాడా?

అవ: ప్రొద్దుట్నుంచీ చూస్తున్నాను.

ధర్మ: వాడిని వాడి గదిలో పెట్టి తాళం వేశారట. నువ్వు వెళ్ళి చూసిరా.

ప్రసాద్: ఈ పిచ్చయ్య చెప్పేవన్నీ అటువంటివే! గోపీని ఎవరు గదిలోపెట్టి తాళం వేస్తారు?

ధర్మ: ఏమో? ఈ వూళ్ళో చెయ్యకూడనిది ఏం ఉంది? వెళ్ళిరా అవతారం.....

(అవతారం బయటకు వెళ్ళగానే ధర్మారావు లోపలకు వెళ్ళడానికి బయలు దేరతాడు)

ప్రసాద్: వద్దని నీకు కాదు చెప్పేది?

ధర్మ: వెళ్ళాలని నీకు కాదూ, చెప్పేది?

తాతయ్య: నీ మాట నీదే కాని ఎదుటివాళ్ళ మాట వినిపించుకోవేం?

ధర్మ: మీ మాటే మీది కాని ఎదుటి వాళ్ళ మాట వినిపించుకోవేం? (అంటూ వెళ్ళబోతాడు)

ప్రసాద్: ఏమైనా నువ్వు వెళ్ళడానికి వీలు లేదు.

ధర్మ: ఏమైనా నేను వెళ్ళితీరాలి.

ప్రసాద్: నువ్వు పోట్లాటకు వచ్చినట్టున్నావే!

ధర్మ: ఎవరు వచ్చిందీ తెలియదంటా?

(అంటూ లోపలకు పోబోతాడు. ప్రసాద్ అతన్ని వెనకకు నెడతాడు)

ధర్మ: ఏం చేస్తున్నావో తెలుసుకో! అనవసరంగా ఎందుకని వూరుకుంటుంటే, పెట్రేగిపోతున్నావే!

తాతయ్య: ఎవరికో చెప్పినట్టు, నీకు ఎన్నిసార్లు చెప్పాలి ధర్మారావు?

ధర్మ: ఎవరికో చెప్పినట్లు మీకు ఎన్ని సార్లు చెప్పాలి?

ప్రసాద్: ఇదేం అనవసరంగా వున్నట్లుగా లేదు.

ధర్మ: అటువంటి పనులు చేసేది నువ్వు. నేను గోపీ ననుకున్నావు కాబోలు...ఇవేం మనదగ్గర సాగవు... మర్యాదగా అడ్డంలే.

ప్రసాద్: లేవకపోతే ఏం చేస్తావ్?

ధర్మ: ఏం చేస్తానో చెప్పడం ఎందుకు? నువ్వే చూడొచ్చు.

ప్రసాద్: నీ యిష్టం వచ్చింది చేసుకో....మేం మాత్రం నిన్ను వెళ్ళనివ్వం.

ధర్మ: ఎందుకు వెళ్ళనివ్వరో నేనూ చూస్తాను.

(అంటూ ముందుకు వెడతాడు. ప్రసాద్ అతన్ని గట్టిగా తోస్తాడు. అతను వెనక్కుపడి, తమాయించుకుని, లేస్తాడు)

తాతయ్య: ప్రసాద్! ఏమిటది?

ప్రసాద్: వెడతాట్ట! వెళ్లమను –

'ధర్మారావు సర్దుకుని, లేచి, గబగబా ప్రసాద్ దగ్గరకు వచ్చి చాచి లెంపకాయ కొడతాడు. చుట్టూ మూగిన విద్యార్థులు కొందరు నవ్వుతారు. కొందరు నోర్లు తెరుచుకుని చూస్తూ వుంటారు)

ధర్మ: ఎందుకునే అని వూరుకుంటుంటే మగతనం చూపిద్దామనుకున్నావ్, మగతనం! నేనేం గోపీ అనుకున్నావా?.ఎక్కడనుంచో వచ్చినవాణ్ణి భయపెట్టి, గదిలో ఉంచి తాళం వెయ్యడానికి?

తాతయ్య: ఎవరు?

ధర్మ: మీరే! ఇంకెవరు చేస్తారు? నాదీ ఈ వూరే!..నీ బతుకు తెలియదనుకోకు...క్రిందికి నెట్టే మగాడు వచ్చాడు...జాగ్రత్త! అనవసరంగా నా జోలికి రాకు.

ప్రసాద్: నన్ను....నన్ను కొడతావురా! బ్రూట్...

(అంటూ ధర్మారావు మీదకు వస్తాడు. తాతయ్య ఆపుతాడు)

తాతయ్య: నువ్వు చెయ్యిచేసుకోవడం ఏమీ బాగులేదు ధర్మారావు!

ధర్మ: ఏం? మీ వాడు చేసింది బావుందా? నన్ను నెడతావా? వీడెంత, వీడి బ్రతుకెంత? నాలుగు ఊలెన్ గుడ్డలు, కట్టి, అమ్మాయిలకు పోజులు కొట్టినంత మాత్రాన వీడు హీరో అయిపోయాడా?

ప్రసాద్: అనవసరంగా మాటలు మాగలకు–తన్నులు తింటావు.

ధర్మ: ఎవరు తింటారో తెలుస్తూనే వుంది.

ప్రసాద్: నోరుముయ్......(అని తాతయ్యను విదిలించుకుని ప్రసాద్ మీదకు వస్తాడు. కాని తాతయ్య మళ్ళీ ఆపుతాడు)

ఏడు: ఎందుకు బాబూ, ఇంతలో కీచులాటలు?

ధర్మ: కీచులాటలు అంటావేం ఏడుకొండలు? ప్రపంచాన్నంతా వీడిఇష్టం వచ్చినట్లు నడిపిద్దామనుకుంటున్నాడు.....వీడివ్వాళ ఇవాళ మగాడయినాడు.......అమ్మ పుట్టిల్లు మేనమామల దగ్గరా?

ప్రసాద్: తెలుసు, తెలుసు...ఆ గోపీగాడిని వెంటవేసుకుని ఆ వెంకటరత్నం ఇంటికి వెళ్ళడంలోనే బయటపడ్డది నీ బండారం.

ధర్మ: ఏమిటోయ్, అది?

ప్రసాద్: నీకు మాత్రం తెలియదూ? ఆ అమ్మాయిగారికి ఆ వారాల వెధవమీద ఎందుకు అంత మమకారం?

ధర్మ: అలా వాగితేనే మళ్ళీ తింటావ్! ఏం మాటలు మర్యాదగా రావూ? నీకు ఆ ఏడుపెందుకు? నీకు ఆ గోపిని వాళ్ళింటికి తీసుకు వెళ్ళి పరిచయం చేశానని నీ ఏడుపు...నిన్నూ పరిచయం చేస్తాను,

రా......ఛీ! నీ కంటే కుక్కనయంరా, వాళ్ళు అక్కచెల్లెళ్ళయినా, అమ్మా కొడుకులయినా, నీలాంటి వాళ్ళకి ఏదో నీచమైన సంబంధమే కనిపిస్తుంది.

ప్రసాద్: ఏం పెట్రేగిపోతున్నావు? .....ఆగరా! వీడి సంగతి తేలుస్తాను.

తాతయ్య: మీర్దిరదూ ఇలా బజారున పడితే ఎలారా? పెద్ద పెద్ద ఉపన్యాసాలు చెబుతాము? ఇంత చిన్న విషయాలకేమిట్రా ఈ దెబ్బలాటలు?

(ఇంతలో పాపారావు, ఆశీర్వాదం వస్తారు)

ధర్మ: ఏరా పాపా! నేను వుత్తరం తీసుకోవడానికి లోపలకు వెళ్ళాంటే, వెళ్ళన్వివరా?

పాపా: నీకు అడ్డేమిటిరా? వెళ్ళు.

తాతయ్య: అది కాదు పాపారావు! అతను వెడితే ప్రతివాడూ అడగడూ?

ఆశీ: ప్రతివాడూ, అతనూ ఒకటేనే? వెళ్ళరా ధర్మా –

ధర్మ: ఇందాక నేను వెడతానన్నందుకే నన్ను క్రిందికి తోసాడు ప్రసాద్.

పాపా: (ప్రసాద్ మీదికి వెళ్ళి) ఏం బ్రదర్! ఒక్కసారి హీరో వయిపోదామని చూస్తున్నావా?

తాతయ్య: ధర్మారావు చేసింది బావుందా?

ధర్మ: నన్ను కిందికి తోశాడు. నేను కొట్టాను.

ప్రసాద్: కొడతావు. కొడతావు...తాతయ్య పట్టుకోబట్టి బ్రతికి పోయావు.

ధర్మ: అబ్బా! లేకపోతే ప్రాణాలు తీస్తావా? ఇప్పుడు చెయ్ ఏం చేస్తావో?

ప్రసాద్: ఏం చెయ్యాలి? సిగ్గు ఎగ్గూ లేని బ్రతుక్కి –

పాపా: మాటలు సరిగ్గారాని! పేలిపోతుంది ఒళ్ళు.

ప్రసాద్: వాడు అనగా లేనిది, నేనంటే వచ్చిందేం?

ఆశీ: వాడేమన్నాడు? తప్పేం అనలేదే!

పాపా: (తాతయ్యతో) మీవాడి మాటలకి ముందు క్షమాపణ చెప్పించు...మరీ మితిమీరిపోతోంది వ్యవహారం.

తాతయ్య: ఎవరనుకొన్నవి వాళ్లనుకొని పైగా క్షమాపణ ఏమిటోయ్....

ఆశీ: ముందు అన్నది ఎవరు?

తాతయ్య: ఎవరంటే యేం? జరిగొపోయాక –

పాపా: అలాకాదు –

తాతయ్య: ముందు తొందరపడ్డది ప్రసాదే!

పాపా: అందుకే క్షమాపణ చెప్పాలనుకుంటున్నాం.

ప్రసాద్: చచ్చినా చెప్పను.

ఆశీ: ఆలోచించుకోండి...మేం ఇప్పుడేవస్తాం....క్షమాపణ చెబితే సరేసరి, లేకపోతే – (ముగ్గురూ వెళ్ళిపోయారు)

తాతయ్య: చూశావా! తొందరపడకురా అంటే –

ప్రసాద్: ఇంకా తొందర అంటావేం? వాడనే మాటలు నువ్వు వినలా?

తాతయ్య: మాటల్లో పోయేదానికి నువ్వు చెయిచేసుకుంటివి.

ప్రసాద్: ఇంకానయం.........కాలు చేసుకోలేదు....

తాతయ్య: సంతోషించాం కాని, ఇప్పుడేం చెయ్యడం? నువ్వు క్షమాపణ చెప్పకుంటే ఈ నిప్పు మండకుండా ఆరిపోతుంది.

ప్రసాద్: ప్రాణాలుపోయినా ఒప్పుకుంటానుగాని, ఆ వెధవకి క్షమాపణ చెప్పుకుంటానా?

తాతయ్య: మరి ఎలారా?

ప్రసాద్: ఎలాగంటూ నానుస్తావేం? వీళ్ళు ఒక్క మాట ఇహ నన్నారో, సాయంకాలంలోపుగా వీళ్ళలో కొందరికి వరస తగలనిస్తాను.

తాతయ్య: సరే! ఏమయితే అది అవుతుంది.....కానీ –

(ఆశీర్వాదం, పాపారావు, ధర్మారావు మరికొందరు సన్నిహితులు వస్తారు)

పాపా: ఏం బ్రదర్, ఏం తేల్చుకున్నారు?

తాతయ్య: ఈ భాగ్యానికి వాడు క్షమాపణ చెప్పవలసిన అవసరం ఏముంది?

ఆశీ: ఉండడం లేకపోవడం తరువాత సంగతి....ముందు క్షమాపణ చెప్పుకోవాలి.

ప్రసాద్: చెప్పను, చెప్పను, చెప్పను.

పాపా: అయితే పదండిరా కాలేజీలోకి, వీళ్ళ బెట్టు ఏమిటో చూద్దాం. వాళ్ళు తప్పులు చేస్తే ఒప్పులూనూ, మనం చేస్తే కాదా? పదండి...ధర్మా! లోపలికి పద.....జకరయ్యా!....అందరూ లోపలకు పదండి –

(లోపలకు వెళ్ళడానికి రెండు వర్గాలవారికీ సంఘర్షణ జరుగుతుంది. వీరు వారిని వారు వీరిని తోసుకోవడం, పరస్పరం ఒకటి రెండు దెబ్బలు తినడం జరుగుతుంది. ఓ క్షణం అయిన తరువాత ప్రసాద్ రేగిపోయిన జుట్టుతో చిరిగిన బట్టలతో వస్తాడు.....ఇంతలో మరోవైపు నుంచి సత్యం వస్తాడు)

సత్యం: ఏమిట్రా బ్రదర్! దేవదాసు వేషంగాని వెయ్యడం లేదు కదా!

ప్రసాద్: నోరుముయ్యరా! నీవేళాకోళాలకు వేళాపాళా లేదురా?

సత్యం: టైం టేబుల్‌లో ఇది ప్రత్యేకంగా ఒక సబ్జక్టు కాదు, ఖర్మ! ఏం చేస్తాం? సరే! వీళ్ళందరూ ఏరి?

ప్రసాద్: ఎవరు?

సత్యం: అదే! యోధానయోధులు, వీరశూరధీర సేనులు. తాతయ్య, పాపారావు వగైరాలు.

ప్రసాద్: ఆ పాపారావు వాళ్ళు వున్నట్టుండి కాలేజీకి వెళ్ళారు తెలుసా?

సత్యం: ఏమిటీ?..ఎందుకు?

ప్రసాద్: ఒళ్ళు మదం ఎక్కి.....వీళ్ళకి ముందున్నదిలే ముసళ్ళ పండుగ...(ఏదో ఆలోచించి) అరేయ్, బ్రదర్! ధర్మారావు క్లాసుకు వెళ్ళినట్టున్నాడు కాని, వాడినలా వెనకాల గేటు దగ్గరకు తీసుకురా, మాట్లాడాలి.

సత్యం: నువ్వే కాలేజీలోకి వచ్చి మాట్లాడకూడదు.

ప్రసాద్: ఈ వేషంలో వస్తే దడుసుకుంటారు....నువ్వు ఓ పదినిముషాలు అయిన తరవుఆత వాడిని అటు తీసుకునిరా! నేను రమ్మన్నానని చెప్పకు...నువ్వే ఏదో మాట్లాడుతూ తీసుకురా!

సత్యం: ఏమిటో, నాకేమీ అర్థం కావడం లేదు.

ప్రసాద్: ఇది చెబితే అర్థం అయ్యేది కాదురా....ప్రత్యక్షంగా చూస్తావుగా! త్వరగా వెళ్ళు.

(బలవంతాన పంపుతాడు)

ఏడు: ఏంది బాబుగారూ? యవారం అంతా బెడిసినట్టుందే?

ప్రసాద్: వాళ్ళ వాళ్ళు నలుగురు దగ్గరున్నారని మిడిసిపడితే బెడవకేం చేస్తుంది? చూస్తావుగా ఏడుకొండరూ! – సాయంకాలంలోగా వీళ్ళందర్నీ వాయించి వదలాలి.

ఏడు: పోనివ్వండి బాబూ! ఆళ్ళెవరో సేసేవారని మనం సేస్తే మన గొప్పేముంది? అయినా యింతదాకా బాగానే ఉన్నారు గదండీ....

ప్రసాద్: వెధవ బుద్ధులు పుట్టడానికి ఎంతసేపు పట్టాలి?

ఏడు: కూచుని, ఓ సోడా తాగండి బాబూ!

(సోడా కొడతాడు – ఇంతలో చిట్టన్న వస్తాడు)

ఏడు: ఏంది చిట్టన్నా, ఇటొచ్చినావు! దోవతప్పినట్టుందదే!

చిట్ట: లేదన్నా! కావలనే వచ్చినా! (ప్రసాద్‌తో) అయ్యా! ఈడ మా ధర్మయ్యగారు ఎక్కడుంటారో తెలుసునా?

ప్రసాద్: ధర్మయ్యో, అధర్మయ్యో ఎవరికి తెలుసు?

ఏడు: ఇప్పుడే లోపలికి పోయినట్టుండాది....కాదుబాబూ?

ప్రసాద్: ఏమో ఎక్కడ ఏడిశాడో ఎవరికి తెలుసు?

చిట్టన్న: ఏంది బాబు! ముక్కుమీద కోంప పెట్టుకొచ్చినావు! పోనీ గానయ్యా! గోపయ్యబాబు ఎక్కడుంటాడో తెలుసునా!

ప్రసాద్: గోపేనా? ఎందుకు?

చిట్టన్న: పనుండదిలే బాబు, ఉన్నాడా?

ప్రసాద్: ఏమిటి పని? చెప్పు.......ఫరవాలేదు....లోపల ఉన్నాడు.

చిట్టన్న: మా సుగుణమ్మగోరు ఓ సీటీ ఇచ్చిరమ్మన్నారండీ...ఎక్కడున్నారయ్యా?

ప్రసాద్: లోపల క్లాసులో ఉన్నాడు. ఆ చీటీ ఇవ్వు నేను ఇస్తాను?

చిట్టన్న: అయ్యోబాబు! ఇది ఎవరకైనా ఇచ్చినానని తెలిస్తే అమ్మగారు చంపరూ?

ప్రసాద్: పోనీ, చూపించు.....నేను వెళ్ళి వాడిని పంపుతాను.

చిట్టన్న: పంపడానికి చూడాలనా బాబూ? (నవ్వుతూ) చూడడం ఇవ్వడం ఒకటేగా బాబూ? ఏమంటావు ఏడుకొండలూ!

ఏడు: మా బాగా చెప్పినావు! (దూరం నుంచి 'ప్రసాద్' అని కేక వినిపిస్తుంది. ప్రసాద్ త్వరాగా వెళ్ళిపోతదు) ఏం సిట్టన్నా! అంత అవసరం సీటేనా అది? తెలీకడుగుతాను –

చిట్టన్న: అవునన్నా! మా అమ్మగారు చాలా ఏగిరం ఇచ్చిరమ్మన్నారు! ఇచ్చి రెండు గంటలాయే! ఆ అయ్యకోసం తిరిగిన చోటు తిరక్కుండా తిరిగేను. కాళ్ళేమో బలపాలు కట్టినయ్, ఆ అయ్యేమో ఇంతదాకా కనిపించలేదు....ఇహ మా దర్మయ్యగోరన్నా కనిపిస్తారని ఇటొచ్చినా.

ఏడు: ఇప్పటిదాకా మీ అయ్య, ఇక్కణ్ణుంచి లగెత్తికెళ్ళినే – ఆ అయ్య ఒకటే లడాయి....మీ అయ్య కోపం వచ్చి ఈ ఆయన్ని కొట్టను కూడా కొట్టాడు.

చిట్టన్న: కొట్టినాడా మా అయ్య!

(అవతారం, గోపీ వస్తాడు)

చిట్టన్న: గోపయ్యగారా?

గోపీ: ఏమిటి చిట్టన్నా, ఇలా వచ్చావ్?

చిట్టన్న: ఇప్పుడా బాబు, చాలా ఏళనుంచి మీ కోసం తిరగడం –

గోపీ: ఏమిటి సంగతి?

చిట్టన్న: అమ్మగారు ఈ సీటి ఇచ్చిరమ్మన్నారు బాబూ!

(గోపీ చీటి తీసుకుని చదువుతాడు)

అవతారం: ఏమిట్రా?

గోపీ: నన్ను కొట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయట! తనకు ఇప్పుడే తన క్లాస్‌మేట్ రాధ చెప్పిందట. వెంటనే వాళ్ళయింటికి రమ్మని వ్రాసింది.

అవతారం: వీళ్ళందరూ ఏరి?

గోపీ: ఏం, ఏడుకొండలూ; ఒక్కరూ కనిపించరేం?

ఏడు: కొట్టుకున్నారు బాూ!..కొందరమో, లోనికి పోయినారు, కొందరేమో గుసగుసలాడుకుంటూ ఇటు కాలేజీ ఎనక రోడ్డుకు పోయినారు.

గోపీ: లోపలికి పోయారా?..సరే! చిట్టన్నా! సుగుణమ్మా గారితో సాయంకాలం వస్తానని చెప్పు..ఇక్కడేం గాభరా లేదని చెప్పు.

చిట్టన్న: అట్టనే బాబూ! (ఏడుకొండలుతో) వస్తానన్నా.....

ఏడు: గాపకం ఉంచుకో –

చిట్ట: అట్టగట్టగే – (వెళ్ళిపోతాడు)

అవతారం: తమాషాగా వుంది.....అయినా ఏదో రాద్ధాంతం జరిగే వుంటుంది.

ఏడు: అవును బాబు! కొట్టుకున్నారగందా!

అవతారం: కొట్టుకున్నారా! ఎవరెవరు?

ఏడు: ప్రసాదయ్యని ధర్మయ్యగారు కొట్టారు.

గోపీ: ధర్మ కొట్టాడా?

అవతారం: బ్రదర్! నువ్విప్పుడు ఇక్కడ వుండడం భావ్యం కాదు.....సుగుణ వాళ్ళింటికి వెళ్ళిపో.

గోపీ: ఏం కొడతారని భయమా?

అవతారం: మన జాగ్రత్తలో మనం వుండడం మంచిది కదా అని.

గోపీ: కొట్టనివ్వరా!..మనుష్యుల్లో ఆ దౌర్భల్యంచచ్చి పశుత్వం రావాలే కాని, మనం వచ్చి కొడతారు..

(ఇంతలో ధర్మారావు, దెబ్బలు తగిలి, రక్తం స్రవిస్తూ వుండగా, ఏడుస్తూ వస్తాడు...అతని వెనక బిక్కుబిక్కుమంటూ సత్యం వస్తాడు)

గోపీ: ఏమిటిది, ధర్మా?

ధర్మ: ఆ వెధవలు, అందరూ కలిసి...ఒక్కణ్ణి చేసి –

ఏడు: అదేమిటి బాబు తలంతా రక్తం.

(ఏడుకొండలు త్వరగా వెళ్ళి ఓ సోడాకొట్టి తీసుకొస్తాడు. తడిగుడ్డ తడిపి ముఖాన అద్దుతూ వుంటాడు)

సత్యం: నన్నే పిలుచుకురమ్మన్నారు గోపీ...ఊరికే మాట్లాడ్డానికనుకున్నా...తీరా వచ్చిం తరువాత –

గోపీ: ఎవర్రా కొట్టింది?

ధర్మ: ఆ ప్రసాదే? తన దమ్ములు లేక ఊళ్లోనుంచి రౌడీలను పిలిపించాడు.

అవతారం: అప్పుడే –

గోపీ: వాళ్ళు రావడానికి ఎంతసేపు కావాలిరా! వాళ్ళకు ఇదేగా పని? పైగా పెద్దవాళ్ళ అండ వుంది.

ధర్మ: మనకేనా లేంది? వాణ్ణి – అ......బ్బా......!

గోపీ: ఉద్రేక పడకురా......

(ధర్మారావు అంతకంతకూ నీరసిస్తూ వుంటాడు)

గోపీ: అవతారం! లోపలకు వెళ్ళి మనవాళ్ళ నెవరినయినా కేకవేసుకురా!....త్వరగా – ఏడుకొండలూ! కొంచెం మంచినీళ్ళు అందుకో.

(పిచ్చయ్య వస్తాడు)

పిచ్చయ్య: నువ్వు ఇక్కడ వున్నావురా! నీ కోసమే వస్తున్నాను. ఇదేమిటి! ఎవరు కొట్టారు?

గోపీ: ఎవరుంటారు?....ప్రసాద్.

పిచ్చియ్య: వాడేరా ఇదంతా చేస్తుంది. చూశావా! సమ్మె చేసిన వాళ్ళందరూ బాగానే వున్నారు...మధ్య నీకు వచ్చింది.

గోపీ: ఏమిటి?

పిచ్చయ్య: నిన్ను కూడా వారంరోజులు సస్పెండు చేశారు....ఇప్పుడే నోటీసు కట్టారు.

గోపీ: నన్నా!.....నిజం?

పిచ్చయ్య: ఇప్పుడేగా చూసివస్తున్నది....నీకు చెబుదామని వస్తున్నాను.

గోపీ: నా పేరెలా తెలిసిందో ప్రిన్సిపాలుకు?

పిచ్చ: అసలు ఏం జరిగిందంటే – మళ్ళీ నేను చెప్పానని ఆ ప్రసాద్ వాళ్ళతో చెప్పకు – మొదట

ప్రిన్సిపాలు దగ్గరకు వెళ్ళినప్పుడు కసికొద్దీ నీ పేరు చెప్పారట! తీరా కొంతమంది కాలేజీకి వచ్చారా? రానివాళ్ళలో లీడర్సునందరినీ సస్పెండు చేశారు.

గోపీ: బావుంది!...అరె! ఇదేమిటి? ఇంకా రక్తం ఆగలేదు...ధర్మా! ధర్మా! అరె....స్మృతి తప్పినట్టున్నాడు. ఏడుకొండలూ! మా వాళ్ళెవరన్నా వస్తే జనరల్ హాస్పటల్‌కు రమ్మని చెప్పు.

(వెళ్ళడానికి లేస్తాడు)

పిచ్చయ్య: గోపీ! నువ్వొక్కసారి అర్జంటుగా ప్రిన్సిపాలును కలుసుకోవాలి...అప్పుడే కమిటీ వాళ్ళంతా కాలేజీకి వచ్చారు. వాళ్ళకు నీ పేరు తెలిసిందంటే నీ స్కాలర్ షిప్ కాస్తా పోతుంది.

గోపీ: పోనివ్వరా, ఏం చేస్తాం? నేను ముందు ఆసుపత్రికి వెళ్ళాలి...వాళ్ళ ఇష్టం వచ్చినట్టు చేసుకోమను.

పిచ్చయ్య: అది కాదురా –

గోపీ: (వినిపించుకోకుండా) ఏయ్, రిక్షా! రిక్షా!

(గోపీ త్వరగా వెళ్ళిపోతాడు. పిచ్చయ్య అలాగే నోరు తెరిచి చూస్తూ వుంటాడు)

ఏడు: మంచి మారాజు! ఎంత జాలిగుండె!...అటువంటి ఆయనకే అన్నీ కష్టాలు!......

(ఇద్దరూ గోపీ వెళ్ళిన వైపే చూస్తూ వుండగా తెర.)

# వీలునామా

### నాగభూషణ్

**పాత్రలు:** రాఘవయ్య, భాస్కరం, ఆనందరావు, బంగారు, అనంతం, సంతానం, సుశీల

## రంగము 1

రాఘవయ్య: (తెరవెనుక) భాస్కరం! భాస్కరం! ఎంతచెప్పినా, ఎటూ కాని వేళ ఆ తలుపులు మూసుకుని, తెరలు వేసుకుని కూర్చుంటావేరా? బంగారు! బంగారు!

బంగారు: సారూ!

రాఘ: వాడికి తెలియకపోతే నీకైనా తెలియదురా? పట్టపగలు ఆఫీసురూము మూసుకు కూర్చుంటార్రా? ఆ తెర తియ్. తలుపులు తెరు.

(తెర తొలిగిపోతుంది. కనిపించేది రాఘవయ్యగారి ఆఫీసు గది. గదికి ముందుభాగాన 'పి. రాఘవయ్య బి.ఏ., ప్లీడరు' అనీ, రెండో ప్రక్కన 'పి. భాస్కర్ బి.ఏ., బి.ఎల్., అడ్వొకేట్' అనీ వ్రాసిన 'బోర్డులు' వున్నయ్. గదికి వెనుక మధ్యగా ఒక వాకిలి, వాకిట్లోకి మరో వాకిలి వుంటయ్. మరో ప్రక్క వీధివైపుకు కిటికీ వుంది. గది మధ్యలో ఒక టేబుల్, దానికి మూడు ప్రక్కలా మూడు కుర్చీలు, ఒక మూల పడక కుర్చీ, దూరంగా ఒక బల్ల, దానికి చేరువగా రెండు కుర్చీలు వున్నయ్)

రాఘ: ఇట్లా నాలుగు గోడలమధ్య కూర్చుండిపోతే, ఒక ప్రాక్టీస్ ఎలా చేస్తావురా?

(భాస్కరం ఆలోచిస్తూ వుంటాడు)

రాఘ: అంత ప్రపంచాన్నే మరిచిపోయే ఆలోచనలేమిట్రా!

భాస్క: అదే! – 'మనుష్యులు అనవసరంగా యెందుకు యెప్పుడూ ఆలోచిస్తూ వుంటారా?' అని.

రాఘ: ఎందుకాలోచిస్తున్నారా అని నువ్వు ఆలోచిస్తున్నావా? చించు, చించు –

(బంగారు ఏదో చీటీ తెచ్చి రాఘవయ్యగారికిస్తాడు)

ఎవరు? ఆనందరావా?.. పేరు కూడా ఎప్పుడూ వినలేదే!

బంగా: రెండు రోజులకిందటే మీకు ఉత్తరం రాశానంటున్నాడండీ –

రాఘ: ఉత్తరమా! నేను చూడలేదే!

భాస్క: (రూళ్ళకర్రను ముక్కుమీద నిలబెట్టడానికి ప్రయత్నం చేస్తూ) నేనూ చూడలేదే!

(బంగారు, భాస్కరం వంక నోరు తెరిచి ఆశ్చర్యంగా చూస్తాడు)

రాఘు: ఏమిత్రా, తిమింగలంలా అలా నోరు తెరుచుకు చూస్తావ్?

భాస్క: (బంగారం వంక చూసి) ఏం బంగారు? అదే అని నీ ఉద్దేశ్యమా?

(అవునన్నట్లు తల వూపుతాడు బంగారు)

రాఘు: ఏది?

భాస్క: అదే! మొన్న క్లబ్‌లో బిలియర్డ్స్ మాచ్ వుంది. త్వరగా వెడుతూ వుండగా ఉత్తరాలు యిచ్చాడు బంగారు. ఇచ్చినవాడు వూరుకున్నాడా? అట్లాగే నోరు తెరుచుకుని నిలబడ్డాడు. నాకూ తమాషా చెయ్యాలనిపించింది. కవరు చిన్నది కూడా నేమో, నోట్లో పడేటట్లు విసిరాను. మేం యూనివర్సిటీలో వుండగా ఒక 'గేం, ఆడేవాళ్ళం నాన్నా! ఒక గిరిగీసి, ఆ గిరిలో పడేటట్లు అట్టముక్కల్ని విసరడం! కాని, ఏం లాభం? అది కాస్తా మరుగుగుంటలో పడి మునిగిపోయింది.

రాఘు: ఏం బావుండలేదు, భాస్కరం.

భాస్క: నిజమే! కాని ఆ ఆట ఆడడం మానేసి అప్పుడే నాలుగు నెలలయింది.

రాఘు: (చేతిలో చీటి మూస్తూ, బంగారు వంకకు తిరిగి) ఎట్లా వుంటాడు మనిషి.

బంగా: మనిషికేమండీ! మన ఒంగోలు కోడెలా వున్నాడు. అయితే యేం? మనిషేందో దిగులుగా, సినిమాలో హీరో ఏడుస్తున్నాడండీ.

భాస్క: ఆపరా బంగారూ, నీ అలంకారాలు! వీటిని వింటే ప్రబంధకవులు ఆమాంతం గుండెలు బాదుకుంటారు.

రాఘు: ఆఁ!........వుత్తరం అదేనంటావా? లేక పొరపాటు పడ్డాడా?

బంగా: ఆయన ఆచ్చంగా తన నోటితో సెబితేనే!

భాస్క: పోనీ, మళ్ళీ రాయమనగూడదూ?

రాఘు: (విసుగుతో) ఆఁ –

బంగా: కాని, ఆ అమ్మాయిగారు –

భాస్క: ఎవరు?

బంగా: అదేనండీ! ఆయనగారితో రాలా, ఓ అమ్మాయిగారు –

భాస్క: మాకేం తెలుసురా? వచ్చిందా?

బంగా: ఆఁ! వచ్చిందండీ...ఆవిడగారు ఏడుస్తోంది.

భాస్క: (ఆదుర్దాగా) ఏడుస్తోందా?...ఎన్నేళ్ళుంటాయ్?

బంగా: సిన్నదేనండీ.

భాస్క: అంటే పదేళ్ళుంటాయా?

బంగా: పెద్దదేనండీ.

భాస్క: అంటే, ఓ యాభైయ్యేళ్ళుంటాయా?

బంగా: కాదు బాబూ.....ఓ ఇరవై –

భాస్క: ఇరవై!.....అందగా వుంటుందా?

బంగా: కొరుక్కు తినొచ్చునండి.

రాఘ: ఏడిశావుగాని, బెల్ కొట్టగానే వాళ్ళను లోపలకు తీసుకుని రా.

బంగా: సిత్తం..

భాస్క: బంగారు! ఇహ నెప్పుడూ ఉత్తరాలిచ్చి నోరు తెరుచుకు నిలబడకు...తెలిసిందా?

(బంగారు నవ్వడానికి ప్రయత్నం చేసి, విఫలుడౌతాడు. మొహం పాలిపోతుంది)

ఏమిటి బంగారు అలా అయిపోయావు?

బంగా: అబ్బే!..ఏముంది?...ఏమీ లేదండి (అంటూ వెళ్ళిపోతాడు)

భాస్క: బంగారు అలా వున్నాడేం నాన్నా?

రాఘ: భాస్కరం ఆ సంగతి అలా వుంచు..నిన్ను చూస్తేనే నాకు కోపం ముంచుకు వస్తుంది.

భాస్క: సహజమేననుకోండి....

రాఘ: ఇప్పుడు వినోదరావు కేమని చెప్పాలి?

భాస్క: వినోదరావు కాదు నాన్నా? ఆనందరావు.

రాఘ: అదే! ఆయనకేమని చెప్పాలి? 'మా వుత్తరం చదవ లేదండి...మా వాడు ఓ ఘనకార్యం చేశాడు' అనాలి.

భాస్క: ఎందుకు?

రాఘ: ఎందుకేమిటి? ఆయన మన దగ్గరకు ఎందుకు వచ్చాడో మన కేమీ తెలియదని ఒప్పుకోవాలి కదా!

భాస్క: (ఆలోచిస్తూ) ఆ మాత్రం తెలుసుకోలేమా?

రాఘ: (కొంచెం ఆశ్చర్యంగా) నువ్వు తెలుసుకోగలవా?

భాస్క: రెండూ, రెండూ కలిపితే ఎంత అవుతుందో ఇంకా నేర్పాలా నాన్నా?

రాఘ: అంత తెలివిగలవాడవయితే ఈ కేసు న్వు నడుపు. చూస్తాను....ఇది నీకు మొదటి కేసు!

భాస్క: (ముందు కొంచెం బిత్తరపోయినా, తెప్పరిల్లుకుని) అలాగే!......తప్పకుండా....(తరువాత, ధైర్యంగా) వాళ్ళు లోపలకు వచ్చిన రెండు నిమిషాల్లో వాళ్ళు ఎవరో, ఎందుకు వచ్చారో తెలుసుకుంటాను, చూడండి.

రాఘ: (పేవలంగా నవ్వుతూ) చిన్నవాళ్ళ దగ్గర నుంచి నేర్చుకోవడానికి నేనెప్పుడూ సిద్ధమే! అయితే, ఆ మాత్రం మేమూ కనుక్కోగలం!

భాస్క: ఎలా?

రాఘ: వాళ్ళనే అడిగితే సరి.

భాస్క: ఆ మాత్రానికే నేను యూనివర్సిటీకి వెళ్ళి, వున్నదానికి మరో తోక తగిలించుకురావడం దేనికి?

రాఘ: భగవంతుడికి తెలియాలి...సరే, వాళ్ళను పిలవమంటావా?

భాస్క: (కుర్చీలో నుంచి లేచి, తనను తాను సర్దుకొని) యస్...

రాఘు: (బెల్ కొట్టబోయి, ఆగి) ఆ వచ్చినావిడ పేరు కూడా మనకు తెలియదు కదా!

భాస్క: నేను కనుక్కుంటానుగా, చూడండి.

రాఘు: పెళ్ళయిందా?

భాస్క: అదే తెలుస్తుంది..మనకు తెలిసినదల్లా ఆవిడ చిన్నదని అందగత్తె అని, ఏడుస్తోందని – ఆవిడకు పెళ్ళి అయివుంటేపా ప్రక్కనున్నాయన ఆవిడ భర్త అయివుంటే, భర్త ప్రక్కన వుండి కూడా ఆవిడ ఏడవవలసిన పని ఏమిటి?

రాఘు: వున్నందుకేనేమో?

భాస్క: అందుకయితే ఇంతదూరం ఎందుకు వస్తుంది? ఒక వేళ పెళ్ళి కాకపోతే ఈయన ప్రియుడైనా, అన్నయినా కావచ్చు......ఇంతకూ ఆ అమ్మాయి విషయంలోనే వచ్చారని మాత్రం నాకు తోస్తోంది.

రాఘు: బృహస్పతి దిగి వచ్చాడయ్యా! (బెల్ కొడతాడు)

(మరుక్షణంలో ఓ యువకుడు, ఆయనకు అంటుకుపోయిన ఓ యువతి లోపలకు వస్తారు. ఇద్దరూ భయపడుతున్నారు. యువకుడి మొహం పాలిపోయి వుంటుంది. అతను లోపలి ఆతురతను అణుచుకోవడం కోసం, అనుక్షణం దీర్ఘంగా నిట్టూర్పులు విడవడం వినిపిస్తుంది. ఆవిడ విచారం యింకా తగ్గినట్లు లేదు. ఏడవడం వలన ఏర్పడిన చెదిరిన ముంగురులు, చెరిగిన కాటుక మాత్రం మనకు కనిపిస్తూ వుంటయ్)

భాస్క: రండి ఆనందరావుగారూ! వీరు మా నాన్నగారు (ఆనందరావు ఆయనకు నమస్కరిస్తాడు. రాఘవయ్యగారు ప్రతినమస్కారం చేసి వూరుకుంటాడు) వారు లాయరే!...అయినా ఈ కేసు నేను చూస్తున్నాను.

ఆనం: (తప్పు చేసినవాడిలా భయపడుతూ) నా ఉత్తరం అందిందనుకుంటాను.

భాస్క: (కొంచెం తడబడుతూ) అవును...అందింది.

ఆనం: దానిలో అన్ని విషయాలు వివరంగా...

భాస్క: అవునవును...అవన్నీ నాకు జ్ఞాపకం వున్నయ్....కూర్చోండి (సుశీల వంక ప్రత్యేకంగా చూస్తూ) కూర్చోండి...ఆ...మీ పేరు....మీ పేరు మరిచిపోయాను.

రాఘు: నువ్వు అడగనే లేదుగా భాస్కరం!

(భాస్కరం దీనికి కొంచెం విసుగుదల కనబరుస్తాడు)

ఆనం: క్షమించండి...మరచిపోయాను. ఈవిడ సుశీలా ఆనందరావు....నా భార్య.

(భాస్కరం తెల్లమొహం వేస్తాడు, ఓ క్షణం పాటు కనిపించకుండా నవ్వుకుంటాడు రాఘవయ్యగారు)

భాస్క: (తెప్పరిల్లుకుని) అలాగా! చాలా సంతోషం. కూర్చోండి సుశీలా దేవిగారూ!

(సుశీల సిగ్గుపడుతూ కూర్చుంటుంది)

ఆనం: సుశీల ఈ విషయమై కొంచెం ఆదుర్దాగా వున్నదండి.

భాస్క: ఉండదుటండీ మరి!..(స్టేజి ఒక చివరకు వెళ్ళి) అందులోనూ ఈ విషయాలున్నాయ్ చూడండి – తాత్కాలికంగా చాలా బాధగా వుంటయ్.....కాని, క్రమంగా మరచిపోతాంలెండి.

సుశీ: అదే ఆనంద్ కూడా అంటున్నాడండి....కాని, నాకే – ఎందువల్లనో – (తలవంచి, మెల్లగా) అయినా మా పెళ్ళయి సంవత్సరం కాలేదు.

భాస్క: అవుననుకోండి....అసలు అందువల్లనే –

ఆనం: (మాట మార్చడానికి ప్రయత్నం చేస్తూ) ఆ!..మీ ఫీజు! తక్కువేననుకొంటాను.

భాస్క: నాకు మాత్రం చాలా తక్కువే అనిపిస్తోందండి.

ఆనం: నాకు చాలా ఎక్కువనిపించిందండి.

భాస్క: అంటె, అంతకంటె ఎక్కువ –

ఆనం: అబ్బే!

భాస్క: (అయిష్టంగానే) సరే!

సుశీ: నాకూ చాలా ఎక్కువనిపించిందండి.

భాస్క: (దెబ్బతిని) ఓ!

ఆనం: ఈ చిన్న విషయానికి ఇంత డబ్బు అనవసరమని సుశీల ఉద్దేశ్యం.

భాస్క: సరే! కానివ్వండి...అయితే, ఒక విషయం మనం ముందు ఆలోచించుకోవాలి. ఈ పరిస్థితుల్లో కేవలం సుశీలదేవిగారినే ముఖ్యంగా తీసుకుని, ఆవిడ మీదనే ఆధారపడడం బావుండదు!...అందువల్ల మనం మరో మార్గమేదయినా –

ఆనం: (బిత్తరపోయి) మరో మార్గం ఎందుకండి? అంతా ఆ వుత్తరంలో వున్నట్లుగా చేస్తే సరిపోదు?

భాస్క: అహ....సరిపోదని కాదు –

సుశీ: ఆనంద్!.......(కంటతడి పెడుతుంది)

ఆనం: (ఓదార్చడానికి, బుజం మీద తడుతూ) ఊరుకో, సుస్.

భాస్క: (మరొక త్రోవకు పోయి) నాకు చాలా విచారంగా వున్నది సుశీలదేవి గారూ! (ఆనందరావు వంకకు తిరిగి) కాని సభ్యత గల స్త్రీకి ఇటువంటి ప్రచారం జరగడం –

ఆనం: (ఆశ్చర్యంతో) ప్రచారం! ప్రచారం ఏమిటండీ?

భాస్క: అదే!....ఆవిడ విషయంలో మనం వ్యక్తుల పేర్లను మిగిలిన విషయాలు మాట్లాడుకోవడం బావుంటుందేమో?

ఆనం: పేర్లు!

సుశీ: (ఇంకా ఏడుస్తూనే) నేనేం చేస్తాను! నేను అంతగా ప్రేమిస్తున్నాను!

భాస్క: (సుశీలతో) అయితే, క్షమించి విడిచి పెడదామంటారా?..విషమంగా వున్న పరిస్థితుల్ని సౌమ్యంగా అతికే అవకాశం లేదంటారా?

ఆనం: (కోపంతో) ఏమిటండీ మీరంటున్నది?

రాఘు: (ఇంతవరకూ ఆనందించినా, ఇక తట్టుకోలేక) అవును భాస్కరం, ఏమిటి నువ్వంటున్నది?

భాస్క: అదే! (ఆనందరావు దగ్గరకు వెళ్ళి) చూడండి ఆనందరావుగారు! ప్లీడర్లకు మీరు విషయాలన్నీ వివరంగా చెప్పకపోతే, మేం కేసులు నడిపించడం కష్టమండి.

ఆనం: కేసంటారేమిటి?..నేనేం కోర్టు పక్షిననుకున్నారా?

భాస్క: అంటే కేసేమీ లేదా?

ఆనం: నాకు తెలిసినంతవరకు లేదు.

సుశీ: మీరు అనే కేసు ఆనంద్ మీద కాదుగదా! అతను దేవత!

భాస్క: (తప్పుచేసింది ఆవిడైనా కావచ్చునని అనుమానపడి) అయితే, అది మీరు.

సుశీ: (బెదిరిపోయి) నేనా! ఏమిటి నేను?

ఆనం: (కోపంతో, అరుస్తూ) దీని అర్థం ఏమిటి?

భాస్క: అర్థమా! (తాపీగా కూర్చుని, ఏడుస్తున్న సుశీలవంక చూపుతూ) తప్పంతా ఈవిడదేనని నేను కలలో కూడా అనుకోలేదు. నాకు చాలా బాధగా వుంది. నేను కేసులో పనిచెయ్యలేను.

(కొడుకు ఆత్మవిశ్వాసాన్ని చూసి రాఘవయ్యగారికి ఏడుపూ, నవ్వూ కూడా వచ్చినయ్. సుశీల బెదిరి ఒకర్ని విడిచి ఒకరివంక చూస్తూ వుంటుంది)

ఆనం: (కుర్చీలో కూలబడుతూ) ఏమిటి!

రాఘు: (గొంతు సవరించుకొని) అయితే, ఈ కేసు నేను తీసుకుంటాను.

ఆనం: (రాఘవయ్యగారి దగ్గరకు వెళ్ళి) మీ అబ్బాయి నన్ను అవమానపరిచాడు. దీనికి ముందు సంజాయిషీ-

సుశీ: (లేచి, ఆనందరావు మీదకు వాలిపోయి) ఎందుకు ఆనంద్? పద, వెళ్ళిపోదాం....

రాఘు: (వారిస్తూ) ఒక్క మాట ఆనందరావుగారూ! మీ ఉత్తరం నేను చూడలేదు కనుక అసలు విషయమేమిటో నాకు చెప్పగలరా?

ఆనం: నా వీలునామా తయారు చెయ్యడానికి మీకు వీలుంటుందేమో తెలియచేయవలసిందని వ్రాశాను.

భాస్క: వీలునామా!.....అంతేనా?

ఆనం: అంతే!

రాఘు: ఇప్పుడంతా తెలిసింది కదూ భాస్కరం!

భాస్క: మరి సుశీలాదేవిగారు ఆదుర్దాకు కారణం?

ఆనం: వీలునామా, నా మరణాన్ని ముందుకు తెస్తుందని సుశీలకు భయం

(సుశీల మళ్ళీ ఏడుపు మొదలు పెడుతుంది. 'సుస్' అంటూ వారిస్తాడు ఆనంద్)

భాస్క: అదా!

ఆనం: ఇదంతా వుత్తరంలో వున్నది కదండీ!

రాఘు: (నవ్వుతూ) ఏమంటావు భాస్కరం?

భాస్క: ఏముంది?...నాకు మాత్రం చాలా విచారంగా వుంది. (ఇంతలో ఏదో ఆలోచన తట్టినట్లుగా వుంది. రాఘవయ్యగారి వంకకు తిరిగి నవ్వుతాడు)

నా కిప్పటికీ ఆశ్చర్యంగా వుంది. మీ పేరు యస్. విమలానందరావుగారు కదూ?

ఆనం: కాదండీ! ఒట్టి ఆనందరావునే! ఎ. ఆనందరావు.

భాస్క: ఎ. ఆనందరావు గారా!...చూశారా, నాన్నా! మనం ఎలా పొరపాటు పడ్డామో?

(ఈ సర్దుకున్న పద్ధతిచూచి రాఘవయ్య సంతోషిస్తారు)

భాస్క: సంగతేమిటండే సుశీలాదేవిగారూ! ఇవ్వాళే మేం యస్. విమలానందరావుగారని – ఆయన కోసం చూస్తున్నాం. ఆయన వస్తానని వ్రాశారు...ఆయన, ఆయన భార్య విషయంలో ఏదో మాట్లాడాలన్నారు.

సుశీ: ఎంత భయపెట్టారు!

భాస్క: భయంకాదుటండీ మరి! (ఆనందరావుతో) క్షమించండి..మా వృత్తిని దృష్టిలో పెట్టుకుని అంతకంటె ఎక్కువ చెప్పటేం, చూడండి.

ఆనం: మేము మాత్రం అడుగతామా?...కాని నేను కూడా ఉత్తరం వ్రాశానే!

భాస్క: వ్రాసి వుండొచ్చు....వీలునామాను గురించేనా? (అవునని తల తిప్పుతాడు ఆనంద్) అవి నాన్నగారు చూస్తారు...ఇప్పటికేనా ఉత్తరం సంగతేమైనా జ్ఞాపకం వచ్చిందా నాన్నగారూ?

రాఘు: ప్చ్....అందడం లేదు.

భాస్క: అరె! తమాషాగా వుందే.......అయితే మీరు సరిగ్గా చూచివుండరు.

రాఘు: (కొడుకు వంక తృప్తిగా చూస్తూ) కావొచ్చు....ఆ! ఇప్పుడు చెప్పండి ఆనందరావుగారూ!....మీరు వచ్చిన విషయం –

భాస్క: (లేచి) నాన్నా! ఇక నేను వుండనక్కర్లేదు కదూ!

రాఘు: అవసరం లేదు.....నువ్వు హాయిగా క్లబ్‌కు వెళ్ళి నీ బిలియర్డ్స్ ఆడుకో...వెడుతూ, వెడుతూ బంగారాన్ని పంపించు...(ఆనందరావు, సుశీలతో) మా వాడు ఇవ్వాళే మొదటి కేసు నడిపించాడు.

(భాస్కరం ఏమీ ఎరగనట్లుగా, పేపర్లు సర్దుతూ వుంటాడు)

ఆనం: కేసులో గెలుపు వారిదేనేమో?

రాఘు: అనొచ్చు....మొదటంతా పద్మవ్యూహంలా తయారు చేసుకున్నాడు. కాని, దాని నుంచి తెలివిగా మటుకు బయటకు వచ్చాడు....ఫరవాలేదు భాస్కరం!......నువ్వు మంచి లాయరువవుతావు.

భాస్క: థాంక్స్......(వెళ్ళిపోబోయి, మళ్ళీ లోపలకు వచ్చి) వస్తాను ఆనందరావుగారూ! క్షమించండి... సుశీలాదేవిగారూ! మీరూ క్షమిస్తారు కదూ!

రాఘు: అందరూ ఏకంగా క్షమిస్తారు వెళ్ళిరా.

భాస్క: నమస్తే. (ఆనందరావు ప్రతి నమస్కారం చేస్తాడు)

రాఘు: ఆ! ఇప్పుడు చెప్పండి ఆనందరావుగారూ! (ఆనందరావు, సుశీల చాలా దగ్గరగా కూర్చొని వుంటారు. రాబోయే గాలివానకు తట్టుకొనడానికి తయారు తినేవాడిలా వున్నాడు ఆనందరావు)

ఆనం: నా వుద్దేశ్యం....వీలునామా అంతా ఒక్క వాక్యంలో వుంటే సరిపోతుందనండీ.........“నాకు చెందిన ప్రతి వస్తువూ నా మరణానంతరం నా భార్యపరం కావాలి”

రాఘ: దానికేం! అందంగానే వుంది! ఇంతకంటె చెత్తగా వున్న వీలునామాలు నేను లక్షలు రాశాను.

(సుశీల ఉద్రేక పడుతుంది)

ఆనం: (ఉద్రేకంలో నిట్టూర్చే సుశీలను వారిస్తూ) అలా మాటి మాటికీ వుద్రేకపడకు సుస్.

సుశీ: (అంత బాధలోను) ఆ మాటలు చూడు – ‘నా మరణానంతరం’...అవెందుకు చెప్పండి లాయరు గారూ!

రాఘ: ఆ మాటలు లేకుండానే నేను వీలునామా తయారు చేస్తానమ్మా.

సుశీ: (త్వరగా) బావుందండి అలా చెయ్యండి.

రాఘ: (ఆనందరావుకేసి తిరిగి) అయితే, ఇటు వంటి న్యాయసమ్మతమైన వీలునామాల్లో, ఏ విధవకు ఆస్తి చెందుతుందో –

(సుశీల నోట్లో చీర కుక్కుకుంటుంది. ఆనందరావు ఓదార్చక తప్పదు కదా!)

ఆనం: సుశీలా! –సుస్– (రాఘవయ్యగారి వైపు తిరిగి) ఆ (విధవ’ అనే మాటలేకుండా చెయ్యండి లాయరు గారూ!

రాఘ: అలాగే! అలాగే!! ఈ ముసలివాడికి ఆ విషయం జ్ఞాపకం లేదమ్మా. వూరుకో – (సుశీల మామూలు మనిషై, చిన్నగా నవ్వుతుంది. బంగారు వస్తాడు)

బంగారు మూడు కాఫీ తీసుకురా! (బంగారు వెడతాడు) ఆ......మీరు చెప్పే విషయాలు రెండూ వ్రాసుకుంటాను (కలం, కాగితం తీసి, వ్రాస్తూ) నాకు తెలిసినంత వరకు ఈ కేసులో వున్న విషయాలు ఇవి ఆనందరావుగారూ! ఇప్పుడే యౌవనంలో అడుగు పెట్టినప్పటికీ, జీవితం శాశ్వతం కాదని –

సుశీ: (వెనకటి వలెనే) ఓ!

రాఘ: (తట్టుకొని) మనల్ని పెద్దవాళ్ళు దీవించేటప్పుడు ‘శతమానం భవతి శతాయుః....’ అంటారు. అంటే, మనిషి వయస్సు మనదేశంలో వంద సంవత్సరాలన్న మాట. ఆనందరావుగారు అన్నేళ్ళూ తప్పకుండా వుంటారు – కనీసం మీ ప్రేమకోసమైనా వుంటారు. అయినా, వీలునామా పత్రాన్ని ఇప్పుడే తయారు చేసి వుంచడం మంచిదని. కేవలం పత్రాన్ని మాత్రమే – ఆయన అభిప్రాయం.

సుశీ: సరే!

రాఘ: అమ్మయ్య! ఇప్పుడు కొన్ని వివరాలు చెబుతారా, ఆనందరావు గారూ!

ఆనం: అడగండి.

రాఘ: ముందు మిమ్మల్ని గురించి చెప్పండి.

ఆనం: ‘నా’ అనే వాళ్ళెవ్వరూ నాకు లేరండి. (సుశీల జాలిగా చూస్తుంది) అదే! ఒక నా సుస్ తప్ప......నివాసం... సుశీలా సదనం, సత్యనారాయణపురం!

సుశీ: (అదేదో అందరికి తెలిసినదన్నట్లుగా) అవునండి. మేం అక్కడే ఉండడం.

ఆనం: ప్రస్తుతం నేనిక్కడ ఒక పెద్ద కంపెనీలో గుమాస్తాగా ఉంటున్నాను. ఆంధ్రదేశంలో పెద్ద కంపెనీ అదేనండి.....సంవత్సరానికి 20 లక్షలు లాభాలే పంచిపెడుతుందండి అది.

రాఘు: అవునవును. నాకు తెలుసు.......అయితే వ్యక్తిగతమైన రాబడి ఏమైనా ఉందా?

(ఆనందరావు, సుశీల 'ఈ ప్రశ్న ఏమిటా' అని ఒకళ్ళనొకళ్ళు ప్రశ్నార్థకంగా చూసుకుంటారు)

ఆనం: అబ్బే! ఏమీ లేదండి.

రాఘు: (వ్రాసుకున్న విషయాలను పరిశీలిస్తూ) ఇది చిన్న వీలునామానే అవుతుంది.

ఆనం: (అపార్థం చేసుకొని కాబోలు) నాకు వచ్చేది కొంచెం ఎక్కువేనండి.

రాఘు: (ఆసక్తితో) ఎంతో?

సుశీ: సంవత్సరానికి బోనస్ కాక, పదిహేను వందలు వస్తయ్.

రాఘు: బావుంది.....మీ ఇద్దరేగా!

ఆనం: నెలకు ముప్పై రూపాయల దగ్గర మొదలు పెట్టానండి. జీవితం...అయితేనేం? ప్రతి సంవత్సరం ఇంక్రిమెంట్లు బాగానే ఇస్తున్నారు. ఈ యేడు ఒక్కసారి ఇరవై రూపాయలిచ్చారు.

రాఘు: పనిచేస్తున్నావ్.....ఇస్తున్నారు.

(ఏకవచన ప్రయోగాన్ని గుర్తిస్తాడు ఆనందరావు. దానికి సంతోషించినట్లే కనబడతాడు)

ఆనం: అయితే, నాకొక ఆశయం మాత్రం వున్నదండి.

సుశీ: (ఆనంద్ కొంచెం సేపు ఆగడం చూచి) ఫరవాలేదు ఆనంద్! ఆయనకు చెప్పు.

ఆనం: (కొంచెం బిడియంగా) ఈ సంవత్సరం చివరకు 3550 రూపాయలు నిలవచెయ్యాలని వుంది.

సుశీ: (గర్వంగా) అంటే రోజుకు పదిరూపాయలన్న మాట.

రాఘు: (వాళ్ళ అభిలాషకు ఆనందిస్తూ) బావుంది. తప్పకుండా చెయ్యగలవు.

ఆనం: నాకూ ధైర్యం వుంది...కాని మొన్ననే ఇంట్లోకి కావలసిన సామాన్లు మింగినయ్ చాలా డబ్బు.

రాఘు: డబ్బు మింగేవే అవి!

సుశీ: ఉన్న వాటిలో మంచిరకమే మన ఇంట్లో ఉండాలంటాడు ఆనంద్. ఒక్కసారి నా గది చేస్తేనా –

రాఘు: (ఆనందాన్ని తెలుపుతూ) అవును.......

ఆనం: అయినా, మాకు ఒక్క చిల్లిగవ్వ కూడా అప్పులేదు. ఇప్పటికే రెండు వేలు బాంకులో ఉంది.

రాఘు: అదృష్టవంతుడివి...నువ్వు తప్పకుండా ముందుకు పోగలవు....

సుశీ: ఆనంద్ అంటే ఆఫీసులో అందరికి ప్రాణమండీ!

రాఘు: నీకు! పంచప్రాణాలు! అవునా?

(ఇద్దరూ సిగ్గుపడతారు)

ఆనం: నేను అయిదు వేలకు ఇన్స్యూర్ కూడా చేశాను.

రాఘు: మరీ బావుంది...ముందే మేలుకున్నావు.

ఆనం: కృష్ణ ఒడ్డునే ఓ బంగళా, ఓ కారు – కనీసం ఇవైనా సుశీలకు వదిలి వెళ్ళాలని నా ప్రయత్నం.

రాఘ: ఏమో! నీ ప్రయత్నం ఫలించ కూడదని ఎక్కడ వుంది?

సుశీ: (బాధతో) ఓ!

రాఘ: అనుకోకుండా వచ్చేసిందమ్మా! ఏమీ అనుకోకు.

సుశీ: కార్లు, బంగళాలు ఎందుకండీ నాకు, ఆయన లేకుండా?

రాఘ: నిజమే నమ్మా, నిజమే! ఆయన అనే దేమిటంటే – ఆయన మరణానంతరం....అది సంభవిస్తే – 3ఆయనకు చెందిన ప్రతి వస్తువూ నీకే రావలని.

ఆనం: (అనుకోకుండా) అవును..అదే నా వుద్దేశ్యం.

సుశీ: (అప్రయత్నంగానే) కాదు.

ఆనం: అవును.

సుశీ: కాదు.

(రాఘవయ్య ఇద్దరి వంకా ఆశ్చర్యంగా చూస్తూ వుంటాడు. ఇంతలో బంగారు మూడు కాఫీలు తెస్తాడు)

రాఘ: (ఇద్దరికీ కాఫీ యిస్తూ) తీసుకోండి.

ఆనం: థాంక్స్...తీసుకో సుస్.....ఈ విషయంలోనే మా యిద్దరి మధ్య ఓ చిన్న అభిప్రాయభేదం వచ్చిందండి.

సుశీ: మీరు పెద్దలు కదా, మీరు చెప్పండి.

(రాఘవయ్య ఒప్పుకుంటున్నట్లు తల తిప్పుతాడు)

ఆనం: నాకు ఇద్దరు అక్కయ్యలు ఉన్నారు – పినతండ్రి పిల్లలు – వాళ్ళకు కాస్తో – కూస్తో ఇప్పుడూ సహాయం చేస్తున్నా మనుకోండి. వీలునామాలో ఎలా చెయ్యగలం చెప్పండి?

రాఘ: నువ్వు ముందు నీ భార్య సంగతి ఆలోచించాలి?

ఆనం: కాని, ఆవిడే వాళ్ళకు ఒక్కొక్కళ్ళకు వందరూపాయల చొప్పున వదిలి వెళ్ళాలంటుంది.

సుశీ: (దృఢంగా) కాదు. రెండు వందలు.

ఆనం: వంద.

సుశీ: కాదు ఆనంద్. రెండు వందలు.

రాఘ: పోనీ, నూటయాభై.

సుశీ: కాదండీ, రెండు వందలూ ఇవ్వవలసిందే.

ఆనం: సరే! సుశీల యిష్టమే కానివ్వండి......ఇవిగో, వాళ్ళ పేర్లు, అడ్రసులు –

రాఘ: (తీసుకుంటూ) ఇంకేమైనా......

ఆనం: అంతేనండి.

సుశీ: ఆ ఇంటివాళ్ళనేం చేశావ్ ఆనంద్? (రాఘవయ్యతో) చదువుకొనే రోజుల్లో అక్కడ వుండేవాడండి.. వాళ్ళెంతో మర్యాదగా చూశారు......ఎంతో మంచిగా వున్నారు.

ఆనం: నిజమేననుకో...కాని –

సుశీ: యాభై రూపాయలు – (రాఘవయ్య వంక చూస్తుంది)

రాఘ: అంతటితో నీ జాబితా పూర్తయితే, ఈ వద్దు నా కభ్యంతరం లేదు. (ఆనంద్ ఇచ్చిన కాగితాన్ని పుచ్చుకుని, లేచి) చూడు ఆనంద్! రేపు – ఈ వేళకే – మీరు వస్తే వీలునామా మీ చేతికిస్తాను.

సుశీ: (అయిష్టంగానే) అది కాదండీ! ఇవ్వాళతో అయిపోతే బాధ వదిలి పోతుందేమోనని.

ఆనం: ఇవ్వాళే పూర్తయ్యేటట్లు చూడలేరా?

రాఘ: దానికేం? ఎంతో సేపు పట్టదు. (గడియారం వంక చూసుకుంటూ) మీరు ఒక గంట అలా వెళ్ళి, భోజనం చేసురండి. ఈలోగా పూర్తిచేసి వుంచుతాను.

సుశీ: నన్నుమాత్రం ఏమీ తినమని అడగకు ఆనంద్!

ఆనం: నేనుమాత్రం తినగలనా?...ఆదుర్దాలో వున్నప్పుడు ఆకలి వెయ్యదు, చూడండి.

సుశీ: అట్లా షికారుగా, బజారుకు వెళ్ళొద్దాం.

రాఘ: ఈ రద్దీలో మొగుణ్ణి వెంటవేసుకుని తిప్పుతావా? చూసేవాళ్ళు కొంగున కట్టుకున్నావనుకుంటారు.

సుశీ: (సిగ్గుతో) కావచ్చు...కాని నాకు ఆనంద్ అంటే అంత యిష్టం.

రాఘ: అవును..నువ్వు కూడా అలాగే ఉండాలి ఆనంద్.....అందులోనూ పెద్దవాడివయ్యాక ఈ సంగతి బాగా జ్ఞాపకం ఉంచుకోవాలి.

ఆనం: ఆ భయం మీ కక్కర్లేదండి (సుశీలను చూసి ఆప్యాయంగా నవ్వుతాడు)

సుశీ: దయచేసి, ఈ వీలునామా కాపీని మాత్రం మాకు యివ్వకండి...అది ఇంట్లో లేకపోవడమే నాకు హాయి........వుంటే నిద్రపట్టదు.

రాఘ: అచ్ఛా! అలాగా!...ఓ గంటలో –

(బంగారు ఇంతవరకు నోరు తెరుచుకుని వింటున్నాడు, వాళ్ళు లేవడం చూచి, బయటి తలుపులు తీస్తాడు. వాళ్ళు ఒకరి చేతిలో ఒకరు చేయి వేసుకుని ఆనందంగా బయటకు వెడతారు. రాఘవయ్యగారు, కనిపించేటంత వరకు, వాళ్ళనే చూచి, తల పంకించి ఏవో రెండు విషయాలు ఓ కాగితం ముక్కమీద వ్రాసి.......)

రాఘ: ఇదుగో! ఈ కాగితం ఇంటిదగ్గర అమ్మాయిగారికివ్వు. కాగితాలు ఇస్తే, తీసుకురా!....(మళ్లీ వాళ్ళు వెళ్లిన వైపుకు చూస్తూ) బలే దాంపత్యం! బంగారు!

బంగా: సారూ!

రాఘ: ఏమంటావ్?

బంగా: (అతి సాధారణంగా) అవునండి.

రాఘ: ప్రేమకలాపాలు జీవితసుఖానికి నిలయాలు అందులోనూ వయసులో వున్నారా? –

బంగా: (విచారంగా) అవునండి.

రాఘ: (బంగారు వంక చూసి) అట్లా వున్నావేం బంగారు?

బంగా: (నవ్వడానికి ప్రయత్నిస్తూ) ఎట్లా ఉన్నానండి?

రాఘు: నీ హుషారంతా ఏమైంది?

బంగా: దానకేమండి...బాగానే వున్నానండి...(త్వరగా) ఇంటికి వెళ్ళొస్తానండి (వెళ్ళబోతాడు)

రాఘు: ఆగు! ఇటురా! ఎందుకు అలా వున్నావ్? ఇంకా ఆ విషయాన్ని గురించే బాదపడుతున్నావా? (బంగారు వాలకం అలానే వుంది) నొప్పి ఇంకా ఎక్కువయిందా?

బంగా: నొప్పి పెద్దగా లేదండీ...కాని తిప్పుతున్నట్లుగా ఉంది.

రాఘు: (ఓదారుస్తూ) నువ్వనుకున్నది కాదు బంగారు! (జబ్బు పేరు చెప్పదలుచుకోక) ఆ సంగతి ఏ మంచి డాక్టరయినా చెబుతాడు)

బంగా: నిన్న మన డాక్టరుగారే చెప్పారండి.

రాఘు: ఏమని?

బంగా: అది – అదేనండి! (వెళ్ళడానికి వెనుదిరిగి) నా పని అయిపోయింది బాబూ!

రాఘు: (దగ్గరకు వెళ్ళి) ఆయన చెప్పింది నిజమై వుండదు....మరో డాక్టరు దగ్గరకు వెళ్ళిరా.

బంగా: అక్కర్లేదు బాబూ! చలపతిరావుగారి కంటే మంచి డాక్టర్లున్నారా? – అయన చెప్పనే చెప్పాడు బాబూ! ఇంకా తొమ్మిది నెలలంట, మహాబతికితే!

రాఘు: (ఈ విషయం విని షాక్ తింటాడు, మరో మూలకు పోయి) పోనీ, ఆపరేషన్ చేయిస్తే?

బంగా: చాలా ఆలస్యమయిందట బాబూ! మొదట్లో ఎప్పుడో చేయించుకొని వుంటే, కూస్తంత ఆశ వుండేదంట!

రాఘు: ఇది నీకు ఎక్కువరోజులనుంచి లేదు కదా?

బంగా: నాకు తెలియకుండానే వుందంట బాబూ! చిన్నప్పట్నుంచీ – నాలో మచ్చగా, సూది మొనంత – ఉండి ఉండి, సరిగ్గా ఇప్పుడు – బతికి బట్టకట్టాల్సిన రోజుల్లో, ఇప్పుడు బయటపడ్డాదండి.

రాఘు: ఇంత ఎక్కువగా ఒక్కసారే ఎలా వచ్చిందంట?

బంగా: నాకూ తెలవదండి....కాని మనందర్లోనూ, మచ్చ మనకు తెలియకుండానే వుంటుందటండీ. నా మాదిరిగా జాగ్రత్త లేకుంటే, చివరకు –

రాఘు: కాదు, కాదు –

బంగా: కాదండీ బాబూ! డాక్టరు బాబు గారు అంత చెప్పినాక ఇంకా అనుమానమే! ఆయనయినా ఊరికే చెప్పారా? అరిచి మొత్తుకుంటే బయటపడ్డారు. 'రావలసిన జబ్బు కాదు' అన్నారండాయన....కాని వచ్చిందిగా! నా తరువాత నా పెళ్ళాం –

(చెప్పలేక బాధపడతాడు. రాఘవయ్యగారు ఓదారుద్దామని ప్రయత్నం చేస్తాడు. కాని చెయ్యలేకపోతాడు. ఇంతలో బంగారే తెప్పరిల్లుకుంటాడు.)

బంగా: వస్తా, బాబూ, వస్తా ఇంటికెళ్ళి కాగితాలు దెస్తా.

(త్వరగా వెళ్ళిపోతాడు)

(రాఘవయ్యగారు బంగారు వెళ్ళిన వైపుకే చూస్తూ, దీర్ఘంగా నిట్టూరుస్తూ వుండగా – తెర)

## రంగము 2

**(ఇరవైయేళ్ళ తరువాత)**

రంగాలంకరణ పూర్వం మాదిరే; కొద్ది మార్పులుమాత్రం చేయబడినయ్. ఇది వరకు లేని గాంధి, నెహ్రూ ఫొటోలు గోడలకు తగిలించబడినయ్.

కొత్త తివాసీ, టేబుల్‌మీద టెలిఫోన్. సాయంకాలపు వెలుతురు మసగ్గా లోపలకు వస్తుంది. భాస్కరం ఆలోచిస్తూ అటూ, ఇటూ పచార్లు చేస్తూ వుంటాడు. మనిషలో చిలిపితనం పోయి దర్జా కనిపిస్తుంది. తిరుగుతున్నవాడు ఆగి, ఫోన్ తీసి, మళ్లీ తనలో తాను వితర్కించుకొని, ఫోన్ కింద పెడతాడు. గది మూలకు వెళ్ళి లైటు వేస్తాడు. అనంతం వస్తాడు. అనంతం భాస్కరం దగ్గర కొత్త నౌకరు.

అనం: సుశీలా ఆనందరావుగారటండీ, ఆవిడొచ్చారు, మిమ్మల్ని చూడ్డానికి.

భాస్క: ఎవరు అనంతం? ఆనందరావుగారు కదూ?

అనం: కాదండి...సుశీలా –

భాస్క: ఓ! నేను ఆనందరావుగారి కోసం చూస్తున్నాన్లే...సరే! రమ్మను.

(అనంతం వెళ్ళిపోబోతాడు)

అనంతం! ఏమిటి ఆఫీసులో ఈ అనంతమైన అల్లరి?

అనం: గుమాస్తాలు బాబు! అంతా కుర్రకారు కదూ!

భాస్క: ఇక్కడ కుర్రకారు కావడానికి వీల్లేదు. ఒక వేళ కాదలుచుకుంటే, ఇక్కడ వుండడానికి వీల్లేదని చెప్పు.

అనం: అట్లాడేనండి......(వెళ్ళిపోతాడు)

(భాస్కరం టేబులు మీది పేపర్లు సర్ది డ్రాయర్లో పెడతాడు. సుశీల వస్తుంది. ఆవిడ వయసూ ముప్ఫై ఎనిమిది సంవత్సరాలు. దుస్తులు, అలంకరణ భాగ్యవంతురాలని చెబుతున్నాయి. సాధారణంగా ధనవంతులైన యువతుల్లో తరచూ కనిపించే ప్రయత్నం – పరిగెత్తే వయస్సును పట్టుకుని వెనక్కు నడిపిద్దామన్న – వృథాప్రయత్నం ఈవిడలోనూ కనిపిస్తుంది. ఇది వరకు కళ్ళల్లో కనిపించిన అమాయకత్వం ఇప్పుడు లేదు. తన స్థితికి గర్వపడుతున్నట్లు కనిపిస్తుంది. కాని అది ఎదుటవారిని హేళన చేసేందుకుమాత్రం కాదు.)

భాస్క: (లేచి) నమస్తే....రండి.....మీ రాక నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది సుశీలా దేవీ!..కూర్చోండి.

(సుశీల ప్రతినమస్కారం చేసి కూర్చుంటుంది)

మీరా దుస్తుల్లో ఉన్నప్పుడు చాలా బావుంటారు.

సుశీ: ఆ మాట చాలా మంది అన్నారు. (అని, నాలుక కొరుక్కుని) ఆ! ఎటూ కాని వేళ యీవిడ యిలా వచ్చిందేమిటీ అనుకుంటున్నార కదూ మీరు!

భాస్క: అబ్బే!...నిజంగా, నేను –

సుశీ: మీరు ఆనందరావు గారి రాకకోసం ఎదురు చూస్తున్నారు కదూ!

భాస్క: (ఏమీ అనలేక) ఆ.......(చెప్పవచ్చునో, కూడదోనని అనుమానం)

సుశీ: మీ లాయర్ల నటనలు ఆపండి, పుణ్యముంటుంది. ఆయన, ఇక్కడే మిమ్మల్ని కలుసుకుంటారని నాకూ తెలుసు. అందుకే నేనూ వచ్చాను.

భాస్క: (అమ్మయ్య అనుకొని) అంటే ఆయననను కలుసుకోవడానికి, ఆయనే మిమ్మల్ని ఇక్కడకు రమ్మన్నారా?

సుశీ: నేనన్నానా?..(పేవలంగా నవ్వుతూ) నేను రావడం ఆయనకు ఇష్టమని కూడా అనుకోను.

భాస్క: (పాలిపోయి) అలాగా!

సుశీ: ఆయన ఎందుకు వస్తున్నారో కూడా తెలుసు. మరో వీలునామా వ్రాయించడానికేగా?

భాస్క: (నవ్వడానికి ప్రయత్నం చేస్తూ) అయినా, మీ వీలునామా వ్రాయడం ఇదే మొదటి సారి కాదుగా?

సుశీ: కాదు, నాలుగోసారి!

భాస్క: ఎటువంటి జీవితం! ఒక మెట్టునుంచి, మరొక మెట్టు – ఉన్నతమైన అంతస్థు –

సుశీ: (తన దుస్తులు సర్దుకుంటూ, అతి సామాన్యంగా) అవును. మేము గొప్పవాళ్ళం అయినాం.

భాస్క: కాస్తా కూస్తానా! ఆంధ్రదేశం గర్వించదగ్గ అయిదారు కుటుంబాల్లోను ఒకటి మీది!

సుశీ: (మాట మారుస్తూ) సరే! భాస్కరంగారూ! క్రిందటి సారి వ్రాసిన వీలునామా సరిగ్గా లేదా?

భాస్క: (ఆలోచిస్తూ, సుశీలకు ప్రక్కగా వచ్చి) చూడండి సుశీలాదేవి! ఇటువంటి విషయాలు మీతో చర్చించడానికి నాకు అధికారం లేదు.....అయినా, ఆయన వుద్దేశ్యాలు ఏమిటో నాకు ఆవగింజలో అరవయ్యో వంతు కూడా తెలియవు.

సుశీ: అసలు వుద్దేశ్యాలంటూ వున్నయ్యా అని నా అనుమానం. (కిటికీ దగ్గరకు వెడుతుంది)

భాస్క: అలాగా!

సుశీ: అందుకే ఇప్పుడిక్కడకు వచ్చింది. ఆయన పొరపాటున ఏమైనా – (తలుపు తెరుచుకుంటుంది. అనంతం వస్తాడు)

అనం: ఆనందరావుగారు –

భాస్క: (త్వరగా) రమ్మను.

(ఆనందరావు వస్తాడు. మనిషి పూర్వం కన్నా కాస్త లావెక్కాడు. హుందాతనం దర్జా ఉట్టిపడుతూ ఉంటయ్.... ప్రపంచానుభవం తాలూకూ మడతలు పడ్డ నుదురు. చీటికీ మాటికీ తలపంకించి, ఓ క్షణం సేపు ఆలోచించే అలవాటు అతనిలో కొత్తగా కనిపించే విశేషం)

ఆనం: (వస్తూనే) హల్లో భాస్కరం గారూ! కులాసానా?...చూడండి, నా పని యెంత త్వరగా పూర్తిచేస్తే అంత మంచిది. కాలం డబ్బు వంటిదండి....డబ్బు వంటిది.

(ఇంతవరకు సుశీలను చూడడు. సుశీల మధ్యకు వస్తుంది. ఆవిణ్ణి చూసిన వెంటనే మూర్ఛపోయినంత పనై, చివరకు తెప్పరిల్లుకొని) సుస్!

సుశీ: నువ్వు నన్ను రమ్మనలేదు ఆనంద్.......అయినా, నేను వచ్చాను.

ఆనం: (బరువుగా) దానికేం?....చాలా బావుంది.

సుశీ: (ఓ ప్రక్కగా కూర్చుంటూ) నాకు తెలియనివ్వకుండా నువ్వు తయారు చేస్తున్న వీలునామా ఇదే ఆనంద్!

ఆనం: (తనను తాను నిలవదొక్కుకుని) ఎక్కువ మార్పులేం చెయ్యడం లేదు సుస్. లేకపోతే నీకు చెప్పకుండా మార్పిస్తానా? అదీ కాక దీనివల్ల నీకు కొంత భారం తగ్గిద్దామనుకొంటున్నాను.

సుశీ: అంటే?

ఆనం: అదే!...ఏ మనిషైనా తన వీలునామా వ్రాస్తున్నాడంటే తనకు జీవితంలో చివరి ఘడియలు వచ్చాయని తెలుసుకున్నాడన్న మాట! (భాస్కరం వైపు తిరిగి) ఏమంటారు?

భాస్క: చాలామంది ఉద్దేశ్యం అదే!

సుశీ: కాని మళ్ళీ ఈ తతంగం అంతా ఎందుకు? దానికి దీనికి ఏమిటి సంబంధం?

ఆనం: ఏమీ లేదనుకో –

సుశీ: ఇదంతా నీ పిచ్చి ఆనంద్...చీటికీ, మాటికీ నీకు డబ్బు ఎంత ఉందో చూసుకోవడం నీకు ఆనందమనుకుంటాను.

ఆనం: చూచుకోవడం కాదు. ఇచ్చివేయడం –

సుశీ: దానికేం? నువ్వు ప్రేమించిన వాళ్ళకు ఎలాగూ ఇస్తావ్?

(భాస్కరం డ్రాయర్లో నుంచి కాగితం తీస్తాడు)

ఆనం: (కొంచెం విసుగుతో) నేనిప్పుడే ఇవ్వడం లేదు...నేను ఆఖరు గడియల్లో ఉన్నట్లు మాట్లాడుతున్నావ్!

సుశీ: నేనా! అట్లా ఎప్పుడూ మాట్లాడేది నువ్వే!

భాస్క: (డ్రాయర్లో నుంచి తీసిన కాగితాలు ఇస్తూ) క్రిందటి వీలునామా కాపీ ఇది దీన్ని చదివిన తర్వాత మనం మరోటి వ్రాయడం బావుంటుందేమో?

ఆనం: అనవసరం.

సుశీ: ఎందుకండీ? దాని కాపీ మా యింట్లోనే వుందిగా? పైగా, దాన్లో ఏముందో మాకు బాగా తెలుసు.

ఆనం: (క్రిందటి వీలునామా చూపుతూ) దానిలో వున్న దానికంటే ఇంకా ఎక్కువే నేను ఇప్పుడు వదిలిపెడుతున్నాను...ఎంతో చెప్పుకోగలరా భాస్కరంగారూ?

భాస్క: ప్చ్.........ఊహకు కూడా అందడం లేదు.

ఆనం: అంతకంటె ముప్పైవేలు ఎక్కువ. మొత్తం లక్షా, ఎనభైవేలు.

సుశీ: అవి, వున్న నాలుగిళ్ళు, పొలాలు, స్థలాలు, తోటలు కాక! మీరు మా కొత్త ఇల్లు చూడలేదు కదూ! తప్పకుండా చూడాలి.

భాస్క: (మెల్లగా) అవును...విన్నాను.

(కొంచెం సేపు నిశ్శబ్దం. ఎవ్వరూ భంగపడడానికి ఇష్ట పడరు)

సుశీ: (చివరకు, మాటలను పెళ్ళగిస్తూ) చెప్పు, ఆనంద్! నన్ను ఈ భాగ్యాలన్నింటినుంచీ దూరం చెయ్యదలుచుకున్నావా?

ఆనం: లేదు, సుస్ లేదు నీకు ఇదివరకటి కన్న ఎక్కువే వస్తుంది.

సుశీ: అవును……ఇదివరకటి కంటె మనకు ఇప్పుడు ఎక్కువ వుంది కదూ!

ఆనం: (ఆవిడనుంచి ముఖాన్ని తిప్పుకుని) కాని…….(చెప్పడానికి జంకుతాడు)

సుశీ: ఊ! చెప్పు ఆనంద్….కాని – ఏమిట? అదంతా నాదేకదూ!

ఆనం: (చెప్పలేక, చెప్పక తప్పక, మొఖం పేలవంగా అయిపోయి) అదే! అక్కడ వీలునామాను కొంచెం సవరిద్దామనుకున్నాను.

సుశీ: ఇన్నాళ్ళుగా నా అనుమానం నిజమయిందన్న మాట! అందుకేనేమో నువ్వు ఇక్కడకు వచ్చింది……పోనీ, నువ్వు ఎందుకు సవరించాలనుకుంటున్నావో చెప్పగలవా, ఆనంద్?

ఆనం: అదే!……సవరించాలనుకోండం సహజమే కదా! ఇది నాలుగోసారి!

సుశీ: కాని ఈ సారి మార్చడం మాత్రం సహజం కాదు.

భాస్క: కాని చూడండి – అవతల పిల్లలున్నారు.

ఆనం: (తాను చెప్పదలచుకున్నది, భాస్కరం చెప్పినందుకు సంతోషిస్తూ) అదే – అదే నా వుద్దేశ్యం కూడా!

సుశీ: అంటే, నా పిల్లకు నేను డబ్బు ఇస్తానా, యివ్వనా అనే కదూ మీ అనుమానం! (ఆనంద్‌తో) ఇంతవరకు వాళ్లను పోషించడంలో నేనెప్పుడైనా పొరపాటు చేశానా ఆనంద్?

ఆనం: (ఆవిడను శాంతింప చెయ్యడానికి బుజం మీద చెయ్యివేసి, బుజ్జగిస్తూ) లేదు, సుస్ లేదు. (సుశీలతో విసుగుతో, విదిలించుకుని, కిటికీ దగ్గరకు పోయి నిలబడుతుంది)

ఆనం: నీకు వాళ్ళంటే మమకారం యెక్కువ..వాళ్ళకు నీ దగ్గర గారాబం ఎక్కువ. నువ్వు అతి ప్రేమవల్ల ఏం చేసినా వాళ్ళ జీవితాలు చెడిపోతాయ్.

సుశీ: అయితే, వీలునామా మార్చడం ఎందుకు?

ఆనం: అందుకే!….నేను వెళ్ళిపోయిన తర్వాత నువ్వు అనవసరంగా ఈ విషయాల్లో బాధ పడకుండా ఉండాలనే నా అభిలాష!

సుశీ: నా డబ్బును నేను జాగ్రత్త చేసుకోవడంలో నాకు బాధ ఏమిటి?

ఆనం: (ఇహ సహించలేక) కాని, ఇంతవరకు ఇది నా డబ్బే కదా!

సుశీ: నీ మనసులో నువ్వు వూహిస్తున్న దేమిటో నాకు తెలుసు ఆనంద్!

ఆనం: (తనలో తాను అనుకుంటున్నట్లుగా) ఇంత పెద్ద మొత్తం!

సుశీ: జనం ఇదంతా వింటుంటే ఏమనుకుంటారో తెలుసా? ఇదంతా నా స్వంతానికే వాడుకుంటానని నువ్వనుకుంటున్నావని అనుకుంటారు.

ఆనం: ఇంకా ఏమనుకుంటారో తెలుసా?…నేను వచ్చే వారమే చచ్చిపోతానని నువ్వనుకుంటున్నా వనుకుంటారు.

(నిజానికి ఆనంద్ ఆలోచించి ఆ మాట అనలేదు. ఆవేశంలో అన్నాడు. అయినా ఫలితం మామూలే)

సుశీ: ఓ!

ఆనం: నేనదేమిటంటే (తనలో అనుకుంటున్నట్లు) గుడ్ గాడ్! ఇదంతా నువ్వు ఏదో ఓ వ్యాపారంలో పెట్టి నష్టపోతావనుకో! (డబ్బే తన కిప్పుడు సర్వస్వం అయినట్లుగా) భాస్కరంగారూ! ఇంత కష్టపడి, స్వహస్తాలతో సంపాదించిన డబ్బు ఏ వ్యాపారంలోనో చిల్లి గవ్వ లేకుండా పోవడం తలచుకుంటే, చచ్చిపోయిన తర్వాత కూడా నేను శాంతంగా వుండలేనని పిస్తున్నది.

(భాస్కరం తల మాత్రం తిప్పి, చేతికో కాగితం ఇస్తాడు)

సుశీ: నువ్వు నిన్ను గురించే ఆలోచించుకుంటున్నావు కాని, పిల్లల్ని గురించి ఏమీ ఆలోచించడం లేదు, ఆనంద్.

ఆనం: కావేకాదు.

భాస్క: (అగ్నిలో ఆజ్యం పోసినట్లు) ఆ, అన్నట్లు, మీ పిల్లలు కులాసానా?

సుశీ: గొప్పలు చెప్పడం కాదు. కాని, వాళ్ళను చూస్తేనే చాలండి..రామం ప్రిన్సెస్ కాలేజీలో చదువుతున్నాడు. ప్రిన్సెస్ కాలేజి వంటిది ఇండియాలో ఒక్కడే ఉందండీ!

భాస్క: బాగా చదువుకుంటున్నాడనుకుంటాను!

ఆనం: భూనభోంతరాళాలు బద్దలు చేస్తున్నానని మాత్రం ఉత్తరాలు వ్రాస్తున్నాడు. వాడికి వున్న ఇద్దరు స్నేహితులూ మహారాజుల కొడుకులేనట! మొన్న ఆదివారం వాడు వాళ్ళు ముగ్గురూ తప్పతాగి క్లాసులోకి వచ్చారట! మరి ప్రిన్సెస్ కాలేజీ కదూ! అటువంటి కాలేజీ ఇండియాలో అదొక్కటే! ఇంతా చేస్తే వాడికెన్నేళ్ళో తెలుసా? పందొమ్మిది!

సుశీ: నువ్వలాగే చెబుతావులే ఆనంద్.

భాస్క: మీ అమ్మాయి........ఎప్పుడో చూశాను. ఈ సరికి పెద్దదయి వుండాలి.

(ఆనంద్, సుశీల – ఒకరినొకరు సంతృప్తితో చూసుకుంటారు)

సుశీ: భాస్కరంగారికి చెప్పొచ్చు ఆనంద్.

ఆనం: రేఖకు పెళ్లిచేద్దామని ఆలోచిస్తున్నాం భాస్కరంగారూ! మన –

సుశీ: పేర్లెందుకులే ఆనంద్!

ఆనం: అవును....అక్కర్లేదు....ఏమైతే నేం? అమ్మాయి యిహ మనింట్లో వుండదు.

భాస్క: అదా! అట్లా చెప్పవేం? మీరు వీలునామా మార్చాలనుకోవడం అందుకన్నమాట!

ఆనం: ముఖ్యంగా అందుకే భాస్కరంగారూ! దానివల్ల వీలునామాలో చాలా మార్పులు చేయవలసి వస్తయ్.

సుశీ: కాని, నాకు చేసిన వాగ్దానాలు మాత్రం మరిచిపోకు ఆనంద్.

ఆనం: అదే వాటిని గురించే ఆలోచిద్దాం.

భాస్క: ఆ! మీరు పూర్వం ఏ సంస్థలకైతే విరాళాలు ఇద్దామనుకున్నారో, వాటికి ఇప్పుడు కూడా ఇస్తారా?

ఆనం: (కుర్చీలో మేనువాల్చి) ఆ!...హాస్పిటల్‌కు పదివేల రూపాయలు కదూ?

సుశీ: మనకు ఇన్ని ఖర్చులు వస్తున్నాయి. ముందు ముందు అది ఇవ్వడం అవసరమంటావా ఆనంద్?

ఆనం: పదివేలు కాదు, ఇరవై వేలు.

సుశీ: ఆనంద్.

ఆనం: నేను నిశ్చయం చేసుకున్నాను సుస్.....మన దేశంలో హాస్పిటళ్ళు బాగు పడవలసిన అవసరం ఎంతైనా వుంది.

భాస్క: మిగిలిన సంస్థలకు –

ఆనం: మిగిలినవన్నీ ఎప్పటిలాగే వుంచివెయ్యండి.

భాస్క: మీ పిన్నిగారి కూతుళ్లకు – ఒక్కొక్కరికి సంవత్సరానికి మూడు వందలు.

ఆనం: దాన్నలా వుంచితే సరిపోతుందనుకుంటాను సుస్.

సుశీ: పోనీ, ఒక్కసారే కొంత మొత్తంగా ఇస్తే – మొదట వాళ్లకు ఒక్కొక్కళ్ళకు వంద రూపాయలు ఇస్తే సరిపోతుందనుకున్నాం.

ఆనం: అప్పుడు నేను భాగ్యవంతుణ్ణి కాదు, సుస్.

సుశీ: వాళ్ళను ఇంతభారం ఒక్కసారి మొయ్యమనడం భావ్యమా? వాళ్ళకు ఈ డబ్బు ఎలా ఖర్చు పెట్టాలో కూడా తెలియదు.

ఆనం: వాళ్ళూ పెద్దవాళ్ళయినారు.

సుశీ: అందువల్లనే – వాళ్ళకు ఏం అవసరాలు వుంటయ్? పోనీ, సంవత్సరానికి రెండు వందలు –

ఆనం: వాళ్ళు కలిసివుంటే అలాగే సరిపోతాయనుకో. కాని వాళ్ళకు ఒక్క క్షణం సరిపడదే! (భాస్కరంతో) వాళ్ళిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందనుకోండి!

సుశీ: బంధువులు – అందులోనూ అక్కా చెల్లెళ్ళు – అలా వుండడం మంచిదా? పోనీ ఓ సరి చేద్దాం. వాళ్ళిద్దరూ కలిసి వుంటేనే డబ్బు వాళ్ళకు ముడుతుందని చెప్పండి.

ఆనం: ఇది కొంచెం బాగానే వుంది.

భాస్క: ఇంతకూ సుశీలాదేవిగారి విషయం –

సుశీ: ఇంకా నా సంగతి ఏమిటి? నిశ్చయం అయిపోయింది గదా!....ఏమంటావ్ ఆనంద్?

ఆనం: (నిస్పృహతో, నిస్సారంగా నవ్వి) ఇప్పుడా ఎప్పుడో అయిపోయింది. (లేస్తాడు)

(కొంచెంసేపు నిశ్శబ్దం)

భాస్క: (వ్రాయడం పూర్తిచేసి) బావుంది...కాని ఈ వీలునామా కూడా మా నాన్న గారే వ్రాద్దామనుకున్నారు. కాని ఆయన విశ్రాంతి కోసం పల్లెకు వెళ్ళారు.

సుశీ: (లేస్తూ) కులాసాగా వున్నారా?

భాస్క: (తాను కూడా లేస్తూ) ఇది వరకటి కన్న బావున్నారు – ఇప్పుడంతా ఆటలు, పాటలు –

ఆనం: గానాబజానాలో ఉన్నారన్నమాట! యేం ఆటలు ఆడతారు?

భాస్క: ఏముంటయ్? ఏ చీట్ల పేకో, చదరంగమో –

ఆనం: నాకు ఊపిరి పీల్చడానికి కూడా టైం దొరకడంలేదండి........యీ వయస్సులో అలా విశ్రాంతి తీసుకోవడానికైనా పెట్టి పుట్టొద్దూ. కాని వీలునామా వ్రాసేటప్పుడు చూడాలండి ఆయనను. ఈ వీలునామా కూడా ఆయనే వ్రాస్తే బావుండునను నాకు ఉన్నది. కాని ఆయన్నింకా బాధ పెట్టదలుచుకోలేదు.

భాస్క: ఇప్పటికయినా ఆయన మీ వీలూనమా వ్రాయడమంటే చాలా ఆనందిస్తారు.

ఆనం: అవును....నాకు తెలుసు. వ్రాస్తున్నప్పుడు ఆయన చేతులు చూడాలి, ఎలా పరుగెత్తేవో! సంగతులు నేను చెప్పినవే అయినా, తీరా ఆయన వ్రాశాక ఎలా వుంటయ్యోనని భయపడే వాణ్ణి నేను.

సుశీ: నాకేమనిపించేదో తెలుసా? ఆ చేతుల్తోనే మనల్ని కోర్టుల్లో హాజరుపరచరు కదా అని –

ఆనం: (కొంచెం తత్తరపాటుతో) ఛా! అలా ఎన్నడయినా జరుగుతుందా?

సుశీ: నేను అనుకున్నది చెప్పాను ఆనంద్....ఆ! నువ్వు ఇంటికి వస్తావా, బజారుకు వెడతావా?

ఆనం: పద......క్లబ్బుకు వెడదాం......వస్తాం భాస్కరంగారూ! మీ నాన్నగారు వచ్చిన తరువాత మా ఇంటికోసారి రమ్మనండి. ఆయన చూడలేదు......అదీగాక నాకు తీరదేమో!

భాస్క: అలాగే! తప్పక పంపుతాను. ఆయన కూడా చాలా సంతోషిస్తారు. మీరు మొదటి సారి వీలునామా వ్రాయించడానికి వచ్చినప్పుడు జ్ఞాపకం ఉందా?

ఆనం: అవునవును......తలుచుకుంటేనే చాలా తమాషాగా వుంటుంది.

భాస్క: మీరు వెళ్లిన తర్వాత ఏమన్నారో తెలుసా? మీ వంటి దాంపత్యంలోనే తెలియాలంట ప్రేమ రహస్యం.

ఆనం: (భాస్కరంతో కరచాలనం చేస్తూ) నిజమే భాస్కరం గారు! (సుశీలవంకకు తిరిగి) చూశావా సుస్! మన ప్రేమను గురించి ఏమీ తెలియకుండానే ఆయన ఏమని చెప్పారో?

(సుశీల నవ్వుతుంది)

భాస్క: అవునవును......ఆయనకేం తెలుసు మీ ప్రేమ ఎటువంటిదో!

(వాళ్ళు వెళ్ళిపోతారు. కాని ఒకరి చేతుల్లో ఒకరు చేతులు వేసుకుని కాదు. భాస్కరం వాళ్ళు కనిపించేదాకా వాళ్ళవంక చూసి, తరువాత ఒక్కసారి డ్రాయరు మీద ఉన్న వీలునామా వంక చూసి, దానిని డ్రాయర్లో వుంచుతాడు. తిరిగి వాళ్ళు వెళ్ళిన వైపుకే తిరిగి తనలో తాను నవ్వుకుంటు వుండగా – తెర)

## రంగము 3
## పదేళ్ళ తరువాత

మనుష్యులు మారినా నివాసాలు మారలేదు. స్వల్పమైన మార్పులతో వెనుకటి గదే వెనుక వున్న గాంధి, నెహ్రూ ఫొటోలకు ఇప్పుడు దండలు వేయబడి వున్నాయి. కుర్చీల స్థానాన్ని సోఫాలు ఆక్రమించాయి. ఓ ప్రక్క ఫ్లవర్ వాజ్ పెట్టబడివుంది. టేబుల్ మీద టెలిఫోన్‌లు రెండు వున్నాయి. గదికి మూల మరొకటి వుంది.

తెర లేచేసరికి గదిలో ఎవ్వరూ వుండదు. ఒక క్షణం తరువాత రాఘవయ్యగారు వస్తారు. మనిషికి, వయసుతోపాటు, చత్వారం వచ్చింది. బాగా స్థూలకాయుడైనాడు....ప్రతి నిమిషం ఏదో యంత్రంలా చేసివెయ్యడం తప్ప ఆలోచించడం ఇప్పుడాయనకు పడడం లేదు.

ఆయన వచ్చి గది నలుమూలలా పరీక్షిస్తూ వుండగా సంతానం వస్తాడు. వాడు కొత్త నౌకరు కావడం వల్ల వచ్చినాయనెవరో తెలియదు. అందువల్ల తన అనుమతి లేకుండా లోపలికి రావడాన్ని సహించలేక –)

**సంతా:** సార్!.........(రాఘవయ్యగారు వినిపించుకోడు) మీకేనండి, చెప్పడం.

(రాఘవయ్యగారు విని, తల తిప్పుతాడు)

ఇంకా బాబుగారు రాలేదండి.

**రాఘు:** వచ్చాను కదోయ్! (ఓ క్షణం ఆగి) ఓ! అంటే భాస్కరం మాటా నువ్వు చెప్పేది.

**సంతా:** అవును సార్!

**రాఘు:** ఇంకా రోజూ ఆలస్యమేనన్నమాట!....ప్చ్ చిన్నతనం వదలలేదు.. (కొంచె ఆగి) అవును. పిల్లలెప్పుడూ పిల్లలే.......ఆ! బంగారూ!

**సంతా:** నా పేరు సంతానం సార్!

**రాఘు:** సంతానమా! నువ్వెవరు?....బంగారాన్ని పిలు..

**సంతా:** (చనిపోయినవాళ్ళను జ్ఞాపకం చేసుకుంటున్నాడన్న సానుభూతితో) ఆ పేరు గలవాళ్ళు ఇక్కడ ఎవ్వరూ లేరు సార్.

**రాఘు:** (పిరికిగా) లేడా!...అవును....నాకు జ్ఞాపకం వస్తోంది.....పాపం! (అయినా తనను తాను నమ్మించుకోలేక) సరే! వచ్చిన తరువాత నేను రమ్మన్నాని చెప్పు.

(రాఘవయ్య తను వెనక కూర్చుండే కుర్చీ స్థానంలోకి వచ్చి, అక్కడి తన కుర్చీ స్థానే వున్న సోఫామీద కోటు తగిలించి వుండడం చూస్తాడు)

**రాఘు:** ఈ కోటు ఎవరిది?

**సంతా:** బాబు గారి–అదే! భాస్కరం గారిది సార్!

రాఘ: అది ఇక్కడ ఎందుకు తగిలించాడు? ఇది నా కుర్చీ అని తెలియదూ?

సంతా: అదేమిటి సార్ అయన ఎన్నాళ్ళనుంచో అక్కడ కూర్చుంటుంటే?

రాఘ: కూర్చోడానికి వీల్లేదు...బంగారేం చేస్తున్నాడు? చూస్తూ వూరుకున్నాడా?

(టేబులు మీది ఉత్తరాలు ఒక్కొక్కటే చించి చూస్తూ వుంటాడు)

సంతా: ఏమిటి సార్! అడక్కుండానే గదిలోకి వచ్చింది కాకుండా, ఇంకా ఉత్తరాలు చించుతారేమండీ!..ఆ వుత్తరాలు భాస్కరంగారివి.

రాఘ: ఏమిటీ! ఒళ్ళు కొంచెం దగ్గర పెట్టుకో! అసలు నువ్వెందుకిక్కడ? బంగారాన్ని పంపు.

(సంతానం ఏమి చెయ్యడానికి పాలుపోని ఈ పరిస్థితుల్లో భాస్కరం వస్తాడు. మనిషి పాలిపోయి వుంటాడు. తెల్లని జుట్టు, వాకిలి దగ్గరకు వచ్చి, తండ్రిని చూచి, నిర్ఘాంతపోతాడు)

భాస్క: (ఆశ్చర్యమూ, ఆనందమూ, బాధా ఒక్కసారే ముప్పిరికొంటయ్) మీరా, నాన్నా! (సంతానం వైపుకు తిరిగి కోపంతో) నువ్వేనా ఆయననక్కడ కూర్చోబెట్టింది? (సంతానం వణికిపోతూ వుంటాడు) ఇహ కాఫీ కావాలా అని, అలా పడక కుర్చీలో పడుకోమనడం కాని, లేకపోతే ఇంటికి సరాసరి తీసుకురావడం తెలియదన్నమాట! – ఊ.......వెళ్ళు.

(బ్రతకాంరా దేముడా' అనుకొని వెంటనే వెళ్ళిపోతాడు సంతానం)

రాఘ: (భాస్కరం వంకకే చూస్తూ) నువ్వూ పెద్ద వాడివయినావు భాస్కరం.

భాస్క: ఎప్పుడూ ఒకలానే వుంటామా? (కొంచెం లాలిస్తూ) అయినా మీరు ఇంత శ్రమపడి ఇక్కడి ఎందుకు వచ్చారు చెప్పండి. ఆరోగ్యమూ సరిగా లేదాయే! పల్లెలో విశ్రాంతి తీసుకోవడం బావుండేదేమో? ఎన్ని సంవత్సరాలైంది ఇక్కడకు వచ్చి?

రాఘ: అందుకే వచ్చాను...అనుకోకుండా – షికారుకని బయలుదేరాను. స్టేషనులో రైలు వుంది ఎక్కాను.

భాస్క: ఆగండి....మీతోపాటు ఎవరినైనా ఇంటికి పంపుతాను. విశ్రాంతి తీసుకుందురు గాని –

రాఘ: ఊరుకో భాస్కరం..కొంచెం సేపు ఇక్కడే కూర్చుంటాను.

భాస్క: దానకేం?....పోనీ, కాఫీగాని –

రాఘ: తాగేవచ్చాను లేవోయ్!

భాస్క: అయితే ఇక్కడ చలిగాలి బాగా తగులుతుంది. ఆ పడకకుర్చీలో పడుకుని నిద్రకూడా పోవచ్చు. (పడక కుర్చీదాక నడిపించుకుపోతాడు)

రాఘ: నిద్రా!..అవును. నేనిప్పుడు దానికితప్ప దేనికీ పనికిరాను. ఒకప్పుడు – ఏమయితేనేం? ఒకప్పుడు కూర్చున్న కుర్చీలో నా కొడుకు కూర్చున్నాడు. (భాస్కరం కోటును సర్ది, కుర్చీలో కూర్చుంటాడు) ఆ! భాస్కరం. నిద్ర వచ్చేవరకు ఏమైనా సంగతులు చెప్పు. ఆ! బంగారు బ్రతికే వున్నాడా భాస్కరం!

భాస్క: (తెలియనట్లుగా) బంగారా?

రాఘ: మన నౌకరు భాస్కరం –

భాస్క: ఓ! వాడా!...ఇప్పుడా ముప్పై ఏళ్లయింది పోయి.

రాఘు: ముప్ఫైయేళ్ళు! అంతా నిన్న జరిగినట్లుగా వుంది నాకు.

భాస్క: మీకు ఇప్పటి సంగతులకన్న పూర్వం సంగతులే బాగా జ్ఞాపకం ఉంటున్నాయ్ నాన్నా!

రాఘు: కావచ్చు.

(రాఘవయ్యగారి కుర్చీలో పడుకుని కళ్ళు మూసుకుంటాడు. మరుక్షణంలోనే గురక వినబడుతుంది. భాస్కరం ఉత్తరాలు చూస్తూ వుంటాడు. ఓ నిముషం తర్వాత సంతానం వస్తాడు)

సంతా: రావుబహదూర్ ఆనందరావు గారు వచ్చారు సార్!

భాస్క: (త్వరగా) ఆనందరావుగారా! రమ్మను. (ఓ క్షణం తరువాత ఆనందరావు లోపలకు వస్తాడు. ఇప్పుడాయన రావుబహదూర్....తీరని వ్యథతో క్రుంగిపోయినవాడిలా కనిపిస్తాడు...ప్రస్తుతం కూడా అదే స్థితిలో ఉన్నాడు)

భాస్క: నమస్తే!..రండి, ఆనందరావు గారు! మీరు వస్తారనే అనుకోలేదు. కబురు లేకుండా కూడా ఇలా వచ్చేశారేం? బావున్నారా?

ఆనం: ఆ......గొప్పగా ఉన్నాను. (కొంచెం జోక్యులర్‌గా) మళ్ళీ వెనకటి పరిమీదే వచ్చాను.

భాస్క: మరో వీలునామా తయారు చేయించడానికా?

ఆనం: అవును...అందుకే!

భాస్క: అవునవును..తప్పదు కదా!

(ఆనంద్ కుర్చీలో పడుకున్న రాఘవయ్య గారిని చూస్తాడు)

భాస్క: మా నాన్నగారు! (మెల్లగా దగ్గరకు వెళ్ళి) నిద్రపోతున్నారా నాన్నా? (ఆనంద్‌తో) అంతేనండీ! ఇలా మాట్లాడుతూ ఉంటారు. మరుక్షణంలో మగతలో పడిపోతారు. మనం చెప్పేవి వినిపించవు. (ఆయన నుదుటిన అంటి) చూశారా! ఇహ లేవడం కూడా అనుకోకుండానే లేస్తారు....చాలా పెద్దవారయారు. ఏ విషయాలూ జ్ఞాపకం వుండవు.

ఆనం: (ఆలోచనతో) జ్ఞాపకం ఉండవా? ఎంత అదృష్టం...

భాస్క: (గది మరొక ప్రక్కకు వస్తూ) విన్నాను, ఆనందరావుగారూ! చాలా విచారించవలసిన విషయం. అనుకోకుండా జరిగిపోయింది...అంతేనండి! జీవితమే అంత! జీవిత గమ్యాన్ని చేరుకోవడానికి కలిసి బయలుదేరిన ఇద్దరు బాటసారుల్లోను, ఒకరు మధ్యలోనే విడిపోవడం విచారకరమైన విషయమే! అయినా ఏం చేస్తాం? అలా జరగక తప్పదు.

ఆనం: అవునవును.

భాస్క: (ఇంకా సానుభూతిని సూచించే కంఠంతోనే) చాలా మంచిది..నాకు ఆవిడ అంటే ఎంతో గౌరవం.

ఆనం: (చికాకు కనబరుస్తూ) సరే! ముందు మన పని కానివ్వండి...ఏమైనా ఆవిడ – మనం అందరం నేనే ముందు వెళ్ళిపోతాననుకున్నాం.

భాస్క: అవునవును...అంతేనండీ! ఎవరుముందో, ఎవరు వెనుకో ఎవరికి తెలుసు?

ఆనం: తెలియనివి ఇంకా వున్నయ్! మనం విల్లును గురించి ఇంత బాధ పడేవాళ్ళమా! ఆ వేళ ఆవిడద –

సరే! (కూర్చుంటూ) మరొకటి తయారు చేద్దాం కాని, నేను ఓడిపోయవడం మాత్రం జరుగదు.

భాస్క: ఏమోనండి! మనం అందరం తలలు వంచవలసిన వాళ్ళమనే నా కనిపిస్తుంది.

ఆనం: అంతేనంటారా? లేదు, వీలులేదు...అలా జరగడానికి వీలులేదు.

భాస్క: (ఏం చెప్పాలో తెలియక) ఆవిడ వుండగా ఇంతచేసింది! ఆవిడ చెప్పినట్లుగానే విల్లును –

ఆనం: వీల్లేదు భాస్కరంగారు! ఆవిడ చేసిందేమీ లేదు...

భాస్క: అంతేనంటారా? ఆవిడ రాగానే మీకు సిరిఅబ్బిందని, మీకు సంఘంలో గౌరవం, ఉన్నతస్థానం లభించాయిన అంటారు....నిజంగా, సుశీలా దేవిగారిని ఆ సిల్కు దుస్తుల్తో చూడాలి –

ఆనం: ఆపండి భాస్కరంగారు! ఆవిణ్ణిగురించి నాకు బాగా తెలుసు. ఆవిడ మొదటి నుంచి సిల్కుల్లోనే మణిగి వుండేదా? సాదా చీరల్లో ఇంతకంటే హాయిగా, ఆనందంగా వుండే రోజులు ఉన్నయ్.....(మనిషి దిగజారిపోతూ, ఇంతలో తట్టుకుని) పరిస్థితులు విషమించినయ్! ఎందువల్ల? ఇప్పుడు జరిగిన ప్రతిసంఘటనకూ ఆవిడే కారణం? (కొంచెంసేపు ఆగి, మాట మారుస్తూ) పోనివ్వండి..అవన్నీ తవ్వుకోవడం వల్ల లాభంలేదు...మనపని కానిద్దాం.

భాస్క: (సానుభూతిగా) నిజమేననుకోండి..అయినా జీవితం మన బాధలకు పరిహారంగా సంతోషాలు కూడా ఇవ్వకపోదు...మీ అబ్బాయి వున్నాడు కదా!

ఆనం: (దృఢంగా) లేదు.

(భాస్కరం నిర్ఘాంతపోయి, సూటిగా ఆనంద్ కళ్ళలోకి చూస్తాడు)

ఆనం: వాడికీ, నాకూ ఎప్పుడో ఋణం తీరింది.

భాస్క: అదేమిటండీ!....ఒక వేళ అతను తప్పేచేసి వుంటే –

ఆనం: తప్పా! వాడు చేసిన పనుల్ని తప్పులని పిలవడం చాలా మృదువుగా వుంటుంది.

భాస్క: అంత –

ఆనం: ఆ! అంతగా చెడిపోయాడు – సమూలంగా – వాడిలో ప్రతి అణువూ కుళ్ళిపోయింది.

భాస్క: అలా అనకండి....నాకే బాధగా వుంది.

ఆనం: (వ్యంగ్యంగా) నాకంటే ఎక్కువ బాధగా వుంది కాబోలు! ఏం? (ఇంతలో వుద్రేకంతో) ఎలాగైతేనేం, వాడి బాధ వదిలించుకున్నాను. వాడిని ఈ దేశం నుంచి పంపించి వేశాను. చట్టం వాడిమీద విరుచుకుపడ్డది. వాడికోసం కాదు – నా కోసం..నా పరువునూ, ప్రతిష్టనూ, కాపాడుకోవడం కోసం...వాడు నాకు కొడుకా?...వాడి మీద ఎన్ని ఆశలు పెట్టుకున్నాను?...అందుకే నాకీ ప్రతిఫలం దొరికింది...ప్రతివాళ్ళూ నా వెనుకనే నన్న చూసి నవ్వుతున్నారు. ఇంకా మా అమ్మాయిని గురించి అడగరేం –

భాస్క: విన్నాను, విన్నాను....చాలా బాధాకరమైన విషయం.

ఆనం: నీచుడు...లోఫర్...అటువంటి వాడితో – తనకారును నడిపే వెధవతో –

భాస్క: ఏం చేస్తామండి? రోజులు –

ఆనం: కారు..దీనికంతకూ కారణం కాదంటారా?

భాస్క: ఆవిడే నంటారా?

ఆనం: (ఆ మాట వినడానికి కూడా అసహ్యించుకున్నవాడిలా) ఎవరైతేనేం? ఇక నాకు ఎవరి సానుభూతీ అనవసరం. వాళ్ళిద్దరికీ నాకు ఏ విధమైన సంబంధమూ లేదు..(కొంచెం సేపు ఆగి) నేను ఈ సంఘటనలవల్ల సర్వనాశనమైనా ననుకుంటే మీరు పొరబడ్డారు....ఆనంద రావంటే ఎవరో వాళ్ళకి చూపిస్తాను...కాగితం తీసుకున్నారా! ఇది నా ఆఖరి వీలునామా! వ్రాసుకోండి...నా నిశ్చయం చూస్తే మీకే తెలుస్తుంది.

భాస్క: (అనునయిస్తున్నట్లుగా) అది కాదు ఆనందరావుగారూ! పరిస్థితులు కొంచెం చక్కబడేదాకా ఆగడం

ఆనం: మీరు వ్రాస్తానంటారా, లేక నా దోవన నన్ను పొమ్మంటారా?

భాస్క: మీరు తప్పదంటే, నేను కాదంటానా?

ఆనం: అయితే వ్రాయండి...(కుర్చీకి వెనుకగా నిలబడి) నేను, సుశీలా సదనం యజమాని ఎ.ఆనందరావుని, నా యావదాస్తిని, నా తదనంతరం –

భాస్క: (ఆగిపోయిన ఆనంద్‌ను వ్రాసుకుంటున్న భాస్కరం తలయెత్తి చూస్తాడు) ఆ –

ఆనం: (తోచక) ఆ! నా తదనంతరం...నా యావదాస్థిని –

భాస్క: ఆ.......యావదాస్తినీ –

ఆనం: యావదాస్తినీ (కంగారుగా) ఏం చెయ్యాలో తెలియడం లేదు భాస్కరంగారూ! (ఏమీ తోచక, ఏదో ఒక నిశ్చయానికి రావాలన్న మనోనిబ్బరంతోను, ఎంత ఆలోచించినా తోచని దారితోను యుద్ధం చేస్తూంటాడు)

భాస్క: నిజంగా మీరు –

ఆనం: కొంచెం సలహా చెప్పకూడదండీ భాస్కరం గారూ! (కుర్చీలో కూలబడతాడు)

భాస్క: మీ పినతండ్రి కూతుళ్ళు – బహుశః చనిపోయారనుకుంటా –

ఆనం: ఎప్పుడో!

భాస్క: ఇంత డబ్బును చూస్తూ, చూస్తూ –

ఆనం: ఇంత డబ్బును ఈ చేతుల్లో సంపాదించాను. ఆ! మీరేమనుకుంటేనో!..(రాఘవయ్యగారి వంక చూస్తూ) ఆయన ఏ దేశాలకో వెళ్ళి విశ్రాంతి తీసుకోవడానికి వీలుంటే ఆదుకోవడానికి ఇది ఉపయోగించదా? ఇది మీకిస్తే, మీ యిష్టం వచ్చినట్లు బీదకూ, బిక్కికీ పంచగలరా?

భాస్క: ఆనందరావుగారూ!

ఆనం: (జేబులోనుంచి ఒక కాగితం తీసి ఇస్తూ) ఇదుగో! మూడు లక్షల నలభైవేలు) నాలుగు ఇళ్లు, నాలుగు తోటలు, నాలుగు కార్లు – ఇవన్నీ ఈ ఆరుగురిని నోళ్లు కొట్టి సంపాదించినవే?..నేను కావాలని చేయలేదు. వ్యాపారంలో ఒకరికి లాభం వచ్చిందంటే, మరొకరికి నష్టం వచ్చితీరాలి. (దగ్గరగా వెళ్ళి,

బ్రతిమాలుతున్నట్లు) భాస్కరం గారూ? ఈ ఆరుగురికీ ఎంతెంత మొత్తాలు ఇవ్వాలో దీనిలో ఉంది. వాళ్ళ ఉసురు నాకు తగలకుండా, వాళ్ళకు నేను చేసిన అన్యాయానికి ప్రతిఫలంగా యివ్వండి మిగిలేది లక్షన్నర దాకా వుంటుంది. అది మీకు – (త్వరగా) విల్లు తయారు చేసి యీ ఇంటికి తీసుకురండి. సంతకం చేస్తాను.

భాస్క: ఏమిటి, నిజంగానా!..క్షమించండి ఆనందరావుగారూ! నేను మాత్రం తీసుకోలేను.

ఆనం: (ధృడంగా నిశ్చయించుకున్న వాడిమాదిరిగా) మీరు కాకపోతే మరొకరు..మొదటి అవకాశం మీది...ఆలోచించుకోండి. ఏమంటారు?

భాస్క: (ఆలోచించి) సరే!

(ఆనంద్ చేతిలో కాగితం తీసుకుంటాడు)

ఆనం: అయితే ఈ విషయం పరిష్కారం అయినట్లే! (లేచి, రాఘవయ్యగారి వంక చూస్తూ) నా మొదటి వీలునామా వ్రాసింది మీరు! చివరి వీలునామా మీ చేతుల మీదుగా తయారు కావడం లేదు...

రాఘ: ఏమిట్రా భాస్కరం, వీలునామా అంటున్నావ్?

భాస్క: మేలుకొనే వున్నారా నాన్నా?

రాఘ: (పడక కుర్చీలో లేచి కూర్చొని, ఆనందరావును చూచి) మిమ్మల్నెక్కడో –

భాస్క: గుర్తుపట్టలేదా నాన్నా? ఆయన ఆనందరావుగారు – ఇప్పుడు రావుబహదూర్ ఆనందరావుగారూ!

రాఘ: రావుబహదూర్ ఆనందరావుగారా! (ఆనందరావు చేసిన నమస్కారాన్ని అందుకుని) చాలా సంతోషం, కాని మిమ్మల్ని ఇదివరకెక్కడా చూడలేదు.

భాస్క: చూడకపోవడమేమిటి నాన్నా! ఈయన ఆనందరావుగారు!

రాఘ: ఇది వరకు ఆనందరావు తెలుసు.

భాస్క: అయితే ఈయన –

(భాస్కరం, ఆనందరావులు రాఘవయ్యగారి వంక చూస్తూ వుంటారు. ఆయన మాత్రం నిర్లిప్తంగా బయటకు చూస్తూ వుంటారు)

రాఘ: కాదు, కాదు..అతను కుర్రవాడు. పైకి రావలసినవాడు...అతని భార్య! ఎంత అన్యోన్యంగా వుండేవాళ్ళు! ఎన్నో ఏళ్ళకు పూర్వం.....వాళ్ళిద్దరూ ఇక్కడకు వచ్చారు. వాళ్ళకు అంత తక్కువ ఆస్తివున్నా, దాన్నే ఎంత ఘనంగా చూసుకునే వాళ్ళు! ఎంత కులాసాగా, హాయిగా వుండేవాళ్ళు!

భాస్క: (వెనకటి సంగతులు ఆనందరావుకు బాధను కల్గిస్తాయిన భయపడి) పోనివ్వండి నాన్నగారూ! (ఆనందరావుతో) మా నాన్నగారికి ఇప్పటి సంగతికంటె గతించిన సంఘటనలే బాగా జ్ఞాపకం వుంటున్నాయ్.

ఆనం: కావచ్చు....ఆయనకు చెప్పనివ్వండి.

రాఘ: (క్షణం నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ, మెల్లగా) పాపం! చివరికంతా బాధలతో అంతం అయింది.

మీకు తెలుసా?

ఆనం: (అనుకోకుండానే ఆయనకు సమాధానం చెబుతాడు) నాకు తెలుసు...(కుతూహలంగా) నాకు ఆశ్చర్యం వేస్తుంది - పరిస్థితులు బాధాకరంగా ఎందుకు తారుమారయ్యాయంటారు? ఎంత ఆలోచించినా నాకు మొదలు, చివర తెలియడం లేదు.

రాఘ: తెలిస్తే బాధ ఏముంది? అది ఎప్పుడూ మనల్ని వెంటనంటే వుంటుంది. దాని కసలు మొదలంటూ వుండదు. ఇదంతా నాకు అతను చెప్పిందే!

భాస్క: నాకేమీ తెలియడం లేదు. ఆయన మరేదో విషయం మాట్లాడుతున్నారు.

ఆనం: (భాస్కరంతో) కాదు. (రాఘవయ్యగారితో) ఏమిటండీ ఆ ఎప్పుడూ వుండేది?

రాఘ: అదే! విచారం, బాధ! మనోవ్యథ!! అదొక్కడి లేకుండావుంటే, మనుష్యులు హాయిగా వుంటారు. కాని అది మాత్రం నిత్యం వాళ్లను అంటిపెట్టుకు వుంటుంది - మాయని మచ్చలా - సూదిలా బయలు దేరి, దబ్బనంలా తేలుతుంది. చివరకు జీవితాన్ని సమూలంగా నాశనం చేస్తుంది.

భాస్క: ఆయన మాట్లాడుతోందేమిటో నాకు ఆగమ్యగోచరంగా వుంది...బహుశః ఏదో ఊహాలోకంలో వుండి, మాట్లాడుతున్నారేమో?

ఆనం: (నిస్సారంగా) కాదు.......ఆయనకు ప్రతి విషయం తెలుసు......(రాఘవయ్యగారితో, ఆదరంగా, గౌరవంగా) మరి ఆ బాధను మాన్పుకోవడానికి వాళ్ళేం ప్రయత్నాలు చెయ్యలేదంటారా?

వాళ్ళకు తెలిస్తే కదా చెయ్యడం? వాళ్ళు ఊహించను కూడా లేదు..అందువల్లనే జాగ్రత్త పడలేదు. అది చివరకు వాళ్ళ జీవితాన్నే నాశనం చేస్తున్నప్పుడు గాని వాళ్ళకు తెలిసి రాలేదు...పాపం!

ఆనం: పాపమా!!

రాఘ: అది వుండకూడని జబ్బు, తగిన జాగ్రత్త తీసుకోకపోతే ప్రతి వాడి పనీ అంతే!

(ఒక్క క్షణం నిశ్శబ్దం......మరుక్షణంలో ఆయన మగతలో వుండిపోతాడు)

భాస్క: ఆయన ఏం మాట్లాడారో మీకు తెలిసిందా?...నాకు ఒక్క అక్షరం కూడా తెలియలేదు.

ఆనం: నాకు సర్వమూ తెలిసింది. మా విషయం అంతా ఆయనకు సవిస్తరంగా తెలుసు.

(భాస్కరానికి ఇది వరకు ఇచ్చిన కాగితాన్ని టేబుల్ మీద నుంచి తీసి ముక్కలు ముక్కలుగా చించివేస్తాడు)

భాస్క: అమ్మయ్య! ఇప్పటికి నాకు స్తిమితం చిక్కింది.. మీరలా చెయ్యడం నాకు చాలా ఆనందంగా ఉంది.

ఆనం: (అదేం వినిపించుకోకుండా) మాయని మచ్చ! అది నన్ను నాశనం చేసినట్లే యువకుల్ని, వృద్ధిలోకి రాదగినవాళ్ళని నాశనం చెయ్యకుండా కాపాడుతారు...నా పాపాలకు ప్రాయశ్చిత్తం అది!...వాళ్ళైనా జీవితంలో వెలుగును స్వచ్ఛతనూ చూపి అనుభవించగలుగుతాడు.

భాస్క: నిజం! ఇంత డబ్బుతో ఎంతైనా చెయ్యవచ్చు.

ఆనం: (డబ్బు అనే మాటను ఏహ్యంగా అనుకరిస్తూ) హూ! డబ్బు! డబ్బుతో ఏమౌతుందండీ!..కావలసింది

ఉదయం! వస్తాను.

(త్వరగా, వెనుతిరిగి చూడకుండా వెళ్ళి పోతాడు ఆనంద్. కనిపించేటంతవరకు అటే చూస్తూ తరువాత తనలో తాను నవ్వుకుంటాడు భాస్కరం)

**భాస్క:** సంతానం, సంతానం!

**సంతా:** (వస్తూ) సార్.......

**భాస్క:** నాన్నగారు నిద్రపోతున్నారు...చల్లగాలి వస్తోంది.....బయట గోలగా వుంది! గాలి తగలకుండా, గోల వినిపించకుండా ఆ తెర వెయ్యి.

**సంతా:** చిత్తం సార్..........

(తెర వేస్తాడు)